సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 142

మంగళవారం 12-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'



'ఆఖరి అడ్డంకిని అధిగమిస్తాం'

వన్డే వరల్డ్ కప్ విజయంపై టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఆశాభావం -14లో



యువ

నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కథనం -13లో



ప్రధాని మోదీకి జెలెన్‌స్కీ ఫోన్

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రధాని మోదీతో ఫోన్లో మాట్లాడారు. తమపై రష్యా చేస్తున్న దాడుల గురించి వివరించారు.


వివరాలు 6లో ▸



ఫెడరల్ నియంత్రణలోకి..

నేరాలకు అడ్డుకట్ట కోసం దేశ రాజధానిలోని పోలీసు విభాగాన్ని ఫెడరల్ నియంత్రణలోకి తీసుకుంటున్నట్లు ట్రంప్ చెప్పారు.

వివరాలు 6లో ▸



మంత్రి రాజన్న తొలగింపు

సొంత పార్టీ నేతలపై రిగ్గింగ్ ఆరోపణలు చేసిన మంత్రి రాజన్నను కర్ణాటక సీఎం సిద్దరామయ్య కేబినెట్ నుంచి తొలగించారు.

వివరాలు 6లో ▸



ఐదుగురు జర్నలిస్టులు మృతి

గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడిలో అల్‌జజీరా అరబిక్ ప్రతినిధితోపాటు మరో నలుగురు జర్నలిస్టులు మరణించారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

'సినీ' సమస్యలపై కమిటీ



సినీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం సినీ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. సమస్యలపై ఫెడరేషన్, ఫిలిం చాంబర్ కలిసి చర్చించుకోవాలన్నారు.

- వివరాలు 16లో▶

హైకోర్టు జడ్జీలు ఎవరికంటే కూడా తక్కువ కారు



హైకోర్టు జడ్జీలు సుప్రీంకోర్టు జడ్జీల కంటే తక్కువ కాదని దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. న్యాయమూర్తులపై నిరాధార ఆరోపణలు చేసే ధోరణి పెరగడం ఆందోళనకరమని వ్యాఖ్యానించింది.

- వివరాలు 2లో▶


నిధులివ్వకపోతే ర్యాంకులెలా?



ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే జాతీయ స్థాయిలో ర్యాంకులు ఎలా సాధిస్తామని రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉప కుల పతులు ప్రశ్నించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేటు వర్సిటీలతో పోటీ పడమంటే కుదిరే పనేనా? అంటూ నిలదీశారు.

- వివరాలు 12లో▶

ఈ ఏడాదీ టెన్త్‌లో ఇంటర్నల్ మార్కులు



టెన్త్ పరీక్షల్లో ఈ ఏడాదీ అంతర్గత మార్కుల విధానం కొనసాగుతుందని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. థియరీ మార్కులు 80 ఉంటే, ఇంటర్నల్ మార్కులు 20 ఉంటాయని పేర్కొంది.

- వివరాలు 16లో▶

ఇదండీ సంగతి



మనదే బాగుంది.. ఒక్క హామీ అమలు చేయకున్నా నిత్యం కనిపిస్తున్నాం..!!

సోమవారం పార్లమెంటు వెలుపల ఇండియా కూటమి ఎంపీల నిరసన. చిత్రంలో ప్రియాంక, రాహుల్, టీఆర్ బాలు, అఖిలేశ్, ఖర్గే, పవార్, సంజయ్ రౌత్ తదితరులు



ఓట్ల చోరీపై పోరుబాట

ఢిల్లీలో 'ఇండియా' కూటమి ఎంపీల నిరసన ర్యాలీ

- పార్లమెంట్ మకరద్వారం నుంచి ఈసీ కార్యాలయం వరకు బయలుదేరిన ఎంపీలు
- 'ఒక్కరికి ఒక ఓటు' విధానాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్
- స్వచ్ఛమైన, స్పష్టమైన ఓటర్ల జాబితా కోసం ఉద్యమిస్తున్నామని స్పష్టీకరణ
- ర్యాలీకి అనుమతి లేదంటూ మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు
- 30 మందినే అనుమతిస్తామని వెల్లడి.. ససేమిరా అన్న నేతలు
- బారికేడ్లను దాటి వెళ్లేందుకు ఎంపీల ప్రయత్నం.. తీవ్ర ఉద్రిక్తత
- రోడ్డుపై బైఠాయించి ఈసీకి వ్యతిరేకంగా నినాదాలు
- అందరినీ అదుపులోకి తీసుకొని 2 గంటల అనంతరం విడుదల చేసిన పోలీసులు

6లో

"ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాల గురించి ప్రజలందరికీ తెలుసు. అయినా దీనిపై ఈసీ స్పందించడం లేదు. గత ఎన్నికల్లో దేశమంతా జరిగిన రిగ్గింగ్‌పై త్వరలో బాంబు పేలుస్తా. ఈసీ కోరుతున్నట్లుగా సంతకం చేసిన అఫిడవిట్ సమర్పించే ప్రసక్తే లేదు. ఈసీ వెబ్‌సైట్ నుంచి తీసుకున్న సమాచారాన్నే విశ్లేషించి ఓట్ల చోరీని బయటపెట్టా. ప్రజల దృష్టిని మళ్లించడానికే అఫిడవిట్ పేరిట ఈసీ డ్రామాలాడుతోంది.

- రాహుల్ గాంధీ

స్పీకర్‌పై ఒత్తిడి పెంచాలి



ఎమ్మెల్సీల ఫిరాయింపుపై త్వరలో పిటిషన్ వేయాలి

బీఆర్ఎస్ ముఖ్య నేతలకు కేసీఆర్ ఆదేశం	బీసీ రిజర్వేషన్ల పెంపుపై సర్కారు చేతులెత్తేసిందని వ్యాఖ్య	14న బీసీల కదన భేరి ఏర్పాట్లపైనా చర్చ

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో అసెంబ్లీ స్పీకర్‌పై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు పార్టీ ముఖ్య నేతలను ఆదేశించారు. మరోవైపు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్సీలపై సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు జరుగుతున్న సన్నద్ధతపై ఆరా తీశారు. ఢిల్లీలో న్యాయవాదులు కోరిన విధంగా పూర్తి సమాచారాన్ని వీలైనంత త్వరగా సిద్ధం చేసి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని కేటీఆర్‌ను ఆదేశించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కేసీఆర్ సోమవారం ఎర్రవల్లి నివాసంలో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై ఆయన చర్చించినట్లు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

స్థానిక ఎన్నికలు.. బీసీ రిజర్వేషన్లు


రాష్ట్ర ప్రభుత్వ స్థానిక ఎన్నికల సన్నద్ధతపై చర్చించడంతో పాటు బీసీ రిజర్వేషన్ల పెంపుదలకు సంబంధించిన పరిణామాలు భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంలో ప్రభుత్వం ఇప్పటికే చేతులెత్తేసిందని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. పార్టీ పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే అవకాశముందని సమావేశంలో నేతలు అంచనా వేశారు. ఈ నెల 14న కరీంనగర్ వేదికగా బీఆర్ఎస్ నిర్వహించే 'బీసీల కదన భేరి' సభ ఏర్పాట్లపైనా చర్చించారు. సభలో రిజర్వేషన్ల అంశాన్ని బలంగా ప్రస్తావించి కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టాలని కేసీఆర్ ఆదేశించారు.

బనకచర్లపై దిశా నిర్దేశం

ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్టుపై ఇటీవల ఢిల్లీలో న్యాయ నిపుణులతో హరీశ్ జరిపిన సంప్రదింపులకు సంబంధించి చర్చ జరిగినట్లు తెలిసింది. జాతీయ స్థాయిలో

మిగతా 3వ పేజీలో ▶

ఈ వారంలోనే కార్పొరేషన్ డైరెక్టర్లు



జూబ్లీహిల్స్‌లో ప్రజాభిప్రాయంపై మరింత విస్తృతంగా సర్వే

- సీఎం రేవంత్‌తో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ భేటీలో నిర్ణయాలు
- పాదయాత్రకు వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసిన సీఎం

సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయి నాయకత్వానికి ఈ వారంలోనే పదవుల పంపకానికి కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లు, బోర్డులకు డైరెక్టర్లు, సభ్యుల నియామకాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ నిర్ణయించారు. దీంతో నామినేటెడ్ పదవుల కోసం మండల, జిల్లా స్థాయి కాంగ్రెస్ నేతల ఎదురుచూపులకు మోక్షం కలగనుంది. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీలో నెలకొన్న పరిణామాలపై చర్చించేందుకు మహేశ్‌కుమార్‌గౌడ్ సోమవారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. గంటన్నరకు పైగా సాగిన ఈ భేటీలో నామినేటెడ్ పదవులు, జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, జనహిత పాదయాత్ర, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను పార్టీపరంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం తదితర అంశాలపై చర్చించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై చర్చలో భాగంగా ఆ నియోజకవర్గంలోని ప్రజలకు పార్టీని మరింత దగ్గర చేసే కార్యాచరణ రూపొందించాలని.. మంత్రులతోపాటు పార్టీ

మిగతా 2వ పేజీలో ▶

ప్రేలాపనలు ఆపు..

- భారత్ దాడి చేస్తే సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామన్న పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ వ్యాఖ్యలపై కేంద్రం ఆగ్రహం
- బాధ్యత లేని అణ్వస్త్ర దేశం పాకిస్తాన్ అంటూ మండిపాటు
- అమెరికా మద్దతు లభించినప్పుడల్లా రెచ్చిపోవడం దాయాదికి అలవాటేనని ధ్వజం
- పాక్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి మునీర్ ఆ దేశాధ్యక్షుడు అవుతారేమోనని ఎద్దేవా

6లో

అణ్వాయుధాలు చూపించి బ్లాక్‌మెయిల్ చేస్తే బెదిరిపోవడానికి ఎవరూ సిద్ధంగా లేరు. అసిమ్ మునీర్ ప్రేలాపనలు మానుకోవాలి. ప్రతి అణ్వస్త్ర సామర్థ్యంగల దేశం బాధ్యతగా నడుచుకోవాలి. అణ్వాయుధాలను చూపించి ఇతరులను బెదిరిస్తామంటే అది కుదరదు. మా దేశ రక్షణ కోసం ఎలాంటి చర్యలకైనా సిద్ధం. దక్షిణాసియాలో అణు అస్థిరతకు పాక్ అడ్డాగా మారింది. అసిమ్ మునీర్ వాగుడు దీన్నే సూచిస్తోంది. అమెరికా గడ్డపై ఆయన అనుచితంగా మాట్లాడారు. ఈ బాధ్యతరహితమైన, రెచ్చగొట్టే వ్యాఖ్యలను అమెరికా ప్రభుత్వం ఆమోదిస్తోందా?

- భారత ప్రభుత్వ వర్గాలు

ఈ యాంటీబయాటిక్స్‌తో జాగ్రత్త!

వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో యాంటీమైక్రోబియల్ ఔషధాల వాడకంలో అపసవ్య ధోరణులను అరికట్టాల్సిన తరుణం ఇది. పాలు, మాంసం కోసం పశువులు, కోళ్ల పెంపకంలో.. రొయ్యలు, చేపల సాగులో లేదా ప్రాసెసింగ్ ప్రక్రియల్లో వాడేటప్పుడు జాగరూకతతో వ్యవహరించాలని ప్రభుత్వం నిర్దేశిస్తోంది.

- వివరాలు 13లో▶

ఓ అభ్యర్థికి చెక్కును అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం. చిత్రంలో గండ్ర సత్యనారాయణ, రాజ్ ఠాకూర్, నవీన్ మిట్టల్, హర్కర వేణుగోపాల్, జనక్‌ప్రసాద్



సివిల్స్ అభ్యర్థులకు ఎంతైనా సహకరిస్తాం

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

సింగరేణి తోడ్పాటుతో 178 మంది సివిల్స్ అభ్యర్థులకు రూ. లక్ష చొప్పున చెక్కుల అందజేత

సాక్షి, హైదరాబాద్: సివిల్స్ సాధించాలనుకునే అభ్యర్థులకు ఎంతయినా సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. సివిల్స్‌లో తెలంగాణ విద్యార్థులే అత్యధికంగా ఎంపిక అవ్వాలని ఆయన అన్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం'పథకం పేరుతో సివిల్స్ మెయిన్స్‌కు సన్నద్ధమయ్యే 178 మందికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించే చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రజా భవన్‌లో జరిగింది. చెక్కులు అందించిన అనంతరం భట్టి మాట్లాడారు. సమాజంలో మానవ వనరులే బలమైన పెట్టుబడులని, వీటిని సానబట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇంటర్వ్యూకి ఎంపికైన వారికి కూడా రూ.లక్ష ఆర్థిక సాయం, ఢిల్లీలో వసతులు కల్పిస్తామని

మిగతా 3వ పేజీలో ▶

రైల్వే బైపాస్ బాట!

రెండు లైన్లను అనుసంధానిస్తూ బైపాస్ లైన్ల నిర్మాణం



బైపాస్ లైన్ల పరిస్థితి ఇదీ...

- ఎటు నుంచి ఎటైనా నేరుగా వెళ్లేలా ఏర్పాట్లు
- భారీగా అనుసంధాన లైన్ల నిర్మాణం
- ప్రస్తుతం చాలాచోట్ల ముందు స్టేషన్‌కు వెళ్లి ఇంజిన్ మార్చుకుని వెనక్కు రావాల్సిన పరిస్థితి
- దీనిద్వారా ఒక్కో రైలుకు రెండు గంటల సమయం వృథా

సాక్షి, హైదరాబాద్: పర్లి–వికారాబాద్ రైలు మార్గం గుండా వచ్చే రైలు వాడీ మార్గంలోకి మళ్లాలంటే.. వికారాబాద్ స్టేషన్‌కు చేరుకుని అక్కడ ఇంజిన్‌ను విడదీసి రివర్స్ చేసి రైలుకు మరోవైపు జత చేస్తే కాని రాలేని దుస్థితి. ఈ తంతు పూర్తి కావాలంటే గంటన్నర నుంచి రెండు గంటలు పడుతుంది. అప్పటివరకు రైలు అక్కడ నిలిచి ఉండాల్సిందే. అదే సమయానికి వేరే రైళ్లు ప్రయాణిస్తుంటే ఈ వేచి ఉండే సమయం ఎక్కువగా ఉంటుంది. ట్రాఫిక్ లేకుంటే గంటన్నరలో పూర్తవుతుంది. అంటే ఆ రైలు గమ్యం చేరటానికి పట్టే ప్రయాణ సమయానికి ఇది అదనం అన్నమాట.

ఆదాకానున్న సమయం

రెండు రైల్వే లైన్లు అనుసంధానమవుతున్నప్పుడు వాటి నుంచి వచ్చిపోయే రైళ్లు పరస్పరం లైన్లు మారేందుకు వీలుగా అనుసంధాన లైన్లు ఉండాలి. కానీ, దశాబ్దాల క్రితం లైన్లు నిర్మించినప్పుడు ఈ అనుసంధానం ఒకవైపే ఏర్పాటు చేశారు. మరోవైపు వెళ్లాలంటే.. రైలు నేరుగా వచ్చి అక్కడి స్టేషన్‌లో ఆగి ఇంజిన్‌ను మరోవైపు మార్చుకుని వెనక్కు ప్రయాణించాల్సి ఉంటుంది. ఇన్నేళ్ల తర్వాత ఈ సమస్యను చక్కదిద్దాలని రైల్వే శాఖ నిర్ణయించి, అన్ని అనుసంధానాల వద్ద ప్రత్యేకంగా బైపాస్ లైన్లను నిర్మించాలని నిర్ణయించింది. ఫలితంగా ప్రయాణ సమయంలో భారీ ఆదా కానుంది. కొన్ని రూట్లలో ఈ ఆదా

బైపాస్ లైన్	నిడివి (కి.మీ)	అంచనా వ్యయం	ప్రస్తుత స్థితి	ఒక్కో రైలుకు కలిసొచ్చే సమయం
పెండ్యాల–హసన్‌పర్తి బైపాస్	24.55	రూ.465.29కోట్లు	భూసేకరణ పూర్తి	54 నిమిషాలు
విష్ణుపురం బైపాస్	4.9	రూ.110.89కోట్లు	భూసేకరణ పూర్తి	2 గంటలు
నిజామాబాద్ బైపాస్	1.55	రూ.121.97 కోట్లు	భూసేకరణ ప్రక్రియ	1.10 గంటలు
వికారాబాద్ బైపాస్	2.80	రూ.46.37 కోట్లు	టెండర్ల ప్రక్రియ	2 గంటలు
పెద్దపల్లి బైపాస్	2.17	రూ.36.99 కోట్లు	అందుబాటులోకి	గంటన్నర

మిగతా 3వ పేజీలో ▶

యూరియా ఎడాపెడా!



- దక్షిణాదిలో కర్ణాటక తర్వాత ఎక్కువగా వినియోగిస్తోంది మనమే
- ఖరీఫ్‌లో కర్ణాటకలో 11.17 లక్షల మెట్రిక్ టన్నుల వాడకం
- 9.80 లక్షల మెట్రిక్ టన్నులతో రెండో స్థానంలో తెలంగాణ
- దేశంలో అత్యధికంగా యూపీలో 40 ఎల్ఎంటీల యూరియా వాడకం

3లో

కొట్టుకునేది మీరు.. దెబ్బలు పిల్లలకా!

పిల్లలు వాళ్లంతట వాళ్లు తమ తల్లిదండ్రులను ఎంపిక చేసుకుని ఈ భూమి మీదకు రారు. మరి తల్లిదండ్రుల మధ్య కోపతాపాలకు, మనస్పర్థలకు, తగాదాలకు, బాధ్యతలేనితనాలకు, భావోద్వేగాలకు, అనాలోచిత నిర్ణయాలకు పిల్లలెందుకు బలైపోవాలి? చక్కగా ఆడుతూ, పాడుతూ, చదువుకుంటూ, స్వేచ్ఛగా, నిర్భీతిగా ఎదగాల్సిన వయసులో – 'అమ్మానాన్న కొట్టుకుని చచ్చే హింసాత్మక సినిమా' పిల్లలకెందుకు చూపించటం? వాళ్లకీ శిక్షేంటి?! అసలీ అంతులేని కర్మేంటి?!

– సాక్షి, స్పెషల్ డెస్క్

నిత్యం తల్లిదండ్రుల తగవులాటలు
బిక్కుబిక్కుమంటూ చిన్నారులు
ఎవరికీ చెప్పకోలేక సతమతం
ఆందోళన, మానసిక ఒత్తిడి, కుంగుబాటు
పేరెంట్స్ మారాలంటున్న నిపుణులు



శుక్రవారం రాత్రి ఢిల్లీలోని కరావాల్ నగర్‌లో ఒక వ్యక్తి తన భార్యను (28)ను, ఇద్దరు కూతుళ్లను (7, 5) వారు నిద్రపోతుండగా గొంతు నులిమి చంపటం యావద్దేశాన్నీ కలచివేసింది. పేకాటకు అలవాటుపడి అతడు అప్పులపాలయ్యాడు. దీంతో భార్యాభర్తలు తరచు గొడవ పడేవారట. ఆ గొడవలు ఆ చిన్నారుల మనసులపై చాలా ప్రభావం చూపాయట. భర్త అప్పులు చేసి తీర్చలేక ఆ నిస్పృహలో భార్యా, కూతుళ్లను చంపేశాడని తెలుస్తోంది. అమాయకులైన ఆ ఇద్దరు బిడ్డలు ఆ తల్లిదండ్రుల కడుపున పుట్టటమే పాపమన్నట్లుగా నిద్రలోనే ప్రాణాలను కోల్పోయారు.

విచక్షణ కోల్పోతున్న తల్లిదండ్రులు..: క్షణికావేశంలో విచక్షణ కోల్పోయి పిల్లల్ని పొట్టన పెట్టుకునే తల్లిదండ్రులు కొందరైతే, నిత్యం పిల్లల కళ్ల ముందే తిట్టుకుంటూ, కొట్టుకుంటూ ఉండే అమ్మానాన్నలు ఎంతోమంది! తమ ప్రవర్తనే తమ పిల్లలను మంచివాళ్లుగానో లేదా చెడ్డవాళ్లుగానో చేస్తుందన్న గ్రహింపు చాలామంది తల్లిదండ్రులకు ఉండటం లేదు. ఆ గ్రహింపు లేని తల్లిదండ్రులు.. ఘర్షణలతో పిల్లల మనసులనే కాదు, భవిష్యత్తు ఆశల్ని, కలల్ని కూడా ఛిద్రం చేస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎన్నో ఆశలతో ఎదురుచూస్తారు..: చిన్నపిల్లలంటే తల్లిదండ్రులు ప్రేమాభిమానాలతో వెలిగే చిరు దివ్వెల లాంటివాళ్లు. ఉదయం వెళ్లిన నాన్న.. సాయంత్రానికి ఏం కబుర్లు, బహుమతులు మోసుకొస్తారో అని ఎదురుచూసే చిన్నారులు కొందరు. నాన్నకు తాను కబుర్లు, కథలు చెప్పాలని ఉబలాటపడే బుజ్జాయిలు మరికొందరు. కానీ, ఇవేవీ పట్టించుకోకుండా ఇంటికి రాగానే.. భార్యతో గొడవ పడే మగాళ్లు కొందరైతే, భర్తలను సతాయించే భార్యలు మరికొందరు. పోనీ, గదుల్లో పోట్లాడుకుంటారా అంటే అదీ కాదు.. ఆ పసిహృదయాల ముందే!

భార్యాభర్తల మధ్య గొడవలకు చాలామంది చిన్నారులు భయంతో గజగజలాడిపోతారు. ఘర్షణ కొనసాగుతున్నంత సేపూ వీళ్ల భయానికి, ఆందోళనకు గురవుతూనే ఉంటారు. అమ్మానాన్న ఎక్కడ విడిపోతారోనని కలవరపడతారు.

అపరాధ భావన

తల్లిదండ్రుల పోట్లాటలో వాటి నోటి వచ్చే మాటల్ని బట్టి ఘర్షణకు కారణం తామేనన్న అపరాధ భావన కూడా పిల్లల్ని కుంగదీస్తుంది. విచారం, నిరాశ అలుముకుంటాయి. కొందరు లోలోపల దుఃఖపడుతుంటారు. కొందరు నిద్రకు దూరమౌతారు. ఇవన్నీ పిల్లల మనసులను తీవ్రంగా గాయపరుస్తాయి, వాళ్ల వ్యక్తిత్వాన్నీ ప్రభావితం చేస్తాయని మానసిక వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చెప్పండి.. ఇవ్వండి.. తీర్చండి..

తల్లిదండ్రుల తగాదాలు వారి పిల్లల మానసిక అనారోగ్యాన్ని ఎన్ని విధాలుగా ప్రభావితం చేస్తాయో అనేక అధ్యయనాలలో వెల్లడయింది. అన్ని అధ్యయనాలు కూడా ప్రధానంగా చెప్పేదేంటంటే.. ఈ గొడవల వల్ల పిల్లల్లో నిరాశ, ఆందోళన, అభద్రతాభావం కలుగుతున్నాయట. అలాగే ఆ అధ్యయన ఫలితాలు తల్లిదండ్రులకు కొన్ని సూచనలు చేశాయి. అవి :



వాళ్ల తప్పులేదని చెప్పండి..: గొడవలకు తామే కారణం అని పిల్లలు అనుకుంటుంటారు. అందువల్ల, వాదన జరగటంలో పిల్లల తప్పేమీ లేదని స్పష్టంగా చెప్పండి.

అనుమానాలను తీర్చండి..: మీ వాగ్వాదంపై పిల్లలకు అనేక సందేహాలు ఉంటాయి. వాటిని అడిగేందుకు జంకుతుంటారు. కనుక వారికి వచ్చే అనుమానాలను మీరే కనిపెట్టి, వారి సందేహాలు తీర్చండి. మనమంతా ఎప్పటికీ ఒక కుటుంబం అని పిల్లల్ని దగ్గరకు తీసుకోండి.

గొడవ కారణం చెప్పండి..: మీ మధ్య ఏం జరిగిందో పిల్లలకు పైపైన అయినా చెప్పండి. 'ఒక ముఖ్యమైన విషయం మీద మా ఇద్దరికీ అభిప్రాయ భేదాలున్నాయి. అంతే తప్ప ఇంకేం లేదు' అని తెలియజేయండి. గొడవ పడటం తప్పేనని అంగీకరించండి.

ఏం కాదని భరోసా ఇవ్వండి..: మీ భార్యాభర్తల మధ్య జరిగిన వాదన అప్పటి వరకేనని, దాని వల్ల ముందు ముందు ఏ సమస్యలూ రావని పిల్లలకు నమ్మకం కల్పించండి. మీ ఇద్దరి మధ్య ప్రేమానురాగాలు ఉన్నాయని వారికి భరోసా ఇవ్వండి.

ఒక బాలిక ఉత్తరం!


పిల్లలకు బయటనుంచి ఏదైనా కష్టం వస్తే అమ్మానాన్నకు చెప్పుకొంటారు. కానీ, ఆ అమ్మానాన్నే తమకు వచ్చిన కష్టం అయితే.. ఇంకెవరికి చెప్పుకుంటారు? ఎలా చెప్పుకుంటారు? కొంచెం పెద్ద పిల్లలైతే పత్రికల్లో వచ్చే కౌన్సెలింగ్ కాలమ్‌కి గోప్యంగా తమ ఆవేదనను రాసి పంపుతుంటారు. అలా రాసిన ఒక ఉత్తరంలో ఎంత బాధ దాగి ఉందో చూడండి :

'నా చిన్నప్పటి నుంచి నా తల్లిదండ్రుల మధ్య గొడవలు చూస్తున్నాను. కొన్నిసార్లు డబ్బు గురించి, మరి కొన్నిసార్లు కుటుంబ సమస్యల గురించి ఆ గొడవలు ఉంటాయి. వాటిని ఎలా ఆపాలో నాకు తెలియదు. వాళ్లూ ఆపాలని అనుకోరు. నేనంటూ ఒకదాన్ని ఉన్నానన్న గ్రహింపు వాళ్లకు ఉండదు. ఒక్కోసారి నాకు ఇంటి నుంచి పారిపోవాలని అనిపిస్తుంది. దాని వల్ల అమ్మానాన్నకు చెడ్డపేరు వస్తుంది. అది ఆలోచించి ఆగిపోతాను. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడానికి కష్టపడి చదువుతున్నాను. కానీ పరీక్షల్లో మంచి మార్కులు రావటం లేదు. పరీక్షల టైమ్‌లో కూడా.. నేను చదువుకుంటున్నానన్న ఆలోచన కూడా లేకుండా అమ్మానాన్న ఏదో ఒక కారణంతో తగాదా పడుతూనే ఉంటారు. నా కళ్లముందే.. కొన్నిసార్లు నాన్న అమ్మను కొడుతుంటారు కూడా. అప్పుడు నాకు ఏడుపొస్తుంది. చచ్చిపోవాలనిపిస్తుంది. కానీ నాకు ఒక తమ్ముడు ఉన్నాడు. వాడంటే నాకు చాలా ఇష్టం. మా అమ్మానాన్న గొడవల్లో నేను, నా తమ్ముడు నలిగిపోతున్నాం' అని ఆ అమ్మాయి ఉత్తరం ముగించింది.

ఇలాంటి చిన్నారులు మనదేశంలో ఎంతోమంది ఉన్నారు. వాళ్లంతా చెప్పేది ఒక్కటే..

'ఆలోచించండి.. ఓ అమ్మానాన్నా.. ఏం చెప్పగలం మీకు ఇంతకన్నా..'

నాలుగు క్రస్ట్‌గేట్ల ద్వారా కృష్ణమ్మ పరుగులు



నాలుగు గేట్ల ద్వారా విడుదలవుతున్న వరదనీరు

నాగార్జునసాగర్: సాగర్ వద్ద కృష్ణమ్మ నాలుగు రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా పరుగులిడుతోంది. ఎగువన గల శ్రీశైలం జలాశయానికి 1,52,458 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 885.00 అడుగులు(215.8070టీఎంసీలు). కాగా ప్రస్తుతం 881.80 అడుగులు (197.9120టీఎంసీలు) ఉంది. కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 66,202 క్యూసెక్కుల వరద నీటిని సాగర్ జలాశయంలోకి విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయానికి 65,800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590.00 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 589.30 అడుగులు (309.9534టీఎంసీల) ఉంది. ఆదివారం రాత్రి 11 గంటల వరకు ఆరుగేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేయగా 11 గంటల అనంతరం నాలుగు గేట్ల ద్వారానే వదులుతున్నారు. గేట్లతో పాటు విద్యుదుత్పాదనతో కలిపి 61,015 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ, ఏఎమ్మార్పీ, వరద కాల్వలకు 14,860 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ఈ వారంలోనే కార్పొరేషన్ డైరెక్టర్లు

▶ మొదటి పేజీ తరువాయి

నాయకత్వానికి కూడా మరిన్ని బాధ్యతలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. అలాగే జూబ్లీహిల్స్ ఓటర్ల అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి మరింత విస్తృతంగా సర్వే నిర్వహించాలని కూడా ఇరువురు నేతలు ఓ నిర్ణయానికి వచ్చారు. మరోవైపు జనహిత పాదయాత్ర జరిగిన తీరు గురించి రేవంత్‌రెడ్డికి మహేశ్‌గౌడ్ వివరించారు. ఈ యాత్రలో ప్రభుత్వ పనితీరు గురించి సేకరించిన ప్రజాభిప్రాయాలను సీఎంకు తెలియజేశారు. ఈ నెల 23 తర్వాత రెండో విడత పాదయాత్ర ప్రారంభిస్తున్నామని.. వీలు చూసుకొని పాల్గొనాలని మహేశ్‌గౌడ్ విజ్ఞప్తి చేయగా రేవంత్ సానుకూలత వ్యక్తం చేశారని తెలిసింది. తనతోపాటు మంత్రివర్గం కూడా పాదయాత్రకు వస్తుందని ఆయన చెప్పినట్టు సమాచారం.

హైకోర్టు జడ్జీలు ఎవరికంటే తక్కువకారు

అసభ్యకర ఆరోపణలపై సుప్రీంకోర్టు సీరియస్

- న్యాయమూర్తిపై ఆరోపణలు చేసిన కక్షిదారు, లాయర్లు క్షమాపణ చెప్పాలి
- రేవంత్‌రెడ్డిపై దాఖలైన అట్రాసిటీ కేసు విచారణలో సీజేఐ ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: హైకోర్టు న్యాయమూర్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ సుప్రీంకోర్టు న్యాయమూర్తుల కంటే తక్కువకాదని దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. న్యాయమూర్తులపై నిరాధారంగా, అసభ్యకరంగా ఆరోపణలు చేసే ధోరణి పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ మౌషుమి భట్టాచార్యపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కక్షిదారు పెద్దిరాజు, ఆయన తరపు న్యాయవాదులు బేషరతు క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. ఒక వారంలోపు క్షమాపణ పిటిషన్ సమర్పించాలని, ఆ తర్వాత హైకోర్టు న్యాయమూర్తి ఆ క్షమాపణను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. సోమవారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ అతుల్ ఎస్.చందుర్కర్‌తో కూడిన ధర్మాసనం ఈమేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. 'ఇటీవలి కాలంలో కారణం లేకుండా హైకోర్టు, ట్రయల్ కోర్టు జడ్జీలను విమర్శించే అలవాటు పెరిగింది. హైకోర్టు న్యాయమూర్తులు సుప్రీంకోర్టు జడ్జీలతో సమాన రక్షణ పొందుతారు. రాష్ట్రంలో రాజకీయ నాయకుడిపై కేసు ఉంటే ఆ రాష్ట్రంలో న్యాయం దొరకదని భావించి పిటిషనర్ ఆ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరే సంస్కృతి పెరిగింది'అని ధర్మాసనం పేర్కొంది. కాగా సుప్రీంకోర్టు.. హైకోర్టు తీర్పులను మార్చగలిగినా, హైకోర్టు న్యాయమూర్తులపై పరిపాలనా నియంత్రణ లేదని చెప్పింది. హైకోర్టు న్యాయమూర్తులపై చేసిన ఆరోపణలు అవమానకరంగా ఉన్నాయని, వీటిని సహించలేమని హెచ్చరించింది. 'లాయర్లను శిక్షించడం కోర్టులకు ఆనందం కాదు. కానీ కోర్టుల వ్యవహారంలో జోక్యం చేసుకునేలా వ్యవహరిస్తే ఏమాత్రం సహించం'అని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు.

కేసును మళ్లీ తెరవండి

ప్రస్తుత కేసు సీఎం రేవంత్ రెడ్డిపై ఎస్సీ/ఎస్టీ చట్టం కింద నమోదైన క్రిమినల్ కేసును హైకోర్టు కొట్టివేయడంతో పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ తీర్పు ఇచ్చిన హైకోర్టు న్యాయమూర్తిపై పక్షపాతం, తప్పుడు ప్రవర్తన ఆరోపణలు చేస్తూ ఎన్.పెద్దిరాజు సుప్రీంకోర్టులో ట్రాన్స్‌ఫర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జూలై 29న సుప్రీంకోర్టు కొట్టివేసింది. అయితే న్యాయమూర్తిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసినందుకు పిటిషనర్, ఆయన తరఫు న్యాయవాదులకు కంటెంప్ట్ నోటీసులు జారీ చేసింది. కాగా సుప్రీంకోర్టు 1954లో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం ప్రస్తావించింది. ఇలాంటి అవమానకర, అసభ్యకర ఆరోపణలకు పిటిషనర్ మాత్రమే కాకుండా, పిటిషన్‌పై సంతకం చేసిన న్యాయవాదులు కూడా సమాన బాధ్యత వహించాలన్నది ఆ తీర్పు సారాంశమని ధర్మాసనం గుర్తు చేసింది. హైకోర్టు న్యాయమూర్తికి క్షమాపణ చెప్పడం సరైనదని భావిస్తూ, కేసు మళ్లీ తెరిచి న్యాయమూర్తి ముందుంచాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది. ఒక వారం లోపు క్షమాపణ సమర్పించాలని, ఆ తర్వాత మరో వారం లోపు న్యాయమూర్తి ఆ క్షమాపణపై నిర్ణయం తీసుకోవాలని సీజేఐ చెప్పారు. కాగా పిటిషనర్ పెద్దిరాజు తరపున సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే బేషరతు క్షమాపణ పిటిషన్ సమర్పించారు.

సైబర్ మోసాలపై కేంద్రం స్పెషల్ ఫోకస్

- త్వరలో ఈ అంశంపై తెలంగాణలో సెమినార్
- సమన్వయ్ ప్లాట్‌ఫాం, సైబర్ కమాండో కార్యక్రమంపై బండి సంజయ్ సమీక్ష



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ మోసాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా.. సోమవారం న్యూఢిల్లీలోని తన కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హోంశాఖ ఉన్నతాధికారులతో ఐ4ఠ (ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్) ఆధ్వర్యంలో అమలులోకి తెచ్చిన సమన్వయ్ ప్లాట్‌ఫాం, సైబర్ కమాండో ప్రోగ్రాంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలకు పాల్పడే నిందితుల సిమ్ కార్డులను తక్షణమే బ్లాక్ చేసే సదుపాయాలను జిల్లా ఎస్పీలకు కల్పించాలని కేంద్ర హోం శాఖ నిర్ణయించింది. దీంతోపాటు నేర అనుమానితుల కచ్చితమైన లొకేషన్లను, బ్యాంకింగ్, టెలికాం సోర్స్‌ల వివరాలను దేశంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు అందించేందుకు తగిన చర్యలు తీసుకోనుంది. దేశవ్యాప్తంగా సైబర్ నేరాలపై గ్రామగ్రామాన ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని నిర్ణయించింది. అందులో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదేశాలతో తెలంగాణలో ఈ అంశంపై ఒకరోజు రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించాలని ఆ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్ణయించారు. సైబర్ టెక్నాలజీపట్ల ఆసక్తి ఉన్న హోంగార్డు మొదలు ఎస్పీదాకా ఒక్కో జిల్లా నుంచి 10 మంది చొప్పున 33 జిల్లాల నుంచి ఎంపిక చేసి వారికి నిష్ణాతులతో సైబర్ మోసాలపై ఒక రోజంతా అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఆ సెమినార్ అనంతరం శిక్షణ పొందిన పోలీసులు తమతమ జిల్లాల్లో టీచర్లు, న్యాయవాదులు, ఇంజనీర్లు, డాక్టర్లు, జర్నలిస్టులు, ప్రొఫెసర్లుసహా సమాజాన్ని ప్రభావితం చేసే వారిని ఎంపిక చేసి ప్రత్యేకంగా సెమినార్లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వారంతా గ్రామగ్రామానికి వెళ్లి సైబర్ మోసాలపై అవగాహన కల్పించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందిస్తారన్నారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఐ4సీ చేసిన కృషిని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట

గరిడేపల్లి పీఎస్‌లో కేసు కొట్టివేత



సాక్షి, హైదరాబాద్: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో 2019లో నమోదైన కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి ఊరట లభించింది. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ హైకోర్టు తుదిఉత్తర్వులు జారీ చేసింది. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు గరిడేపల్లి పీఎస్‌లో అప్పటి ఎంపీ రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై 2019, జనవరి 19న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఎలాంటి అనుమతి లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పొనుగోడులో సమావేశం నిర్వహించారన్నది ఫిర్యాదు. ఆధారాలు లేకుండా తనపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి.. ఎఫ్ఐఆర్‌ను రద్దు చేస్తూ ఆదేశాలిచ్చారు.

ట్రయల్‌కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు..

వరంగల్ జిల్లా కమలాపూర్ పీఎస్‌లో నమోదైన కేసులో ట్రయల్ కోర్టుకు హాజరు నుంచి రేవంత్‌రెడ్డికి హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను, ఫిర్యాదుదారును ఆదేశించింది. తదుపరి విచారణ సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది. హుజూరాబాద్ ఎన్నికల సమయంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి దాదాపు 2,500 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారన్న ఫిర్యాదు మేరకు రేవంత్‌పై కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టి.. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించారు.

ఢిల్లీలో కదం తొక్కిన రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు



సోమవారం ఢిల్లీలో విపక్ష ఎంపీలు చేపట్టిన ర్యాలీలో మల్లు రవి తదితరులు

'పార్లమెంట్ టు ఈసీ' నిరసనలో పాల్గొన్న నాయకులు

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ విపక్ష ఎంపీలు చేపట్టిన ర్యాలీలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు సైతం కదంతొక్కారు. సోమవారం రాహుల్ గాంధీ నేతృత్వంలో 'పార్లమెంట్ టు ఈసీ'మార్చ్ చేట్టారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, రేణుకా చౌదరి, గడ్డం వంశీకృష్ణ, రామసహాయం రఘురామిరెడ్డి, కడియం కావ్య, అనిల్‌కుమార్ యాదవ్‌లు ఇందులో పాల్గొన్నారు. పార్లమెంట్ ముఖద్వారం వద్ద నుంచి ప్రారంభమైన మార్చ్‌లో రాహుల్, ప్రియాంక గాంధీలతో కలసి వీరు నడిచారు. ఈ సందర్భంగా ఈసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మధ్యలో పోలీసులు అడ్డుగాపెట్టిన బారికేడ్లపైకెక్కి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ముందుకువెళ్లే ప్రయత్నం చేశారు. మార్చ్‌కు అనుమతి లేదంటూ ఎంపీలను అడుకున్న పోలీసులు.. వారిని అరెస్టు చేసి పార్లమెంటు స్ట్రీట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇండియా కూటమి ఎంపీలను అరెస్టు చేయడాన్ని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఖండించారు. మోదీ, బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు ఇది పరాకాష్ట అని మల్లు రవి అన్నారు. 'ఎస్ఐఆర్'కు వ్యతిరేకంగా ఇండియా కూటమి ప్రజాస్వామ్యబద్ధంగా చేపట్టిన నిరసనను అడ్డుకోవడం ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వ తీరు రాజ్యాంగానికి వ్యతిరేకమని గడ్డం వంశీకృష్ణ విమర్శించారు. ఇండియా కూటమి ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వానికి, ఈసీకి అంత భయమెందుకని రేణుకా చౌదరి నిలదీశారు. బిహార్‌లో లక్షల ఓటర్లను జాబితా నుంచి తొలగించారని మండిపడ్డారు. గత లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో సైతం దొంగ ఓట్లతో బీజేపీ గెలిచినట్లు కనిపిస్తోందని అనిల్‌కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు.

ఎంపీలను అడ్డుకోవడం దుర్మార్గం

- రాహుల్, ఇతర ఎంపీల అరెస్టును ఖండించిన సీఎం రేవంత్
- ఇది అప్రజాస్వామిక చర్య : మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ఓట్ల చోరీని అడ్డుకునే ప్రయత్నాల్లో భాగంగా పోరాటం చేస్తున్న కాంగ్రెస్ నేతలు రాహుల్, ప్రియాంకా గాంధీలతో పాటు విపక్ష ఎంపీలను ఢిల్లీలో పోలీసులు అరెస్టు చేయడాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ర్యాలీ చేస్తున్న ఎంపీలను అమానవీయంగా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని సోమవారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి రేవంత్ మండిపడ్డారు. రాహుల్‌తో పాటు ఇండియా కూటమి ఎంపీల అరెస్టును పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఎంపీల అరెస్టు అప్రజాస్వామికమని అన్నారు. ఓట్ల చోరీపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మహేశ్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీల అరెస్టు ఘటనను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో ఖండించారు. ఇందుకు బీజేపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

పార్లమెంట్‌లో తెలంగాణ

ఏపీ నుంచి రావాల్సిన బకాయిలు రూ.408 కోట్లు

ఖాతాల సర్దుబాటుకు కేంద్రం చర్యలు

సాక్షి, న్యూఢిల్లీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ఉభయ రాష్ట్రాలకు సేవలందించిన హైకోర్టు, రాజ్‌భవన్, ఇతర రాజ్యాంగ, చట్టబద్ధ సంస్థల ఖర్చులకు సంబంధించి రీయింబర్స్‌మెంట్‌గా తెలంగాణకు రావాల్సిన రూ.408.48 కోట్ల బకాయిలపై కేంద్రం స్పందించింది. సోమవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానమిస్తూ.. 2022 జూలై 5న తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో కేంద్రానికి లేఖ రాసిందని తెలిపారు. ఉమ్మడి హైకోర్టు, రాజ్‌భవన్, ఇతర సంస్థల ఖర్చులపై ఆంధ్రప్రదేశ్ నుంచి రూ.408.48 కోట్లు రీయింబర్స్ చేయించాలని తెలంగాణ కోరినట్లు కేంద్రమంత్రి వివరించారు. కాగా, ఈ అంశంపై 2025 ఫిబ్రవరి 3న సమావేశం నిర్వహించి, రెండు రాష్ట్ర ప్రభుత్వాలను తమ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్స్‌తో కలిసి.. ఖర్చులను సమీక్షించి సర్దుబాటు చేసుకోవాలని సూచించామని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఆ తర్వాత 2025 జూన్ 25న కేంద్ర హోం కార్యదర్శి, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు లేఖ రాసి, ఖర్చుల సర్దుబాటును త్వరగా పూర్తి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

రూ.3.5 లక్షల కోట్లు దాటిన తెలంగాణ అప్పులు

తెలంగాణకు ఉన్న అప్పులు 2024 మార్చి 31 నాటికి రూ.3,50,520.39 కోట్లకు చేరుకున్నాయని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. ఈ అప్పుల్లో రూ.3,14,545.68 కోట్లు ఓపెన్ మార్కెట్ లోన్స్ రూపంలో ఉన్నాయని, అలాగే కేంద్ర ప్రభుత్వ రుణాలు రూ.18,057.16 కోట్లు, స్వయం ప్రతిపత్తి గల సంస్థల నుంచి తీసుకున్న రుణాలు రూ.13,194.39 కోట్లు ఉన్నాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. సోమవారం లోక్‌సభలో బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రాష్ట్ర విభజన అనంతరం 2014–15లో తెలంగాణ అప్పులు రూ.69,603.87 కోట్లుగా ఉండగా, 2023–24 నాటికి అవి రూ.3,50,520.39 కోట్లకు చేరాయని వివరించారు. ఇదే కాలంలో రాష్ట్ర ఆస్తులు రూ.83,142.68 కోట్ల నుంచి రూ.4,15,099.69 కోట్లకు పెరిగాయని తెలిపారు.

వరంగల్ గ్రామీణ యువతకు ఈ-కామర్స్‌లో శిక్షణ

వరంగల్ జిల్లాలోని గ్రామీణ యువతను ఈ–కామర్స్ రంగంలో వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పలు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టింది. సోమవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి సమాధానం ఇస్తూ.. వరంగల్ జిల్లాలో 2022–23లో రెండు ప్రత్యేక ప్రాజెక్టుల ద్వారా 170 మందికి శిక్షణ ఇవ్వగా, 2024–25లో తెలంగాణలోని 25 వికాస్ కేంద్రాల ద్వారా 1,461 మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించామన్నారు.

నల్లగొండలో ఈఎస్ఐసీ దవాఖానాకు అర్హతలు లేవు

నల్లగొండలో ఈఎస్ఐసీ నిబంధనలకు తగ్గట్టుగా పెద్ద దవాఖానా ప్రతిపాదనకు అవసరమైన అర్హతలు ఇంకా సమకూరలేదని కేంద్రం స్పష్టం చేసింది. నల్లగొండలో 150 లేదా 200 పడకల ఈఎస్ఐసీ దవాఖానా ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై లోక్‌సభలో ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా ఈ వివరాలు వెల్లడించారు. 150 పడకల దవాఖానాకు కనీసం ఒక లక్ష, 200 పడకల దవాఖానాకు 1.5 లక్షల ఇన్సూర్డ్ వ్యక్తులు ఉండాలని మంత్రి తెలిపారు.

బనకచర్లపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం

గోదావరి జలాలపై తెలంగాణ రాష్ట్రం ఆధారపడి ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ ఎంపీ కేఆర్.సురేశ్‌రెడ్డి అన్నారు. రాజ్యసభలో బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చించేందుకు బీఆర్ఎస్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. అయితే దీనిని నిరాకరించడంతో.. సోమవారం సభ ప్రారంభమైన సమయంలో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని వద్దిరాజు డిమాండ్ చేశారు. అనంతరం సురేశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రం సమాధానం చెబితే రెండు రాష్ట్రాలకు స్పష్టత వస్తుందన్నారు. అలాగే కేంద్రం గోదావరిలో నీటి లభ్యతపై స్పష్టత ఇస్తే తెలంగాణ ప్రభుత్వం నిర్మించుకునే ప్రాజెక్టుల గురించి కూడా స్పష్టత ఉంటుందన్నారు.

13 రిజిస్టర్డ్ పార్టీల తొలగింపు

- క్రియాశీలకంగా లేకపోవడంతో ఈసీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి చెందిన 13 గుర్తింపులేని రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలను కేంద్ర ఎన్నికల సంఘం పార్టీల జాబితా నుంచి తొలగించింది. ఎన్నికల సంఘం నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను ఏపీ రాష్ట్ర సమైక్య సమితి, బహుజన్ సమాజ్ పార్టీ–అంబేడ్కర్–పూలే, ఇండియన్ మైనారిటీస్ పొలిటికల్ పార్టీ, జాతీయ మహిళా పార్టీ, యువ తెలంగాణ పార్టీ, జాగో పార్టీ, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్, తెలంగాణ కార్మిక రైతు రాజ్యం పార్టీ, తెలంగాణ మైనారిటీస్ ఓబీసీ రాజ్యం, తెలంగాణ ప్రజాసమితి–కిశోర్‌రావు/కృష్ణన్, యునైటెడ్ ఫర్ నేషన్, తెలంగాణ లోక్‌సత్తా పార్టీ, యువ పార్టీలను జాబితా నుంచి తొలగించినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఆయా రాజకీయ పార్టీ లు క్రియాశీలకంగా లేకపోవడంతో పాటు ఆదాయ, ఖర్చులకి సంబంధించిన నివేదికలను సమర్పించడంలో విఫలం కావడంతో ఈ నిర్ణయం తీసుకుంది.

క్లుప్తంగా...

14న నెక్లెస్ రోడ్డు నుంచి 'తిరంగా ర్యాలీ'

- బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 14న ఉదయం 10 గంటలకు నెక్లెస్ రోడ్డు నుంచి సచివాలయం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు 'తిరంగా ర్యాలీ' నిర్వహించనున్నారు. ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని.. బీజేపీ మంగళవారం నుంచి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు విలేకరులతో మాట్లాడుతూ.. 14న విభజన గాయాల స్మృతి దినం సందర్భంగా.. అన్ని జిల్లాల్లో, మండలాల్లో ప్రదర్శనలు, హాల్ మీటింగ్‌లు నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగాలో భాగంగా.. ప్రతి ఇంటిపై జాతీయ పతాకావిష్కరణ ఉంటుందని వెల్లడించారు. ఇందులో భాగంగా అన్ని మండలాల్లో తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.మనోహర్ రెడ్డి చైర్మన్‌గా ఏర్పాటైన కమిటీ ద్వారా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాంచందర్ రావు తెలిపారు.

మీరే నకిలీ జాతీయవాదులు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుపై విప్ ఆది శ్రీనివాస్ ఫైర్



సాక్షి, హైదరాబాద్: రాహుల్‌గాంధీ నకిలీ భారతీయుడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ఆయన కొత్త మురిపెంలో ఉన్నాడని, పార్టీ అధ్యక్ష పదవి వచ్చిన ఆనందంలో నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. కాలం చెల్లిన బీఆర్ఎస్ నేత లను పార్టీలోకి చేర్చుకుని ఏదో ఘనకార్యం చేసినట్టు తెగ హడావుడి చేయడం కోతికి కొబ్బరి చిప్ప దొరికిన తీరుగా ఉందని ఎద్దేవా చేశారు. సోమవారం సీఎల్పీలో శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ నేతలే నకిలీ జాతీయ వాదులని, పైకి మాత్రం దేశం కోసం , ధర్మం కోసం అని చెప్తారని, లోపల అంతా మతతత్వమే, అధికార దాహమే ఉంటుందని ఆరోపించారు. నకిలీ ఓట్ల గురించి రాహుల్‌గాంధీ అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక గుమ్మడికాయ దొంగల్లా బీజేపీ నేతలు భుజాలు తడుముకుంటున్నారని వ్యాఖ్యానించారు. రాంచందర్‌రావు ఎంత హడావుడి చేసినా తెలంగాణ ప్రజలు ఆ పార్టీని నమ్మబోరని శ్రీనివాస్ పేర్కొన్నారు. బీసీల ద్రోహి అయిన రాంచందర్‌రావుకు రాహుల్‌గాంధీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

బాబుకు బినామీగా చేస్తూ బనకచర్లకు గ్రీన్ సిగ్నల్

- మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య



సాక్షి, హైదరాబాద్: రేవంత్ తన గురువు చంద్రబాబుకు బినామీగా పనిచేస్తూ కాళేశ్వరాన్ని ఎండబెడుతున్నారని, బనకచర్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవ రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో బనకచర్ల కట్టేందుకు బీఆర్ఎస్ అంగీకరించదని, బనకచర్ల ఆపేందుకు అవసరమైతే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. దేవాదులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం పూనుకోకపోతే ధర్నా చేస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు 22 జిల్లాలకు ఉపయోగపడే ప్రాజెక్టు అని, అలాంటి ప్రాజెక్టు కూలిందని కాంగ్రెస్ నేతలు కావాలని ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద మోటార్లు ఆన్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వానికి ఇంజనీర్లు రాసిన లేఖ తమ దగ్గర ఉందని, ప్రభుత్వం స్పందించకపోతే ఆ లేఖను తామే బయటపెడతామని చెప్పారు.


యూరియా ఎడాపెడా!

దక్షిణాదిలో కర్ణాటక తర్వాత ఎక్కువగా వినియోగిస్తోంది మనమే

ఖరీఫ్‌లో కర్ణాటకలో 11.17 లక్షల మెట్రిక్ టన్నుల వాడకం

9.80 ఎల్ఎంటీలతో రెండోస్థానంలో తెలంగాణ

దేశంలో అత్యధికంగా యూపీలో 40 ఎల్ఎంటీల యూరియా వాడకం



దేశంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల వాడకం ఇలా (లక్షల మెట్రిక్ టన్నుల్లో)..

ప్రాంతం	యూరియా	డీఏపీ	ఎంఓపీ	కాంప్లెక్స్	ఎస్ఎస్‌పీ
సౌత్ జోన్	32.15	10.52	3.75	31.03	3.07
వెస్ట్ జోన్	61.71	23.70	2.85	29.27	20.85
నార్త్ జోన్	67.13	16.08	2.13	6.18	5.24
ఈస్ట్ జోన్	22.42	6.35	2.15	9.35	2.55
నార్త్ ఈస్ట్ జోన్	1.98	0.32	0.24	0.26	0.85

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఏటా యూరియా వినియోగం పెరిగిపోతోంది. అనేక రాష్ట్రాల్లో ఎరువులు, అందునా యూరియా వాడకం ఎక్కువగా ఉంటోంది. తెలంగాణలో సైతం అధిక యూరియా వినియోగం నమోదవుతుండగా..దక్షిణాది రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకుంటే తెలంగాణ రెండోస్థానంలో ఉండడం గమనార్హం. ఖరీఫ్ సీజన్‌లో యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పీ వంటి ఎరువులను అత్యధికంగా కర్ణాటక 26.75 లక్షల మెట్రిక్ టన్నులు (ఎల్ఎంటీ) వినియోగిస్తుండగా, అందులో ఒక్క యూరియా వినియోగమే 11.17 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ఇక కర్ణాటక తరువాత తెలంగాణలో ఒక సీజన్‌లో మొత్తం 23.75 ఎల్ఎంటీల మేర ఎరువులు వినియోగిస్తుండగా..అందులో యూరియా 9.80 ఎల్ఎంటీలు ఉండటం గమనార్హం. ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చే కేరళ రాష్ట్రంలో మాత్రమే ఎరువుల వాడకం అతి తక్కువగా ఉంది. ఈ రాష్ట్రంలో ఖరీఫ్‌లో వినియోగించే యూరియా కేవలం 52 వేల మెట్రిక్ టన్నులే కావడం కావడం విశేషం. డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్, ఎస్ఎస్‌పీ ఎరువుల వినియోగం కూడా ఈ రాష్ట్రంలో అతితక్కువగా ఉంది. ఏపీలో 6.22 ఎల్ఎంటీ, తమిళనాడులో 4.37 ఎల్ఎంటీ యూరియాను వినియోగిస్తుండగా, పాండిచ్చేరిలో 6 వేల టన్నులను మాత్రమే వాడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం 2025–26 సంవత్సరానికి యూరియా కోసం రూ.1.19 లక్షల కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటికే రూ.30,940 కోట్లు సబ్సిడీ విడుదల చేసింది. దేశంలో యూరియాతో పాటు ఎరువుల వినియోగం ఏయేటికాయేడు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్న కేంద్రం.. యూరియాపై ఒకవైపు రూ.లక్షల కోట్లు భరిస్తూనే సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా ప్రయత్నాలు చేస్తోంది. సేంద్రీయ ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయంపై కేంద్ర ప్రభుత్వం, వ్యవసాయ పరిశోధన సంస్థలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, రైతులు అధిక దిగుబడి లక్ష్యంగా ఎరువులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. దేశంలో ఉత్తరప్రదేశ్ ఎరువుల వినియోగంలో అగ్రభాగాన ఉంది. ఈ రాష్ట్రంలో కేవలం ఒక సీజన్‌కు 40 ఎల్ఎంటీల చొప్పున యూరియా వినియోగిస్తున్నారు. ఇక దేశ పశ్చిమ ప్రాంతంలోని గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గోవాల్లో 61.71 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను వినియోగిస్తున్నారు. గోవాలో అతి తక్కువగా కేవలం వెయ్యి మెట్రిక్ టన్నులే వినియోగిస్తుండడం గమనార్హం. తూర్పు ప్రాంత రాష్ట్రాల్లో బిహార్‌లో అత్యధికంగా 10.32 ఎల్ఎంటీ యూరియాను వినియోగిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించి సిక్కిం, నాగాలాండ్‌లలో అసలు ఎరువులే వినియోగించడం లేదు.

ఉత్తరప్రదేశ్ టాప్

ఇదేం అన్నం.. దొడ్డుగా ఉంది

- సివిల్ సప్లయ్ అధికారులపై మంత్రి అడ్లూరి ఆగ్రహం
- చింతకుంట సాంఘిక సంక్షేమ కళాశాల ఆకస్మిక తనిఖీ



వసతి గృహంలో అన్నం పరిశీలిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కొత్తపల్లి (కరీంనగర్): రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాల్లో సన్న బియ్యం సరఫరా చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కరీంనగర్ జిల్లా చింతకుంటలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల సమస్యలు తెలుసుకున్న ఆయన మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అన్నం దొడ్డుగా ఉండటంపై ప్రిన్సిపాల్‌ను మంత్రి ఆరా తీయగా, 15 రోజుల నుంచి దొడ్డు బియ్యమే వస్తున్నాయని తెలిపారు. దీంతో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సన్నబియ్యం సరఫరా చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేసి తనకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే డీఎస్‌వోపై చర్యలు తీసుకోవడంతో పాటు రెండురోజుల్లో సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. గురుకుల విద్యాలయంలోని మెస్ పరిసరాలు, డార్మెటరీ రూంలు పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైతే అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతికి సూచించారు. అలాగే విద్యాలయ స్థలం కబ్జా కాకుండా వెంటనే సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయాలని, ఇందులో ఎంత పెద్దవారున్నా వదలొద్దని ఆదేశించారు. బహుజన బిడ్డలు ఐఐటీ, జేఈఈ, నీట్‌లో రాణించడమే లక్ష్యంగా చక్కని విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

ఆర్థిక వ్యవస్థను ఖతం పట్టించారు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్
- రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని విమర్శ
- రైతు బీమా గతంలో మాదిరిగా రెన్యువల్ చేయాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనలో తెలంగాణ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలు సంగతేమో కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మాత్రం గ్యారెంటీగా ఖతం పట్టించిందని అన్నారు. కాగ్ ఇచ్చిన తాజా నివేదికలోని అంశాలను ప్రస్తావిస్తూ.. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిందని సోమవారం ఒక ప్రకటనలో కేటీఆర్ పేర్కొన్నారు.

ఇప్పటికే రూ.20,266 కోట్లు అప్పు

'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తలకిందులైంది. కాగ్ నివేదిక ప్రకారం, రాష్ట్ర ఆదాయం పడిపోవడంతో పాటు అప్పులు భారీగా పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.20,266 కోట్లు ప్రభుత్వం అప్పుగా తీసుకుంది. వార్షిక లక్ష్యంలో ఇది 37.5 శాతం. కొత్తగా ఏ రోడ్లు వేయకుండా, ఒక్క ప్రాజెక్టు కూడా ప్రారంభించకుండా, విద్యార్థులకు కనీసం మంచి భోజనమైనా పెట్టకుండా ఈ నిధులను ఏం చేస్తున్నారు? పన్నేతర ఆదాయం కూడా దారుణంగా పడిపోయింది. బడ్జెట్‌లో అంచనా వేసిన దానిలో కేవలం 3.37 శాతం మాత్రమే వసూలు అయింది. మిగులు బడ్జెట్‌తో ప్రారంభమైన తెలంగాణ, ఇప్పుడు రూ.10,583 కోట్ల రెవెన్యూ లోటును ఎదుర్కోవడం అసమర్థ పాలనకు నిదర్శనం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టడానికి ప్రభుత్వం దగ్గర ఎలాంటి ప్రణాళిక ఉందో ప్రజలకు స్పష్టంగా చెప్పాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ఏ ఒక్క పథకం సరిగ్గా అమలు కావడం లేదు

కాంగ్రెస్ పాలనలో పథకాల కోసం ప్రజలు పదే పదే దరఖాస్తు చేసుకోవడానికే సరిపోతుందని, ఒక్క పథకమూ నిర్దిష్టంగా అమలు కావడం లేదని కేటీఆర్ విమర్శించారు. తిక్కలోడు తిరునాళ్లకు పోతే..ఎక్కా దిగా సరిపోయిందన్న చందంగా ప్రభుత్వం తీరుందని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన ఎద్దేవా చేశారు. 'గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు బీమా పథకం కింద 2018 నుంచి 2023 డిసెంబర్ వరకు 1,11,320 మంది రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.5,566 కోట్ల పరిహారం అందించాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బీమా ప్రీమియం చెల్లించలేదు. వేలాదిమంది రైతు కుటుంబాలు బీమా సాయం కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రతి ఏటా ఆగస్టు 14తో రైతుబీమా ప్రీమియం గడువు ముగుస్తుంది. ప్రభుత్వం ఎల్ఐసీకి ప్రీమియం చెల్లించి రెన్యువల్ చేయడం ఆనవాయితీ. అయితే గడువు దగ్గరకు వచ్చిన తర్వాత రైతుబీమా కోసం రైతు స్వయంగా స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ డిక్లరేషన్) పత్రం అందజేయాలని, తనతో పాటు నామినీ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు కూడా అందజేయాలనే నిబంధన విధించారు. ప్రస్తుతం ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి కీలక సమయంలో రైతుబీమాకు రైతులు మళ్లీ దరఖాస్తు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం మూర్ఖత్వం. గతంలో మాదిరిగానే ప్రభుత్వం రైతు బీమా రెన్యువల్ చేయాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

మంత్రి సురేఖ ఇల్లు ముట్టడి

- 'అక్షయ పాత్ర'కు అప్పగింతపై మధ్యాహ్న భోజనం కార్మికుల ఆగ్రహం



మధ్యాహ్న భోజన కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

హనుమకొండ: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీ బాధ్యతను 'అక్షయ పాత్ర' సంస్థకు అప్పగించడాన్ని నిరసిస్తూ మధ్యాహ్న భోజనం కార్మికులు సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి ఇంటి వద్దకు చేరుకున్న మధ్యాహ్న భోజనం కార్మికులు, సీఐటీయూ నాయకులు లోపలికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట, వాగ్వాదంతో ఉద్రిక్తత నెలకొంది. అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజనం కార్మికుల వేతనాలు పెంచుతామని చెప్పి.. ఇప్పుడేమో ఉన్న జీవనోపాధిని లాగేసుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఎంత నచ్చజెప్పినా వినిపించుకోకపోవడంతోపాటు మంత్రి ఇంటిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన సీఐటీయూ నాయకులు సహా మధ్యాహ్న భోజనం కార్మికులను అరెస్టు చేసి సుబేదారి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

బీసీ గర్జన సభలో కాంగ్రెస్ మోసాలు ఎండగడతాం

- బీఆర్ఎస్ మాజీ మంత్రుల ప్రకటన
- సభకు ముఖ్య అతిథిగా కేటీఆర్



బీసీ గర్జన వివరాలు వెల్లడిస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, మధుసూదనాచారి, గంగుల కమలాకర్

కొత్తపల్లి (కరీంనగర్): కరీంనగర్‌లో ఈనెల 14న నిర్వహించే బీసీ గర్జన కదనభేరి సభలో కాంగ్రెస్ మోసాలను ఎండగడతామని బీఆర్ఎస్ మాజీ మంత్రులు తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యే సభలో బీసీ సమాజం పాల్గొని కదం తొక్కాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా చింతకుంటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం మండలి విపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడారు. బీసీలు అధికారంలోకి రావడమే లక్ష్యంగా ఈ సభ జరగనుందని చెప్పారు. తమిళనాడు తరహాలో కొట్లాడి 9వ షెడ్యూల్‌లో చేర్పించడమే మార్గమని చెబితే ఢిల్లీలో కాంగ్రెస్ నాటకాలాడిందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాల్సిన ప్రధాని మోదీని తిట్టి..రాహుల్‌ను ప్రధానిగా చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ధర్నా బీసీ జీవితాలకు శాపంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్ మాట్లాడుతూ, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేకుండా బీసీ బిడ్డలను మోసం చేస్తోందన్నారు. సీఎంకు ఎంత బలుపుంటే మహబూబ్‌నగర్ సభలో 'బట్టలు ఉతికేవారిని ఎమ్మెల్యే, చేపలు పట్టుకునే వారిని మంత్రిని చేశాను'అని మాట్లాడతారని తలసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ మేయర్, ఆర్టీసీ చైర్మన్, కార్పొరేషన్ పదవులు, మరో ఐదు మంత్రి పదవులు బీసీలకే కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాశ్, కౌన్సిల్ మాజీ చైర్మన్ స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవి ముఖ్యం కాదు

- 'ఎక్స్'లో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తనకు మంత్రిపదవి ముఖ్యం కాదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. తమకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, అవినీతి రహిత పాలన అందించాలని ప్రజలు కోరుతున్నారని గుర్తు చేశారు. తెలంగాణ సమాజం ఆకాంక్షలను నెరవేర్చేలా ప్రభుత్వ పాలన ఉండాలని ఆశిస్తున్నానని వెల్లడించారు. ఈ మేరకు సోమవారం 'ఎక్స్'వేదికగా ఆయన ట్వీట్ చేశారు. పార్టీ అధిష్టానం తనకు మంత్రి పదవి ఇస్తానన్న హామీని అమలు చేయకుండా.. రాష్ట్ర ముఖ్య నేతలు అడ్డుకుంటూ అవమానిస్తుండటాన్ని ప్రజలకు వివరించినందుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు రాజగోపాల్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

సివిల్స్ అభ్యర్థులకు ఎంతైనా సహకరిస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. మొదటి సంవత్సరం 148 మందికి ఆర్థిక తోడ్పాటునిచ్చినట్టు చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో బ్యూరోక్రసీ పాత్ర కీలకమని, ప్రజల జీవన స్థితిగతులను వీరే మార్చగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎక్కువ మంది ఎంపికవ్వాలి: కోమటిరెడ్డి

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రాష్ట్రం నుంచి ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపికైతే రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ పథకం సహాయంతో సివిల్స్‌లో విజయం సాధించి, పరిపాలన విభాగంలో అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ పేదింటి పిల్లలు కూడా సివిల్స్‌లో విజయం సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. 2024లో తెలంగాణ ప్రాంతం నుంచి సివిల్స్ విజేతలైన 30 మందికి ఈ సందర్భంగా మెమెంటోలను బహూకరించారు. వరంగల్‌కు చెందిన ఎట్టబోయిన సాయిశివాని సివిల్స్‌లో 11వ ర్యాంక్ సాధించడంపై ముఖ్యఅతిథులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణ, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌పై ఒత్తిడి పెంచాలి

▶ మొదటి పేజీ తరువాయి

ఏపీ సీఎం చంద్రబాబు వేస్తున్న ఎత్తుగడలకు పార్టీ పరంగా చెక్ పెట్టేలా ఎలాంటి వ్యూహం అనుసరించాలనే అంశంపై కేసీఆర్ దిశా నిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అసెంబ్లీ సమావేశాలకు సన్నద్ధతపై చర్చ

స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటనకు ముందే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని కేసీఆర్ అభిప్రాయపడినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెడితే అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించినట్లు తెలిసింది. దీనిపై చర్చకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని కేసీఆర్ వెల్లడించినట్లు సమాచారం.

విలీనం ప్రచారాన్ని తిప్పికొట్టాలి: 'ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించి పదేళ్లు అధికారంలో కొనసాగి, ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతర పోరాటం చేస్తోంది. కానీ బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతోందని కొందరు ఉద్దేశపూర్వక ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో కేడర్‌కు తప్పుడు సంకేతాలు వెళ్లక ముందే విలీనం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టండి..' అని బీఆర్ఎస్ అధినేత ఆదేశించారు.

రైల్వే బైపాస్ బాట!

▶ మొదటి పేజీ తరువాయి

గంట ఉంటే, కొన్ని రూట్లలో రెండు గంటలు ఉండనుంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రస్తుతం రూ.1.15 లక్షల కోట్లతో మౌలిక వసతుల పనులు జరుగుతున్నాయి. ఇందులో తెలంగాణలో దాదాపు రూ.45 వేల కోట్లతో పనులు జరుగుతున్నాయి. వాటిలో ఈ బైపాస్ లైన్లు కూడా ఉన్నాయి.

ప్రధాన బైపాస్ లైన్లు ఇవే..

నిజామాబాద్ బైపాస్: ప్రస్తుతం సికింద్రాబాద్–కరీంనగర్ మధ్య డైరెక్ట్ లైన్ లేదు. ఫలితంగా సికింద్రాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లాలన్నా, కరీంనగర్ నుంచి సికింద్రాబాద్ రావాలన్నా.. రైళ్లు నిజామాబాద్ స్టేషన్‌కు చేరుకుని అక్కడ ఇంజిన్లను రివర్స్ చేసుకుని ముందుకు సాగాల్సి వస్తోంది. దీనివల్ల ఒక్కో రైలుకు సగటున 71 నిమిషాల సమయం వృథా అవుతోందని అధికారులు గుర్తించారు. దీనికి విరుగుడుగా ఇప్పుడు కరీంనగర్–నిజామాబాద్ మార్గంలోని మామిడిపల్లి– సికింద్రాబాద్–నిజామాబాద్ మార్గంలోని డిచ్‌పల్లి మధ్య రెండు లైన్లను అనుసంధానిస్తూ రూ.121.97 కోట్ల వ్యయంతో 1.55 కి.మీ. నిడివితో బైపాస్ లైన్ ప్రతిపాదించారు.

పెద్దపల్లి బైపాస్ లైన్: కాజీపేట నుంచి కరీంనగర్ వెళ్లాలంటే పెద్దపల్లి స్టేషన్‌కు వచ్చి ఇంజిన్ రివర్స్ చేసుకుని వెళ్లాల్సి వస్తోంది. ఇప్పుడు ఆ సమస్య లేకుండా పెద్దపల్లి–కొత్తపల్లి మధ్య కరీంనగర్ లైన్‌తో బైపాస్ లైన్ ద్వారా అనుసంధానించారు. 2.17 కి.మీ. నిడివి ఉండే ఈ లైన్‌ను రూ.37 కోట్లతో నిర్మించారు. ఇటీవలే ఈ లైన్ అందుబాటులోకి వచ్చింది.

వికారాబాద్ బైపాస్ లైన్: సికింద్రాబాద్–వాడీ, వికారాబాద్–పర్లి మార్గాలను అనుసంధానిస్తూ బైపాస్ లైన్‌ను నిర్మిస్తున్నారు. పర్లి నుంచి వాడీ వైపు వెళ్లే రైళ్లు వికారాబాద్ స్టేషన్‌లో రివర్స్ చేసుకునే బాధ తప్పనుంది.

పెండ్యాల–హసన్‌పర్తి బైపాస్ లైన్: పెద్దపల్లి నుంచి హసన్‌పర్తి మీదుగా వచ్చే రైళ్లు సికింద్రాబాద్ వెళ్లాలంటే కాజీపేట్ స్టేషన్ మీదుగా రావాల్సి వస్తోంది. గ్రాండ్ ట్రంక్ రూట్ కావటంతో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు, సరుకు రవాణా రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. అన్నీ కాజీపేట జంక్షన్ మీదుగా రావాల్సి రావటంతో విపరీతమైన రద్దీ ఏర్పడి రైళ్లను స్టేషన్ బయటే కాసేపు నిలిపేయాల్సి వస్తోంది. దీనికి విరుగుడుగా హసన్‌పర్తి వద్ద బైపాస్ లైన్‌ను ప్రారంభించి ధర్మసాగర్–నష్కల్ మీదుగా నిర్మించి కాజీపేట–సికింద్రాబాద్ లైన్‌లో కలుపుతారు. దీనివల్ల.. పెద్దపల్లి కరీంనగర్ నుంచి వచ్చే రైళ్లు కాజీపేట స్టేషన్ వరకు వెళ్లకుండా హసన్‌పర్తి నుంచి బైపాస్ మీదుగా మళ్లీ సికింద్రాబాద్ వైపు వస్తాయి.



విష్ణుపురం బైపాస్ లైన్: కాజీపేట–విజయవాడ లైన్‌లోని మోటమర్రి నుంచి గుంటూరు–సికింద్రాబాద్ లైన్లోని విష్ణుపురంను అనుసంధానిస్తూ గూడ్స్ లైన్ ఉంది. దీన్ని త్వరలో ప్రయాణికుల రైళ్ల కోసమూ వినియోగించాలని భావిస్తున్నారు. మోటమర్రి నుంచి జాన్‌పహాడ్ మీదుగా వచ్చే రైళ్లు సికింద్రాబాద్ వైపు రావాలంటే విష్ణుపురం స్టేషన్లో ఇంజిన్లను రివర్స్ చేసుకోవాల్సి వస్తోంది. ఈ బాధ లేకుండా ఆ మార్గంలో వచ్చే రైళ్లు విష్ణుపురం వెళ్లాల్సిన అవసరం లేకుండా సికింద్రాబాద్ లైన్‌తో బైపాస్ లైన్ ద్వారా అనుసంధానిస్తారు.



వాటిని చదవడానికి కూడా సమయం వీలు చేసుకోగలిగితే పుస్తకాలు కొనడం అనేది మంచిదే!
- ఆర్థర్ షోపెన్‌హోవర్

సాక్షి
మంగళవారం, 12 ఆగస్టు 2025

చట్టసభలే సరైన వేదికలు

మన చట్టసభల వల్ల ప్రజలకూ, ప్రజాస్వామ్యానికీ ఏ మేరకు ప్రయోజనం కలుగుతోందన్న అంశంలో ఎవరి అభిప్రాయాలు వారికున్నా... అక్కడి చర్చల సరళి ఇంకా మెరుగుపడాలని, ప్రభుత్వ జవాబుదారీతనం మరింత పెరగాలన్న విషయంలో అందరూ ఏకీభవిస్తారు. గత నెలాఖరున మూడు రోజులపాటు 'ఆపరేషన్ సిందూర్'పై విస్తృత చర్చ జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలోనూ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలోనూ సమాధానమిచ్చారు. కానీ భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ శనివారం చేసిన ప్రసంగంలోనూ, అంతక్రితం ఈ నెల 4న సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ ఉపేంద్ర ద్వివేది మద్రాస్ ఐఐటీలో చేసిన ఉపన్యాసంలోనూ కనబడిన స్పష్టత, వివరాలు చర్చ సందర్భంగా ప్రధాని, కేంద్ర హోంమంత్రి చేసిన ప్రకటనల్లో లేవు. ఇరు దేశాల మధ్యా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం వెనక ఏ ప్రపంచ నాయకుల ఒత్తిళ్లూ లేవని ఇద్దరూ నిర్ద్వంద్వంగా చెప్పటం హర్షించదగ్గదే అయినా, ఆ ఆపరేషన్‌లో మనం సాధించిన విజయాలనూ, ఆ క్రమంలో ఎదురైన సవాళ్లనూ వివరించకపోవటం, అసలు పెహల్గాం భద్రతా లోపాలూ, వాటిపై చర్యలూ వెల్లడించకపోవటం లోటే అనిపిస్తుంది. అనర్గళంగా మాట్లాడగలిగే శక్తివున్నవారెవరో, అవతలి పక్షాన్ని వ్యంగ్యంతో, వెటకారంతో గేలిచేసి చిన్నబుచ్చగలవారెవరో తెలుసుకోవటానికి ప్రజలు చట్టసభల ప్రత్యక్ష ప్రసారాలు చూడరు. వాస్తవాలు తెలుసుకోవాలనుకుంటారు. విపక్షాల సందేహాలకు ప్రభుత్వం సూటిగా, స్పష్టంగా జవాబిచ్చిందా లేదా అనేది గమనిస్తారు. కానీ పార్లమెంటులో జరిగింది వేరు. ఎప్పటిలా పరస్పరం నిందారోపణలు చేసుకోవటంతోనే చాలా సమయం గడిచింది.

'సిందూర్'లో జరిగిందేమిటో ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ చెప్పారు. పాకిస్తాన్‌కు చెందిన అయిదు యుద్ధ విమానాలను కూల్చటంతోపాటు మరో భారీ విమానాన్ని సైతం పడగొట్టామని, దాదాపు 90 గంటల వ్యవధిలో అనుకున్న లక్ష్యాలను సాధించామని ఆయన వివరించారు. మన గగనతల రక్షణ వ్యవస్థ, డ్రోన్ వ్యవస్థ సక్రమంగా పనిచేయటంతో పాక్ సైన్యం పాచికలేమీ పారలేదని, వారి ఎఫ్–16లూ, డ్రోన్లూ, క్షిపణులనూ కూల్చేయటంతోపాటు రెండు కమాండ్ కంట్రోల్ కేంద్రాలనూ, ఒక వైమానిక స్థావరాన్నీ ధ్వంసం చేశామని ప్రకటించారు. జనరల్ ద్వివేది అయితే ప్రభుత్వం రాజకీయ స్పష్టతతో దిశానిర్దేశం చేయటం, విశ్వాసాన్నీయటం, నిర్ణయాన్ని తమకే వదిలేయటం తొలిసారి చూశామని చెప్పారు. ఇటువంటి ప్రకటనలు పార్లమెంటు వేదికపై ప్రభుత్వం వైపుగా వస్తే, వాటిపై విపక్షం ప్రశ్నిస్తే మరిన్ని వివరాలు వెల్లడయ్యేవి. ముఖ్యంగా జనరల్ ద్వివేది ప్రసంగం వాస్తవ స్థితేమిటో చెప్పింది. శత్రువుతో ఇప్పుడు నాలుగు రోజుల్లోనే ఘర్షణలు సమసినా... త్వరలోనే మరో యుద్ధం జరిగినా ఆశ్చర్యం లేదని, ఈసారి ఒంటరిగా వస్తారా, వేరే దేశాలతో కలిసి వస్తారా అన్నది కూడా చెప్పలేమని ఆయన అనటం గమనించదగ్గది.

ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌జీత్, జనరల్ ఉపేంద్ర ద్వివేది కూడా 'ఆపరేషన్ సిందూర్' దేశాన్ని ఏకం చేయటం గురించి ప్రస్తావించారు. దేశ ప్రజానీకమంతా ఒక్కటై నిలబడటం సాధారణ విషయం కాదు. ఇందులో విపక్షాల పాత్రను కొట్టిపారేయలేం. పెహల్గాంలో భద్రతా లోపాలపై తీసుకున్న చర్యలేమిటో చెప్పకపోవటం, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్-పాక్ ఘర్షణలు ఆగటం తన ఘనతేనని ప్రకటించటం విపక్షాలకు అభ్యంతరకరం అయింది. ట్రంప్ మధ్యలో స్వరం మార్చినా తిరిగి దాన్నే పదే పదే చెబుతున్నారు. అందువల్ల పార్లమెంటు వేదికగా దేశానికి మాత్రమే కాదు, ప్రపంచం మొత్తానికి జరిగిందేమిటో చెప్పాల్సిన బాధ్యత పాలకులపై పడింది. ప్రశ్నిస్తున్న విపక్షాలు పాకిస్తాన్‌తో కుమ్మక్కయ్యాయని ప్రత్యారోపణ చేయటం ఇందుకు ప్రత్యామ్నాయం కాదు.

యుద్ధ రంగంలో వ్యూహాలూ, ఎత్తుగడలూ ఎలావుండాలో నిర్ణయించుకునే స్వేచ్ఛను సైన్యానికి వదిలిపెట్టినా, ఆ క్రమంలో ఏర్పడ్డ సమస్యలను తెలుసుకుని అవసరమైన సూచనలీయటం, జరిగిందేమిటో ప్రజలకు తేటతెల్లం చేయటం దేశ రాజకీయ నాయకత్వం బాధ్యత. మన రక్షణ దళాల చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ సింగపూర్‌లో జూన్ నెలాఖరున మాట్లాడుతూ మన దళాలు చేసిన కొన్ని 'వ్యూహాత్మక తప్పిదాల' కారణంగా జెట్ విమానాలు కోల్పోయామని చెప్పటం వివాదాస్పదమైంది. పార్లమెంటులో దానిపై ప్రభుత్వం వైపునుంచి ఎలాంటి వివరణా లేదు. ఇప్పుడు దళాధిపతుల ప్రసంగాల్లోనూ ఆ వివరాల్లేవు. ఈ విషయమై సందేహాలు పోగొట్టడానికి పార్లమెంటే సరైన వేదిక. దాన్నుంచి వెలువడే సందేశం దేశ ప్రజానీకాన్ని ఒక్కటి చేస్తుంది. ఆ సంగతిని అధికార పక్షంతోపాటు విపక్షం కూడా మరువరాదు.


గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం: తిథి: బ.తదియ ప.10.09 వరకు, తదుపరి చవితి; నక్షత్రం: పూర్వాభాద్ర ప.2.17 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా.11.25 నుండి 12.56 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.18 నుండి 9.08 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.41 వరకు; అమృత ఘడియలు: ఉ.6.32 నుండి 8.03 వరకు.

సూర్యోదయం: 5.45
సూర్యాస్తమయం: 6.25
రాహుకాలం: ప.3.30 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు
సంకటహర చతుర్థి

సోషల్ టాక్

ఎప్పటికి జెట్?



సొంత జెట్ ఇంజిన్‌ను ఇండియా ఇప్పటికీ అభివృద్ధి చేసుకోలేకపోయింది. స్వీయ సమృద్ధి సాధించాలంటే అది కీలకం. ఐదు దేశాలు ఈ టెక్నాలజీలో గురుత్వాన్ని సాధించాయి: యూఎస్‌ఏ, రష్యా, చైనా, యూకే, ఫ్రాన్స్. టర్కీ, దక్షిణ కొరియాలు దీని అభివృద్ధిలో పురోగమన దశలో ఉన్నాయి. ఇండియాకు ఎందుక్కాదు?

– రాజీవ్ మల్హోత్రా, వ్యాఖ్యాత

తగ్గిన మరణాలు



కొన్నేళ్లుగా ఇండియాలో రేబిస్ మరణాలు 75 శాతం తగ్గాయి. 2030 కల్లా రేబిస్ మరణాలు లేకుండా చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యం. గతేడాది 5,700 మంది రేబిస్‌తో మరణించి వుంటారని అంచనా. దశాబ్దం క్రితం ఈ సంఖ్య 20,000.

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

పట్టించుకోవద్దు



మీ గురించి తెలియకుండానే మీపై ఎవరైనా ఒక వ్యతిరేక అభిప్రాయం ఏర్పరచుకుని ఉంటే వదిలేయండి. ఆ అభిప్రాయాన్ని మార్చేందుకు మీ శక్తిని వృథా చేసే బదులు, మీ పనిలో మీరు శ్రద్ధ పెట్టండి. అప్పుడు అన్నీ అవే సర్దుకుంటాయి.

– మానుషీ ఛిల్లర్, మిస్ వరల్డ్

రాటు తేలాలి



కష్టాలకు ఎప్పుడూ భయపడకండి. కష్ట సమయాలు మీ నిజమైన సామర్థ్యాన్ని మీకు తెలియజేయటానికి సహాయపడతాయి. మిమ్మల్ని శక్తిమంతంగా మారుస్తాయి. మీ వ్యక్తిత్వ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయి.

– తపన్ సింఘేల్, వ్యాపారవేత్త

మారిన నిర్వచనం



అక్షరాస్యత అంటే ఇప్పుడు ఏఐతో, ఏఐ సాఫ్ట్‌వేర్‌లతో సరళంగా, సమర్థంగా పని చేయగలగటం! అది కనుక తెలిస్తే, ఏఐతో సంబంధం లేకుండా పాత పద్ధతిలోనే మీ సీనియర్లు చేస్తున్న పనుల్లో మీరు నేరుగా రెండవ మెట్టుకు, లేదా మూడో మెట్టుకు చేరుకోవచ్చు.

– జస్ప్రీత్ బింద్రా, 'ఏఐ అండ్ బియాండ్' ఫౌండర్

మొదట వినండి



కమ్యూనికేషన్‌లో ఉన్న అతి పెద్ద సమస్య ఏమిటంటే, మనం అర్థం చేసుకోటానికి వినం! సమాధానం చెప్పటానికి వింటాం. మనలో వినాలన్న ఉత్సుకత ఉన్నప్పుడు- సమాధానం చెప్పాలనే ఉద్దేశంతో కాకుండా, మాటల్ని అర్థం చేసుకోటానికి శ్రద్ధ చూపుతాం.

– రాయ్ టి బెన్నెట్, లీడర్‌షిప్ కోచ్

విద్యార్థులకు భవిష్యత్ పాఠం

విశ్వ గురు



◆ యూట్యూబ్‌లో ఇంగ్లిష్ నేర్చుకునేందుకు ఉపయోగపడుతున్న వేదిక 'ఇంగ్లిష్ స్పీచెస్'. అది భాషను బోధించే వీడియోలను మాత్రమే కాక, విభిన్న ఆలోచనలను అందిస్తోంది. ఆ వేదికగా 'మైక్రోసాఫ్ట్' సీఈఓ సత్య నాదెళ్ల ఇటీవల చేసిన ప్రసంగ సంక్షిప్త పాఠం:

అవి మా ముత్తాత పోయిన కొత్తలు. ఆయన ఒక సన్నకారు రైతు. ఆయన పోవడంతో మా ముత్తవ్వ యువ వితంతువుగా మారింది. అప్పటికే ఆమెకు ఇద్దరు కుమారులు. ఆదాయ వనరు సున్నా. ఇద్దరు పిల్లలను చదివించి, వారికి మంచి భవిష్యత్తు కల్పించాలనే ఉద్దేశంతో దగ్గరలోని ఓ పట్టణానికి మకాం మార్చారు. ఓ ఇంట్లో పని మనిషిగా చేరారు. చాలీచాలని ఆదాయం ఇద్దరు పిల్లల్లో ఒకరిని చదివించేందుకే సరిపోతుంది. ఇద్దరు పిల్లల మధ్య వయసులో పెద్ద తేడా లేదు. ఆ ఇద్దరిలో ఒక పిల్లాడు బాధ్యతతో మెలిగేవాడుగా కనిపించాడు. రెండవవాడు కాస్త పేచీకోరు. పరిస్థితులకు అనుగుణంగా మసలుకునే పిల్లాడిని, ఆమె పనిలోకి దింపారు. అతను భవన నిర్మాణ పనుల్లో దినసరి కూలీగా మారాడు. కొత్త నైపుణ్యాలను గడించుకుని, ఉన్నత స్థాయి ఉద్యోగాన్ని అందుకొనే అవకాశం ఎన్నడూ లభించలేదు.

మరో పిల్లాడిని స్థానికంగా ఉన్న పాఠశాలకి పంపించగలిగారు. ఆ పిల్లాడే మా తాతయ్య. తక్కువ బాధ్యతతో వ్యవహరించే పిల్లాడిగా ముద్రపడినా, స్కూలు చదువును కొనసాగించగలిగాడు. పోలీసు అధికారి అయ్యాడు. అతని సోదరుడు నాలుగు రాళ్ళు సంపాదించడం ప్రారంభించిన పదేళ్ళ తర్వాత ఉద్యోగంలో చేరినా, ప్రారంభంలోనే ఎక్కువ జీతభత్యాలు తీసుకోగలిగాడు. మా తాత చదువుకోవడం, ఉద్యోగ జీవితం వల్ల, మా నాన్నకు చదువుకొనే అవకాశం లభించింది. ఫలితంగా, నేను నాకు ఇష్టమైన బాటలో అడుగులు వేసేందుకు అవకాశం చిక్కింది. మా తాతకు లభించిన అవకాశం వల్ల, ఆ తరువాత తరాలు కూడా బాగుపడే వీలు చిక్కింది. ప్రతిభావంతులు ప్రతిచోటా ఉన్నారు. కానీ, వారు వెలుగులోకి వచ్చే అవకాశమే ఉండటం లేదు అనే దానికి ఈ వ్యక్తిగత జీవిత వివరాలే ఉదాహరణ.

> 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్' నివేదికను పరిశీలించండి. నేడు పాఠశాలల్లో అడుగుపెడుతున్న విద్యార్థుల్లో 65 శాతం మందికి లభించబోయే ఉద్యోగాలు, ఇపుడు ఉనికిలో ఉన్నవి కావు. దానికి వారిని సిద్ధం చేయాలి.

టెక్నాలజీ ఉపకరణం మాత్రమే!

ఈ రోజు కార్యక్రమం విద్య, టెక్నాలజీ గురించి! సూటిగా చెప్పాలంటే, రేపటి ప్రపంచాన్ని సృష్టించేవారిగా నేటి విద్యార్థులను తీర్చిదిద్దడానికి సంబంధించినది. సాంకేతికంగా అబ్బురపరచే ప్రగతిని సాధిస్తున్న కాలంలో మనం జీవిస్తున్నాం. మన జీవితాలలో ప్రతి పార్శ్వాన్ని, ఆర్థిక వ్యవస్థలను, సమాజాలను డిజిటల్ టెక్నాలజీలు రూపుదిద్దుతున్నాయి. అయితే, టెక్నాలజీ అంతరాయాలను కూడా సృష్టిస్తోంది. టెక్నాలజీ ఏ కొద్ది మందికోకాక, అందరికీ అవకాశాలను అందివ్వగలదా? అన్నదే అసలైన ప్రశ్న. ఇతరులు సాధించే విజయంపైనే మన విజయం గణనకు వస్తుంది. చదువుకునే అవకాశాన్ని అందరికీ కల్పించడం మన ధ్యేయం కావాలి. నేటి సమాజం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సవాళ్ళలో అది ఒకటి. 'మైక్రోసాఫ్ట్' మాజీ పరిశోధకుడు, 'గీక్ హేర్సే' పుస్తక రచయిత కెంటరో టొయోమ ఆ అంశాన్ని బాగా పట్టుకున్నారు. టెక్నాలజీలో కన్నా ముందుగా సమాజంలో మార్పు రావాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. టెక్నోక్రాట్లు సాధారణంగా టెక్నాలజీ గుణగణాల గురించి గొప్పగా చెప్పేందుకు మొగ్గు చూపుతూంటారు. వ్యవస్థలోని అన్ని రుగ్మతలకూ దానినే విరుగుడుగా భావిస్తూంటారు. దానితో విభేదం ఉన్నవాడిగానే నేనిక్కడికి వచ్చాను. విద్యను రూపాంతరీకరించడానికి టెక్నాలజీ ఒక్కటే సమాధానమనే భ్రమల్లో మనం లేము. విద్యా రంగంలో మార్పు తీసుకొచ్చేందుకు అంకిత భావం కలిగిన పాలకులు, గొప్ప ఉపాధ్యాయులు, ప్రేరణ పొందిన విద్యార్థులు, పాలుపంచుకునే తల్లితండ్రులు, సమాజాలు అవసరం. టెక్నాలజీ వారి సృజనాత్మకతకు, చాతుర్యానికి సాధికారత కల్పించగల ఒక ఉపకరణం మాత్రమే.

ప్రపంచం నలుమూలల ఉన్న విద్యార్థులను చూడగలగడం, వారి నుంచి నేర్చుకోగలగడం నా ఉద్యోగ బాధ్యతల్లో నేను ఇష్టపడే అంశాల్లో ఒకటి. గత రెండేళ్ళుగా, నేను 20కి పైగా దేశాలలో విద్యార్థులను కలుసుకునే అవకాశం లభించింది. సియాటిల్‌లో నా కూతుళ్ళు ఏ ఆఫీసు టూల్స్‌ని ఉపయోగిస్తున్నారో అవే టూల్స్‌ని జకార్తా, టెల్ అవీవ్‌లలోని విద్యార్థులు కూడా ఉపయోగిస్తున్నారు. ఆ యా తరగతి గదుల్లో కొంత సమయాన్ని వెచ్చించినప్పుడల్లా, ప్రతిసారీ నాలో కొన్ని అంశాలు ముసురుకుంటూ వచ్చాయి.

పిల్లలను ఎలా తీర్చిదిద్దాలి?

ఒకటి– తరగతి గదిలో టీచర్ పనికి టెక్నాలజీ సాయపడాలేగానీ, అవరోధం కాకూడదు. సమయాన్ని వెచ్చించడంలో టీచర్లపై చాలా డిమాండ్లు ఉంటాయి. వారు పాఠ్యాంశాలను ఎంపిక చేయాలి. పరీక్షలు పెట్టాలి. పేపర్లు దిద్దాలి. తరగతుల్లో విద్యార్థులను అదుపాజ్ఞలలో ఉంచాలి. క్రమశిక్షణ నేర్పాలి. టెక్నాలజీ టీచర్ల జీవితాలను సులభతరం చేసి, విద్యార్థులలో సృజనాత్మకతను రేకెత్తించేదిగా ఉండాలిగానీ, వాటి నుంచి దృష్టి మళ్ళించేదిగా ఉండకూడదు. రెండు– పని స్వరూప స్వభావాలలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒక సమస్యను పరిష్కరించేందుకు సమష్టిగా పనిచేస్తున్నారు. సమస్యను విభజించి చూడటం కన్నా ఏక మొత్తంగా చూస్తున్న ధోరణి కనిపిస్తోంది. ఈ రకమైన భవిష్యత్తుకి మనం విద్యార్థులను తయారు చేయాల్సిన అవసరం ఉంది. తరగతి గదిలో కూడా టీమ్‌ల వారీగా పనిచేయడాన్ని ప్రోత్సహించాలి. సహకారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా నేర్చుకోవడం తరగతి గదిలోనే మొదలవ్వాలి. టీమ్ వర్క్‌కి అవి కేంద్రాలు కావాలి. అప్పుడే దేన్నైనా కలసి సృష్టించగల సామర్థ్యం సొంతమవుతుంది. విద్యార్థులను కలసిమెలసి నేర్చుకునేటట్లుగా చేస్తే, వారి విద్యావకాశాలు కూడా మెరుగుపడతాయి.

మూడు– రేపటికి తగినట్లుగా మన విద్యార్థులను తయారు చేసి తీరాలి. 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్' నివేదికను, అది రూపొందించిన ఉద్యోగాల నివేదికను పరిశీలించండి. నేడు పాఠశాలల్లో అడుగుపెడుతున్న విద్యార్థుల్లో 65 శాతం మందికి లభించబోయే ఉద్యోగాలు, ఇపుడు ఉనికిలో ఉన్నవి కావట! 'కాంపుటేషనల్ థింకింగ్', సమస్యను పరిష్కరించగల నైపుణ్యాలు భవిష్యత్తుకు కీలకమని టీచర్లకు తెలుసు. 'స్టెమ్' పాఠ్య ప్రణాళికను విస్తృతంగా వీక్షించవలసిన అవసరం ఉందని కూడా వారికి తెలుసు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితాన్ని కలిపి పొందికతో కూడిన అధ్యయన నమూనాగా చేయడాన్ని 'స్టెమ్'గా పిలుస్తున్నారు. చదవడం, రాయడం, డిజైన్, కళలకు తోడు, 'స్టెమ్' పాఠ్య ప్రణాళికను కూడా తీసుకువస్తే, భవిష్యత్తులో ఈ విద్యార్థులు విజయం సాధించడానికి రంగం సిద్ధం చేసినవాళ్ళం అవుతాం.

> సహకారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా నేర్చుకోవడం తరగతి గదిలోనే మొదలవ్వాలి. తరగతి గదులు టీమ్ వర్క్‌కి కేంద్రాలు కావాలి. అప్పుడే దేన్నయినా కలసి సృష్టించగల సామర్థ్యం సొంతమవుతుంది.

చివరగా– మా తాతకు లభించిన అవకాశం, మా కుటుంబ గతిని మార్చివేసింది. ఇపుడు నాకు స్ఫూర్తినిస్తున్న అంశం ఈ తరంలోనూ, రాబోయే తరాలలోనూ ప్రతి విద్యార్థికి విద్యావకాశాన్ని ప్రజాస్వామ్యీకరణ చేసేందుకు మనందరం కలసి మెలసి ఎలా ఒకటవాలన్నదే! అందరికీ కృతజ్ఞతలు. ◆

మహిళా సాధికారతలో టెక్నాలజీ సవాలు

అభిప్రాయం



బోగా దీపిక

దేశం ఆర్థికంగా శరవేగంగా దూసుకుపోవడంలో సాంకేతికతది కీలక పాత్ర. అయితే భారత ఆర్థికాభివృద్ధిలో ఎంతగా సాంకేతికత పెరుగుతున్నదో అదే స్థాయిలో మహిళల భాగస్వామ్యం తిరోగమిస్తున్నది. ప్రస్తుతం 35.9 శాతం మించని మహిళా శక్తి భాగస్వామ్యం... 2030 నాటికి 1.9 కోట్ల మంది మహిళలు ఉపాధి, ఉద్యోగాలు కోల్పోయి మరింత దిగజారుతుందనేది ఓ అంచనా.

వ్యవసాయ రంగంలోని అన్ని దశల్లో సాంకేతికతను విరివిగా వినియోగిస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు చల్లడానికి డ్రోన్లు వచ్చేశాయి. కలుపు తీయడానికి, పంట కోతకు ఆధునిక యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. అనుబంధ రంగాలతో కలిసి భారత వ్యవసాయ దిగుబడుల విలువ సుమారు రూ. 58.74 లక్షల కోట్లకు చేరింది. సాంకేతికత దేశంలో వ్యవసాయ దిగుబడులను పెంచుతూ... వ్యవసాయ మహిళల జీవనోపాధిని కబళిస్తోంది. ఫలితంగా ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. విజృంభిస్తోన్న సాంకేతికతనూ వ్యతిరేకించలేం; కోట్లాది శ్రామిక మహిళాశక్తినీ విస్మరించలేం. ఇదో సంక్లిష్ట వ్యవహారం. ఈ రెండింటి మధ్య హేతుబద్ధత, సమతౌల్యత సాధించడం విహిత కర్తవ్యం.

> ◆ విజృంభిస్తోన్న సాంకేతికతనూ వ్యతిరేకించలేం; కోట్లాది శ్రామిక మహిళాశక్తినీ విస్మరించలేం. ఈ రెండింటి మధ్య హేతుబద్ధత, సమతౌల్యత సాధించడం విహిత కర్తవ్యం.

వర్తమాన 4వ పారిశ్రామిక విప్లవ కాలంలో, రోబోటిక్స్, ఆటోమేషన్, బ్రెయిన్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా, నానో- బయోటెక్నాలజీలు, బయోకెమిస్ట్రీ, జెనెటిక్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇవి ప్రధానంగా ఉత్పత్తి, సేవలపై దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. ఈ పరిణామం వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో నిమగ్నమైన కోట్లాది పేద, మధ్యతరగతి మహిళల ఉపాధిని హరిస్తోంది.

వ్యవసాయ రంగంతో పోల్చితే, భారత పారిశ్రామిక రంగంలో సాంకేతికత వినియోగం ఎక్కువగా ఉంటోంది. అదే సమయంలో మహిళల భాగస్వామ్యం వేగంగా తగ్గుతోంది. అయితే భారత సేవా రంగంలో మహిళల పాత్ర గణనీయంగానే ఉంది. విద్య, ఆరోగ్యం, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, రిటైల్, హాస్పిటాలిటీ వంటి రంగాలలో మహిళల సంఖ్య గణనీయం. ఇవ్వాళ సేవారంగం... లింగ వివక్షకు, అసమానతలకు దూరంగా ఉంటూ, ప్రతిభకు పట్టం కడుతోంది. ఈ రంగం ఆధునిక సాంకేతిక విద్యావంతులైన కోట్లాది మహిళలకు ఉద్యోగాలను కల్పించింది.

ఈ నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ కేవలం సాంకేతికతను మాత్రమే కాదు, మహిళల శ్రమశక్తిని, మేధాసంపత్తిని సమానంగా ఇముడ్చుకుంటూ ముందుకు సాగితే లింగ వివక్ష, అసమానత సమసిపోతుందని విధాన నిర్ణేతలు గ్రహించాలి. మహిళలకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం, చిన్న, అతి చిన్న పరిశ్రమలలో మహిళల సంఖ్యను గణనీయంగా పెంచడం, మహిళలు తయారు చేసిన వస్తు ఉత్పత్తులకు ప్రోత్సాహకాలు, రాయితీలు ఇవ్వడం; వనరులు, ముడి సరుకుల లభ్యతను సులభతరం చేయడం, బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణ సౌకర్యం కల్పించడం వంటి చర్యల వల్ల మహిళల ఆర్థిక స్వావలంబన సులభతరం అవుతుంది. ప్రభుత్వాలు ఈ దిశలో అడుగులు వేయాలి.

వ్యాసకర్త పరిశోధకురాలు

పుస్తకాలే... నిజమైన ఆస్తి

ఇన్ బాక్స్

ఒకప్పుడు పుస్తకం కొనుగోలు చేయడానికి డబ్బులు లేకపోతే లైబ్రరీల బాట పట్టేవారు. చదువుకోడానికి సరైన వసతి లేకపోయినా, పఠనాసక్తి కలిగిన వారు గ్రంథాలయాలనే ఆశ్రయించేవారు. ప్రస్తుతం సాంకేతిక విప్లవం విద్యార్థులను లైబ్రరీల నుంచి దూరం చేసింది. ఏ విషయం కావాలన్నా గూగుల్‌లో వెతకడం సులభమైపోయింది. కానీ గ్రంథాలయాలలోనే మనసుకు ప్రశాంతత, చదువుకు ఏకాగ్రత లభిస్తాయి. అందుకే నేటి తరాన్ని గ్రంథాలయానికి మళ్లించాల్సిన అవసరం ఉంది.

చరిత్రలో మొదటి గ్రంథాలయంగా అసుర్బానిపాల్ లైబ్రరీ (క్రీ.పూ. 7వ శతాబ్దం, నినెవె, ఇరాక్) ప్రసిద్ధి చెందింది. ఇందులో మట్టి పలకలపై క్యూనీఫార్మ్ లిపిలో రాసిన సుమారు 30,000 హస్త ప్రతులు ఉన్నాయి. భారత దేశంలో అతిపెద్ద లైబ్రరీ కలకత్తా పబ్లిక్ లైబ్రరీ. 1836 మార్చి 21న ద్వారకానాథ్ టాగూర్ ప్రారంభించిన ఈ లైబ్రరీ, స్వాతంత్ర్యం తర్వాత నేషనల్ లైబ్రరీ ఆఫ్ ఇండియాగా మారి ఇప్పుడు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ అధీనంలో నడుస్తోంది. ఇక్కడ 25 లక్షల పుస్తకాలు ఉండగా, బెంగాల్ శాస్త్రవేత్త అశుతోష్ ముఖర్జీ ఒక్కడే 80,000 పుస్తకాలు దానం చేశారు. మరో విశిష్ట గ్రంథాలయం ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ ముంబయి. 1833లో జేమ్స్ మాకింతోష్ దీన్ని ప్రారంభించారు. 192 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ లైబ్రరీలో లక్షకు పైగా పుస్తకాలు ఉండగా, 15,000 అరుదైన గ్రంథాలు మాణిక్యాల్లా మెరుస్తున్నాయి. ఆధునికతకు అనుగుణంగా, ఇక్కడి అన్ని పుస్తకాలు, లిఖిత ప్రతులు, పత్రికలను డిజిటల్ రూపంలోకి మార్చి 'గ్రంథ్ సంజీవనీ వెబ్‌సైట్' ద్వారా ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉంచారు.



నేడు జాతీయ గ్రంథాలయ దినోత్సవం

నేడు జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా 'సోషల్ మీడియా కోసం కాదు, సొంత మెరుగుదలకు చదువుదాం!' అనే ప్రతిజ్ఞ తీసుకుందాం.

– అర్జునరావు రాజనాల | అరోరా పీజీ కళాశాల గ్రంథాలయ విభాగాధిపతి


సాక్షి ఎడిటోరియల్ పేజీ ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

డేటా పాయింట్

సృజనాత్మక ఆవిష్కరణలు

ఆధారం: కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ

మేధా సంపత్తి హక్కుల (ఐపీ) కోసం చేసే దరఖాస్తుల సంఖ్య మన దేశంలో గత 5 ఏళ్లలో భారీగా పెరిగింది. అనేక విభాగాల్లో వినూత్న ఆవిష్కరణలు పెరిగాయనడానికి ఇవే నిదర్శనం. 2020-21 నుంచి 2024-25 మధ్య... మొత్తంగా ఐపీ దరఖాస్తుల సంఖ్య 4,77,533 నుంచి 44 శాతం పెరిగి 6,89,991కు చేరింది. డిజైన్లకు సంబంధించిన దరఖాస్తులు రికార్డు స్థాయిలో 266 శాతం పెరగడం విశేషం. పేటెంట్లకు సంబంధించినవి 180 శాతం. కాపీరైట్‌వి 83 శాతం, ట్రేడ్‌మార్క్‌వి 28 శాతం పెరిగాయి.



వేదపండితుడు

ఋగ్, యజుర్, సామ, అధర్వణ అని వేదములు నాలుగున్నాయి. వాటిలో మొత్తం 20,379 మంత్రాలున్నాయి. అన్నిటినీ కంఠస్థం చేయటమేకాక ప్రతి పదానికీ అర్థం, తాత్పర్యం చెప్పి వ్యాఖ్యానం చేయగలడొక పండితుడు. అతణ్ణి వేదపండితుడని అనవచ్చా? 'ఘనాపాఠి' లాంటి ధ్రువపత్రాలు ఇవ్వవచ్చా? ఇంకా అదనంగా వేదపండితునికి ఏమైనా ఉండాలా?

జ్యోతిర్మయం

వేద పఠనం నుండి గ్రహించిన సత్యాలకు అనుగుణంగా ఆయన జీవితం ఉండి తీరాలి. యాదవ ప్రకాశులు వేదపండితునిగా ప్రసిద్ధి చెందాడు. రామానుజాచార్యులు ఆయనకు శిష్యుడయ్యాడు. బుద్ధి కుశలత గల రామానుజుడు వేదాలకు గురువిచ్చే నిర్వచనాన్ని, వ్యాఖ్యానాన్ని ఖండించాడు. గురువుగారు ఆయన్ను అంతమొందించటానికి కుట్ర చేశాడు. అలాంటి వాడు వేదపండితుడవుతాడా? తను నరకానికి పోయినా సరే ఇతరులకు, శ్రేయస్సు కలగాలని గుడి గోపురమెక్కి అష్టాక్షరీ మంత్రాన్ని ఎలిగెత్తి చాటి చెప్పిన రామానుజుని వంటి విశాల హృదయము ఉన్నవారిని వేదపండితులని అనవచ్చు.

'వివేక చూడామణి'లో ఆది శంకరులవారు 'వాగ్వైఖరీ శబ్దఝురీ శాస్త్ర వ్యాఖ్యాన కౌశలం వైదుష్యం విదుషాం తద్వద్భుక్తయే న తు ముక్తయే' అని అంటారు. దీని అర్థం... 'మహానిపుణముగా యుక్తి యుక్తముగా సంభాషించుట యందలి చాతుర్యము, శబ్దముల నప్రయత్నముగా గంగా ప్రవాహము వలె అనర్గళముగా ధారాకారముతో నుచ్చరించుటయు, శాస్త్రముల వ్యాఖ్యానమును అవలీలగా చేయుట యందు నిపుణత్వము, పండితుల ఖండన- మండన రూప పాండిత్యము, ఇదంతయు కూటి కొఱకేగాని మోక్షము కొఱకు కాదు (పుట 30 - వివేక చూడామణి, శ్రీవ్యాసాశ్రమము). అసలైన వేదపండితునికి సంపద, పేరు ప్రతిష్ఠల పట్ల శ్రద్ధ ఉండదు, వాద, ప్రతివాదముల యందు ప్రీతి ఉండదు. అందరి పట్ల సమభావన ఉంటుందని భగవద్గీత చెబుతుంది. సకల సద్గుణ సంపన్నుడే వేద పండితుడు.

– రాచమడుగు శ్రీనివాసులు

క్లుప్తంగా...

15న యాదగిరి గుట్టలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

యాదగిరిగుట్ట: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఈనెల 15న సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఈఓ వెంకట్రావ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు కొండ కింద శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఉచితంగా ఈ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ వ్రతంలో పాల్గొనాలనుకునే మహిళలు ఈనెల 13న సాయంత్రం 5 గంటల వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో అన్ని రకాల పూజలు, దర్శనం కల్పించడంలో వైదిక సిబ్బంది పని తీరు పరిశీలించేందుకు, సూచనలు, సలహాలిచ్చేందుకు ఏడుగురితో వైదిక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెంకట్రావ్ వెల్లడించారు. కమిటీ చైర్మన్‌గా వంశపారంపర్య ధర్మకర్త బి.నర్సింహమూర్తి, సభ్యులుగా డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ, ప్రధానార్చకుడు-1తో పాటు ప్రధాన పురోహిత్, శివాలయం ప్రధానార్చకుడు, సీనియర్ వేద పండితుడు, ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారిని నియమించినట్లు తెలిపారు.

ప్రధానార్చకుడిగా సురేంద్రచార్యులు



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రధానార్చకుడిగా సురేంద్రచార్యులు నియమితులయ్యారు. ఈ మేరకు ఆలయ ఈఓ వెంకట్రావ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ప్రధానార్చకుడిగా ఉన్న నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆ పోస్టును భర్తీ చేసేందుకు ఉప ప్రధానార్చకుడిగా ఉన్న సురేంద్రచార్యులుకి ప్రధానార్చకుడిగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోడు భూములు గిరిజనేతరుల చేతుల్లోనా?

- రైతు కమిషన్ సీరియస్

సాక్షి, హైదరాబాద్: గిరిజన ప్రాంతాల్లోని పోడుభూములు గిరిజనేతరుల చేతుల్లో ఉండటం ఏంటని రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ములుగు జిల్లాకు చెందిన గిరిజన రైతులు హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయానికి వచ్చి చైర్మన్ కోదండరెడ్డిని కలిశారు. చట్ట విరుద్ధంగా పోడు భూములను గిరిజనేతరులు పట్టా చేయించుకున్నారని వాపోయారు. గిరిజనేతరుల చేతుల్లో ఉన్న అటవీ భూములను స్వాధీనం చేసుకొని అర్హులైన వారికి కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన కోదండరెడ్డి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారితో పాటు రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి, ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ భూములు గిరిజనేతరుల చేతుల్లో ఉండటం ఏంటని ప్రశ్నించారు. సర్వే చేసి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతు కమిషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో చైర్మన్ కోదండరెడ్డి తోపాటు సభ్యులు భవానీరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ నాయకులు పత్తి కృష్ణారెడ్డి, కమిషన్ మెంబర్ సెక్రటరీ గోపాల్, ఏవో హరి వెంకటప్రసాద్, ములుగు జిల్లా గిరిజన రైతులు పాల్గొన్నారు.

రేవంత్ పెంచరు.. కేసీఆర్ అడగరు

- చేయూతపై మంద కృష్ణమాదిగ



చిట్యాల: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. చేయూత లబ్ధిదారులైన వృద్ధులు, దివ్యాంగులకు సీఎం రేవంత్‌రెడ్డి పింఛను పెంచటం లేదు.. ఇచ్చిన హామీని అమలు చేయాలని మాజీ సీఎం కేసీఆర్ అడగటం లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విమర్శించారు. అందుకే చేయూత పింఛన్‌దారుల తరపున ఉద్యమం చేపట్టానని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో సోమవారం నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల స్థాయి చేయూత పింఛన్‌దారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిపై తాడోపేడో తేల్చుకునేందుకు హైదరాబాద్‌లో సెప్టెంబర్ 3న నిర్వహించనున్న బహిరంగ సభకు దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కోరారు.

ప్రముఖ కవయిత్రి అనిశెట్టి రజిత కన్నుమూత



హనుమకొండ కల్చరల్: ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత (66) హనుమకొండలోని తన నివాసంలో సోమవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన రజిత.. స్త్రీ విముక్తి, స్త్రీకి సామాజిక సమానత్వం కోసం పలు రచనలు చేశారు. ఆమె 2017లో తెలంగాణ ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కారం అందుకున్నారు. 1969లో కాజీపేటలోని ఫాతిమానగర్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సమయంలో.. ప్రజాకవి కాళోజీ ధిక్కార స్వర వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారు. తెలంగాణ తొలిదశ ఉద్యమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ ప్రోత్సాహంతో మలిదశ ఉద్యమంలో పాల్గొన్నారు.

మహిళా మార్ట్.. బిజినెస్ భేష్!



ఖమ్మంలోని మహిళా మార్ట్

- మార్కెటింగ్‌తో పాటు ఉపాధి.. ఆదాయం
- ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఊతం ఇస్తున్న వేదిక
- నాణ్యమైన ఉత్పత్తులతో రెండు నెలల్లో లాభాల బాట
- రాష్ట్రంలోనే తొలి మహిళా మార్ట్ ఖమ్మంలో ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం

స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తుల అమ్మకానికి ఖమ్మంలోని మహిళామార్ట్ వేదికగా నిలుస్తోంది. ఏళ్లుగా సభ్యులు ఉత్పత్తులను తయారుచేస్తున్నా.. సరైన మార్కెటింగ్ లేక నష్టపోయారు. వివిధ ప్రాంతాల్లో స్టాళ్లు ఏర్పాటుచేసినా ప్రదర్శనకే పరిమితమయ్యారు. కానీ కార్పొరేట్ తరహాలో ఖమ్మంలో మహిళా మార్ట్ ఏర్పాటవడంతో వారి కష్టాలు తీరాయి. జిల్లాలోని అన్ని స్వయంసహాయక సంఘాల సభ్యుల ఉత్పత్తులను ఒకే చోట విక్రయించేలా ఈ మార్ట్‌ను తీర్చిదిద్దారు. రాష్ట్రంలో ఈ తరహా మార్ట్ ఏర్పాటు కావడం ఇదే మొదటిసారి. ఈ ఏడాది మే 28న ఈ మార్ట్ మొదలుకాగా.. రెండు నెలల్లోనే వ్యాపారం దాదాపు రూ.17 లక్షలు దాటింది. దీని ద్వారా ఆరు ఎస్‌హెచ్‌జీల సభ్యులకు ఉపాధి లభించడమే కాక మిగతా సంఘాల సభ్యులు తయారుచేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సులువవుతోంది.

గత కలెక్టర్ ఆలోచనతో..

జిల్లాలోని ఎస్‌హెచ్‌జీల సభ్యులు గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే ముడిసరుకుతో ఉత్పత్తులను తయారు చేస్తుండగా మార్కెటింగ్ లేక, పెట్టుబడి కూడా రాక నిరాశకు లోనయ్యారు. ఇదే అదనుగా కొందరు వీరి నుంచి తక్కువ ధరకు ఉత్పత్తులను కొనుగోలు చేసి హైదరాబాద్ వంటి నగరాల్లో అధిక ధరకు విక్రయించే వారు. ఈనేపథ్యంలో గత కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్.. మహిళామార్ట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రూ.30 లక్షల సెర్ప్ నిధులతో పాత భవనాన్ని ఆధునీకరించి మహిళా మార్ట్ ఏర్పాటు చేయించడంతో వీరి వ్యాపారాలకు ఆదరణ లభిస్తోంది.

15 రోజులకోసారి చెల్లింపులు

స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు తమ ఉత్పత్తులను ఇక్కడికి తీసుకొస్తే.. వాటిని పరిశీలించి నాణ్యత ఆధారంగా ధర నిర్ణయిస్తారు. ఆపై మహిళా మార్ట్ స్టిక్కర్‌తో విక్రయాలు చేస్తున్నారు. ఈ లావాదేవీలకు సంబంధించిన సొమ్ము జిల్లా సమాఖ్య ఖాతాలోకి వెళ్తుంది. ప్రతీ 15 రోజులకోసారి లెక్కలు తీసి.. మండల సమాఖ్యలకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఇచ్చేస్తారు. ఈ మహిళా మార్ట్‌లో ప్రస్తుతం 200కు పైగా ఉత్పత్తులను అమ్ముతున్నారు.

వందలాది కుటుంబాలకు ఊతం..

మహిళా మార్ట్ .. జిల్లాలోని వందలాది కుటుంబాలకు ఊతంగా మారింది. ఉత్పత్తులు నాణ్యంగా ఉన్నాయనే ప్రశంసలు వస్తుండటంతో మరిన్ని ఉత్పత్తులను అమ్మకానికి ఉంచాలని వినియోగదారులు కోరుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ మార్ట్‌లో ప్రతిరోజు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. జూన్ నెలలో రూ.8 లక్షలు, జూలైలో రూ.8.50 లక్షల అమ్మకాలు జరగడం విశేషం.


ర్యాక్‌లలో సామగ్రి సర్దుతున్న మహిళలు

శిక్షణ ఇచ్చి ఉద్యోగంలోకి



నేను ఇంటర్ చదవడంతో వ్యాపార నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. కంప్యూటర్‌లో వివరాల నమోదు, బిల్లుల జారీ, ప్యాకింగ్‌పై అవగాహన రావడంతో మహిళా మార్ట్ ప్రారంభమయ్యాక పిలిపించారు. ఇక్కడ కూడా మరికొంత శిక్షణ ఇచ్చి ఉద్యోగంలో చేర్చుకున్నారు. – అరవికట్ల వసంత, వేపకుంట్ల, రఘునాథపాలెం మండలం

మహిళలకు మంచి అవకాశం



చదువుకుని ఇంట్లో ఖాళీగా ఉంటున్న నాకు ఉద్యోగం లభించింది. డిగ్రీ వరకు చదివిన నేను స్టాక్ రిసీవర్‌గా పని చేస్తున్నా. విక్రయాలు మరింత పెరిగితే ఇంకా ఎక్కువ మంది మహిళలు ఉపాధి పొందుతారు. – తుడుం త్రివేణి, నేలపట్ల, కూసుమంచి మండలం

నెలకు రూ.50 వేల సరుకులు ఇస్తున్నా



జొన్న మురుకులు, మిక్చర్, సజ్జ బూరెలు, జొన్న లడ్డూ, రాగి లడ్డూ, కారప్పూస, అరిసెలు, రాగిచెక్కలు, సకినాలు, చేపలు, చికెన్ పచ్చళ్ల వంటి ఉత్పత్తులతో రూ.50 వేల విలువైన సరుకులు నెలనెలా మార్టుకు ఇస్తున్నా. గతంలో గిరాకీ ఉన్న చోటకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు తిరిగే ఇక్కట్లు తప్పాయి. – మద్దినేని పద్మ, తులశమ్మ సంఘం, గోపారం, కొణిజర్ల మండలం

దివ్యాంగుడని చూడకుండా.. గోడు వినకుండా

- ప్రజావాణికి వచ్చిన దివ్యాంగుడిని ఈడ్చుకెళ్లిన సిబ్బంది
- జగిత్యాల కలెక్టరేట్‌లో అమానవీయం

జగిత్యాల టౌన్: జగిత్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన ఓ దివ్యాంగుడిని ఈడ్చుకెళ్లిన అమానవీయ ఘటన కలకలం సృష్టించింది. అధికారులకు గోడు చెప్పుకునే అవకాశం ఇవ్వకుండా దివ్యాంగుడిని (లోకోమోటివ్ డిజార్డర్) కలెక్టరేట్ పోలీసులు, సిబ్బంది బయట వదిలేశారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన మర్రిపెల్లి రాజగంగారాం ప్రజావాణిలో తన సమస్య చెప్పుకునేందుకు చక్రాలబండిపై వచ్చాడు. కలెక్టర్ వస్తున్నారంటూ అక్కడే విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ కానిస్టేబుల్, ఇతర సిబ్బంది రాజగంగారాంను వీల్‌చైర్‌తో సహా బలవంతంగా బయటకు లాక్కెళ్లారు. ఆడిటోరియం తలుపును పట్టుకున్న గంగారాం.. అక్కడే నేలపై పడుకుని నిరసన తెలిపే ప్రయత్నం చేశాడు. సరిగ్గా అదే సమయంలో అక్కడికి వచ్చిన కలెక్టర్ సత్యప్రసాద్ దివ్యాంగుడిని పట్టించుకోకుండానే లోపలికి వెళ్లిపోయారు. తర్వాత రాజగంగారాంను సిబ్బంది ప్రజావాణి ప్రాంగణం నుంచి బయట వదిలేశారు. తన ఇంటికి అడ్డుగా గోడ నిర్మించి ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గత సోమవారం కూడా నేలపై పడుకుని నిరసన తెలిపాడు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో తిరిగి ప్రజావాణికి వచ్చి తన సమస్య వివరించే ప్రయత్నం చేయగా ఆయన్ను బయటకు తోసేయడం వివాదాస్పదంగా మారింది. వెన్నుపూస సంబంధిత వైకల్యంతో బాధపడుతున్న తాను ఎనిమిదేళ్లుగా ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ తన సమస్యను పట్టించుకోలేదని రాజగంగారం వాపోయారు.

బాధ్యుడైన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి: కవిత

గోడు చెప్పుకునేందుకు వచ్చిన దివ్యాంగుడిని కలెక్టర్ ఎదుటే ఈడ్చుకెళ్లి బయట పడేయడం అత్యంత దుర్మార్గమని, ఈ ఘటనకు బాధ్యుడైన కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. తన కళ్లెదుటే ఇంతటి దారుణం జరుగుతున్నా స్పందించని కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికగా ఆమె డిమాండ్ చేశారు.

ప్రజావాణికి వచ్చిన దివ్యాంగుడిని ఈడ్చుకెళ్లడం ఏంటి?: వాసుదేవరెడ్డి

సాక్షి, హైదరాబాద్: తనకున్న సమస్యను చెప్పుకుందామని ప్రజావాణికి వచ్చిన దివ్యాంగుడిని పోలీసులు ఈడ్చుకెళ్లడం ఏంటని దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యమా? లేదా రాచరికమా అని సోమవారం ఒక ప్రకటనలో నిలదీశారు. జగిత్యాల కలెక్టరేట్‌లో జరిగిన సంఘటన మానవత్వానికి మాయని మచ్చ అని మండిపడ్డారు. వెంటనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం, జగిత్యాల మంత్రి, జిల్లా కలెక్టర్ స్పందించి ఆ దివ్యాంగుడి సమస్యను తీర్చాలని కోరారు.


గంగారాంను ఈడ్చుకెళ్తున్న కలెక్టరేట్ పోలీసులు

రైల్వే విద్యుత్ తీగలపై కోతుల గుంపు

- తెగడంతో నిలిచిన విద్యుత్ సరఫరా
- గంటన్నర పాటు ఆగిన కాకతీయ, సింగరేణి రైళ్లు

కారేపల్లి: కోతులు గుంపులుగా వేలాడటంతో.. రైల్వే హైటెన్షన్ తీగలు తెగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నుంచి సికింద్రాబాద్ వైపు కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం ఉదయం 5.20 గంటలకు ఖమ్మం జిల్లా కారేపల్లి మీదుగా వెళ్లాల్సి ఉంది. ఈమేరకు కారేపల్లిలో బొగ్గు లోడ్‌తో ఉన్న గూడ్స్ రైలును స్టేషన్‌లో లూప్‌లైన్‌లో నిలిపివేశారు. గూడ్స్ బోగీల నిండా బొగ్గు ఉండడంతో.. వాటిపైకి చేరిన కోతులు అడుగు ఎత్తులోనే ఉన్న తీగలను పట్టుకుని వేలాడాయి. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి ఒక కోతి మృతి చెందగా.. మరో తీగ సైతం తెగిపోయింది. దీంతో రైల్వే అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. ఇంతలోనే కొత్తగూడెం నుంచి కాకతీయ ఎక్స్‌ప్రెస్ కారేపల్లి స్టేషన్ సమీపానికి చేరడంతో అక్కడే నిలిపివేశారు. అనంతరం గంటన్నర పాటు రైల్వే అధికారులు శ్రమించి తెగిన విద్యుత్ తీగలను సరిచేయడంతో రైలు బయలుదేరింది. కాగా, స్టేషన్‌లో తాగునీటి సౌకర్యం లేకపోవడం, సమీపాన దుకాణాలు సైతం లేక అంతసేపూ పిల్లాపాపలతో ఉన్న ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కాగా, ఆ వెనుకే కొత్తగూడెం నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్లాల్సిన సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ రైలు కారేపల్లి రైల్వేస్టేషన్‌కు ఉదయం 6.34 గంటలకు చేరుకోవలసి ఉండగా.. విద్యుత్ అంతరాయంతో చీమలపాడు స్టేషన్ వద్ద నిలిపివేయాల్సి వచ్చింది.


కారేపల్లి స్టేషన్ సమీపాన తెగిపడిన హైటెన్షన్ విద్యుత్ తీగ

ఇందిరమ్మ ఇల్లు కట్టుకోనివ్వకుంటే | ఆత్మహత్య చేసుకుంటా


ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు భూమి ఆధార పత్రాలు చూపిస్తున్న శివ


ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కాళ్లపై పడిన అన్నెపర్తి గోపాల్

- పురుగు మందు డబ్బాతో ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎదుట హల్‌చల్
- మరో ఘటనలో ఇల్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాళ్లపైపడ్డ వ్యక్తి

గార్ల: అధికారులు ప్రభుత్వ భూమి అని ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేశారని, పూర్తిగా కట్టనివ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానని ఓ బాధితుడు ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎదుట పురుగు మందు డబ్బాతో హల్‌చల్ చేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా గార్లలో సోమవారం జరిగింది. సోమవారం ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో గార్ల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. విషయం తెలుసుకున్న మండలంలోని మర్రిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన భూక్య శివ పురుగు మందు డబ్బా, భూమి హక్కు పత్రాలతో అక్కడికి వచ్చాడు. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, అధికారులు ప్రభుత్వ భూమి అని నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేశారని, ఇల్లు పూర్తిగా కట్టుకోనివ్వకపోతే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని కలెక్టర్ ఎదుట వాపోయాడు. ఈ క్రమంలో కలెక్టర్ భూమి పత్రాలు పరిశీలించి పక్కనే ఉన్న తహసీల్దార్ శారదను వివరాలు అడుగగా, ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్నాడని, అందుకే నిలిపివేశామని ఆమె వివరించారు. కాగా, తన నాన్న భూక్య కిషన్ పేరుమీద 24 గుంటల భూమి పట్టాదారు పాసు పుస్తకం ఉందని బాధితుడు ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు పత్రాలను చూపించాడు. పూర్తి విచారణ జరిపిన అనంతరం సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ బాధితుడికి హామీ ఇచ్చారు.

సార్, నీకాళ్లు మొక్కుతా...

గుండాల: నిరుపేద కుటుంబానికి చెందిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రానికి చెందిన అన్నెపర్తి గోపాల్.. ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కాళ్లపైపడి వేడుకున్నాడు. 'సార్ నీ కాళ్లు మొక్కుతా, నాకు ముగ్గురు కుమారులు, నాలుగు కుటుంబాలు కలిసి ఒకే ఇంట్లో నివసిస్తున్నాం. మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదు' అని విలపిస్తూ ఎమ్మెల్యే కాళ్లపై పడ్డాడు. ఉన్న చిన్న ఇంట్లో అందరం కలిసి ఉండలేక పోతున్నామని, వెంటనే ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని ఆయన కోరాడు.

ఆస్తి లాక్కొని.. ఇంట్లో నుంచి గెంటేశారు

ఆదుకోవాలంటూ కలెక్టర్‌కు విన్నవించిన వృద్ధురాలు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వృద్ధురాలు

గద్వాల: వృద్ధాప్యంలో అండగా నిలవాల్సిన కన్న కొడుకు భూమిని లాక్కోవడంతో పాటు లేని రోగాన్ని ఉందంటూ వేధింపులకు గురిచేసి ఇంట్లో నుంచి గెంటేశాడని, తనను ఆదుకోవాలని ప్రజావాణిలో ఓ వృద్ధురాలు కలెక్టర్‌ను ఆశ్రయించింది. వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన హుస్సేన్‌బీ (80)కి ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. రెండో కుమారుడు చిన్న ఇస్మాయిల్ తల్లిపేరిట ఉన్న 8.20 ఎకరాల భూమిపై కన్నేశాడు. నీ మిగిలిన జీవిత కాలం నేనే చూసుకుంటాను అని నమ్మబలికి 2022లో హుస్సేన్‌బీని తన ఇంటికి తీసుకెళ్లాడు. ఆమె పేరిట ఉన్న భూమిని తన పేరిట 2.03 ఎకరాలు, భార్య పేరిట 2.03 ఎకరాల భూమిని గిఫ్ట్‌డీడ్ కింద 2023, జూన్ 9న మార్చించుకున్నాడు. మిగిలిన 4.26 భూమిని 2023, అక్టోబర్ 5న భార్య సాబేరాభాను పేరిట గిఫ్ట్‌డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తల్లి పేరిట ఉన్న మొత్తం భూమిని తమ పేరిట మార్పు చేసుకోవడంతో నెలరోజులుగా వేధింపులకు గురిచేస్తున్నారు. ఈక్రమంలోనే తల్లికి ఎయిడ్స్ ఉందనే అబద్ధపు ప్రచారం చేస్తూ హింసకు గురిచేస్తూ వచ్చారు. చివరికి చేసేది లేక ఆమె తన గోడును కలెక్టర్ బీఎం సంతోష్‌కు చెప్పుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి వినతి పత్రం ఇచ్చింది. న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

కీసర ఓఆర్‌ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

- వేగంగా వచ్చిన మినీ ట్రక్ ఢీకొని ముగ్గురు కూలీలు మృతి


ప్రమాదానికి కారణమైన వాహనం ఇదే

కీసర: కీసర అవుటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓఆర్‌ఆర్ పైన ఉన్న చెట్ల మధ్యలో కలుపు తీసేందుకు వచ్చిన కూలీలను వేగంగా దూసుకువచ్చిన ఓ మినీ ట్రక్ ఢీకొట్టింది. దీంతో ముగ్గురు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కీసర సీఐ ఆంజనేయులు కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన నారాయణ (28), చెక్మోహన్ (24) జైరామ్ (32) రెండు రోజుల క్రితమే బతుకుదెరువు నిమిత్తం శామీర్‌పేటకు వచ్చారు. ఈ క్రమంలో ఇతర కూలీలతో కలసి ముగ్గురూ సోమవారం అవుటర్ రింగు రోడ్డుపై ఉన్న చెట్ల మధ్యలో కలుపుతీసే పనికి వచ్చారు. మధ్యాహ్నం భోజనం చేశాక కూలీలు అందరూ కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నారు. అదే సమయంలో విశాఖపట్నం గాజువాక నుంచి సెల్‌ఫోన్ టవర్ సామగ్రితో మేడ్చల్‌కు వస్తున్న మినీ ట్రక్ అతి వేగంగా కూలీలపైకి దూసుకువచ్చింది. దీంతో అక్కడ ఉన్న 11 మంది కూలీల్లో 8 మంది తప్పించుకున్నారు. అక్కడినుంచి పరుగెడుతున్న ముగ్గురినీ ఈ వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం డ్రైవర్ గణేశ్ మద్యం మత్తులో ఉండి, నిర్లక్ష్యంగా నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన గణేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కీసర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమల తనిఖీలకు స్పెషల్ డ్రైవ్

- తొలి విడతలో 4,061 హైరిస్క్ పరిశ్రమల్లో తనిఖీలు
- ఐదు రీజియన్లుగా రాష్ట్రంలోని పరిశ్రమల విభజన.. ఒక్కో రీజియన్‌కు ప్రత్యేక బృందం
- నేటి నుంచి యాజమాన్యాలతో కలెక్టర్ల సమావేశాలు


(ఫైల్)

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సిగాచీ పరిశ్రమలో ప్రమాదం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పరిశ్రమల్లో భద్రత తనిఖీలకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు కేవలం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శాఖ మాత్రమే ఈ తనిఖీలు చేసేది. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఈ శాఖ అధికారులతోపాటు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ), అగ్నిమాపక, కార్మిక, జిల్లా పరిశ్రమలు, బాయిలర్ శాఖ ఇన్‌స్పెక్టర్లతో కూడిన ఏడుగురు సభ్యులుండే ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయి. ఈ మేరకు కార్మికశాఖ మూడు రోజుల క్రితం జీఓ 331ను జారీ చేసింది. రెండు నెలలపాటు ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగనుంది. పరిశ్రమల్లో కార్మికుల భద్రత, భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించనున్నారు. సిగాచీ పరిశ్రమలో శక్తివంతమైన పేలుడు జరిగి 56 మంది మృత్యువాతపడిన విషయం విదితమే.

మొదట హైరిస్క్ పరిశ్రమల్లో..

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మొదట హైరిస్క్ ఉన్న పరిశ్రమల్లో తనిఖీలు చేయనున్నారు. పేలుడు స్వభావం ఉన్న వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలు, అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉన్నవి, ప్రమాదరకమైన గ్యాస్‌లు లీకయ్యే అవకాశాలున్న ఫ్యాక్టరీల్లో తొలుత తనిఖీలు జరుగుతాయి. హైరిస్క్ పరిశ్రమలు రాష్ట్రవ్యాప్తంగా 4,061 ఉన్నాయి. ఫార్మా, కెమికల్ పరిశ్రమల్లో తొలివిడతలో తనిఖీలు చేయాలని భావిస్తున్నారు. రెండో విడతలో గ్యాస్ బాట్లింగ్, ఆయిల్, పెయింటింగ్, ఫార్ములేషన్, బయోటెక్ ఫ్యాక్టరీలు; మూడో విడతలో థర్మల్ పవర్‌ప్లాంట్లు, సిమెంట్; నాలుగో విడతలో ఇతర హైరిస్క్ ఫ్యాక్టరీలను తనిఖీలు చేయనున్నారు.

రాష్ట్రాన్ని ఐదు రీజియన్లుగా విభజన: పరిశ్రమల సంఖ్యను బట్టి రాష్ట్రాన్ని ఐదు రీజియన్లుగా విభజించారు. సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, మెదక్, ఉమ్మడి నల్లగొండ రీజియన్లతోపాటు మిగిలిన జిల్లాలతో మరో రీజియన్‌ను ఏర్పాటుచేశారు. ఒక్కో రీజియన్‌కు ఒక్కో ప్రత్యేక బృందాన్ని నియమించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కన్వీనర్‌గా ఉండే ఈ బృందంలో మొత్తం ఏడుగురు సభ్యులు ఉంటారు. తొలుత ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మంగళవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా యాజమాన్యాలు పాటిస్తున్న భద్రత ప్రమాణాలకు సంబంధించి స్వీయ ధ్రువీకరణ పత్రాలను తీసుకుంటారు.


పార్లమెంట్ మకర ద్వారం వద్ద బైటాయించి నినాదాలు చేస్తున్న ప్రియాంకా గాంధీ, డింపుల్ యాదవ్, సయోనీ ఘోష్


బారికేడ్లపైకి ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న మహువా మొయిత్రా, సుస్మితా దేవ్


పోలీసు వాహనంలో రాహుల్ గాంధీ, సంజయ్ రౌత్ తదితరులు

ఓట్ల చోరీపై పోరుబాట

ఢిల్లీలో 'ఇండియా' కూటమి ఎంపీల నిరసన ర్యాలీ

- పార్లమెంట్ నుంచి ఈసీ కార్యాలయానికి బయలుదేరిన విపక్ష నేతలు
- ర్యాలీకి అనుమతి లేదంటూ మధ్యలోనే అడ్డుకొని అరెస్టు చేసిన పోలీసులు

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)తోపాటు దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల్లో అక్రమాలు, ఓట్ల చోరీ, గత లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్‌పై విపక్ష 'ఇండియా' కూటమి పోరుబాట పట్టింది. ఓట్ల చోరీని వెంటనే ఆపాలని, 'ఒక్కరికి ఒక ఓటు' అనే విధానాన్ని పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ప్రతిపక్ష ఎంపీలు సోమవారం దేశ రాజధానిలో ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. తెల్లటోపీలు ధరించి పార్లమెంట్ మకరద్వారం నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి బయలుదేరిన 'ఇండియా' కూటమి ఎంపీలను పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ర్యాలీకి అనుమతి లేదంటూ పీటీఐ భవనం ఎదుట పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను పక్కకు తొలగించేందుకు ఎంపీలు ప్రయత్నించారు. కేవలం 30 మందిని అనుమతిస్తామని పోలీసులు చెప్పగా, ఎంపీలు అంగీకరించలేదు. ఎన్నికల సంఘానికి విజ్ఞాపన పత్రం అందజేయడానికి శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న తమను అడ్డుకోవడం ఏమిటని మండిపడ్డారు. కొందరు రోడ్డుపై బైఠాయించి, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని హత్య చయడం ఆపాలన్నారు. మహిళా ఎంపీలు మహువా మొయిత్రా, సాగరికా ఘోష్, సుస్మితా దేవ్, సంజనా జాతవ్, జోతిమణితో పాటు సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు అఖిలేష్ యాదవ్ బారికేడ్లపైకి ఎక్కారు. ఎన్నికల సంఘం తీరుపై నిప్పులు చెరిగారు. నినాదాలతో హోరెత్తించారు. ఈ గందరగోళం మధ్య మహిళా ఎంపీలు మహువా మొయిత్రా, మితాలీ బేగ్ స్పృహ తప్పిపడిపోగా, రాహుల్ గాంధీ వారికి సపర్యలు చేశారు. తర్వాత పోలీసులు నిరసనకారులను బస్సుల్లోకి ఎక్కించి, పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. రెండు గంటల తర్వాత వారందరినీ విడుదల చేశారు.

రాజకీయ పోరాటం కాదు: రాహుల్

ఇది రాజకీయ పోరాటం కాదని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే పోరాటం ప్రారంభించామని స్పష్టంచేశారు. నిరసన ర్యాలీ సందర్భంగా ఆయన మాట్లాడారు. చట్ట ప్రకారం ఒక్కరికి ఒక ఓటు మాత్రమే ఉండాలన్నారు. అక్రమాలు, అవకతవకలకు తావులేని స్వచ్ఛమైన, స్పష్టమైన ఓటర్ల జాబితా కోసం ఉద్యమిస్తున్నామని ఉద్ఘాటించారు. ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాల గురించి ప్రజలందరికీ తెలుసని చెప్పారు. ఎన్నికల సంఘం దీనిపై స్పందించడం లేదని నిలదీశారు. గత ఎన్నికల్లో దేశమంతటా జరిగిన రిగ్గింగ్‌పై త్వరలో బాంబు పేలుస్తానని రాహుల్ మరోసారి వెల్లడించారు. ఎన్నికల సంఘం కోరుతున్నట్లుగా సంతకం చేసిన అఫిడవిట్ సమర్పించే ప్రసక్తే లేదన్నారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్ నుంచి తీసుకున్న సమాచారాన్ని విశ్లేషించి, ఓట్ల చోరీని బయటపెట్టానని, ఇంతకంటే సాక్ష్యాధారాలు ఇంకేం కావాలని ప్రశ్నించారు. అది తాను సృష్టించిన డేటా కాదని స్పష్టంచేశారు.

బీజేపీ కుట్రలను అడ్డుకుంటాం: ఖర్గే

ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతూనే ఉంటామని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే స్పష్టంచేశారు. ఓట్ల చోరీని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. ఎస్ఐఆర్ పేరిట ఓటర్ల జాబితాలను తారుమారు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ కుట్రలను కచ్చితంగా అడ్డుకుంటామని అన్నారు. ఈ మేరకు ఖర్గే 'ఎక్స్'లో పోస్టుచేశారు. దేశంలో బీజేపీ నిరంకుశత్వం చెల్లదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా బీజేపీ చేస్తున్న కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. సాక్షాత్తూ పార్లమెంట్ ఎదుటే ప్రజాస్వామ్యంపై దాడి జరిగిందని, ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ధ్వజమెత్తారు. ప్రతిపక్ష ఎంపీలను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. తమ డిమాండ్లపై ఎన్నికల సంఘానికి వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు. ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల సంఘం దొంగతనం చేసే సంఘంగా మారొద్దని జైరాం రామేశ్ హితవు పలికారు. నిరసన ర్యాలీలో శరద్ పవార్(ఎన్సీపీ-ఎస్పీ), టి.ఆర్.బాలు(డీఎంకే), సంజయ్ రౌత్(శివసేన-ఉద్ధవ్), డెరెక్ ఓబ్రెయిన్(టీఎంసీ)తోపాటు ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యుడు సంజయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, నిరసన ర్యాలీ కోసం ఎవరూ అనుమతి తీసుకోలేదని ఢిల్లీ పోలీసులు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం ఆఫీసు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బారికేడ్ దాటేసిన అఖిలేశ్

నిరసన ర్యాలీలో తమను అడ్డుకున్న పోలీసులపై సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేశ్ యాదవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బారికేడ్లను తోసుకొని ముందుకెళ్లేందుకు ప్రయత్నించారు. బారికేడ్ ఎక్కి అవతలికి దూకేశారు. పోలీసులు వెంటనే అప్రమత్తమై ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

ప్రజా ఉద్యమంలా మారింది: రాహుల్

న్యూఢిల్లీ: 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా చేపట్టిన ప్రచారం ఉధృతమై ప్రజా ఉద్యమంలా మారిందని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. పోర్టల్ ప్రారంభించినప్పటి నుంచి మద్దతుగా 15 లక్షల సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని, 10 లక్షల వరకు మిస్‌డ్ కాల్స్ వచ్చాయన్నారు.


బారికేడ్‌పైకి ఎక్కి మీడియాతో మాట్లాడుతున్న అఖిలేశ్ యాదవ్


సొమ్మసిల్లిన మిథాలీ బేగ్‌కు సాయపడుతున్న సయోనీ ఘోష్ తదితరులు


సొమ్మసిల్లిన మహువా మొయిత్రాకు బస్సులో రాహుల్ సపర్యలు

ప్రేలాపనలు ఆపు

పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌పై భారత్ ఆగ్రహం

- బాధ్యత లేని అణ్వస్త్ర దేశం పాకిస్తాన్
- అమెరికా మద్దతు లభించినప్పుడల్లా రెచ్చిపోవడం పాక్‌కు అలవాటే
- ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి మునీర్ అధ్యక్షుడు అవుతారేమో!

న్యూఢిల్లీ: బాధ్యత లేని అణ్వస్త్ర దేశం పాకిస్తాన్ అని భారత ప్రభుత్వ వర్గాలు మండిపడ్డాయి. పొరుగు దేశంలో ప్రాణాంతక అణ్వాయుధాలు ప్రభుత్వేతర శక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. భవిష్యత్తులో భారత సైన్యం తమపై దాడి చేస్తే సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామంటూ పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలను భారత ప్రభుత్వ వర్గాలు సోమవారం తిప్పికొట్టాయి. అమెరికా మద్దతు లభించినప్పుడల్లా రెచ్చిపోవడం, నోరుపారేసుకోవడం, అసలు రంగు బయటపెట్టుకోవడం పాకిస్తాన్‌కు అలవాటేనని ఎద్దేవా చేశాయి. పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యం అనేదే లేదని, అక్కడ సైన్యమే రాజ్యమేలుతోందని చెప్పడానికి అసిమ్ మునీర్ నోటిదురుసే తార్కాణమని వివరించాయి. మునీర్‌కు అమెరికాలో ఘనమైన స్వాగతం, గౌరవ మర్యాదలు లభించాయంటే దాని అర్థం ఆయన మౌనంగా ఉండొచ్చు లేదా అమెరికా అండతో పాక్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి, అధ్యక్షుడు కావొచ్చని తెలిపాయి. ఫీల్డ్ మార్షల్ తదుపరి ప్రెసిడెంట్‌గా మారే పరిస్థితి కనిపిస్తోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అణ్వాయుధాలు చూపించి బ్లాక్ మెయిల్ చేస్తే బెదిరిపోవడానికి ఎవరూ సిద్ధంగా లేరని తేల్చిచెప్పాయి. అణ్వాయుధాలు కలిగిన దేశం బాధ్యతగా నడుచుకోవాలని హితవు పలికాయి. వాటిని చూపించి ఇతరులను బెదిరిస్తామంటే అది సాధ్యం కాదని సూచించాయి. తమ దేశ రక్షణ కోసం ఎలాంటి చర్యలకైనా సిద్ధమని స్పష్టంచేశాయి. పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని అసిమ్ మునీర్‌కు తేల్చిచెప్పాయి.

మునీర్ వ్యాఖ్యలను అమెరికా ఆమోదిస్తోందా?

''పాకిస్తాన్‌లో అణ్వాయుధాల బటన్ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం చేతిలో కాకుండా సైన్యం చేతుల్లో చిక్కుకుంది. దక్షిణాసియాలో అణు అస్థిరతకు పాకిస్తాన్ అడ్డాగా మారింది. అసిమ్ మునీర్ వాగుడు దీనినే సూచిస్తోంది. అమెరికా గడ్డపై ఆయన అనుచితంగా మాట్లాడారు. ఈ బాధ్యతరహితమైన, రెచ్చగొట్టే వ్యాఖ్యలను అమెరికా ప్రభుత్వం ఆమోదిస్తోందా? అణ్వాయుధ ఘర్షణలకు తెరపడాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిజంగా కోరుకుంటున్నారా? ఆయన వైఖరి ఏమిటి? మునీర్ వ్యాఖ్యలకు ట్రంప్ సర్కార్ బాధ్యత వహిస్తుందా?'' అని భారత ప్రభుత్వ వర్గాలు ప్రశ్నించాయి.

నోరు పారేసుకున్న మునీర్

న్యూయార్క్: పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ మరోసారి రెచ్చిపోయారు. ప్రస్తుతం అమెరికాలో అధికారిక పర్యటనలో ఉన్న ఆయన భారత్‌పై నోరుపారేసుకున్నారు. భారత సైన్యం గనుక పాకిస్తాన్‌పై దాడి చేస్తే తాము నష్టపోవడం కాకుండా సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామని హెచ్చరించారు. తమ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయని గుర్తుచేశారు. శనివారం ఫ్లోరిడాలోని టాంపా పట్టణంలో ప్రవాస పాకిస్తానీల సమావేశంలో మాట్లాడారు. కాశ్మీర్ అంశాన్ని మర్చిపోయే ప్రసక్తే లేదన్నారు. కాశ్మీర్ అనేది పాకిస్తాన్‌కు 'తల నుంచి గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే సిర' లాంటిదని చెప్పారు. తమ దేశానికి రావాల్సిన నీటిపై హక్కులను వదులుకొనే ప్రసక్తే లేదన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ జల హక్కులకు కాపాడుకుంటామన్నారు. ఇటీవల భారత్-పాక్ మధ్య ఘర్షణలో తాము పైచేయి సాధించమని వ్యాఖ్యానించారు. భారత్ మరోసారి దాడిచేస్తే తగిన సమాధానం చెప్తామన్న సందేశం ఇచ్చామని పేర్కొన్నారు. కాశ్మీర్ అనేది భారతదేశ అంతర్గత వ్యవహారం కాదని, అది పూర్తిగా అంతర్జాతీయ ఎజెండా అని తేల్చిచెప్పారు. పాకిస్తాన్‌కు కాశ్మీర్ అత్యంత కీలకమని మహ్మద్ అలీ జిన్నా చెప్పారని గుర్తుచేశారు.

సింధూ నది ఇండియా జాగీర్ కాదు

తమ దేశానికి నీరు రాకుండా ఎగువన భారత్ గనుక డ్యామ్‌లు నిర్మిస్తే వాటిని కచ్చితంగా పేల్చేస్తామని అసిమ్ మునీర్ హెచ్చరించారు. డ్యామ్‌లు నిర్మించేదాకా వేచి చూస్తామని, వాటి నిర్మాణం పూర్తయ్యాక ధ్వంసం చేస్తామని అన్నారు. సింధూ నది ఇండియా జాగీర్ కాదని స్పష్టంచేశారు. అది సొంత ఆస్తిలాగా భావించొద్దని ఇండియాకు సూచించారు. నదులకు అడ్డుకట్ట వేయాలని చూస్తే అడ్డుకొని శక్తి తమకు ఉందన్నారు. పాకిస్తాన్-అమెరికా మధ్య సంబంధాలు నానాటికీ బలపడుతున్నాయని మునీర్ హర్షం వ్యక్తంచేశారు. నెలన్నర వ్యవధిలోనే తాను మరోసారి అమెరికాకు రావడమే అందుకు నిదర్శనమని తెలిపారు. భారత్-పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని ఆపేసినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మునీర్ మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు.

మోదీకి జెలెన్‌స్కీ ఫోన్

- శాంతికి చొరవ చూపాలని వినతి
- రష్యా చమురుపైనా చర్చ

న్యూఢిల్లీ: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్‌లోని నగరాలు, గ్రామాలపై జరుగుతున్న రష్యా సైన్యం దాడుల గురించి వివరించారు. కాల్పుల విరమణకు రష్యా సిద్ధంగా లేనట్లు కనిపిస్తోందని అన్నారు. ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతికి చొరవ చూపాలని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితి సాధారణ సభ సమావేశం సందర్భంగా వ్యక్తిగతం భేటీ కావాలని జెలెన్‌స్కీ, మోదీ నిర్ణయించుకున్నారు. నరేంద్ర మోదీతో సంభాషణ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. భారత్, ఉక్రెయిన్ మధ్య ద్వైపాక్షిక సహకారంతోపాటు దౌత్య సంబంధాల్లో పురోగతిపై చర్చించామని తెలిపారు. ఉక్రెయిన్-రష్యా మధ్య ఘర్షణకు తెరపడాలని, సాధ్యమైనంత త్వరగా శాంతి నెలకొనాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. అందుకు భారత్ సహకారం అవసరమని పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్‌కు అన్నివిధాలుగా అండగా నిలుస్తున్నందుకు ప్రధాని మోదీకి జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలియజేశారు. మరోవైపు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దంటూ భారత్‌కు అమెరికా చేసిన హెచ్చరికల అంశం కూడా జెలెన్‌స్కీ, మోదీ మధ్య చర్చకు వచ్చింది. భారత్ చెల్లిస్తున్న డబ్బులతో రష్యా సైన్యం తమపై దాడులు చేస్తోందని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. అందుకే రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మోదీ సైతం 'ఎక్స్'లో ప్రతిస్పందించారు. ఉక్రెయిన్- రష్యా మధ్య శాంతికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టంచేశారు. ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటామన్నారు.

తక్షణ బహిష్కరణ.. ఆపై విచారణ!

- అక్రమ వలసదారులకు యూకే ప్రధాని స్టార్మర్ హెచ్చరిక
- 'డిపోర్ట్ నౌ, అప్పీల్ లేటర్'తాజాస్కీంలో భారత్ సహా 23 దేశాలు
- దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వారిపై వేగంగా చర్యలు

లండన్: అక్రమ వలసదారులకు యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ గట్టి హెచ్చరికలు చేశారు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వారిని తక్షణమే బహిష్కరించి, ఆ తర్వాతే ఆన్‌లైన్‌లో విచారణ జరుపుతామని స్పష్టంచేశారు. 'డిపోర్ట్ నౌ, అప్పీల్ లేటర్'స్కీంలో ఉన్న దేశాల సంఖ్య 8 నుంచి భారత్ సహా 23కు పెంచిన నేపథ్యంలో స్టార్మర్ వార్నింగ్ ఇవ్వడం గమనార్హం. 'మా దేశంలోకి మీరు అక్రమంగా వచ్చినట్లయితే నేరానికి పాల్పడినట్లే. ఇందుకుగాను డిటెన్షన్‌ను, బహిష్కరణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సాధ్యమైనంత వేగంగా మిమ్మల్ని వెనక్కి పంపివేస్తాం'అని సోమవారం ఎక్స్‌లో స్టార్మర్ పేర్కొన్నారు. 'ఎంతో కాలంగా విదేశీ నేరగాళ్లు మా వలస వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు. వారి అప్పీల్స్ వాయిదా పడుతుండటంతో యూకేలో నెలలు, సంవత్సరాల తరబడి తిష్ట వేసుకుంటున్నారు. దీనికి ముగింపు పలుకుతాం'అని ఆయన పేర్కొన్నారు. తాజాగా పెంచిన జాబితాలోని 23 దేశాలకు చెందిన అక్రమ వలసదారులను తక్షణమే దేశం నుంచి వెనక్కి పంపించివేస్తారు. వారి అప్పీళ్లపై వీడియో లింక్ ద్వారా విచారణ చేపడతారు. విదేశీ నేరగాళ్లను తొలగించడం, డిటెన్షన్ సెంటర్లపై ఒత్తిడి తగ్గించడం, ప్రజా ధనాన్ని ఆదా చేయడమే తమ లక్ష్యమని యూకే ప్రభుత్వం అంటోంది. 2023లో మొదటగా ఈ చట్టాన్ని తీసుకువచ్చినప్పుడు అందులోని జాబితాలో అల్బేనియా, కొసావో, నైజీరియా, ఎస్టోనియా దేశాలే ఉన్నాయి. విస్తరించిన జాబితాలో భారత్‌తోపాటు ఆ్రస్టేలియా, కెనడా, మలేసియా, కెన్యా, ఉగాండా తదితర దేశాలను చేర్చారు. దీనిపై ఆయా దేశాలతో యూకే అధికారులు చర్చలు ప్రారంభించారు. అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సైతం ఇప్పటికే విదేశీయులను వెనక్కి పంపే కార్యక్రమాన్ని ముమ్మరంగా అమలు చేస్తుండటం తెల్సిందే.

భారతీయులు సహా వందలాది మంది అరెస్ట్

దేశవ్యాప్తంగా అక్రమంగా పనిచేస్తున్న భారతీయులు సహా వందలాదిమందిని యూకే ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు. వీరంతా బైక్‌లపై డెలివరీ ఏజెంట్లుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. జూలై 20-27 తేదీల మధ్యన చేపట్టిన తనిఖీల్లో 1,780 అక్రమంగా పనిచేసే డెలివరీ ఏజెంట్లు, 280 మంది అనుమతులు లేకుండా పనులు చేసే వలసదారులు పట్టుబడ్డారని వెల్లడించారు. హిల్లింగ్‌డన్‌లో ఏడుగురు భారతీయులు దొరికారని, వీరిలో ఐదుగురిని నిర్బంధంలోకి తీసుకున్నట్లు తెలిపారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడి.. ఐదుగురు జర్నలిస్టులు మృతి

- జర్నలిస్ట్ అల్ షరీఫ్‌ను ఉగ్రవాదిగా అభివర్ణించిన ఇజ్రాయెల్
- ఖండించిన పాలస్తీనా జర్నలిస్టు సంఘాలు

డెయిర్ అల్-బలాహ్: గాజా నగరంలో ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో అల్‌జజీరా అరబిక్ ప్రతినిధి 28 ఏళ్ల అనాస్ అల్ షరీఫ్‌తోపాటు మరో నలుగురు జర్నలిస్టులు మరణించారు. ఈ దాడుల్లో కరస్పాండెంట్ మహ్మద్ క్రీకే, కెమెరా ఆపరేటర్లు ఇబ్రహీం జహెర్, మహమ్మద్ నౌఫల్, మోమెన్ అలీవా, వారి సహాయకుడు మహ్మద్ నౌఫల్ మరణించినట్లు అల్‌జజీరా ధ్రువీకరించింది. అల్-షిఫా ఆసుపత్రి ప్రధాన ద్వారం దగ్గర్లో ఉన్న టెంట్ లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. దాడిలో మొత్తం ఏడుగురు మరణించారని అల్-షిఫా ఆస్పత్రి అధికారి ఒకరు తెలిపారు. కాగా, అల్ షరీఫ్ రిపోర్ట్ చేస్తుండగానే బాంబు దాడి జరిగింది. ఈ ప్రాణాంతక దాడికి ముందు, అల్ షరీఫ్ గాజా నగరంలోని తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో పెరుగుతున్న దాడులను వివరిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'రెండు గంటలుగా గాజా నగరంపై ఇజ్రాయెల్ దురాక్రమణ తీవ్రమైంది' అని పోస్ట్‌లో పేర్కొన్నాడు. అల్ షరీఫ్ ప్రాణాలు కోల్పోవడానికి ముందు రాసిన మెసేజ్‌ను అతని ఫ్రెండ్ ఒకరు సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'ఇది నా చివరి వీలునామా, నా చివరి సందేశం. నా ఈ మాటలు మీకు చేరితే, ఇజ్రాయెల్ నన్ను చంపడంలో, నా గొంతును నొక్కేయడంలో విజయం సాధించిందని అర్థం'. అని ఆ సందేశంలో పేర్కొన్నారు.

అల్ షరీఫ్ హమాస్ నాయకుడు: ఐడీఎఫ్

అయితే.. వైమానిక దాడిలో మరణించిన అల్ షరీఫ్.. హమాస్ నాయకుడని ఇజ్రాయెల్ సైన్యం చాలా కాలంగా ఆరోపిస్తోంది. 'అనాస్ అల్ షరీఫ్ హమాస్ ఉగ్రవాద సంస్థలోని ఒక ఉగ్రవాద విభాగానికి అధిపతిగా పనిచేశాడు. ఇజ్రాయెల్ పౌరులు, ఐడీఎఫ్ దళాలపై రాకెట్ దాడులకు ఆయన నాయకత్వం వహించాడు' అని ఇజ్రాయెల్ సైన్యం అల్ షరీఫ్ మరణానంతరం ఒక ప్రకటనలో తెలిపింది. అల్ షరీఫ్‌పై ఇజ్రాయెల్ చేసిన వాదనలకు ఎలాంటి ఆధారాలు లేవని ఐక్యరాజ్యసమితి ప్రత్యేక నివేదకురాలు ఐరీన్ ఖాన్ కొట్టిపారేశారు. అంతేకాదు.. ఫ్రంట్‌లైన్ రిపోర్టింగ్ చేస్తున్న ఆయన ప్రాణాలకు ముప్పు ఉందని ఆమె గతంలోనే హెచ్చరించారు.

ఖండించిన జర్నలిస్టు సంఘాలు..

జర్నలిస్టుల హత్యను పాలస్తీనా జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. వారు ఉగ్రవాదులు కాదని, అలా నిరూపించడానికి ఎలాంటి ఆధారాలు కూడా లేవని కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే) చీఫ్ ఎగ్జిక్యూటివ్ జోడీ గిన్స్‌బర్గ్ తెలిపారు. 'ప్రస్తుత యుద్ధంలోనే కాదు, గత దశాబ్దాల్లోనూ ఇజ్రాయెల్ నమూనా ఇది. జర్నలిస్టును చంపడం.. అతను ఉగ్రవాది అని ముద్ర వేయడం ఇజ్రాయెల్ దళాలు పనిగట్టుకొని చేస్తున్నాయి' అని ఆమె ఆరోపించారు.

' నా ప్రజలను, నా కుటుంబాన్ని మీకు అప్పగిస్తున్నా'
- అనాస్ అల్ షరీఫ్ చివరి సందేశం

సాక్షిప్లస్ జాతీయం పేజీలో

ఫెడరల్ నియంత్రణలోకి వాషింగ్టన్ డీసీ

నేషనల్ గార్డ్ల మోహరింపు: ట్రంప్

వాషింగ్టన్: దేశ రాజధాని వాషింగ్టన్ డీసీ హింసాత్మక గ్యాంగ్‌లు, రక్తపిపాసులైన నేరగాళ్లతో నిండిపోయిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు రాజధానిలోని పోలీసు విభాగాన్ని ఫెడరల్ నియంత్రణలోకి తీసుకుంటున్నామని చెప్పారు. పోలీసుల కుతోడుగా 800 మంది నేషనల్ గార్డ్స్‌ను కూడా మోహరిస్తామని ప్రకటించారు. నేషనల్ గార్డులు శాంతిభద్రతలను, పౌరులకు రక్షణను కల్పిస్తారన్నారు. అవసరమైతే మరింతమంది నేషనల్ గార్డులను తీసుకొస్తామని పేర్కొన్నారు. సోమవారం ఆయన వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. నగరంలో నేరాల రేటు 2024లో 30 ఏళ్ల కనిష్టానికి పడిపోయిందంటూ గణాంకాలు చెబుతుండగా నేరాలమయంగా మారిందని వ్యాఖ్యానించడం గమనార్హం. ట్రంప్ ఈ వారంలోనే ఫెడరల్ బలగాలు రాజధానికి చేరుకుంటాయని రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ తెలిపారు.

నిరాశ్రయులు నగరం విడిచి వెళ్లిపోవాలి

'నివాసం లేని వారు వెంటనే నగరం వదిలి వెళ్లిపోవాలి. వారి కోసం నగరానికి దూరంగా స్థలాలిచ్చాం. నేరగాళ్లూ, మీరు మాత్రం ఎక్కడికీ వెళ్లొద్దు, మీరుండాల్సింది జైలులోనే. మేమే మిమ్మల్ని అందులో ఉంచుతాం'అని ట్రంప్ అంతకుముందు సొంత ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. వీధుల్లో, పార్కుల్లో నివాసం ఏర్పాటు చేసుకున్న వారిని తక్షణమే అరెస్ట్ చేయాలంటూ ఫెడరల్ పోలీసులకు ఆదేశాలిచ్చామన్నారు.

కర్ణాటక మంత్రి రాజన్న తొలగింపు

- సీఎం సిద్ధరామయ్య సిఫారసుకు గవర్నర్ ఆమోదం
- సొంత పార్టీ నేతలపై ఓట్ల రిగ్గింగ్ ఆరోపణల ఫలితం
- రాజన్న వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలన్న బీజేపీ

బెంగళూరు: కర్ణాటక సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్నను సీఎం సిద్ధరామయ్య కేబినెట్ నుంచి తొలగించారు. ఈ మేరకు ఆయన గవర్నర్ థావర్‌చంద్ర గహ్లోత్‌కు సోమవారం మధ్యాహ్నం సిఫారసు చేశారు. ఈ సిఫారసుపై గవర్నర్ ఆమోద ముద్ర వేశారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నాయి. పదవికి రాజీనామా చేయాలని కోరగా రాజన్న స్పందించలేదని, అందుకే తొలగించారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. సిద్ధరామయ్యకు విధేయుడిగా పేరున్న రాజన్న ఇటీవల చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ హైకమాండ్



ఆగ్రహానికి కారణమయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహదేవపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఓట్ల చోరీకి పాల్పడ్డారంటూ సొంత పార్టీ నేతలపై ఆరోపణలు చేయడం కలకలం రేపింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీకి దిగిందంటూ ఇటీవల తీవ్ర విమర్శలు చేస్తుండటం తెల్సిందే. అయితే, సోమవారం ఉదయం మంత్రి రాజన్న మీడియా ఎదుట తమ పార్టీ హయాంలో ఓట్ల చోరీ జరిగిందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటరు జాబితా సవరణలను పార్టీ నేతలు సరిగ్గా పరిశీలించకపోవడం సిగ్గు చేటని వ్యాఖ్యానించారు. ముసాయిదా ఓటరు జాబితా తయారీ సమయంలో మౌనంగా ఉన్నారని ఆరోపించారు. దీంతో, ఒకే వ్యక్తి పేరు మూడు చోట్ల కనిపించిందని, తక్కువ మంది ఉండే చాలా ప్రాంతాల్లో అనుమానాస్పద పేర్లను జత చేశారని పేర్కొన్నారు. మంత్రి రాజన్న ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ చీఫ్ ఖర్గే, నేత రాహుల్ సహా అగ్ర నాయకత్వం తీవ్ర ఆగ్రహంతో ఉంది. వెంటనే ఆయన్ను రాజీనామా చేయాలని తాఖీదులు పంపింది. ఈ పరిణామాలు బీజేపీకి కలిసి వచ్చినట్లయింది. రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణల్లో పస లేదని రాజన్న వ్యాఖ్యలతో తేలిపోయిందని బీజేపీ పేర్కొంది. తప్పు ఎత్తి చూపినందుకు ఎస్టీ వర్గానికి చెందిన రాజన్నతో బలవంతంగా రాజీనామా చేయించారంది. నిజం మాట్లాడితే కాంగ్రెస్ శిక్ష రాజీనామాయే అని బీజేపీ ఎంపీ మోహన్ వ్యాఖ్యానించారు. నిజాన్ని అంగీకరించే ధైర్యం కాంగ్రెస్‌పార్టీకి లేదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీవై విజయేంద్ర పేర్కొన్నారు. ఓట్ల చోరీ బీజేపీ హయాంలో జరిగిందని రాహుల్ ఆరోపిస్తుండగా, సీఎం సిద్ధరామయ్య హయాంలో అవకతవకలు జరిగినట్లు తాజాగా రుజువైందన్నారు. ఇందుకు రాహుల్, సిద్ధరామయ్య, డీకే శివకుమార్.. ఈ ముగ్గురిలో ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. రాజన్న వ్యాఖ్యలపై తక్షణమే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పండుగలను ఇక్కడే జరుపుకోండి

- పరిశుభ్రత విషయంలో పోటీ పడండి
- ఎంపీలకు ప్రధాని మోదీ సూచన
- నాలుగు టవర్లకు నదుల పేర్లు
- ప్రధాని చేతుల మీదుగా ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ: పార్లమెంట్ సభ్యుల కోసం నిర్మించిన బహుళ అంతస్తుల ఫ్లాట్ల సముదాయాన్ని ప్రధాని మోదీ సోమవారం ప్రారంభించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరుపుకునే పండుగలను నివాస ప్రాంగణాల్లోనే జరుపుకోవాలని, అదే సమయంలో పరిశుభ్రత విషయంలో పోటీ పడాలని ఎంపీలకు పిలుపునిచ్చారు. ప్రజలను ఐక్యంగా ఉంచుతున్న వేర్వేరు నదుల పేర్లను నాలుగు టవర్లకు పెట్టామని ఆయన చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఒక టవర్‌కు కోసి నది పేరును పెట్టామంటూ కొందరు అల్పబుద్ధితో వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. లక్షలాది మందికి జీవం పోసే ఈ నదులు ఇప్పుడు ప్రజా ప్రతినిధుల జీవితాల్లో కొత్త ఆనందాలకు ప్రేరణగా నిలుస్తాయి'అని ఆయన అన్నారు. ఢిల్లీలోని బాబా ఖడక్



సింగ్ మార్గ్‌లో పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌కు సమీపంలో నిర్మించిన మరో మూడు టవర్లకు కృష్ణా, గోదావరి, హుగ్లీ నదుల పేర్లను పెట్టారు. కాంప్లెక్స్‌లో మొత్తం 184 ఫ్లాట్లు న్నాయి. అత్యాధునిక వసతులు, పక్కాగా భద్రతా ఏర్పాట్లను కల్పించారు. ఎంపీలకు ఇళ్ల కొరత ఇబ్బందిగా మారిందని, మొదటిసారి ఎంపీలైన వారికి ఇల్లు దొరకడమే కష్టంగా మారిందని ప్రధాని ఫ్లాట్ల ప్రారంభం సందర్భంగా తెలిపారు. 2004-2014 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎంపీలకు కొత్తగా నివాసాలను నిర్మించనే లేదని ఆయన పేర్కొ న్నారు. పాతబడిన భవనాల్లో ఎంపీలు పలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నా రు. తాము అధికారంలోకి వచ్చాక 350 ఫ్లాట్లను ఎంపీల కోసం నిర్మించామని చెప్పారు. ఇక మునుపటి ఇబ్బందులేవీ ఉండవని హామీ ఇచ్చారు. తాజాగా నిర్మించిన ఫ్లాట్లు 5 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో విశాలంగా ఉన్నాయని వివరించారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలకు చెందిన ఎంపీలు ఈ ప్రాంగణాల్లో బస చేస్తారని.. ఇది 'ఏక్ భారత్- శ్రేష్ఠ భారత్' ఆలోచనకు ప్రతీక అని అన్నారు. వివిధ రాష్ట్రాల పండుగలను సమష్టిగా ఇక్కడ జరుపుకోవడం గొప్ప అనుభూతినిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఎంపీలు తమ నియోజ కవర్గ ప్రజలను కూడా వేడుకల్లో భాగస్వాములుగా చేసుకోవచ్చన్నారు. ఇక్కడుండే ఎంపీలు, పరిశుభ్రతను తమ కర్తవ్యంగా భావించాలని, ఈ విషయంలో ఏటా రెండుమూడు పర్యాయాలు పోటీలు పెడితే బాగుంటుందని సంబంధిత శాఖను, కమిటీలను కోరుతానని తెలిపారు. ఈ పోటీలో పరిశుభ్రతలో అత్యుత్తమైన బ్లాక్ పేరును ప్రకటిస్తారన్నారు. మరో ఏడాది తర్వాత, ఉత్తమ బ్లాక్, చెత్తగా ఉండే బ్లాకులను నిర్ణయిస్తామని ఆయన చెప్పారు. సముదాయం ఆవరణలో అనంతరం ప్రధాని మోదీ సిందూరం మొక్కను నాటారు. భవన నిర్మాణంలో భాగస్వాములుగా ఉన్న ఇంజనీరింగ్ అధికారులు, ఇతర సిబ్బందితో ముచ్చటించారు. వారి కృషిని కొనియాడారు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 12 । ఆగస్టు । 2025



గొలుసు కొట్టు ... బెట్టింగ్‌లో పెట్టు

రైళ్లలో ప్రయాణికులను టార్గెట్ చేసుకొని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఓ యువకుడిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. -8లో



స్టేషన్ కాడ.. దాటాలంటే దడ!

సికింద్రాబాద్ స్టేషన్ రోడ్డు పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. వందలాది ఆర్టీసీ బస్సులు..వేలాది మంది ప్రయాణికులు..లెక్కలేని వాహనాలతో ఈ రహదారి కిక్కిరిసిపోతోంది. -10లో

గరిష్టం/కనిష్టం
29.0/22.0

వాతావరణం

నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 29, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

చార్మినార్ జడ్‌సీపై వేటు

– కొత్త జడ్‌సీగా ఎంఆర్‌డీసీఎల్ ఈడీ శ్రీనివాసరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో పారిశుద్ధ్యం సమస్య ఒక జోనల్ కమిషనర్ (జడ్‌సీ) బదిలీకి కారణమైంది. క్షేత్రస్థాయిలోని సంబంధిత అధికారులు, సిబ్బందితో తగిన విధంగా పనులు చేయించకపోతే ఉన్నతాధికారిపైనా చర్యలు తప్పవనే విధంగా జడ్‌సీని బదిలీ చేశారు. చార్మినార్ జడ్‌సీ టి.వెంకన్నను బదిలీతో పాటు రిలీవ్ చేశారు. తదుపరి పోస్టింగ్ కోసం మునిసిపల్ పరిపాలనశాఖలో రిపోర్టు చేయాల్సిందిగా సూచించారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంకన్న స్థానంలో చార్మినార్ జడ్‌సీగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్‌డీసీఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలప్పగించారు. పాతబస్తీలో, ముఖ్యంగా విదేశీ పర్యాటకులు సైతం సందర్శించే చార్మినార్, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉన్నందున ఈ చర్యలు తీసుకున్నట్లు వినిపిస్తోంది. వెంకన్న చార్మినార్ జడ్‌సీగా గత రెండేళ్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో జడ్‌సీలను బదిలీలు చేయకపోవడం తెలిసిందే.



ఉప్పల్- నారపల్లి రోడ్డులో సోమవారం ట్రాఫిక్ జామ్‌తో బారులు తీరిన వాహనాలు

ఉప్పల్ టు నారపల్లి రహదారి నిర్మాణ పనులు జీహెచ్‌ఎంసీకి అప్పగించండి

మంత్రి కోమటిరెడ్డికి వినతి

వరంగల్ హైవేలో ఉప్పల్ టు నారపల్లి వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణం పనులను జీహెచ్‌ఎంసీకి అప్పగించాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి విన్నవించారు. ఈమేరకు వారు సోమవారం మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఎలివేటెడ్ కారిడార్ కోసం తవ్వి వదిలేసిన రోడ్లతో కొన్నేళ్లుగా స్థానికులు, వాహన దారులు, ముఖ్యంగా స్కూల్ విద్యార్థులు నిత్యం నరక యాతన అనుభవిస్తున్నారని వివరించారు. ఆర్అండ్‌బి అధికారులకు ఈ విషయంపై విన్నవించినా పట్టించుకోవడంలేదని, ప్రజలకు ఇబ్బందిగా ఉన్న ఉప్పల్ టు నారపల్లి వరకు రహదారిని నిర్మించడానికి జీహెచ్‌ఎంసీకి అనుమతివ్వాలని కోరారు. స్పందించిన మంత్రి వెంటనే జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రాన్ని ఎండార్స్ చేసినట్లు పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. –ఉప్పల్



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి, వజ్రేష్ యాదవ్

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

- వేడుకలకు నిధుల కొరత లేదు.
- గతంలో కంటే ఘనంగా నిర్వహిస్తాం
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్



గణేష్ ఉత్సవాల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్

లక్డీకాపూల్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఈ ఏడాది గణేశ్ నవరాత్రి ఉత్సవాలను గతంలో కంటే ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని, శాంతియుత వాతావరణంలో వేడుకలు జరిగేలా భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు కలిసి పనిచేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ కోరారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అధ్యక్షతన ఈ నెల 27 వ తేదీన ప్రారంభమయ్యే గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై సన్నాహక, సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ..గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా జీహెచ్‌ఎంసీ, పోలీస్, సంబంధిత ప్రభుత్వ శాఖల సహకారం ఉంటుందన్నారు. ఇప్పటికే నగర పరిధిలో అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. గణేష్ ప్రతిమల ఊరేగింపు జరిగే జాతీయ రహదారుల్లో ఏమైనా రోడ్ల రిపేర్లు ఉంటే వాటిని కూడా చేపడతామన్నారు. పోలీస్ శాఖ సూచన మేరకు నిమజ్జనం సజావుగా, వేగంగా పూర్తి చేసేందుకు గత సంవత్సరం కంటే ఎక్కువ క్రేన్లను కూడా ఉపయోగిస్తామని చెప్పారు. గణేష్ ఉత్సవాలకు బడ్జెట్ సమస్య లేదని, వివిధ పనుల నిమిత్తం గతం కంటే కూడా అధిక నిధులు కేటాయిస్తామన్నారు. వేడుక సజావుగా జరిగేందుకు జోనల్ పరిధిలో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. కాగా గణేష్ ఉత్సవాలు సజావుగా జరిగేందుకు లా అండ్ ఆర్డర్ అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్ పలు సూచనలు చేశారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు ముందే రూట్ మ్యాప్ రూపొందిస్తామన్నారు. అంతకుముందు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు గణేష్ ఉత్సవాలు సజావుగా జరిగేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు.

'మెట్రో'కు సమాంతరంగా ఆర్వోబీలు

మలక్‌పేటలో ట్రాఫిక్‌జామ్‌ల నివారణకు చర్యలు

- ఎమ్మెల్యే విజ్ఞప్తితో పనులకు సిద్ధమవుతోన్న జీహెచ్‌ఎంసీ
- త్వరలో ఫీజిబిలిటీ స్టడీ.. నివేదికకు అనుగుణంగా పనులు

సాక్షి, సిటీబ్యూరో : మలక్‌పేట రైల్వే స్టేషన్ పరిసరాల్లో తరచూ తీవ్ర ట్రాఫిక్‌జామ్‌లు ఏర్పడుతున్నాయి. హయత్‌నగర్, ఎల్‌బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, హస్తినాపురం, సంతోష్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి నగరంలోని కోఠి, అబిడ్స్, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారు పడరాని పాట్లు పడుతున్నారు. నల్లగొండ చౌరస్తా మీదుగా రాకపోకలు సాగించే వారందరికీ ఇది అనుభవైకవేద్యమే. ఇక వర్షాలు కురిసిన ప్రతిసారీ రోడ్డు చెరువులుగా మారుతుండటంతో ఆర్టీసీ బస్సులతో సహ అన్ని వాహనాలను గంటల తరబడి ఎక్కడివాటిని అక్కడే నిలిపివేస్తున్నారు. ఆ ప్రభావం నగరంలోని ఇతర ప్రాంతాలపైనా పడుతోంది. మలక్‌పేటలో వాహనాలు నిలిచిపోయినప్పుడు దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులు అబిడ్స్, కోఠిలోనే నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. ఈ సమస్య జటిలంగా మారుతోంది. మలక్‌పేట రైల్వే స్టేషన్ దగ్గర ఆర్‌యూబీలు ఉన్నప్పటికీ, అక్కడే ఉన్న డ్రైనేజీ నాలా పొంగిపొర్లుతుండటం, రైల్వే స్టేషన్, బస్టాప్, మెట్రోరైల్ స్టేషన్స్ కూడా అక్కడే ఉండటంతో అధిక రద్దీతో ఆ ప్రాంతం జనంతో, వాహనాలతో కిక్కిరిసి పోతోంది. రైల్వే ట్రాక్ దగ్గర రోడ్డుకు రెండువైపులా తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతుండటాన్ని క్షేత్రస్థాయిలో జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లతో కలిసి పరిశీలించిన స్థానిక మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌బిన్ అబ్దుల్లా బలాలా పరిష్కారానికి ఆర్‌ఓబీలు అవసరమని నిపుణులు తెలిపినట్లు పేర్కొంటూ, ఆమేరకు చర్యలు తీసుకోవాల్సిందిగా జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు లేఖ రాశారు. ట్రాఫిక్ జంక్షన్లలో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నిస్తున్న ప్రభుత్వం ఎస్సార్‌డీపీ రెండో దశలో భాగంగా ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు జరపాలని కోరారు. ఈ దిశగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్‌ను కోరారు. ఈనేపథ్యంలో అక్కడ మెట్రో మార్గానికి రెండు వైపులా సమాంతరంగా రెండు ఆర్‌ఓబీల నిర్మాణానికి సాధ్యాసాధ్యాలతోపాటు అవసరమయ్యే భూసేకరణ, అందుకయ్యే వ్యయం, తదితర వివరాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక కోసం కన్సల్టెన్సీ సర్వీసులను ఆహ్వానించినట్లు సంబంధిత ఇంజినీర్లు తెలిపారు. వాటి నివేదిక అందాక పరిశీలించి తగిన చర్యలు చేపట్టనున్నారు.



ఆర్ఓబీల ఏర్పాటు కోసం జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల



కోట జిగేల్

రానున్న పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకొని గోల్కొండ కోటను అధికారులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సోమవారం కోటను వివిధ రకాల విద్యుత్ దీపాలతో ఇలా అలంకరించారు. –గోల్కొండ

సివరేజీలోకి వరద నీరు.. ఆపేదెలా?

డ్రైనేజీల్లో వర్షం నీరు కలిసే ప్రదేశాల గుర్తింపు

- మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లకుండా చర్యలు
- ప్రత్యేక ప్రణాళిక చేపట్టిన జలమండలి

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో మురుగు కాల్వల్లో కలుస్తున్న వరద నీటి కట్టడికి జలమండలి ప్రణాళిక రూపొందిస్తోంది. పది నిమిషాల వర్షానికి రహదారులు జలమయం కావడం, వర్షం నీరు మురుగు కాల్వలో కలిసి మ్యాన్‌హోళ్లు పొంగడం సర్వసాధారణంగా మారింది. ఇక ఎగుడు దిగుడు ప్రాంతాల్లో మాత్రం వర్షం తగ్గిన తర్వాత కూడా గంటల కొద్ది డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల ఓవర్ ఫ్లో తగ్గడం లేదు. సర్వీస్ రహదారులపై నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ ఓవర్ ఫ్లోపై ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. నగరంలో గత 10 నెలలుగా సీవరేజీ ఓవర్ ఫ్లో కట్టడికి స్పెషల్ డ్రైవ్‌ను నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్నా... వర్షాల నేపథ్యంలో ఓవర్ ఫ్లో సమస్య తీవ్రమవడాన్ని జలమండలి తీవ్రంగా పరిగణించి ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైంది. సెక్షన్ల వారిగా జెట్టింగ్, ఎయిర్‌టెక్ వాహనాలను రంగంలోకి దింపి మురుగు కాల్వల పైప్‌లైన్లను క్లీనింగ్ చేయిస్తోంది. అలాగే వర్షం నీరు మురుగు నీటి పైప్‌లైన్లలో కలవకుండా దారి మళ్లిస్తోంది.

వరద నీటి నిల్వ ప్రాంతాల్లో...

నగరంలో వర్షం కురిసిన సమయంలో వరద నీరు నిలిచే ప్రాంతాల్లోని డ్రైనేజీ పైప్‌లైన్లపై జలమండలి దృషి సారించింది. మురుగు కాల్వల్లో వరద నీరు కలిసే ప్రాంతాలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. ఇప్పటికే సెక్షన్ల వారిగా తరచూ సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్‌హోళ్లను గుర్తించింది. సివరేజ్ లైన్లలో వరద నీరు కల్వకుండా తాత్కాలిక చర్యలు చేపట్టింది. క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను(ఈఆర్టీ) అప్రమత్తం చేసి నీరు నిలిచే ప్రాంతాలపైన ప్రత్యేక దృష్టి పెట్టింది.



ఖైరతాబాద్‌లోని ఆనంద్‌నగర్‌లో వర్షపు నీరు చేరడంతో పొంగుతున్న మ్యాన్‌హోల్

మురుగు నెట్‌వర్క్ ఇలా...

మహానగరంలో సుమారు 9,769 కిలోమీర్ల వరకు మురుగు నీటి పైప్‌లైన్ వ్యవస్థ విస్తరించి ఉంది. అందులో కోర్‌సిటీలో 5,570 కిలో మీటర్ల పైప్‌లైన్ల పై 2,70,679 మ్యాన్‌హోల్స్, శివారులోని 4,199 కిలో మీటర్ల పైప్‌లైన్ 3,60,700 మ్యాన్‌హోళ్లు ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే సుమారు 500 ప్రాంతాల్లోని మురుగు కాల్వల్లో వరద నీరు కలుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని కట్టడి చేసి ఓవర్ ఫ్లో కాకుండా చర్యలకు ఉపక్రమించారు.

నిమ్స్‌లో సుందరీకరణ పనులు షురూ..



లక్డీకాపూల్ : నిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో సుందరీకరణ పనులకు హెచ్‌ఎండీఏ శ్రీకారం చుట్టింది. ఆస్పత్రి ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు ఈ నెల 8న ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దోనెపూడి చక్రపాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణీత్ కౌర్‌తో కలిసి డైరెక్టర్ బీరప్ప భూమి పూజ చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు హెచ్‌ఎండీఏ రూ.4 కోట్ల నిధులు కేటాయించింది. ఆ మేరకు సోమవారం ఆస్పత్రి ప్రాంగణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. తొలుత క్లీనింగ్ పనులకు సమాయత్తమయ్యారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణమంతా పచ్చదనంతో కనువిందు చేసేలా గార్డెనింగ్ పనులు చేపడతారు.

హైడ్రాలో హైరానా!

- రాజీనామాకు సిద్ధమైన మాజీ సైనికోద్యోగులైన మార్షల్స్
- ప్రధాన కార్యాలయంలో వారితో చర్చలు జరిపిన కమిషనర్
- జీతాలు ఏమాత్రం తగ్గవనే హామీతో వెనక్కు తగ్గిన వైనం

ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు తగ్గిస్తూ ఇటీవల జీఓ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఆధీనంలోని మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌కు (ఎంఈటీ) నేతృత్వం వహిస్తున్న మార్షల్స్ సోమవారం మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమయ్యారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు తగ్గిస్తూ ఇటీవల ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయం తెలిసి రంగంలోకి దిగిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అప్రమత్తం అయ్యారు. బుద్ధభవన్‌లోని ప్రధాన కార్యాలయంలో మార్షల్స్‌తో భేటీ కావడంతో వివాదం సద్దుమణిగింది. తమ జీతాలు పెంచుతామంటూ హైడ్రా కమిషనర్ హామీ ఇచ్చినట్లు మార్షల్స్ ప్రకటించారు.



రంగనాథ్‌తో భేటీ అయిన మార్షల్స్

జీహెచ్‌ఎంసీ నుంచి హైడ్రాలోకి ఆ రెండూ...

హైడ్రా ఏర్పాటు ముందు వరకు ఎంఈటీలు, మార్షల్స్ జీహెచ్‌ఎంసీ ఆధీనంలో ఉండేవి. ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీ అండ్ డీఎం) విభాగంలో అంతర్భాగంగా పని చేసే వాళ్లు. మాజీ సైనికోద్యోగులైన 93 మంది 2020 మే నుంచి మార్షల్స్‌గా పని చేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వీరికి అప్పట్లో నెలకు రూ.22,500 చొప్పున చెల్లించేవారు. 2022లో పీఆర్సీ ఆధారంగా ఈ మొత్తాన్ని రూ.29,250కి పెంచారు. గత ఏడాది ఈవీ అండ్ డీఎం జీహెచ్‌ఎంసీ నుంచి హైడ్రాలోకి వచ్చింది. దీంతో ఈ ఏడాది నుంచి ఎంఈటీలతో పాటు మార్షల్స్ బాధ్యతల్నీ హైడ్రాకు అప్పగించారు.

మార్షల్స్‌లో ఆందోళన నింపిన ఆ ఉత్తర్వులు...

తాము చేస్తున్న సేవల్ని పరిగణలోకి తీసుకుని జాతాలు పెంచాలంటూ మార్షల్స్ కొన్నాళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క మాజీ సైనికోద్యోగులకు సంబంధించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ రీ సెటిల్‌మెంట్ సైతం వీరికి రూ.32 వేల నుంచి రూ.35 వేల వేతనాన్ని సిఫార్సు చేసింది. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఇవి అమలవుతున్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ జీతాల పెంపుపై గతంలో మార్షల్స్‌కు హామీ ఇచ్చారు. ఇది కార్యరూపంలోకి రాకముందే ఈ నెల 5న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు వీరిలో ఆందోళన నింపాయి. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలను రూ.22,750కు తగ్గిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో ఉంది.

మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమై...

ఈ ఉత్తర్వులను నిరసనగా మార్షల్స్ మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా తొలుత సోమవారం సమ్మె సైరన్ మోగించాలని నిర్ణయించారు. ఈ విషయం తెలుసుకున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అప్రమత్తం అయ్యారు. వర్షాలు కురుస్తున్న ఈ సమయంలో 30 డివిజన్లలోని 150 ఎంఈటీలకు నేతృత్వం వహిస్తున్న మార్షల్స్ ఆవశ్యకతను ఆయన గుర్తించారు. దీంతో అందరినీ బుద్ధ భవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయానికి పిలిపించారు. ఆ ఉత్తర్వులతో మీకు సంబంధం లేదని, జీతాలు ఏమాత్రం తగ్గవని హామీ ఇచ్చారు. మార్షల్స్ జీతాల పెంపుపై త్వరలోనే మరో జీవో వస్తుందని హామీ ఇచ్చారు. పని గంటల అమలు, అదనపు పనికి అదనపు వేతనం తదతర డిమాండ్లనూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని రంగనాథ్ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

'ఫ్యూచర్' కార్యాలయాల ఏర్పాటుకు స్థల పరిశీలన



కందుకూరు: ఫ్యూచర్‌సిటీ భూముల్లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్(ఎన్‌ఐఎంయూ), ఎఫ్‌సీడీఏ (ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయాల ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేశారు. ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్, అర్బన్ ఎఫైర్స్ (ఎంఓహెచ్‌యూఏ) కార్యదర్శి కె.శ్రీనివాస్, జీహెచ్‌ఎంసీ కమిషన్ ఆర్‌వీ కర్ణన్ తదితరులు సోమవారం మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలోని సర్వే నంబర్ 112 లోని భూమిని పరిశీలించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ కోసం గతంలో కేటాయించిన 20 ఎకరాలు, ఎఫ్‌సీడీఏ కార్యాలయం కోసం అదే సర్వే నంబర్‌లో 7.20 ఎకరాలను క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేశారు. వారి వెంట ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీ కొని వ్యక్తి మృతి

మణికొండ: ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొనడంతో అతను అక్కడికక్కడే తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని రోటరీ వద్ద ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సరూర్‌నగర్‌కు చెందిన జంగయ్య(42) తన ద్విచక్ర వాహనం (హోండా యాక్టివా)పై నార్సింగి చౌరస్తా నుంచి గచ్చిబౌలి వైపు వెళుతున్నాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ఓ టిప్పర్ జంగయ్య ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీ కొట్టింది. దాంతో అతను ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ఈ క్రమంలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ నారాయణను అదుపులోకి తీసుకుని టిప్పర్‌ను సీజ్ చేశామని పోలీసులు తెలిపారు.







వారిపై కూడా కేసులు నమోదు చేయండి

నేరం చేయడానికి ప్రోత్సహించారని గవర్నర్ సెక్రెటరీకి నిందితుడి ఫిర్యాదు

జగద్గిరిగుట్ట: ఓ హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తి రాష్ట్ర గవర్నర్ సెక్రటరీకి తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేశాడు. జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన ఆర్టీఐ కార్యకర్త వాకిటి మధుబాబును 2017లో స్థానికంగా ఉన్న బస్టాప్ ప్రాంతంలో కత్తులతో దాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించగా తృటిలో తప్పించుకున్నాడు. ఈ క్రమంలో నాటి నుంచి నేటి వరకు కేసు కోర్టులో కొనసాగుతూ ఉండగా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్‌గా ఉన్న బాలరాజు.. తనను నాడు ప్రోత్సహించిన వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేయాలని ఇందుకు బాధ్యులుగా గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్‌రషీద్, ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ ప్రతినిధి శివరాత్రి యాదగిరిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గవర్నర్ సెక్రటరీకి లేఖ అందజేశాడు. ఈ విషయం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో చర్చగా మారింది. గతంలో తనను ప్రోత్సహించిన వారిపై కేసులు నమోదు చేయాలని గతంలో బాలానగర్ ఏసీపీ గోవర్ధన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

ఉపాధ్యాయుడిపై ఇద్దరు వ్యక్తులు దాడి


వివరాలు సేకరిస్తున్న కానిస్టేబుల్

అమీర్‌పేట: విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. ఎస్ఆర్‌నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు.. సనత్‌నగర్ జెక్ కాలనీలో నివసించే మధుసూదన్.. వెంగళరావు నగర్ స్కూల్లో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. సోమవారం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలు దేరాడు. సుందర్‌నగర్ కమాన్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు మధుసూదన్ వాహనానికి వారి వాహనం అడ్డంగా నిలిపారు. ఒక్కసారిగా అతడిపైకి దూసుకెళ్లి తమ వాహనాన్ని ఢీకొట్టుకుంటూ వెళ్తావా అంటూ దాడికి పాల్పడ్డారు. ముఖం, కణతపై పిడిగుద్దుల వర్షం కురిపించడంతో రక్తస్రావం అయింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులకు జరిగిన సంఘటన గురించి వివరించారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సీసీకెమెరా ఫుటేజీలను పరిశీలించి దాడికి పాల్పడ్డ వ్యక్తులు వాహనాన్ని గుర్తించినట్లు తెలిపారు.

చోరీలకు పాల్పడిన నిందితుల అరెస్ట్

మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ దొంగతనాలకు పాల్పడిన వారిని సోమవారం నాచారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ తెలిపిన మేరకు.. నాచారం మహంకాళి దేవాలయంలో దొంగతనానికి పాల్పడిన ఉప్పల్ చిలుకానగర్‌కు చెందిన బొంత శ్రీశైలం అలియాస్ మహేష్‌ను నాచారం చౌరస్తాలో అనుమానాస్పందంగా తిరుగుతుండంగా నాచారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గతంలో మారేడ్‌పల్లి, జగదిరిగుట్ట కాచిగూడ జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో బొంత శ్రీశైలంపై దొంగతనం కేసులు నమోదయ్యాయి.

సెంట్రింగ్ డబ్బాలు ఎత్తుకెళ్లిన వ్యక్తి అరెస్ట్..

నాచారం ఎరుకల బస్తీకి చెందిన మేతే బాబు బాబానగర్ రజక స్మశాన వాటికలో సెంట్రింగ్ డబ్బాలను ఎత్తుకెళ్లాడు. ఇంటివద్ద ఉన్న మేతే బాబుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

దేవాలయాలలో దంపతుల చోరీలు

నాచారం శ్రీ మహంకాళి సహిత మహాకాళేశ్వర దేవాలయం వద్ద ఉన్నా పూజా స్టోర్, మల్లాపూర్ వెంకటరమణ కాలనీ ఆరెపోచమ్మ దేవాలయంలో దొంగతనాలకు పాల్పడిన దంపతులు మహ్మద్ అబ్బుల్ ఆసిఫ్, అతని భార్య జానకి నాచారం చౌరస్తాలో వాహనాల తనిఖీలో పట్టుబడ్డారు. వారిని విచారించంగా కుషాయిగూడలో ద్విచక్రవాహనం, మౌలాలి గుడిలో దొంగతనంతో పాటు పలు చోరీలు చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో రిమాండ్‌కు తరలించారు.

సెల్‌ఫోన్ దుకాణంలో భారీ చోరీ.. దొంగల అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

అంబర్‌పేట: సెల్‌ఫోన్ దుకాణంలో భారీచోరీ చేసిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఈస్ట్‌జోన్ కార్యాలయంలో ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన పరుశరామ్(30) కోఠిలోని గుజరాతి గల్లీలో వివిధ ఎలక్ట్రానిక్ దుకాణాల్లో పనిచేసి మానేసాడు. ఇక్కడి దుకాణాల్లో చోరి చేస్తే భారీగా నగదు దొరుకుందని భావించి స్వస్థలానికి చెందిన స్నేహితులైన పాత నేరస్థులు జైసా రామ్(32), నాగజీ రామ్(30), లీలరామ్(31), లక్ష్మణ్‌రామ(34)లకు సమాచారం ఇచ్చాడు. వారు ఈ నెల 3న నగరానికి వచ్చారు. 3వ తేదీ రాత్రి లక్ష్మీమొబైల్స్ దుకాణం షట్టర్‌ఎత్తి అందులో ఉన్న రూ.9 లక్షల నగదును దోచుకెళ్లారు. దుకాణ యాజమాని ఎం.రామ్‌దేవాసి ఫిర్యాదు మేరకు సుల్తాన్‌బజార్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీటీవి కెమెరాల ఆధారంగా దిల్‌షుక్‌నగర్‌లో వీరు బస చేసినట్లు గుర్తించారు. అక్కడే ఉన్న వారిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సుల్తాన్‌బజార్ ఏసీపీ ఎం.మట్టయ్య, ఇన్‌స్పెక్టర్ కె.నర్సింహా, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కేసును వారం రోజుల్లో ఛేధించిన సుల్తాన్‌బజార్ పోలీసులను డీసీపీ అభినందించారు.

విద్యుదాఘాతానికి ఉద్యోగి మృతి

మలక్‌పేట: విద్యుదాఘాతంతో ఓ ఉద్యోగి మృతి చెందిన సంఘటన సోమవారం మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ తెలిపిన మేరకు.. మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్‌లో ఎఫ్ఓసీ ఫీల్డ్ వర్కర్ ఆర్టిసన్ ఉద్యోగి అంజద్(42) విధినిర్వహణలో ఉండగా కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రీతూ వెనుక హ్యూమన్ ట్రాఫికింగ్ మాఫియా



అక్రమంగా నివసిస్తూ చిక్కిన బంగ్లాదేశీ

- విశాఖ మహిళ ద్వారా నగరానికి రాక
- మధ్యవర్తిగా వ్యవహరించిన మరొకరు
- ముగ్గురితో సహజీవనం, బ్లాక్‌మెయిలింగ్
- ఇప్పటి వరకు ఆరుగురు నిందితుల అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కేంద్రంగా ముగ్గురితో సహజీవనం చేసి, డబ్బు కోసం వేధించిన బంగ్లాదేశీ రీతూ మోని వెనుక హ్యూమన్ ట్రాఫికింగ్ మాఫియా ఉన్నట్లు ఈస్ట్‌జోన్ పోలీసులు గుర్తించారు. ఈమె పశ్చిమ బెంగాల్ నుంచి విశాఖపట్నం మీదుగా సిటీకి వచ్చినట్లు తేల్చారు. నగరంలో అక్రమంగా నివసిస్తూ, రీతూ రావుగా మారి ఆ పేరుతో గుర్తింపుకార్డులు పొందిన ఆమెపై గత నెల 17న కేసు నమోదు చేసిన దర్యాప్తు ప్రారంభించిన నల్లకుంట అధికారులు ఇప్పటి వరకు ఆమెతో సహా ఆరుగురిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరికొందరి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

పశ్చిమ బెంగాల్ కేంద్రంగా దందా...

బంగ్లాదేశ్‌కు చెందిన యువతులు, మహిళల్ని అక్రమంగా సరిహద్దులు దాటించే ముఠాలు పశ్చిమ బెంగాల్ కేంద్రంగా పని చేస్తున్నట్లు ఈస్ట్‌జోన్ పోలీసులు అనుమానిస్తున్నారు. అలాంటి ఓ ముఠా సాయంతో 2020లో దేశ సరిహద్దులు దాటి వచ్చిన రీతూ తొలుత విశాఖపట్నానికి చెందిన మహిళ కాజోల్ షేక్ వద్దకు చేరుకుంది. ఆమె ద్వారా మాదాపూర్‌లో నివసిస్తున్న నల్లకుంట వాసి చింతల ప్రసాద్ మధ్యవర్తిగా వ్యవహరించడంతో హైదరాబాద్ వచ్చింది. సోషల్‌మీడియా ద్వారా ఆసిఫ్‌నగర్‌కు చెందిన నరేష్‌ను పరిచయం చేసుకుంది. అతడితో కొన్నాళ్లు సహజీవనం చేసిన రీతూ... ఆసిఫ్‌నగర్ చిరునామాతో ఆధార్ కార్డు, పాన్ కార్డు తీసుకుంది. ఈ చిరునామాతోనే సిమ్‌కార్డులు సంగ్రహించింది.

సహోద్యోగికి పరిచయం చేసిన నరేష్..

నరేష్ నగరంలోని ఓ బంగారం దుకాణంలో పని చేశాడు. అప్పట్లో తన సహోద్యోగి అయిన శ్లోకం శేఖర్ రావుకు రీతును పరిచయం చేశాడు. కొన్నాళ్లకు అతడి వద్దకు చేరిన రీతూ తన ఆధార్ కార్డును గన్‌ఫౌండ్రీ చిరునామాకు అప్‌డేట్ చేసుకుంది. శేఖర్‌తో తరచు ఘర్షణకు దిగేది. ఓ దశలో అతడిని భయపెట్టడానికి ఇంట్లోనే షాంపూ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో శేఖర్ ఆమెను గుడిమల్కాపూర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. దీనిపై గుడిమల్కాపూర్ ఠాణాలో కేసు నమోదైంది. నరేష్, శేఖర్‌లతో సహజీవనం చేస్తున్న సమయంలోనే రీతూకు నిజామాబాద్‌కు చెందిన ప్రవీణ్‌తో ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయమైంది. శేఖర్ తనను ఆస్పత్రిలో వదిలేశాడని ఇతడికి సమాచారం ఇచ్చిన రీతు అక్కడకు రప్పించింది.

ప్రవీణ్ ఫిర్యాదుతో విషయం వెలుగులోకి..

అప్పటి నుంచి కొన్నాళ్లు అతడితో కలిసి విద్యానగర్‌లోని ఫ్లాట్‌లో ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 15న యాదగిరిగుట్టలో వివాహితుడైన అతడిని వివాహం చేసుకుంది. కొన్నాళ్లకు ఈమె బంగ్లాదేశీ అని తెలియడంతో అతడు వదిలి వెళ్లిపోయాడు. సోషల్‌మీడియా ద్వారా అతడి భార్యను సంప్రదించి విషయం చెప్పింది. వీరిద్దరూ కొన్నాళ్లకు నల్లకుంట ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీంతో రీతూను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆమెతో పాటు ప్రవీణ్, శేఖర్, కళ్యాణ్‌రావు, శాలిని, ప్రసాద్‌లను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. కొందరు ముందస్తు బెయిల్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారని తెలిసింది. రీతు శేఖర్, నరేష్, ప్రవీణ్‌లను డబ్బు కోసం వేధించినట్లు, రూ.లక్షల్లో తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

గొలుసు కొట్టు ... బెట్టింగ్‌లో పెట్టు


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ ఎస్ఎన్. జావెద్

- చైన్ స్నాచర్ అరెస్ట్
- 77 గ్రాములు బంగారు ఆభరణాలు స్వాధీనం

సికింద్రాబాద్: రైళ్లలో ప్రయాణికులను టార్గెట్ చేసుకొని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఓ యువకుడిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం సికింద్రాబాద్‌లోని జీఆర్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్ఎన్. జావెద్ వివరాలు వెల్లడించారు. ఏపీకి చెందిన కోరుప్రోలు లవరాజు(23 రెండు సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి స్థిరపడ్డాడు. కాజీపల్లిలోని హెటిరో ల్యాబ్‌లో జూనియర్ కెమిస్ట్‌గా పని చేస్తున్నాడు. జల్సాలు, బెట్టింగ్‌లకు అలవాటు పడిన లవరాజుకు జీతం సరిపోకపోవడంతో సులువుగా డబ్బులు సంపాదించాలని అనుకున్నాడు. ఈ క్రమంలో ఇటీవల సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ప్రయాణికుల రద్దీని గమనించాడు. సులువుగా డబ్బు సంపాదించాలనే దురాలోచనతో రైల్వే స్టేషన్లు, రైళ్లలో దొంగతానలను ప్రారంభించాడు. అందులో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరి 26న సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో చైన్ స్నాచింగ్, ఆగస్టు 2వ తేదీన గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో చైన్ స్నాచింగ్‌లు చేశాడు. రెండు బంగారు గొలుసులను గుర్తు తెలియని వ్యక్తికి విక్రయించి మరో గొలుసును సూరారం బ్రాంచ్‌లోని ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో పెట్టి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తూ బెట్టింగ్‌లు ఆడాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 7 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో సంచరిస్తున్న లవరాజ్‌ను గుర్తించిన రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అతడి వద్ద నుంచి సుమారు రూ. 7. 07 లక్షల విలువగల 77 గ్రాములు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్, ఎస్ఐ సుబ్బారెడ్డి, ఆర్పీఎఫ్ పోలీసులు ఐపీఎఫ్ భవాణి శంకర్, ఇన్‌స్పెక్టర్ పీఎస్. సింగ్ పాల్గొన్నారు.

అక్రమ ఫిర్యాదుతో ఛానెల్ బ్లాక్ చేయించిన యువకుడి అరెస్ట్


నిందితుడు విశాల్ రాథోడ్

బంజారాహిల్స్: తెలంగాణకు చెందిన బంజారా జానపద గాయకుడు విజయ్ రమావత్‌కు చెందిన యూట్యూబ్ ఛానెల్ నుంచి అక్రమంగా పాటలను డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు అతడి ఛానెల్‌పై తప్పుడు ఫిర్యాదులతో ఛానెల్‌ను బ్లాక్ చేయించిన ఘటనలో నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే. అచ్చంపేట ప్రాంతానికి చెందిన విజయ్ రమావత్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని కృష్ణానగర్‌లో నివాసం ఉంటున్నాడు. స్నేహితులతో కలిసి వీడియోలు తీసి తన యూట్యూబ్ ఛానెళ్లలో పోస్ట్ చేస్తుంటారు. ఈ పాటలను నాసిక్‌కు చెందిన యూట్యూబర్ విశాల్ రాథోడ్ (25) డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు అవి తనవే అంటూ యూట్యూబ్ యాజమాన్యానికి ఫిర్యాదులు చేస్తుంటాడు. నెల రోజుల పాటు ఈ విధంగా యూట్యూబ్‌లోని సాంగ్స్ బ్లాక్ చేసిన విశాల్ రాథోడ్ వాటిని బ్లాక్ లిస్ట్‌లో నుంచి తొలగించాలంటే రూ.10 లక్షలు ఇవ్వాలంటూ డిమాండ్ చేయడంతో సింగర్ విజయ్ రామావత్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న బంజారాహిల్స్ పోలీసులు మహారాష్ట్రలోని నాసిక్‌లో విశాల్ రాథోడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం నిందితుడిని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు.

బస్తీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి


బస్తీల క్షేత్రస్థాయి పర్యటనలో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

- నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని బస్తీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మేయర్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి జూబ్లీహిల్స్ సర్కిల్‌లోని అంబేద్కర్‌నగర్, ఉదయ్‌నగర్ బస్తీల్లో క్షేత్ర పర్యటన నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందికి మేయర్ ఆదేశాలు జారీ చేశారు. వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం ప్రదర్శించే పారిశుద్ధ్య సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బస్తీల్లో నిర్మాణ వ్యర్థాలు ఇష్టారీతిన పడేసేవారిపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అంబేద్కర్‌నగర్‌లో నాలా వద్ద కొంత భాగం కూలిన రక్షణ వాల్ వద్ద ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా తక్షణ ప్రత్యామ్నాయ రక్షణ చర్యలు చేపట్టాలని మేయర్ చెప్పారు. ఈ రెండు బస్తీల్లో రోడ్ల వెంబడి ఉన్న నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించండి..

బంజారాహిల్స్ రోడ్ నెంబర్-1 మార్గంలో విరించి ఆస్పత్రి సమీపంలో మహేశ్వరి టవర్స్ ప్రాంతంలో ఇటీవలే రోడ్డుపై స్లాబ్ కుంగిపోయి భూమి లోపలికి కూరుకుపోయిన ప్రదేశాన్ని మేయర్ పరిశీలించారు. రూ.65 లక్షలతో 19 మీటర్ల మేర ఆర్‌సీసీ స్లాబ్ నిర్మాణానికి అనుమతులు వచ్చినందున వెంటనే పనులు ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మేయర్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మేయర్ వెంట చీఫ్ ఇంజనీర్ రత్నాకర్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఉన్నారు.

స్వచ్ఛంద సేవలు అభినందనీయం


విద్యార్థులతో సందడి చేస్తున్న మంచు లక్ష్మీప్రసన్న, రత్నారెడ్డి

శంకర్‌పల్లి: టీచ్ ఫర్ చేంజ్, వేనీరావు ఫౌండేషన్ సేవలు అభినందనీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. జన్వాడ జెడ్పీహెచ్ఎస్‌లో టీచ్ ఫర్ చేంజ్, వేనీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్, విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, టీచ్ ఫర్ చేంజ్ ఫౌండర్ మంచు లక్ష్మీప్రసన్న, వేనీరావు ఫౌండేషన్ చైర్‌పర్సన్ రత్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంచు లక్ష్మీప్రసన్న సామాజిక బాధ్యతగా స్వచ్ఛంద సంస్థని స్థాపించి, విద్యార్థులకు సాయం చేయడం గొప్ప విషయమన్నారు.

బాల్యానికి సంకెళ్లు

అధికారులు అడ్డుకుంటున్నా ఆగని బాల్యవివాహాలు

- అత్యవసర నంబర్లను ఆశ్రయిస్తున్న బాలికలు
- 2024లో తొలి మూడు స్థానాల్లో వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు

'నందిగామ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలిక(13)కు మానసిక వైకల్యంతో బాధపడుతున్న కందవాడకు చెందిన ఓ వ్యక్తి(36)తో మే 28న నందిగామ శివారులోని ఓ ఆలయంలో వివాహమైంది. నిజానికి ఈ పెళ్లి బాలికకు ఏమాత్రం ఇష్టం లేదు. ఇదే అంశాన్ని సదరు బాలిక పాఠశాల ఉపాధ్యాయులకు తెలియజేయగా, వారు పోలీసు, రెవెన్యూ, స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పెళ్లి కుమారుడు, మధ్యవర్తి, పురోహితుడు, బాలిక తల్లిపై నందిగామ ఠాణాలో కేసు నమోదు చేసి సదరు బాధిత బాలికను సఖీ కేంద్రానికి తరలించాల్సి వచ్చింది'. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికీ బాల్య వివాహాలు వెలుగు చూస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అభివృద్ధిలో అంతర్జాతీయ దేశాలతో పోటీ పడుతున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను అదే స్థాయిలో సామాజిక వెనుకబాటుతనం వెంటాడుతోంది. నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలకు ఆర్థిక అసమానతలు తోడయ్యాయి. ఫలితంగా 18 ఏళ్ల తర్వాత జరగాల్సిన అమ్మాయిల వివాహ తంతు.. 14 ఏళ్లకే ముగుస్తోంది. తాను ఇప్పుడే పెళ్లి చేసుకోబోనని, అందరిలాగే తాను ఉన్నత చదువులు చదువుకుంటానని చెప్పినా.. తల్లిదండ్రులు వినిపించుకోవడం లేదు. బలవంతపు పెళ్లిళ్లకు పాల్పడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో బాలికలు అత్యవసర ఫోన్ నంబర్లను ఆశ్రయిస్తున్నారు. గత ఏడాది నమోదైన బాల్య వివాహాలను పరిశీలిస్తే.. ఇదే విషయం స్పష్టమవుతోంది. గత ఏడాది అత్యధిక బాల్య వివాహాలు వెలుగు చూసిన జిల్లాల జాబితాలో వికారాబాద్(94) ముందు వరుసలో నిలువగా, ఆ తర్వాత స్థానాల్లో రంగారెడ్డి(54), మేడ్చల్ (53) జిల్లాలు నిలవడం గమనార్హం. ఐటీ చదువులకు, అంతర్జాతీయ పెట్టుబడులకు నిలయంగా మారిన ఈ ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం, బాల్య వివాహాలు వెలుగు చూస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

ఆర్థిక అంతరాలే అసలు కారణం

అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు రాకతో జిల్లా ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. జిల్లాలోని శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, కొండాపూర్, సైబర్‌సిటీ, నానక్‌రాంగూడ, కోకాపేట్, నార్సింగి తదితర ప్రాంతాల్లో ఎకరం భూమి ధర రూ.వంద కోట్లకుపైగా పలుకుతోంది. ఆకాశానికి నిచ్చెన వేస్తున్నట్లు ఓఆర్‌ఆర్‌కు ఇరు పక్కలా హైరైజ్ భవనాలే దర్శనమిస్తున్నాయి. ఐటీ, వాటి అనుబంధ సంస్థలు, రియల్ ఎస్టేట్ పెట్టుబడులు భారీగా వచ్చి చేరడంతో ప్రజల జీవనశైలిలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. తలసరి ఆదాయంలో దేశంలోనే ముందు వరుసలో నిలిచిన జిల్లా కూడా ఇదే. ఇలాంటి కీలకమైన జిల్లాలో ఇప్పటికీ అంతరాలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఉన్నవాడు మరింత ఉన్నవాడిగా, లేనివాళ్లు మరింత లేనివాళ్లుగా మారుతున్నారు. సామాజిక వెనుకబాటుకు ఆర్థిక పరమైన అంశాలు తోడవడంతో కడుపున పుట్టిన పిల్లలను వదిలించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల శంషాబాద్ మండలంలో ఓ తల్లి అప్పుడే పుట్టిన బిడ్డను ఇతరులకు అమ్ముకుని పట్టుబడగా, ఉన్నత చదువులు చదివించి, బిడ్డను మరింత ప్రయోజకురాలిని చేయాల్సిన మరో తల్లి ఏకంగా తన బిడ్డకంటే రెట్టింపు వయసున్న వ్యక్తికి కట్టబెట్టేందుకు సిద్ధపడింది. అంతర్జాతీయ వేదికపై ఓ వెలుగు వెలుగుతున్న ఉమ్మడి జిల్లాలో తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రవేశపెడుతున్నా.. రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి, పైసా ఖర్చు లేకుండానే ఉన్నత చదువులు చెప్పిస్తున్నా.. వివాహం, ఇతర అంశాలకు వచ్చే సరికి తల్లిదండ్రుల ఆలోచన భిన్నంగా ఉంటోంది. అభం శుభం తెలియని వయసులో పెళ్లి చేస్తుండటం ఆందోళనకు గురి చేస్తోంది.

ముందస్తు చర్యలు తీసుకోవాలి



నిలిచిన వరద నీటిని హైడ్రా సిబ్బందితో మరమ్మతు చేయిస్తున్న కార్పొరేటర్

వెంగళరావునగర్: వర్షాల నేపథ్యంలో బస్తీల్లో ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత హైడ్రా అధికారులపై ఉందని కార్పొరేటర్ దేదీప్య తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ వీడియోగల్లీ, మసీదుగడ్డ తదితర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిచిపోయింది. దీంతో ఆయా బస్తీల్లోని ప్రజలు కార్పొరేటర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ స్పందించి తెల్లవారుజామున హైడ్రా అధికారులకు ఫోన్ల ద్వారా సమాచారం అందించారు. అనంతరం వారిని తీసుకుని బస్తీల్లో పర్యటించి నిలిచిపోయిన మురుగు నీటిని తొలగించారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



బోనాలతో మహిళలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్ నెం: 46లోని అంబేడ్కర్‌నగర్ బస్తీలో శ్రావణమాస బోనాలు వైభవంగా జరిగాయి. నల్లపోచమ్మ అమ్మవారికి మహిళలు సామూహిక ఊరేగింపుగా బోనాలు తీసుకువచ్చి నైవేద్యం సమర్పించారు. ఫిలింనగర్ 18బస్తీల సంక్షేమం సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావు బోనాల విశేష పూజలు నిర్వహించారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్ ధ్యేయం

లిబర్టీ: ప్రజా సంక్షేమం ధ్యేయంగా ఉమ్మడి రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేయడం అవమానకరమని సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెన్న సదానందు అన్నారు. ప్రజల కోసం పని చేసిన నాయకులను గౌరవించాల్సింది పోయి వారి విగ్రహాలను ధ్వంసం చేయడంతో వచ్చే లాభం ఏంటని ప్రశ్నించారు. అనేక ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడిన నాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజల కోసం ఉమ్మడి రాష్ట్ర ప్రగతి కోసం శ్రమించిన యోధుడు వైఎస్ఆర్ అని పేర్కొన్నారు.

నత్తే నయం!

- వరద నీటి పైపులైన్ నిర్మాణ పనులలో జాప్యం
- నీరు నిలుస్తుండటంతో స్తంభిస్తున్న ట్రాఫిక్
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



లక్డీకాపూల్ చౌరస్తాలో కొనసాగుతున్న వరదనీటి పైప్‌లైన్ పనులు

బంజారాహిల్స్: నిత్యం రాకపోకలకు రద్దీగా ఉండే లక్డీకాపూల్ చౌరస్తాలో గత ఆరు దశాబ్దాలుగా వరద నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పాటు రోజురోజుకు పరిస్థితి తీవ్రమవుతూ ట్రాఫిక్ స్తంభించిపోవడమే కాకుండా నడుంలోతు వరదనీరు నిలిచిపోతున్నాయి. ప్రతిరోజూ లక్డీకాపూల్ చౌరస్తా నుంచి 3.50 లక్షల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నగరం నుంచి ఎటువైపు వెళ్లాలన్నా లక్డీకాపూల్ చౌరస్తా మీద నుంచే వెళ్లాల్సి ఉంటుండటంతో ఈ చౌరస్తా నిత్యం కిటకిటలాడుతుంటుంది. అసలే ట్రాఫిక్‌జాంలతో రద్దీగా ఉండే ఈ చౌరస్తాలో వానాకాలం వచ్చిందంటే వరదనీరు ముందుకు వెళ్లలేక రోడ్డుపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17 ఇంజినీర్లు వరదనీటి పైప్‌లైన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

రూ.1.30 కోట్ల వ్యయంతో..

రూ.1.30 కోట్ల వ్యయంతో 600 ఎంఎం డయా పైపులు రెండు వరుసల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయి.ద్వారకా హోటల్ నుంచి లక్కీ రెస్టారెంట్ మీదుగా లక్డీకాపూల్ బ్రిడ్జి కిందకు అనుసంధానిస్తూ రెండు వరుసల 600 ఎంఎం డయా వరద నీటి పైపులు వేస్తున్నారు.రెండు నెలల క్రితం ఈ పైప్‌లైన్ పనులు ప్రారంభం కాగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నత్తనడక సాగుతున్నాయి.ఇక్కడ పైప్‌లైన్ పనులు పూర్తయితే ద్వారకా హోటల్, లక్కీ రెస్టారెంట్ ముందు వరద నిలిచే సమస్య పరిష్కారం అవుతోంది. అసెంబ్లీతో పాటు రవీంద్రభారతి, కంట్రోల్‌రూం, బేగంబజార్, అబిడ్స్, సచివాలయం, పంజగుట్ట, మెహిదీపట్నం, ఖైరతాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారికి ఈ చౌరస్తానే కీలకం .ఇంతా ప్రాధాన్యం ఉన్న చౌరస్తాలో ఇన్నాళ్లు వరదనీటి పైప్‌లైన్లు నిర్మించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇన్నాళ్లకు పనులు మొదలు పెట్టినా సకాలంలో పూర్తిచేయడం లేదు. ఫలితంగా గత రెండు వారాల నుంచి కురుస్తున్న వర్షాలకు లక్డీకాపూల్ చౌరస్తా నీట మునుగుతోంది.

రెండు వారాల్లో పూర్తిచేస్తాం

లక్డీకాపూల్ చౌరస్తాలో వరదనీటి పైప్‌లైన్ పనులకు వర్షాల కారణంగా ఆటంకం కలుగుతోంది. అయినా పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. రెండు వారాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. క్యాచ్‌పిట్ల నిర్మాణం పూర్తయ్యింది. రోడ్డు క్రాసింగ్ పనులు కొంత సమస్యగా మారనున్నాయి. రాత్రిపూట రోడ్డు క్రాసింగ్ చేపట్టి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించాం.

–వెంకటనారాయణ, ఈఈ, జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17

రజకుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొడ్డుపల్లి కృష్ణ

హిమాయత్‌నగర్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల్లో రజకులు తెలంగాణ ప్రభుత్వానికి అండగా ఉండాలంటే హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశం సోమవారం హిమాయత్ నగర్ అమృత ఎస్టేట్స్, చేతివృత్తిదారుల సంఘాల రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పగిళ్ల జోజి అధ్యక్షతన జరిగింది. బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ.. గత కొంతకాలంగా రజకులకు చెందిన పెండింగ్ కరెంటు బిల్లులను విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రజకులతో పాటు బీసీ వర్గాలకు సంబంధించిన చేతివృత్తుల వారికి ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గోరుగంటి కృష్ణ, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

మనువాద పాలకులపై తిరుగుబాటు చేయాలి



మాట్లాడుతున్న రాజు

హిమాయత్‌నగర్: మాల అమరవీరుల ఆశయ సాధన, ఎస్సీ వర్గీకరణ రద్దు కోసం మనువాద పాలకులపై తిరుగుబాటు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ వి.ఎల్.రాజు పిలుపునిచ్చారు. సోమవారం మాల మహానాడు కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మాల అమర వీరుల సంస్మరణ సభ రాజు పాల్గొని మాట్లాడారు. 11 ఆగస్టు 1997లో ఆనాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు పాలనలో వర్గీకరణకు వ్యతిరేకంగా దాదాపు పది లక్షల మంది మాలలపై ప్రభుత్వం గుర్రాలతో దాడిచేయగా పాల్గొన్న ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో శేషయ్యే, నారాయణ రెడ్డి సత్యనారాయణ అనే మాల మహానాడు కార్యకర్తలు మరణించారన్నారు. దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ.. మాలలను అణగదొక్కాలని, విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు రానివ్వకుండా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రంలోని బీజేపీ సర్కార్ అండదండలతో కుట్రలు చేశారని ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును గద్దె దించాలన్నారు.

ఉత్సాహంగా కెరీర్ ఫెయిర్



కెరీర్ ఫెయిర్‌లో సందేహాలు నివృత్తి చేసుకుంటున్న విద్యార్థులు

బంజారాహిల్స్: ఉన్నత చదువుల విషయంలో విద్యార్థులకు పాఠశాల దశ నుంచే అవగాహన అవసరమని మెరీడియన్ స్కూల్ ప్రిన్సిపాల్ పూనం జా అన్నారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని మెరీడియన్ స్కూల్‌లో విద్యార్థుల కోసం కెరీర్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతియేటా కొత్త కొత్త కోర్సులు వస్తున్నాయని వాటి గురించి తెలుసుకుంటూ ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లుగా విద్యార్థులు కెరీర్‌ను మలుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు మన దేశంతో పాటు ఇతర దేశాల్లోని యూనివర్సిటీల్లో లభిస్తున్న కోర్సులు, ఉపాధి అవకాశాల విషయంలో ఈ కెరీర్ ఫెయిర్ ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో తేజస్వి బుట్టా, ప్రెసిడెంట్ లలితా నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ రహత్ రషీద్, కెరీర్ కౌన్సిలర్ ఉజ్మా సుల్తానా పాల్గొన్నారు.

హుటాహుటిన..



బంజారాహిల్స్ రోడ్ నెం–13లోని అంబేడ్కర్‌నగర్ బస్తీతో పాటు నాలా కుంగిపోయిన బంజారాహిల్స్ రోడ్ నెం–1లోని మహేశ్వరి టవర్స్‌కు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ సోమవారం ఉదయం వస్తున్నారని తెలుసుకున్న అధికారులు హుటాహుటిన శానిటేషన్ పనులు మొదలు పెట్టారు. అంబేడ్కర్ నగర్ బస్తీ దారిలో గత 15 రోజుల నుంచి పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు ఉన్నతాధికారులు వస్తున్నారని తెలియగానే హుటాహుటినా వ్యర్థాలను తొలగించారు.

– బంజారాహిల్స్

కులవృత్తులను కాపాడాలి



సత్కారిస్తున్న ఆదినారాయణ

లిబర్టీ: సాంప్రదాయ కులవృత్తులను కాపాడేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ విన్నవించారు. కూలిపోతున్న కులవృత్తులను కాపాడేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలన్నారు. సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ వికరణ గ్రూపులైజేషన్ నేపథ్యంలో కులవృత్తులు కూలిపోతున్నాయని సాంప్రదాయ చేనేతలకు అండగా నిలవాలని కేంద్ర ప్రభుత్వానికి తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకి విన్నవించారు. చేనేత రంగానికి చైతన్యం ఇస్తున్న ప్రముఖులను సత్కారించారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు కిలో రూపాయల్లో..టమాట రూ.37, నల్లవంకాయ 23, పొడుగువంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 55, క్యాప్సికం 45, పచ్చికాకరకాయ 26, పందిరిబీర 26, క్యాబేజీ 13, క్యారెట్ 41, దొండకాయ 23, గుండు బీన్నీస్ 60, గింజచిక్కుడు 55, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 13, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 33, మొరంగడ్డ 35, కందగడ్డ 40, క్యాలిఫ్లవర్ 18, సొరకాయ 11, పొట్లకాయ 18, అరిటికాయ 10, మునగకాయ 4, మామిడికాయ 45, ముల్లంగి 4–5, ఉల్లిపారక 35.

బీజేపీ బైక్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. పహల్గామ్ దాడి తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ప్రత్యర్థి స్థావరాలను మట్టుబెట్టిన సందర్భంగా దేశ ప్రజల ఐక్యతను చాటి చెబుతూ బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌రాజ్, వీణామాధురి తదితరులు పాల్గొన్నారు.

ఆకృతి ఎగ్జిబిషన్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హోటల్ తాజ్ డెక్కన్ వేదికగా ఆకృతి ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. సోమవారం ప్రారంభమైన ఈ ప్రదర్శన రెండ్రోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో దాదాపు 70 మంది డిజైనర్లు తమ ఫ్యాషన్ డిజైనింగ్ వేర్‌ను ప్రదర్శిస్తున్నారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

సనత్‌నగర్: నాగరాజరాజేశ్వరీనగర్‌లో కొలువుదీరిన నాగరాజరాజేశ్వరీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, రాజు, నరసింహ, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం ఇస్తున్న భద్రయ్య

పంజగుట్ట: జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్ఆర్సి) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ద్యాగటి హరీష్, బత్తుల రాజశేఖర్‌ను నియమించారు. సోమవారం పంజగుట్టలోని కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అధ్యక్షులు మొగుళ్ల భద్రయ్య వారికి నియామకపత్రాలు అందించారు. రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంలో హరిష్, రాజశేఖర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, పృథ్వీరాజ్, ఆవునూరు కిషోర్ పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: సెప్టెంబరు 19న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్‌వీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట మహాధర్నా విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బీఆర్ఎస్‌వీ నాయకులు తుంగబాలు, కొంపెల్లి నరేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 2 ఏళ్లు గడుస్తున్నా.. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయలేదన్నారు. 19న ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగే మహాధర్నాలో విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్, మల్లేశ్, సురేశ్, పృథ్వీ, అరవింద్, అచ్యుత్‌కిరణ్, వంశీ పాల్గొన్నారు.

గొడవ మాన్పించేందుకు వెళ్తే తల పగలగొట్టాడు

వెంగళరావునగర్: ఇరువురు గొడవ పడుతుండగా అడ్డుబోయిన యువకుడి తల పగలగొట్టిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం రహమత్‌నగర్ వీడియోగల్లీ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌పై చంటి, రాజు, ప్రకాశ్ నిత్యం నిద్రపోయేవారు. శనివారం రాత్రి అక్కడకు వచ్చిన రాజు, ప్రకాశ్ మద్యం తాగి గొడవ పడుతుండగా వారిని సముదాయించడానికి వచ్చి అఫ్జల్ పాషాను ప్రకాశ్ రాయితో తల పగలకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అఫ్జల్‌పాషాను గాంధీ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహా గర్జన సభకు సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న రమేష్ కుమార్ మాదిగ

హిమాయత్‌నగర్: వచ్చేనెల 3న మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో తలపెట్టిన 'ఛలోహైదరాబాద్-మహాగర్జన సభ'కు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు మాదిగ రాజకీయ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) జాతీయ అధ్యక్షులు బి.ఎస్.రమేష్ కుమార్ మాదిగ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర మీడియా కన్వీనర్‌గా సుంకశాల సంపత్ మాదిగకు నియామక పత్రం అందజేసి మాట్లాడారు. ఈ సభకు పెద్ద ఎత్తున వికలాంగులు, పింఛన్‌దారులు, దళితులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వికలాంగులకు రూ.4 వేలు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ఉత్సాహంగా పోటీలు

సనత్‌నగర్: మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. తల్లిదండ్రుల (వయో వృద్ధుల) పోషణ– పిల్లల కర్తవ్యం అనే అంశంపై వ్యాసరచన పోటీలతో పాటు జనరల్ నాలెడ్జ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 100 మంది విద్యార్థులు హాజరై ప్రతిభ చాటారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు, మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయి పర్యవేక్షణలో ఆయా పోటీలు జరిగాయి.

అభివృద్ధి పనుల పరిశీలన

సికింద్రాబాద్: మేడిబావిలోని శాఖ గ్రౌండ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెద్దవారికి, చిన్న పిల్లలకు ఉపయోగపడేలా పార్క్ మాదిరి పనులు చేపట్టామని తెలిపారు. సుమారు రూ. 40 లక్షల వ్యయంతో కంపౌండ్ వాల్, మెష్, గేట్, వాకింగ్ ట్రాక్, వృద్ధులు కూర్చోడానికి బెంచీలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనుల్లో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. వీలైనంత తొందరగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం–7లోని గతి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు బంజారాహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు నివారణ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ.. పిల్లల్లో నులిపురుగులతో పొట్టనొప్పి రావడం, దురద, ఎదుగుదలలో సమస్యలు ఉంటాయన్నారు. పిల్లలు తొందరగా అలిసిపోతారని బలహీనంగా ఉంటారని వాటి నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు.

నిష్కల్క్ ప్రభాత్ హైస్కూల్‌లో..

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లోని నిష్కల్క్ ప్రభాత్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను కార్పొరేటర్ విజయారెడ్డి వేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు 12 వేల దరఖాస్తులు

సాక్షి, సిటీబ్యూరో: హజ్ యాత్ర–2026కు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 వేల దరఖాస్తులు అందినట్లు రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి మహ్మద్ సజ్జాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్వ్యాప్తంగా దాదాపు 7 వేల దరఖాస్తులు రాగా, మిగత దరఖాస్తులు జిల్లాల నుంచి అందినట్లు తెలిపారు. ఇందులో 70 ఏళ్లకుపైబడిన వారిని యాత్రకు నేరుగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. మిగతా దరఖాస్తుల కంప్యూటరైజ్ డ్రా పద్ధతిన కేంద్ర హజ్ కమిటీ ఎంపిక చేస్తుందని పేర్కొన్నారు. ఏప్రిల్ చివరి వారం నుంచి యాత్ర ప్రారంభించాలని ప్రణాళిక సిద్ధం చేశామని, ఈ నెల చివరివారంలో డ్రా ఉంటుందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి యాత్రకు దాదాపు 2 వేల దరఖాస్తులు ఎక్కువ వచ్చాయని పేర్కొన్నారు. ఈ యాత్రకు ఆరు వేల మందిని కేంద్ర హజ్ కమిటీ ఎంపిక చేస్తుందని భావిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది యాత్రకు దాదాపు రూ.4.80 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

జీఎంఆర్ ఏవియేషన్ స్కూల్‌కు ఎయిర్‌బస్ గుర్తింపు

శంషాబాద్: జీఎంఆర్ ఏవియేషన్ స్కూల్ బేసిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీరింగ్ శిక్షణ కార్యక్రమానికి ఎయిర్‌బస్ మెయింటెనెన్స్ ట్రైనింగ్ నుంచి అధికారిక గుర్తింపు లభించింది. ఎయిర్‌బస్ నమోదు చేసిన అంతర్జాతీయ శిక్షణ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ సంస్థ కొనసాగుతోందని గుర్తించారు. ఈ మేరకు సదరు సంస్థ శిక్షణకు సంబంధించిన అంతర్గత నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి గుర్తింపునిచ్చిందని జీఎంఆర్ ఏరోటెక్నిక్ అశోక్‌గోపీనాథ్ అన్నారు. స్కూల్ అందిస్తున్న నాణ్యమైన శిక్షణకు ఇది సరైన గుర్తింపు అని పేర్కొన్నారు. వైమానిక రంగం సాంకేతిక నిపుణులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు.

అమరుల స్తూపానికి మరమ్మతు చేయాలి

– ప్రజావాణిలో విన్నవించిన సీపీఎం



లక్డీకాపూల్: బషీర్‌బాగ్ చౌరస్తాలో నిర్మించిన విద్యుత్ అమరవీరుల స్తూపానికి మరమ్మతులు చేయాలని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ కోరారు. ఈ మేరకు సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అడిషనల్ కమిషనర్ పంకజకు ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మీడియాతో మాట్లాడుతూ 2000 ఆగస్టు 28న జరిగిన విద్యుత్ పోరాటంలో ప్రాణాలర్పించిన అమరుల స్మృతి చిహ్నంగా స్తూపం నిర్మించి 25 సంవత్సరాలు పూర్తైందని అన్నారు. ఈ నేపథ్యంలో స్తూపాన్ని పునర్‌నిర్మించాలని కోరుతూ ప్రజావాణిలో వినతిపత్రాన్ని సమర్పించినట్టు తెలిపారు. ఆయనతోపాటు పార్టీ నేత శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో చేనేత ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఏర్పాటు చేసిన ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ దక్కన్‌లో ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడి పిల్లలు– ప్రతిభ గల పిడుగులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 11 గంటలకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

స్టేషన్ కాడ.. దాటాలంటే దడ!

- రైల్వేస్టేషన్ చుట్టుపక్కల ఐదు చోట్ల సిటీబస్ పాయింట్స్
- ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్లే ప్రయాణికులకు చుక్కలే...
- ప్రతిపాదనలకే పరిమితమైన ఇంటిగ్రేటెడ్ సిటీ సెంట్రల్ బస్‌స్టేషన్

పద్మవ్యూహాన్ని తలపిస్తున్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రోడ్లు



సికింద్రాబాద్ స్టేషన్ వద్ద రద్దీగా ఉన్న బస్సులు, ప్రయాణికులు

సాక్షి, సిటీబ్యూరో

అది సికింద్రాబాద్ రైల్వేస్టేషన్. అక్కడికి రోజూ వందల కొద్దీ ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి.. ట్రిప్పులు వేలల్లో ఉంటాయి.. అయితే సిటీ నలుమూల నుంచి వచ్చే బస్సులను స్టేషన్‌కు నలు దిక్కుల కనీసం రెండు కిలోమీటర్ దూరంలో నిలిపి ఉంచుతున్నారు. ఒక బస్టాపు నుంచి మరో బస్టాపు వరకు చేరుకోవాలంటే రోడ్లపై కిక్కిరిసే వాహనాలను దాటుకుంటూ ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోంది. అటు గురుద్వారా నుంచి ఇటు చిలకలగూడ చౌరస్తా వరకు, అల్ఫా హోటల్ నుంచి బ్లూసీ హోటల్ వరకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసరాలు నిత్యం పద్మవ్యూహాన్ని తలపిస్తాయి. రైల్వేస్టేషన్‌కు, మెట్రోస్టేషన్ వెళ్లాలన్నా తిప్పలే. రైల్వే, మెట్రో, సిటీబస్సుల మధ్య సమన్వయంతోపాటు ప్రయాణికులు ఒక రవాణా సదుపాయం నుంచి మరో రవాణా సదుపాయానికి సులభంగా మారేందుకు సికింద్రాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ సెంట్రల్ బస్టేషన్ కోసం పదేళ్ల క్రితమే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రణాళికలను కూడా రూపొందించారు. కానీ, ఇప్పటివరకు అది ఆచరణకు నోచలేదు.

ఏ బస్సు ఎక్కడో...

నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజు సుమారు 1,500 బస్సులు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ బస్సులు రోజుకు 5 వేల ట్రిప్పులు తిరుగుతాయి. సుమారు 5.5 లక్షల మంది సికింద్రాబాద్ కేంద్రంగా ప్రయాణిస్తుంటారు. హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఘట్కేసర్, ఉప్పల్ తదితర ప్రాంతాల నుంచి సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగించే సిటీ బస్సులన్నీ చిలకలగూడ చౌరస్తాకే పరిమితమవుతాయి. కానీ, ప్రయాణికులు అక్కడి నుంచి అఫ్జల్‌గంజ్, కోఠి, అమీర్‌పేట్, హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఒలిఫెంటా బ్రిడ్జి వద్ద రోడ్డు దాటి రైల్వేస్టేషన్ వరకు నడవాలి.

- మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, సఫిల్‌గూడ, తుకారాంగేట్, లాలాగూడ తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులన్నీ బ్లూసీ హోటల్ దగ్గర ఆగుతాయి. ప్రయాణికులు అక్కడి నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే రోడ్డు దాటి ఫర్లాంగ్ దూరానికి పైగా నడవాల్సిందే.
- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఉప్పల్, తార్నాక, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం వైపు వెళ్లే ప్రయాణికులు కిలోమీటర్‌కుపైగా నడిచి చిలకలగూడ చౌరస్తాకు చేరుకోవాలి.
- జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, అపురూప కాలనీ, బాలానగర్, పటాన్‌చెరు, బీహెచ్ఈఎల్, కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు, అల్వాల్, తిరుమలగిరి తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే సిటీ బస్సులు గురుద్వారా వద్ద ఆగుతాయి. అక్కడి నుంచి మరో బస్సు కోసం బ్లూసీ హోటల్ వరకు లేదా చిలకలగూడ చౌరస్తా వరకు నడవాలంటే కిక్కిరిసిన రోడ్డుపైన నడక నరక ప్రాయమే.

రైల్వేస్టేషన్ విస్తరణ ముప్పు...

- అఫ్జల్‌గంజ్, కోఠి, జూపార్క్, ఈఎస్ఐ, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్, కొండాపూర్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే సిటీ బస్సులు రైల్వేస్టేషన్ ఎదురుగా ఆగుతాయి. ప్రస్తుతం స్టేషన్ విస్తరణలో భాగంగా ట్యాక్సీ స్టాండ్‌ను అక్కడి నుంచి తొలగించారు. ఇప్పుడు బస్సులు ఆపే ప్రాంతం కూడా రైల్వే ప్రాంగణంలోనే ఉంది. దీంతో ఈ బస్టాప్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం 1980లలో సికింద్రాబాద్‌లో రేతిఫైల్ బస్‌స్టేషన్‌ను కట్టించారు. ఇప్పుడు పట్టుమని పది బస్సులు ఆగేందుకు కూడా అక్కడ స్థలం అందుబాటులో లేదు. రేతిఫైల్ బస్‌స్టేషన్ ఉన్నా లేనట్లే.



ఇంటిగ్రేటెడ్ బస్‌స్టేషన్ ఏమైనట్లు..

కనీసం రెండు వేల సిటీ బస్సులను ఒకేచోట నిలిపేందుకు వీలుగా పాతగాంధీ ఆసుపత్రి స్థలంలో అతి పెద్ద బస్‌స్టేషన్‌ను నిర్మించాలని అప్పట్లో ప్రతిపాదించారు. దీనివల్ల రైల్వే, మెట్రో, ఆర్టీసీల మధ్య సీమ్‌లెస్ జర్నీ సదుపాయం అందుబాటులోకి వస్తుందని భావించారు. కానీ, ఈ స్థలాన్ని మెట్రోకు కేటాయించడంతో ఇంటిగ్రేటెడ్ బస్‌స్టేషన్ ప్రతిపాదన అటకెక్కింది. హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ సైతం ఈ స్థలాన్ని ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకురాకపోవడం గమనార్హం. బెంగళూర్ మెజాస్టిక్ బస్‌స్టేషన్ తరహాలో సికింద్రాబాద్‌లో ఒక సమగ్రమైన బస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులు సులభంగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉంటుంది.

నాలాల ఆక్రమణలను తొలగించండి

హైడ్రా ప్రజావాణికి వెల్లువెత్తిన ఫిర్యాదులు



సాక్షి, సిటీబ్యూరో: వర్షాలు, వరదలు, మునకల వేళ నాలాల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 51 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 70 శాతం మేర నాలా ఆక్రమణలకు సంబంధించినవే కావడం గమనార్హం. హైడ్రా అదనపు కమిషనర్ ఎన్.అశోక్ కుమార్ ఈ ఫిర్యాదులను పరిశీలించారు. బార్కాస్ సలాలా ప్రాంతంలోని నాలా మీద ఇల్లు కట్టేశారని, దీని ప్రభావంతో ప్రతి ఏటా వరద ముప్పు ఎదుర్కోవాల్సి వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ముంపునకు గురైనప్పటి చిత్రాలు తీసుకువచ్చి అధికారులకు దాని తీవ్రతను చూపించారు. ఈ ఆక్రమణలను తొలగిస్తే మూడు బస్తీలకు వరద ముప్పు తప్పుతుందని అన్నారు. కీసర సమీపంలోని నాగారంలో పార్కులు, ప్రజావసరాలకు నిర్దేశించిన 12 వేల గజాల స్థలాలు కబ్జా అవుతున్నాయని, ఫెన్సింగ్ వేసి కాపాడాలని హెచ్ఎంటీ బేరింగ్స్ నగర్ నివాసితులు కోరారు. బాలాపూర్ ఏఆర్‌సీఐ రోడ్డులోని ఆర్చిడ్ రెసిడెన్సీ సమీపంలోని పెద్ద చెరువు నాలా కబ్జాలకు గురవ్వడంతో తమ ప్రాంతాలన్నీ నీట మునుగుతున్నాయని రెసిడెన్షియల్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. బీరంగూడలోని వందనపురి కాలనీ ఫేజ్–1లో 20 అడుగుల రహదారిని కొందరు 10 అడుగుల మేర కబ్జా చేశారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. ఉప్పరపల్లిలోని ఎస్ఆర్ సదన్ జీకే అవెన్యూ సమీపంలోని పార్కులోకి మురుగునీరు చేరుతోందని, అక్కడికి వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఫిర్యాదు చేశారు. నాలా ఆక్రమణ కారణంగానే ఇలా జరుగుతోందని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిగూడ అంబేడ్కర్‌నగర్‌లో నాలాను ఆక్రమించి ఇల్లు నిర్మించడం వల్ల వరద ముంచెత్తుతోందని ఆయా ప్రాంతాల నివాసితులు ఫిర్యాదు చేశారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

ఇందిరాపార్కు వద్ద మహాధర్నా



ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కవాడిగూడ: పెన్షనర్ల సమస్యల సాధనకు ఐక్యంగా ఉద్యమించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వక్తలు పిలుపునిచ్చారు. కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ తెలంగాణ, ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద సోమవారం పెన్షనర్లు పెద్ద ఎత్తున మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ రావు, జేఏసీ చైర్మన్ లక్ష్మయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 15 రోజుల్లో ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ప్రకటిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. లక్ష్మయ్య మాట్లాడుతూ ఏప్రిల్ 2024 నుంచి రిటైర్ అయినవారికి పెన్షనరీ బెనిఫిట్ చెల్లించలేదని, వాయిదా పద్ధతిలో కాకుండా అందరికీ ఒకేసారి చెల్లించాలన్నారు. ఏలూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ పెన్షనర్ల ఉద్యమానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. మహాధర్నాకు పెన్షన్‌దారులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో కమిటీ సెక్రటరీ సత్యనారాయణ, వైస్ చైర్మన్ సిద్దుల జ్ఞానేశ్వర్, ఆల్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ సుధాకర్, టీఎన్‌వో నేతలు ఎం.జగదీష్, ముజీబ్, దేవేందర్, శివయ్య పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచాలి

రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల పెన్షన్లను పెంచాలని అఖిల భారత పెన్షన్, విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ బాబు డిమాండ్ చేశారు. సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ధర్నాచౌక్‌లో విశ్రాంత ఉద్యోగులు నిరాహార దీక్ష చేపట్టారు. అనేక ఏళ్లుగా పెన్షన్లు పెంచకపోవ డం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్యక్రమంలో ఉప్పు సుధాకర్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాగుపై అవగాహన అవసరం



యువ శాస్త్రవేత్తలతో నారమ్స్ అధికారులు

ఏజీవర్సిటీ: యువ వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించాలని కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ సభ్యుడు, ఐసీఏఆర్ కార్యదర్శి డాక్టర్ చబిలేంద్ర రౌల్ అన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నారమ్స్)లో సోమవారం కొత్త శాస్త్రవేత్తలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల నుంచి 105 మంది ప్రొబెషనరీ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ వ్యవసాయ సవాళ్లను పరిష్కరించడం, వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం వంటి వాటిపై శిక్షణ ఉంటుందని తెలిపారు. 1960లో దేశం ఎదుర్కొన్న ఆహార కొరత నుంచి ఇప్పుడు ప్రపంచ దేశాలకు ఆహారం అందిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా ఆహార భద్రత, వాతావరణ మార్పులు, నాణ్యత, సహజ వనరులను పరిరక్షించడంపై గురి పెట్టాలని సూచించారు. ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జోయ్ కృష్ణ జెన్ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ వ్యవస్థలోని సవాళ్ల గురించి రైతులతో మాట్లాడి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. కొత్తగా శిక్షణ పొందుతున్న శాస్త్రవేత్తలతో విధేయతపై ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో నారమ్స్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సబ్ స్పెషాలిటీతో మెరుగైన వైద్యం

ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: యూరాలజీ, నెఫ్రాలజీలో యూరో–అంకాలజీ, ఆండ్రాలజీ, పీడియాట్రిక్ యూరాలజీ, మహిళా యూరాలజీ వంటి సబ్ స్పెషాలిటీలతో మెరుగైన వైద్య సేవలందించే అవకాశం ఉంటుందని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ(ఏఐజీ) చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం బంజారాహిల్స్ ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ ఆసుపత్రిని నగర సీపీ సీవీ ఆనంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లికార్జున్ బృందం సబ్ స్పెషాలిటీ వైద్య సేవలపై దృష్టి సారించడం శుభపరిణామమని అన్నారు. దేశంలోనే యూరాలజీ, నెఫ్రాలజీలో అత్యాధునిక సేవలందిస్తున్న ఉత్తమ ఆసుపత్రిగా ఏఐఎన్‌యూ నిలుస్తోందన్నారు. హైదరాబాద్‌లో అత్యాధునిక సాంకేతికత, చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. మహిళలు యూరాలజీ సమస్యలను చెప్పుకోవడానికి మహిళా యూరాలజిస్టులను అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. అనంతరం ఏఐఎన్‌యూ చైర్మన్ మల్లికార్జున మాట్లాడుతూ 1,400 రోబోటిక్ సర్జరీలు చేశామని తెలిపారు. 5 ఏళ్ల నుంచి సబ్ స్పెషలైజేషన్ యూరాలజీ సేవలను తీసుకొచ్చామని చెప్పారు. మహిళల్లో యూరాలజీ, పురుషుల్లో ఆండ్రాలజీ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రొస్టేట్, స్టోన్ సమస్యలు, ప్రొస్టేట్ కేన్సర్లు ఎక్కువ అవుతున్నట్లు గుర్తించామన్నారు.

13న మండలి వెంకట కృష్ణారావు పురస్కారాల ప్రదానం

నాంపల్లి: తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతుల పరివ్యాప్తికి ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో విశేష సేవలందించిన వ్యక్తులకు, తెలుగు సంస్థలకు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతి ఏటా మండలి వెంకటకృష్ణారావు సంస్కృతి పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ పురస్కారం కింద రూ.25 వేలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సౌజన్యంతో ప్రదానం చేస్తున్నారు. 2024వ సంవత్సరానికి ఆటో–విభో–కందాళం ఫౌండేషన్(అమెరికా) అధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణకు, 2025వ సంవత్సరానికి సోలాపూర్‌లోని తెలుగు భాషాభివృద్ధి సార్వజనిక్ గ్రంథాలయం అధ్యక్షుడు కమటం మల్లికార్జున్‌కు పురస్కారాలు ఇవ్వనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు అధ్యక్షతన జరిగిన పురస్కార ఎంపిక కమిటీ నిర్ణయించిందని పేర్కొన్నారు. పురస్కారాల ప్రదానోత్సవం ఈ నెల 13న ఉదయం 11 గంటలకు నాంపల్లి ప్రాంగణంలోని డాక్టర్ నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఉంటుందని తెలిపారు. సభకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి విశిష్ట అతిథిగా, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ గౌరవ అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

'తలసేమియా' సొసైటీ సేవలు భేష్

రాజేంద్రనగర్: అఫ్గానిస్థాన్‌కు చెందిన అట్టా వెల్ఫేర్ ఫౌండేషన్ (ఏడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలోని వైద్యులు, దాతల బృందం నగరంలోని తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్) సేవలను కొనియాడింది. రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు, ముఖ్యంగా తలసేమియా బాధితులకు అఫ్గనిస్తాన్‌లో ఇలాంటి సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ బృందం ఇక్కడ సందర్శించింది. అంతకుముందు టీఎస్‌సీఎస్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, నరేశ్ రతి, వైస్ ప్రెసిడెంట్ రత్నవల్లి, సీఈఓ అండ్ కార్యదర్శి డాక్టర్ సుమన్ జైన్, జాయింట్ సెక్రటరీ అలీమ్ బేగ్‌లతో కలిసి ఏడబ్ల్యూఎఫ్ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. ఆరోగ్య సంరక్షణ సేవలు, రోగి సంరక్షణలో సహకారానికి గల పలు అంశాలపై బృంద సభ్యులు చర్చించారు.

'ఏకలవ్య గ్రామీణ వికాస్'కు ఎస్‌బీఐ విరాళం



సాక్షి, సిటీబ్యూరో: గ్రామీణ విద్య, అభ్యాసం, సాధికారతను బలోపేతం చేయడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారీ విరాళంతో ప్రోత్సాహాన్ని అందించింది. ఎస్‌బీఐ సీఎస్ఆర్ చొరవలో భాగంగా సంస్థ చైర్మన్ చల్లా శ్రీనివాసులు సెట్టి ఆధ్వర్యంలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌కు రూ.50 లక్షల విలువైన విద్యా మౌలిక సదుపాయాలను విరాళంగా ఇచ్చింది. కంప్యూటర్, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవ శాస్త్ర ప్రయోగశాలల ఏర్పాటుసహా గ్రామీణ విద్యకు ఉపయుక్తమైన పలు అంశాల్లో సహకారం అందించింది. కార్యక్రమంలో భాగంగా శ్రీనివాసులు సెట్టి మాట్లాడుతూ బ్యాంకుల నికర లాభంలో ఒక శాతాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు కేటాయించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశించిందని చెప్పారు. ఎస్‌బీఐ చాలా కాలంగా ఈ రంగంలో అగ్రగామిగా ఉందన్నారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలను ప్రవేశపెట్టడానికి చాలాకాలం ముందు నుంచే సాధారణ సీఎస్ఆర్ కార్యకలాపాలను ఎస్‌బీఐ ప్రారంభించిందని తెలిపారు.

పర్యాటక, ఆతిథ్య రంగాలకు పెరిగిన ప్రాముఖ్యత



నిథమ్ ఓరియంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకటరమణ

రాయదుర్గం: పర్యాటక, అతిథ్య రంగాలకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాముఖ్యత ఉందని 'నిథమ్' డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ అన్నారు. గచ్చిబౌలిలోని నిథమ్ క్యాంపస్‌లో 16వ బ్యాచ్ బీబీఏ, 22వ బ్యాచ్ ఎంబీఏ విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని సోమవారం డైరెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యాటక, ఆతిథ్య రంగాల విద్యకు ప్రాముఖ్యత, భవిష్యత్తు నిపుణులను రూపొందించడంలో సంస్థ పాత్ర ఎంతో ఉందన్నారు. విద్యార్థులు అభ్యాసంతోపాటు వృత్తినైపుణ్యం పెంపొందించుకోవడానికి ప్రయత్నించాలని సూచించారు. ప్రతి విద్యార్థి విలువల పట్ల అవగాహన కలిగి ఉండాలని, తల్లిదండ్రులు గర్వపడేలా కృషి చేయాలన్నారు. 'నిథమ్'ను మరింత శక్తివంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఏవియన్ హాలీడేస్ సీఈఓ సిరాజ్ అన్సారీ మాట్లాడుతూ పర్యాటక రంగంలో చదువుతోపాటు నైపుణ్యాలు నేర్చుకుంటే ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. వన్–టు–వన్ ఇంటరాక్టివ్ సెషన్‌ల ద్వారా తన అనుభవం, నైపుణ్యంతో కొత్త విద్యార్థుల సహజ సామర్థ్యం, అభిరుచి, మనస్తత్వాన్ని అన్వేషించాలని అన్నారు. తాజ్‌డెక్కన్ జనరల్ మేనేజర్ అర్నాబ్ గుప్తా మాట్లాడుతూ స్వీయప్రేరణ, క్రమశిక్షణతో పరిశ్రమలో తనను తాను ఎలా ఉన్నతీకరించుకోవాలో రోడ్‌మ్యాప్, దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నిథమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంకే గణేష్, డాక్టర్ డి. మహేశ్వరరెడ్డి, డాక్టర్ నీరజ్‌గోహిల్, విజయలక్ష్మి, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ఎస్. యాదగిరి, ఇతర ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

8 నగరాల్లో యూఎస్ వర్సిటీ ఫెయిర్

అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ వెల్లడి



అమెరికన్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్

రాయదుర్గం: భారతదేశంలోని 8 ప్రధాన నగరాల్లో ఎడ్యుకేషన్–యూఎస్ఏ యూనివర్సిటీ ఫెయిర్స్– 2025ను నిర్వహిస్తున్నట్లు అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ వెల్లడించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో యూఎస్ ఎంబసీ, కాన్సులేట్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఫెయిర్‌ను సందర్శించి విద్యార్థులు, వివిధ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల ప్రతినిధులతో సంభాషించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 9న ప్రారంభమైన ఈ ఫెయిర్స్ చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, న్యూఢిల్లీ, కోల్‌కతా, అహ్మదాబాద్, ముంబై, పుణె వంటి నగరాల్లో నిర్వహిస్తున్నామన్నారు. నిబద్ధత, సమయపాలన, డబ్బు, కృషితోనే అమెరికాలో విద్య సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ విద్యార్థిగా ఉండటం అనేది ముఖ్యమైన బాధ్యతలతో కూడిన హక్కు అని అన్నారు. కార్యక్రమంలో పలువురు అమెరికన్ కాన్సులేట్ అధికారులు, వివిధ యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు బకాయిలు చెల్లించాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తున్న ఆర్.కృష్ణయ్య

నాంపల్లి: పెండింగ్‌లో ఉన్న రూ.6 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు చెల్లించాలని, బీసీ, ఈబీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయం ఎదుట విద్యార్థులు ఆందోళన చేపట్టారు. విద్యార్థులు ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముట్టడికి యత్నించగా పోలీసులు భగ్నం చేశారు. దీంతో విద్యార్థులు గేటు బయటే రోడ్డు మీద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆర్.కృష్ణయ్య అక్కడికి చేరుకుని విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన రోడ్డుపై కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ప్రజాసంక్షేమం పేరుతో లక్షల కోట్లు అప్పులు తెస్తున్న ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఫీజు బకాయిల కోసం అప్పు తెస్తే ఎవరు అడ్డుకుంటారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలవుతున్నా కనీసం రూ.20 కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ఫీజులు కట్టాలని కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని, సంబంధిత కోర్సు పూర్తయినా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని అన్నారు. సర్టిఫికెట్లు లేని కారణంగా ఉద్యోగాలకు విద్యార్థులు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ వర్సిటీల్లోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు ఉన్నత విద్యా మండలి కార్యాలయ సూపరింటెండెంట్ గంగాధర్ విచ్చేసి వినతి పత్రాన్ని స్వీకరించారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



హైదరాబాద్ నగరం ఇప్పుడు కేవలం ఐటీ, ఫుడ్, సినిమా హబ్ మాత్రమే కాదు.. లైవ్ మ్యూజిక్ కన్సర్ట్స్‌కు కూడా కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. తెలుగు మ్యూజిక్ కన్సర్ట్స్ నుంచి బాలీవుడ్ మ్యూజిక్ స్టార్‌ల వరకు, గ్లోబల్ ఫేమస్ బాండ్స్ నుంచి ఫ్యూజన్ మ్యూజిక్ ప్రదర్శనల వరకు అన్నింటికీ సిటీ సెంటెజ్‌గా నిలుస్తోంది.
- సాక్షి, సిటీబ్యూరో

కన్సర్ట్ హబ్ @ హైదరాబాద్



లైవ్ మ్యూజిక్ కన్సర్ట్స్‌కు కేరాఫ్ అడ్రస్, కానీ కాస్ట్ ఖరీదు

బాలీవుడ్ మొదలు గ్లోబల్ మ్యూజిక్ ఈవెంట్స్ అడ్డా..

అనువుగా మ్యూజిక్ లవర్స్, విశాలమైన వేదికలు, మ్యూజిక్ కల్చర్ డైవర్సిటీ

అత్యధిక ధరలతో సొమ్ము చేసుకుంటున్న నిర్వాహకులు



నగరంలో అన్ని రాష్ట్రాల, అన్ని భాషల వారూ ఉండటం, మ్యూజిక్ పట్ల ప్యాషన్ ఉన్న యువత ఎక్కువగా ఉండటం, అంతర్జాతీయ బాండ్స్‌కి కూడా ఇక్కడ అభిమానుల బేస్ ఉండటం.. ఇవన్నీ హైదరాబాద్‌లో కన్సర్ట్ కల్చర్ పెరగడానికి కారణమయ్యాయి. రాక్, జాజ్, ఈడీఎం, క్లాసికల్, ఫోక్, హిప్‌హాప్ ఇలా ఏ జానర్ అయినా ఇక్కడ అభిమానులు రెడీగా ఉంటారు. సిటీలో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్, గచ్చిబౌలి స్టేడియం, ఎల్‌బీ స్టేడియం, శిల్పకళా వేదికతో పాటు పలు కన్వెన్షన్ సెంటర్లు, ఓపెన్ ఎయిర్ అరేనా వేదికలు ఉన్నాయి. వీటికి వేల నుంచి లక్షల వరకు ప్రేక్షకులు హాజరయ్యే సదుపాయం ఉండటం వల్లే, గ్లోబల్ మ్యూజిక్ బాండ్స్, స్టార్ సింగర్లు కూడా హైదరాబాద్‌ను ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నారు.

గ్లోబల్ మ్యూజిక్ ఐకాన్స్..

ఇటీవలి కాలంలో ఎడ్ షీరన్, డేవిడ్ గెట్టా, ఆర్మ్న్ వాన్ బూరెన్, దువా లిపా, ఇమాజిన్ డ్రాగన్స్, కోల్డ్‌ప్లే లాంటి ఇంటర్నేషనల్ స్టార్‌లు తమ టూర్స్‌లో హైదరాబాద్‌ను చేర్చారు. బాలీవుడ్ వైపు నుంచి అరిజిత్ సింగ్, నేహా కక్కర్, శ్రేయా ఘోషల్, మోహిత్ చౌహాన్ వంటి సింగర్లు కూడా సిటీలో గ్రాండ్ కన్సర్ట్స్ చేశారు. తెలుగు మ్యూజిక్ అభిమానుల కోసం సిద్ శ్రీరామ్, అనిరుధ్ రవిచందర్, మంగళం సిరి, దమిని, సునీత, శ్వేత మోహన్ వంటి సింగర్లు లైవ్‌లో పాడి అదిరిపోయే అనుభూతిని అందించారు. ఇక ఏఆర్ రెహ్మాన్ వంటి లెజెండరీ మ్యూజిక్ మాస్ట్రో ప్రదర్శనలు అయితే నగరానికి మ్యూజికల్ ఫెస్టివల్ వాతావరణం తీసుకొస్తాయి.





'సోషియల్ స్టేటస్' ట్రెండ్

మ్యూజిక్ కన్సర్ట్లు ఇప్పుడు కేవలం వినోదం మాత్రమే కాదు సిటీ యంగ్ క్రౌడ్‌కు ఇది ఒక ఫ్యాషన్ స్టేట్మెంట్, లైఫ్ స్టైల్ పార్ట్‌గా మారింది. డిజైనర్ అవుట్‌ఫిట్స్, లైట్ ఇల్లుమినేషన్, సెల్ఫీ స్పాట్స్, ఫుడ్ ఫెస్టివల్స్, కన్సర్ట్స్ ఇప్పుడు ఒక హైఎండ్ సోషల్ గ్యాదరింగ్‌లా మారాయి. ఇన్‌స్టాగామ్ రీల్స్, స్టోరీస్, సోషల్ క్లిప్స్ ద్వారా ఫ్యాన్స్ తమ కన్సర్ట్ అనుభవాన్ని షేర్ చేయడం, లైవ్‌లో ఉండి వీడియోలు పోస్ట్ చేయడం, ట్రెండింగ్ హ్యాష్‌ట్యాగ్స్ వాడటం.. ఇవన్నీ కన్సర్ట్స్‌ను సోషల్ మీడియాలో బజ్ టాపిక్స్‌గా మారుస్తున్నాయి.

సాధారణ అభిమానులకు 'అన్‌రీచబుల్'

అయితే ఈ కన్సర్ట్ కల్చర్‌కు ఒక పెద్ద మైనస్ పాయింట్ ఖరీదైన టికెట్ ధరలు. స్టార్ సింగర్లు, అంతర్జాతీయ బాండ్స్ కన్సర్ట్స్‌కి రూ.20 వేలకు పైగా వరకు వీఐపీ పాస్‌లు అమ్మడం సాధారణం అయింది. సాధారణంగా తక్కువ ధర టికెట్లు రూ.వెయ్యి, రూ.2 వేలు అలా ఉన్నా, అవి సాధారణంగా స్టేజ్‌కు చాలా దూరంలో, స్క్రీన్ ద్వారా మాత్రమే చూడగలిగే సీట్లు అవుతాయి. దీనిపై సాధారణ మ్యూజిక్ లవర్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొందరు సోషల్ మీడియాలో 'మేము ఫ్యాన్స్ అయినా, ఇంత ఖర్చు పెట్టలేం' అని చెబుతున్నారు.

మ్యూజికల్ ఈవెంట్స్ ఫ్యాన్స్ కౌంట్‌డౌన్..

ప్రస్తుతం నగరంలో ఏఆర్ రెహ్మాన్, సిద్ శ్రీరామ్ కాన్సర్ట్స్ కోసం టికెట్ బుకింగ్స్ ఆన్‌లైన్‌లో స్టార్ట్ అయ్యాయి. రెహ్మాన్ ఈవెంట్‌లో అతడి ఆల్‌టైమ్ హిట్స్‌తో పాటు కొత్త ఆల్బమ్ సాంగ్స్ కూడా ప్రదర్శించనున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. సిద్ శ్రీరామ్ కన్సర్ట్‌లో తెలుగు, తమిళ, హిందీ సూపర్‌హిట్స్‌తో పాటు అకౌస్టిక్ స్పెషల్ సెగ్మెంట్స్ ఉండబోతున్నాయి. యువతలో అతడికి ఉన్న క్రేజ్ వల్ల ఈవెంట్ టికెట్లు ఫాస్ట్‌గా సేల్ అవుతున్నాయి.





భవిష్యత్తు మ్యూజిక్ సిటీగా..?

మ్యూజిక్ ఇండస్ట్రీ నిపుణుల అభిప్రాయం ప్రకారం, హైదరాబాద్‌లో కన్సర్ట్ మార్కెట్ ఇంకా పెరిగే అవకాశం ఉంది. ప్రత్యేకంగా యూత్ జనరేషన్ లైవ్ మ్యూజిక్‌కు చూపిస్తున్న రెస్పాన్స్ వల్ల, వచ్చే సంవత్సరాల్లో మరిన్ని అంతర్జాతీయ బాండ్స్, మ్యూజిక్ ఫెస్టివల్స్ నగరాన్ని ఎంచుకునే అవకాశం ఉంది. అయితే, ఖరీదైన టికెట్లు, ట్రాఫిక్ సమస్యలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ లోపాలు వంటి ఇష్యూస్‌ను పరిష్కరించగలిగితే, హైదరాబాద్ నిజంగానే 'ఇండియాస్ మ్యూజిక్ కన్సర్ట్ క్యాపిటల్'గా ఎదుగుతుంది.

ఫ్యాషన్ డిజైనింగ్ ఇష్టం

ఫరెవర్ మిసెస్ ఇండియా హైదరాబాద్ విజేతగా బంగ్లా చంద్రలేఖ



సాక్షి, సిటీబ్యూరో: ఫరెవర్ మిసెస్ ఇండియా 2025 హైదరాబాద్ విజేతగా నగరానికి చెందిన బంగ్లా చంద్రలేఖ నిలిచారు. జైపూర్ జీ స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ టైటిల్ గెలుచుకోవడం చాలా సంతోషాన్నిచ్చిందన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పెరల్ సిటీ హైదరాబాద్ నుంచి పోటీల్లో పాల్గొని విజేతగా నిలవడం చాలా ఆనందాన్నిచ్చిందని తెలిపారు. షారా ఫ్యాషన్ డిజైనింగ్ వ్యవస్థాపకురాలిగా వ్యాపార కార్యకలాపాలు చూసుకుంటూ, కార్పొరేట్ కంపెనీలో టీమ్ లీడర్‌గా రాణిస్తూనే ఫరెవర్ మిసెస్ ఇండియా హైదరాబాద్ పోటీల్లో పాల్గొన్నానని చెప్పారు. నటన, మోడలింగ్ అంటే ఇష్టం. అందుకే ఫ్యాషన్ డిజైనింగ్‌లో అడుగు పెట్టాను. నా ఇష్టాలకు కుటుంబ సభ్యుల సహకారం తోడైందని ఆమె పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరనే గట్టి నమ్మకాన్ని కలిగిస్తోందన్నారు.

అందం.. ఆత్మస్థైర్యం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ ఎస్‌కే మిసెస్ ఇండియా యూనివర్స్ ఇంటర్నేషనల్, మిసెస్ తెలంగాణ కిరీటాలను గెలుచుకున్న ప్రియాంక తారే తన వ్యక్తిత్వం, ప్రతిభ, పట్టుదలతో ఈ తరానికి స్ఫూర్తిగా నిలిచారు. నోయిడాలో జరిగిన ప్రతిష్టాత్మక ఎస్‌కే యూనివర్స్ ఇండియా ఇంటర్నేషనల్ 2025 సీజన్ 27లో ఆమె సౌందర్యం, సమతుల్యత, ఆత్మవిశ్వాసం జడ్జీలతో పాటు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో విజేతగా ఎంపిక చేశారు. ఛత్తీస్‌గఢ్ భిలాయ్‌కు చెందిన ప్రియాంక ఈ పోటీల్లో హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించారు. కార్పొరేట్ లీడర్‌గా, ఈవెంట్స్, ఎచ్ఆర్, సీఎస్ఆర్ రంగాల్లో రాణించడమే కాకుండా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా, గాయనిగా, నృత్యకారిణిగా తన బహుముఖ ప్రజ్ఞ చాటుకుంది. టీఎస్ఈ8 ఉమెన్స్ అచీవ్‌మెంట్ అవార్డు 2025తో పాటు యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా ఆమెకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది.





పాప్ కల్చర్ పండగకు.. సిటీ రెడీ



సాక్షి, సిటీబ్యూరో: పాప్ కల్చర్ అభిమానులకు నగరంలో అక్టోబర్ 31 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు ఒక అద్భుతమైన పండగ రాబోతోంది. భారతదేశపు అతి పెద్ద పాప్ కల్చర్ వేడుక కామిక్ కాన్ ఇండియా తన 13వ ఎడిషన్‌ను నగరంలో ప్రారంభించనుంది. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగే ఈవెంట్‌లో కామిక్స్, కాస్‌ప్లే, గేమింగ్, సినిమాలు, యానిమే, టీవీ షోలు వంటి అనేక రంగాలను ఒకే వేదికపై అభిమానులకు అందించనున్నారు. హైదరాబాద్ పాప్ కల్చర్ మ్యాప్‌లో వేగంగా ఎదుగుతున్న నగరంగా గుర్తింపు పొందింది. నగరానికి ప్రత్యేకత ఏమిటంటే.. ఇక్కడి యువతరం గేమింగ్, కాస్‌ప్లే, ఫ్యాన్ కమ్యూనిటీస్‌కి చూపే ఆసక్తి. నిర్వాహకులు కూడా ఈ ఉత్సాహాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రపంచం నలుమూలల నుంచి ప్రముఖ అతిథులు, సెలబ్రిటీలను తీసుకురానున్నారు.

మూడు రోజులూ ఉత్సాహభరితంగా..

కాస్‌ప్లే అంటే కేవలం కాస్ట్యూమ్స్ కాదు.. అది ఒక ఆర్ట్ ఫారమ్, ఒక లైఫ్‌స్టైల్. ఈసారి కూడా దేశంలోనే అత్యుత్తమ కాస్‌ప్లేయర్లు, అద్భుతమైన డ్రెస్సింగ్, మేకప్, క్యారెక్టర్ పోర్ట్రేయల్‌తో అభిమానుల ముందుకు రానున్నారు. అంతేకాకుండా, లైవ్ మ్యూజిక్ షోలు, స్టాండ్ అప్ కామెడీ, ఈ స్పోర్ట్స్ పోటీలు, ప్యానెల్ డిస్కషన్స్‌తో మూడు రోజులూ ఉత్సాహభరితంగా సాగనున్నాయి. కామిక్ కాన్ సీఈవో షెఫాలీ జాన్సన్ మాట్లాడుతూ.. 'హైదరాబాద్ ఇప్పుడు సాంస్కృతిక, సృజనాత్మక రంగాలలో వేగంగా ఎదుగుతున్న నగరం. ఇక్కడి యువత పాప్ కల్చర్‌కి చూపే స్పందన అద్భుతం. అందుకే కొత్త సీజన్‌ను ఇక్కడ ప్రారంభించాలనుకున్నాం' అని అన్నారు. టికెట్లు డిస్ట్రిక్ట్ యాప్ లేదా డిస్ట్రిక్ట్.ఇన్ లభ్యమవుతున్నాయి.

కిడ్స్.. సూపర్ థాట్స్..



నిత్యం క్లాస్ రూముల్లో చదువులతో కుస్తీ పట్టే చిన్నారులు వివిధ థీమ్‌లతో కదిలారు. మొక్కల పెంపకం, నీటి సంరక్షణ, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ముందుకు వచ్చారు. మైకు చేతులోకి తీసుకొని ఒక్కో అంశంపై వారు వివరిస్తుంటే తల్లిదండ్రులు ముగ్ధులయ్యారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు వావ్ అనిపించాయి. ఈ వేడుకకు సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లోని సెయింట్ ప్యాట్రిక్స్ హైస్కూల్ కిండర్ గార్డెన్ వేదికైంది. కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ ఆరోగ్యస్వామి, ప్రిన్సిపాల్ ఇలాంగో పాల్గొన్నారు. - రాంగోపాల్‌పేట్





ఎన్నికల కమిషన్ విఫలం

మీ స్వీయ నిబంధనలను మీరే పాటించరా? ● ఏపీ ఎన్నికల సంఘం తీరుపై హైకోర్టు ఆక్షేపణ

- పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక పోలింగ్ కేంద్రాల మార్పుపై నిలదీత
- పోలింగ్ కేంద్రాల మార్పుపై పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలి కదా?
- ఆ పనిచేయడంలో ఏపీ ఎన్నికల కమిషన్ విఫలమైంది ● జడ్పీటీసీ, ఎంపీపీ కార్యాలయ గోడలపై అతికిస్తే సరిపోతుందా?

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల జడ్పీటీసీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చిన విషయంలో ఏపీ ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) తీరును హైకోర్టు గట్టిగా తప్పుబట్టింది. ''పోలింగ్ కేంద్రాలను మార్చిన విషయాన్ని జడ్పీటీసీ, ఎంపీపీ కార్యాలయాల బయట అతికిస్తే సరిపోతుందా? ఈ విషయం సాధారణ ప్రజానీకానికి ఎలా తెలుస్తుంది''అంటూ నిలదీసింది. అసలు పోలింగ్ కేంద్రాలను మార్చినట్లు తెలిసినప్పుడే కదా... ప్రజలకు దానిపై అభ్యంతరాలను తెలిపే అవకాశం ఉంటుంది అని అభిప్రాయపడింది. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎర్రబల్లి, నలగొండువారిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను నల్లపురెడ్డిపల్లికి మార్చడాన్ని వైఎస్సార్‌సీపీ చెందిన పలువురు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ సోమవారం విచారణ జరిపారు. ఇప్పటికే 97 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ జరగడం, ఆ స్లిప్పుల్లో పోలింగ్ కేంద్రాల వివరాలు ఉన్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల మార్పు విషయంలో జోక్యం చేసుకోలేకపోతున్నామని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఎన్నిక ప్రక్రియ కూడా మొదలైందని గుర్తుచేస్తూ... పోలింగ్ కేంద్రాల మార్పుపై దాఖలైన వ్యాజ్యాలను తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

"ఉప ఎన్నికల పోలింగ్ కేంద్రాలను మార్చిన విషయాన్ని ప్రతికల్లో ప్రకటనగా ప్రచురించాలని నిబంధనలు చెబుతున్నాయి. అయినా కూడా ఎన్నికల కమిషన్ ఆ పని చేయడంలో విఫలమైంది."

"పోలింగ్ కేంద్రాల మార్పు విషయంలో ఎన్నికల కమిషన్ తన స్వీయ నిబంధనను తానే ఉల్లంఘించింది."

"అసలు అభ్యంతరం తెలిపే అవకాశమే లేనప్పుడు... ప్రజలు అభ్యంతరం చెప్పలేదనే కారణాన్ని చూపుతూ పోలింగ్ కేంద్రాల మార్పు విషయంలో నిర్ణయం తీసుకోవడం ఎంత వరకు సబబు?"

- రాష్ట్ర ఎన్నికల కమిషన్ తీరును ఆక్షేపిస్తూ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

గతంలో 2 కి.మీ.దూరం.. నేడు 4 కి.మీ.

వైఎస్సార్‌సీపీకి చెందిన పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి, న్యాయవాదులు వీఆర్‌రెడ్డి కొవ్వూరి, యర్రంరెడ్డి నాగిరెడ్డి, వడ్లమూడి కిరణ్, సానేపల్లి రామలక్ష్మణరెడ్డి తదితరులు వాదనలు వినిపించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చిందని అన్నారు.



పోలింగ్ కేంద్రాలను మార్చినట్లు ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేదన్నారు. అసలు మార్చినట్లు ఓటర్లకు కూడా తెలియదని పేర్కొన్నారు. గతంలో పోలింగ్ కేంద్రం 2 కిలోమీటర్ల దూరంలో ఉంటే ఇప్పుడు దానిని నాలుగు కిలోమీటర్లకు మార్చిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మార్పుపై పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాల్సి ఉన్నా ఆ పని చేయలేదని తెలిపారు. ఎన్నికల సంఘం తన నిబంధనలను తానే అమలు చేయలేదన్నారు.

ప్రకటన ఇవ్వలేదు.. గోడకు అతికించాం..

ఏపీ ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, పోలింగ్ కేంద్రాల మార్పు విషయంలో నిబంధనలను అనుసరించినట్లు చెప్పుకొచ్చారు. పత్రికల్లో ప్రకటనలు ఇవ్వలేదని అంగీకరిస్తూనే... పోలింగ్ కేంద్రాల వివరాలను జడ్పీటీసీ కార్యాలయం బయట అతికించి ప్రజల నుంచి అభ్యంతరాలు కోరామన్నారు. ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో పోలింగ్ కేంద్రాలను మార్చామని తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ పత్రికల్లో ప్రకటనలు ఇవ్వనంత మాత్రాన పోలింగ్ కేంద్రాల మార్పు గురించి ఓటర్లకు తెలియదని భావించడానికి వీల్లేదన్నారు. ఓటర్ స్లిప్పుల్లో పోలింగ్ కేంద్రాల వివరాలున్నాయన్నారు. చివరి నిమిషంలో కోర్టుకు వచ్చి ఎన్నికలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని వారోపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. పోలింగ్ కేంద్రాల మార్పుపై దాఖలైన వ్యాజ్యాలను తోసిపుచ్చారు.

ర్యాలీ నిర్వహించిన వారిపై ఎలాంటి చర్యలొద్దు

మరో కేసులో ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి... వారు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా చేసి.. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలో లబ్ధి పొందాలనుకున్న కూటమి సర్కారు కుతంత్రాలను ఏపీ హైకోర్టు అడ్డుకుంది. ప్రభుత్వ దాడులను నిరసిస్తూ పులివెందులలో ర్యాలీ చేపట్టినందుకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపల్లి సతీష్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో పాటు 150 మందిపై పోలీసులు నమోదు చేసిన కేసులో హైకోర్టు సోమవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ర్యాలీ నిర్వహించినందుకు నమోదు చేసిన కేసులో నిందితులుగా ఉన్నవారి విషయంలో తదుపరి విచారణ వరకు ఎలాంటి చర్యలు చేపట్టవద్దని పులివెందుల పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వ దాడులను నిరసిస్తూ ఈ నెల 6న పులివెందులలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో వైఎస్ అవినాష్‌రెడ్డి, సతీష్‌రెడ్డితో పాటు పెద్దఎత్తున నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. అయితే, అనుమతి లేకుండా ర్యాలీ తీసి, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారంటూ ఎంపీడీవో కృష్ణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, సతీష్‌రెడ్డితో పాటు దాదాపు 150 మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసును అడ్డం పెట్టుకుని వీరందరినీ పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నింది. దీంతో తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ గజ్జల గంగ మహేశ్వరరెడ్డి, కంచర్ల వెంకట సర్వోత్తమరెడ్డి, కంచర్ల జనార్దన్‌రెడ్డిలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ వ్యాజ్యంపై సోమవారం జస్టిస్ జ్యోతిర్మయి విచారణ జరిపారు.

రాజకీయ కక్ష సాధింపునకే కేసు నమోదు

పిటిషనర్ల తరఫు న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ, కేవలం రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేశారన్నారు. జడ్పీటీసీ ఉప ఎన్నికలో అధికార పార్టీ అనేక అక్రమాలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 125 కింద పెట్టిన కేసు చెల్లదని తెలిపారు. బీఎన్ఎస్ సెక్షన్ 223 కింద నేరుగా కేసు పెట్టే అధికారం పోలీసులకు లేదని తెలిపారు. మేజిస్ట్రేట్ అనుమతి తీసుకున్న తర్వాతే ఈ సెక్షన్ కింద కేసు నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు. పోలీసుల తరఫున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ పిటిషనర్లపై నమోదు చేసిన కేసులు ఏడేళ్ల కన్నా తక్కువ శిక్ష పడేవేని, వారికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు ఇస్తామన్నారు. అందువల్ల ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయొద్దని కోరారు.

పిటిషనర్ల తరఫు వాదనల్లో బలం ఉంది: న్యాయమూర్తి

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి... సెక్షన్ 223 కింద పోలీసులు నేరుగా కేసు పెట్టడానికి వీల్లేదని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో పిటిషనర్ల తరఫు న్యాయవాది చేసిన వాదనల్లో బలం ఉందన్నారు. జడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో పిటిషనర్లతో పాటు ఇతర నిందితులపై నమోదు చేసిన కేసులో తదుపరి ఎలాంటి చర్యలు చేపట్టవద్దని పోలీసులను ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేశారు.

నిస్సిగ్గుగా టీడీపీ బరితెగింపు

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో చంద్రబాబు కుతంత్రం

ఎన్ని అడ్డదారులు తొక్కినా పరాజయం తప్పదని కుట్రలకు తెరతీసిన వైనం

- పంపిణీ చేసిన స్లిప్పులను బలవంతంగా వెనక్కు తీసుకుంటున్న టీడీపీ నాయకులు
- పంపిణీ కాని వాటిని గంపగుత్తగా స్వాధీనం చేసుకున్న వైనం
- భారీ సంఖ్యలో స్థానికేతర టీడీపీ నేతలు పోలింగ్ కేంద్రాల వద్ద తిష్ట
- ఓటరు స్లిప్పులు ఇచ్చి దొంగ ఓట్లు వేయించుకునే ఎత్తుగడ



పులివెందులలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పోలీసుల హడావుడి

సాక్షి, అమరావతి /సాక్షి ప్రతినిధి, కడప: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో గెలుపు కోసం వైఎస్సార్‌సీపీ నేతలపై హత్యాయత్నాలు, దాడులు, అక్రమ కేసులు బనాయింపు మొదలు.. ఎన్ని అడ్డదారులు తొక్కినప్పటికీ టీడీపీ అభ్యర్థికి ఘోర పరాజయం తప్పదని అంతర్గత సర్వేల్లో స్పష్టమవడంతో పెదబాబు, చినబాబు ఇద్దరూ బరితెగించారు. పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి జెడ్పీటీసీ ఉప ఎన్నికల గండం నుంచి గట్టెక్కేందుకు పథక రచన చేశారు. మంగళవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో సోమవారం కొత్త కుట్రకు తెరతీశారు. ఓటర్లకు ఇప్పటికే అధికారులు పంపిణీ చేసిన ఓటరు స్లిప్పుల్లో తప్పులు ఉన్నాయని అబద్ధం చెబుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తల ద్వారా వాటిని సేకరిస్తున్నారు. ఇవ్వని వారి నుంచి బలవంతంగా లాక్కున్నారు. సోమవారం సాయంత్రం వరకు పంపిణీ చేయని ఓటరు స్లిప్పులను అధికారుల నుంచి గంపగుత్తగా టీడీపీ నాయకులు తీసేసుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు, కమలాపురంతోపాటు.. సరిహద్దు జిల్లాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలను రప్పించి పులివెందుల మండలంలో పోలింగ్ బూత్‌లు ఉన్న గ్రామాల్లో తిష్ట వేయించారు. ఈ ఓటరు స్లిప్పులను కార్యకర్తలకు ఇచ్చి దొంగ ఓట్లు వేయించుకోవడానికి కుట్ర చేస్తున్నారు.

ఏజెంట్లపై దాడి చేసి వెళ్లగొట్టే కుట్ర

సోమవారం ఉదయం పోలింగ్ ప్రారంభమైన వెంటనే పోలింగ్ బూత్ నుంచి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడి చేసి, పోలీసుల ద్వారా వారిని వెళ్లగొట్టేందుకు టీడీపీ నేతలు కుట్ర చేశారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బూత్ నుంచి వెళ్లగొట్టడం ద్వారా తమ అడుగులకు మడుగులొత్తే పోలీసులు, అధికారుల సహకారంతో పోలింగ్ బూత్‌ను పూర్తిగా తమ అధీనంలోకి తీసుకుని యథేచ్ఛగా రిగ్గింగ్ చేసుకోవాలన్నది టీడీపీ నేతల ఎత్తుగడ. ఇతర ప్రాంతాల నుంచి రప్పించిన టీడీపీ శ్రేణులను ప్రతి పోలింగ్ బూత్ వద్ద కనీసం వంద మంది చొప్పున ఇప్పటికే మోహరించారు. పోలింగ్ ప్రారంభం కాక ముందే పోలింగ్ బూత్ వద్ద వారితో యథేచ్ఛగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేయించి, ఉద్రిక్త పరిస్థితులకు దారితీసేలా చేసి.. పోలీసులతో లాఠీఛార్జ్ చేయించి.. పోలింగ్ బూత్‌లను ఆక్రమించుకోవడానికి మరో కుట్ర చేస్తున్నారు. తద్వారా రిగ్గింగ్ చేసుకోవాలన్నది టీడీపీ నేతల ఎత్తుగడ.

అంతులేని అక్రమాలు

- పులివెందుల మండలంలో ఇటు అధికారులు, అటు పోలీసులు అందరూ ఏకమై వైఎస్సార్సీపీపై కుయుక్తులకు పాల్పడుతున్నారు. పులివెందులకు విలన్‌లా మారిన మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు కుట్రలను అమలు చేస్తున్నారు. ఎలాగైనా సరే గెలిచి.. వైఎస్ జగన్ అడ్డాలో పాగా వేశామని చెప్పుకునేందుకు చేయని అరాచకం లేదు. ఇందుకోసం ప్రశాంతంగా ఉన్న పులివెందులను రణరంగంగా మార్చేందుకు సిద్ధమయ్యారు. కూటమి నేతల అరాచకంపై ఎన్నికల కమిషన్‌కు ఎన్నిమార్లు విన్నవించినా స్పందనే లేదు.

'స్త్రీ శక్తి'.. బాబు కుయుక్తి!

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై వంచన

మొత్తం 16 కేటగిరీల్లో కేవలం 5 కేటగిరీల్లోనే వర్తింపు

- ఏసీ సర్వీసులు, నాన్ స్టాప్, అల్ట్రా డీలక్స్, సప్తగిరి బస్సుల్లో ఉచితం హుళక్కే
- ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో 75 శాతం నాన్ స్టాప్ బస్సుల్లో ఉచితం లేదు..
- కేవలం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీకే పథకం పరిమితం
- మహిళలు రాష్ట్రం అంతటా పర్యటించవచ్చని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు
- రాష్ట్రం కాదు కదా.. జిల్లాలోనూ పూర్తిగా ఉచితంగా ప్రయాణించే అవకాశమివ్వని వైనం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

క్లుప్తంగా...

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు నేడు పోలింగ్

- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు
- గురువారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల్లో ఉప ఎన్నికలకు సంబంధించి మంగళవారం పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్యాలెట్ విధానంలో పోలింగ్ నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేసింది. 14వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు చేపడతారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో మొత్తం 661 మండలాలు ఉండగా.. 2021లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమయంలో అప్పుడే వివిధ కారణాలతో 8 చోట్ల ఎన్నికలు నిలిచిపోగా, గెలిచిన వారు మృతి లేదా రాజీనామా కారణాలతో మరో 20 దాకా జెడ్పీటీసీ స్థానాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. అయితే, కోర్టులో కేసుల పేరుతో కేవలం పులివెందుల, ఒంటిమిట్ట స్థానాలకు మాత్రమే రాష్ట్ర ఎన్నికల కమిషన్ జూలై 28న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.


బీసీ రిజర్వేషన్ల సాధనకు కార్యాచరణ: ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తమతో కలిసి వచ్చే వర్గాలను కలుపుకుని త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో యునైటెడ్ పూలే ఫ్రంట్, ఇతర బీసీ సంఘాల నాయకులతో కవిత భేటీ అయ్యారు. 'కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా బీసీలను వంచించాలని చూస్తోంది. రాహుల్ గాంధీ ప్రధాని పీఠంపై కూర్చున్న తర్వాతే బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడం కప్పదాటు చర్య. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చి గద్దెనెక్కిన తర్వాత బీసీలను వంచించాలని చూస్తున్న కాంగ్రెస్ కుయుక్తులను ప్రజల ముందు ఎండగడతాం. పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం అనేది కంటి తుడుపు చర్య మాత్రమే. అఖిలపక్షాన్ని ప్రధాని దగ్గరకు తీసుకెళ్లడంలో సీఎం రేవంత్‌కు ఉన్న ఇబ్బందేంటి?'అని కవిత ప్రశ్నించారు.

సింగరేణిని నాశనంచేసి ఇప్పుడు కల్లబొల్లి కబుర్లా?

ఎమ్మెల్సీ కవితపై ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ మండిపాటు



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సింగరేణి గుర్తింపు సంఘానికి గౌరవాధ్యక్షురాలిగా వ్యవహరించిన ఎమ్మెల్సీ కవిత ఆ సంస్థను దోచుకుని, నాశనం చేసి ఇప్పుడు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ధ్వజమెత్తారు. తన ఇంట్లో వచ్చిన పంచాయతీతో హెచ్ఎంఎస్ సంఘంతో పొత్తు అంటూ ప్రెస్‌మీట్లు పెట్టి ఆమె చెబుతున్న కబుర్లను సింగరేణి కార్మికులు నమ్మే పరిస్థితి లేదని సోమవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. పదేళ్ల పాటు చేసిన అవినీతి కారణంగానే గత ఎన్నికల్లో గుర్తింపు సంఘమైన టీజీబీకేఎస్‌ను సింగరేణి కార్మికులు ఓడించారని గుర్తు చేశారు. మొన్నటివరకు కేసీఆర్, కవితలను తీవ్రంగా విమర్శించిన హెచ్ఎంఎస్ నేత రియాజ్ ఇప్పుడు కార్మికుల గౌరవాన్ని కవిత కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని ఆ ప్రకటనలో జనక్‌ప్రసాద్ మండిపడ్డారు.



విజయ సంకేతం చూపిస్తున్న ధర్మారెడ్డి ప్యానల్

ధర్మారెడ్డి ప్యానల్ విజయం

టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో ధర్మారెడ్డి ప్యానెల్ సభ్యులు భారీ మెజార్టీతో గెలుపొందారు. గచ్చిబౌలిలోని సొసైటీ కార్యాలయంలో ఆదివారం ఎన్నికలు జరిగాయి. ధర్మారెడ్డి, గోపాల్, జంగయ్య, ప్రతాప్‌రెడ్డి ప్యానల్స్ ఈ ఎన్నికల్లో పోటీ చేశాయి. కె.ధర్మారెడ్డి 225 ఓట్లు సాధించగా, బి.సత్యనర్సిన్ రెడ్డి 184 ఓట్లు సాధించారు. కరుణాకర్ 194 ఓట్లు, ఎస్.విశ్వనాథ్ 204 ఓట్లు, గోపాల్ 224 ఓట్లు, సురేష్ పోద్దార్ 186 ఓట్లు, జె.రామచంద్ర 179 ఓట్లు, మహిళా కేటగిరీలో కె.శాంత 205 ఓట్లు, ఎం.రామదేవి 199 ఓట్లు గెలుపొందారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు ఉమ్మడి రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లి రెవెన్యూ పరిధిలోని గచ్చిబౌలి ఇళ్ల స్థలాలు కేటాయించింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలోని స్థలాలు అత్యంత ఖరీదైనవి. దీంతో సొసైటీ ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగానే జరిగాయి. సొసైటీ పరిధిలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు ఉండటం.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఒక్కసారి కూడా మేనేజింగ్ కమిటీ ఎన్నికలు జరగకపోవడంతో.. తాజా ఎన్నికలు తీవ్ర ఉత్కంఠ రేపాయి. ఎట్టకేలకు గత పాలకవర్గంలో పనిచేసిన ప్యానల్‌కు తాజా ఎన్నికలు తీవ్ర నిరాశపరచగా.. కొత్తగా పోటీచేసిన వారే గెలుపొందడం గమనార్హం. మేనేజింగ్ కమిటీలో గెలుపొందిన వారు మూడు రోజుల్లో నూతన కమిటీని ఏర్పాటు చేసుకుని నివేదిక ఇవ్వాలని ఎన్నికల అధికారి మహ్మద్ యూసూఫ్ అలీ స్పష్టం చేశారు.

నిధులివ్వకపోతే ర్యాంకులెలా?

- బోధన సిబ్బంది లేరు..ప్రాజెక్టుల్లేవు
- ప్రైవేటు యూనివర్సిటీలతో పోటీ కష్టమే
- ఎన్ఐఆర్ఎఫ్ వర్క్‌షాప్‌లో వీసీల స్పష్టీకరణ
- సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్న మండలి చైర్మన్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే జాతీయ స్థాయిలో ర్యాంకులు ఎలా సాధిస్తామని రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉప కులపతులు ప్రశ్నించారు. 'వర్సిటీల్లో మౌలిక వసతుల్లేవు..బోధన సిబ్బంది (ఫ్యాకల్టీ) సరిపడా లేరు..ప్రభుత్వం నిధులివ్వడం లేదు. మరోవైపు ప్రాజెక్టులూ రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రైవేటు వర్సిటీలతో పోటీ పడమంటే కుదిరే పనేనా?'అంటూ నిలదీశారు. వీసీలు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ర్యాంకుల కోసం మాత్రం కృషి జరగాల్సిందేనని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి చెప్పారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీలో సోమవారం 'నేషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)'పై వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల నుంచి వీసీలు, డీన్‌లు, డైరెక్టర్లు హాజరయ్యారు. తమ వర్సిటీల పరిధిలో ఉన్న పలు సమస్యలను ప్రస్తావించారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల కోసం ప్రైవేటు వర్సిటీలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని, వాటితో తాము పోటీ పడే పరిస్థితి కన్పించడం లేదని వీసీలు నిస్సహాయత వ్యక్తం చేశారు.

అన్ని వర్సిటీలదీ ఒకటే పరిస్థితి..

'ఒక్కో యూనివర్సిటీలో 74 శాతం వరకు సిబ్బంది ఖాళీలున్నాయి. 2,825 అధ్యాపక పోస్టులు మంజూరైతే, ఉన్న రెగ్యులర్ సిబ్బంది కేవలం 873 మంది మాత్రమే. మిగతా వాళ్ళంతా తాత్కాలిక ఉద్యోగులే. అలాంటప్పుడు బోధనలో జవాబుదారీతనం ఎందుకు ఉంటుంది? ఫ్యాకల్టీ కొరత కారణంగా విద్యా ప్రమాణాలు అడుగంటిపోతున్నాయి. ముఖ్యంగా నిధులు ఇవ్వకపోవడం అన్నిటికీ మూలకారణంగా ఉంది. వందేళ్ళ చరిత్ర ఉన్న ఓయూలో పరిశోధనలు తగ్గిపోయాయి. మరోవైపు పరిశోధన ప్రాజెక్టులూ తగ్గాయి. ప్రభుత్వం 1,267 అధ్యాపక పోస్టులు మంజూరు చేసినా, ఉన్న సిబ్బంది 340 మందే. కాంట్రాక్టు అధ్యాపకులతో కాలం వెళ్ళదీయాల్సి వస్తోంది. జేఎన్‌టీయూహెచ్‌లో 410 అధ్యాపకులుండాలి కానీ 169 మందే ఉన్నారు. దీంతో కీలకమైన ఇంజనీరింగ్ బోధనలో ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. పాలమూరు వర్సిటీకి కేటాయించేదే రూ.10 కోట్లు. ఇచ్చేది రూ.7 కోట్ల లోపే. ఏడు విభాగాలకు 84 పోస్టులు మంజూరైతే 17 పోస్టుల్లోనే అధ్యాపకులున్నారు. తెలంగాణ వర్సిటీకి 152 ప్రొఫెసర్ పోస్టులు మంజూరైనా, ఉన్నది కేవలం 61 మంది మాత్రమే. ఈ వర్సిటీకి పదేళ్ళుగా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. కాకతీయ వర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 97 కోట్లు మాత్రమే వస్తున్నాయి. దీంతో అంతర్గత సమీకరణల ద్వారా రూ. 53 కోట్లు సమకూర్చుకుంటున్నారు. 405 రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులకు గాను 83 మందే ఉన్నారు..'అని ఆయా వర్సిటీల వీసీలు తెలిపారు.

ర్యాంకుల కోసం కృషి జరగాల్సిందే: ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



క్వాలిటీ డేటా మేనేజ్‌మెంట్‌తో ర్యాంకుల కోసం వ్యూహాత్మకంగా ముందుకెళ్ళాలని వీసీలకు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి సూచించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా నిధులు సొంతంగా సమకూర్చుకోవాలని చెప్పారు. జాతీయ ర్యాంకులను అంతర్జాతీయ సంస్థలు ప్రామాణికంగా తీసుకుంటున్నందున నైపుణ్యంతో కూడిన బోధన అందించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, వీసీలు డాక్టర్ డి.రాజిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఖాజా అల్తాఫ్ హుస్సేన్, కిషన్‌కుమార్ రెడ్డి, జీఎన్ శ్రీనివాస్, జ్ఞాన ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్. చిత్రంలో ఆర్.నారాయణమూర్తి తదితరులు

నారాయణ మూర్తి మంచి ప్రయత్నం చేశారు

'యూనివర్సిటీ' సినిమాపై ప్రొఫెసర్ హరగోపాల్

పంజగుట్ట (హైదరాబాద్): సమాజంలో అన్ని రంగాల్లో ప్రయోగాలు చేసేవారు ఉంటారని, అదే కోవలో సినిమా రంగంలో ఆర్.నారాయణ మూర్తి ప్రయోగాలు చెయ్యడంలో ముందుంటారని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆర్.నారాయణ మూర్తి దర్శకత్వంలో వస్తున్న యూనివర్సిటీ - పేపర్ లీక్ సినిమాపై సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ .. విద్యారంగంలో వస్తున్న వక్రీకరణలు, దానివల్ల సమాజంలో జరుగుతున్న మార్పులను నారాయణ మూర్తి సినిమా రూపంలో చక్కగా చూపించే ప్రయత్నం చేశారని అన్నారు. విద్యా పరిరక్షణ కమిటీ తరఫున 40 సంవత్సరాలుగా విద్య.. వ్యాపారం కారాదు అని ఎన్ని పోరాటాలు చేసినా సమాజంలో పెద్ద మార్పు తీసుకురాలేకపోయామని, ఇప్పుడు నారాయణ మూర్తి సినిమా రూపంలో మంచి ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యక్తులు వచ్చి విద్యను వ్యాపారంలా మార్చారని విమర్శించారు. ఎందుకు మనం నాణ్యమైన విద్య ఇవ్వలేకపోతున్నాం, దానిని కార్పొరేట్ శక్తులకు ఎందుకు అప్పచెప్పాం.. అనేది ఈ సినిమాలో చక్కగా చూపించారని తెలిపారు. ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ.. సేవా రంగాలైన విద్య, వైద్యం రెండూ కూడా దేశంలో వ్యాపారంగా మారడం బాధాకరమన్నారు. తల్లిదండ్రుల కలలు సాకారం కావాలంటే ప్రైవేట్ విద్య ఉండకూడదని, తమ సినిమా ఆగస్టు 22న విడుదల అవుతుందని, అందరూ చూసి విజయవంతం చేయాలని కోరారు. ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ.. విద్యారంగంలో వస్తున్న మార్పులపై కళాత్మకంగా సినిమా తీశారని, ఇలాంటి సినిమాలు తియ్యడం ఎంతో సాహసమని అన్నారు. ఇలాంటి సినిమాకు పన్ను మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండా నాగేశ్వర్ రావు, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, పీడీఎస్‌యూ కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏ కమిటీల నియామకంలో అవకతవకలు

- నిబంధనలకు విరుద్ధంగా హెచ్‌సీఏ సీనియర్, జూనియర్ కమిటీ నియామకం
- సీఐడీ అడిషనల్ డీజీకి ఫిర్యాదు చేసిన ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీమ్



ఫహీమ్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో మెన్స్ సెలక్షన్ సీనియర్, జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యుల నియామకం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, పీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఏ ఫహీమ్ ఆరోపించారు. కమిటీల నియామ కంలో జరిగిన అవకతవకలపై దర్యాప్తు చేయాలని సీఐడీ అడిషనల్ డీజీ చారుసిన్హాను ఆమె కార్యాలయంలో కలిసి సోమవారం ఫిర్యాదు చేశారు. హెచ్‌సీఏ సీనియర్, జూనియర్ కమిటీ సభ్యుల ఎంపిక హెచ్‌సీఏ బైలాస్ ప్రకారం జరగలేదని, అర్హత లేని వారికి కమిటీ సభ్యులుగా నియమించారని తెలిపారు. సీనియర్ కమిటీలో సభ్యులుగా ఉండాలంటే కనీసం ఏడు టెస్ట్ మ్యాచ్‌ల్లో ప్లేయర్‌గా ఆడి ఉండాలని, లేదంటే 30 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి ఉండాలని, లేదంటే 10 అంతర్జాతీయ మ్యాచ్‌లు అలాగే 20 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడైనా ఉండాలని పేర్కొన్నారు. ఈ అర్హతలతోపాటు కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యే నాటికి ఐదేళ్ల ముందే రిటైర్ అయి ఉండాలన్నారు. చైర్‌పర్సన్‌గా కూడా సీనియర్ మోస్ట్ కెప్టెన్ ఉన్న వ్యక్తి ఉంటారని, కానీ ఇక్కడ అలా జరగలేదని తెలిపారు. సీనియర్ కమిటీ సభ్యుల్లో గతంలో కేవలం ఎన్‌పీ సింగ్, ఆకాశ్ బండారికి మినహా ప్రస్తుత కమిటీలో చైర్మన్ పి.హరిమోహన్ (ఏడు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు), షేక్ రియాజుద్దీన్ (ఆరు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు), జ్యోతి శెట్టి (ఆరు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు)లకు అర్హత లేదని ఫిర్యాదులో తెలిపారు. అలాగే జూనియర్ కమిటీలో 25 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడటంతోపాటు కమిటీ సభ్యుడిగా ఎన్నిక నాటికి ఐదేళ్ల ముందు ఆట నుంచి రిటైర్మెంట్ తీసుకుని ఉండాలని తెలిపారు. అయితే సుదీప్‌త్యాగి, అరవింద్‌శెట్టి మినహా జూనియర్ కమిటీలో ఉన్న చైర్మన్ హబీబ్ అహ్మద్ (16 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు), అన్వర్ ఖాన్ (19 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు), సందీప్ రాజన్ (మూడు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు)లకు అర్హత లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రేపటితో ముగియనున్న దేవరాజ్ సీఐడీ కస్టడీ

హెచ్‌సీఏ నిధుల గోల్‌మాల్ కేసులో ఏ-2గా ఉన్న హెచ్‌సీఏ సెక్రటరీ దేవరాజ్ రామ్‌చందర్ సీఐడీ కస్టడీ బుధవారంతో ముగియనుంది. కస్టడీలో భాగంగా ఆది, సోమవారాల్లో ఆయన ఇల్లు, హెచ్‌సీఏ ఆఫీసుల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. ఐపీఎల్ నిర్వహణ కోసం స్టేడియంలో మౌలిక వసతులకు సంబంధించిన వివరాలతో దేవరాజ్ స్టేట్‌మెంట్లు రికార్డ్ చేసినట్లు సమాచారం. హెచ్‌సీఏ అధికారిక మెయిల్ నుంచి ఐపీఎల్ నిర్వహణకు టెండర్లు, కాంట్రాక్టులు సహా ఫ్రాంచైజర్స్‌తో అగ్రిమెంట్ల వివరాలు సేకరించినట్లు సమాచారం. అధ్యక్షుడు జగన్ మోహన్‌రావుతో కలిసి బీసీసీఐ గ్రాంట్స్‌ను దారి మళ్లించడంలో దేవరాజ్ కీలకంగా వ్యవహరించినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు.

ఉద్యోగుల ప్రయోజనాల్లో వ్యత్యాసంపై వివరణివ్వండి

రిజర్వు బ్యాంక్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు, ఎస్‌బీఐలో విలీనమైన బ్యాంకుల ఉద్యోగుల మధ్య ప్రయోజనాల్లో వ్యత్యాసంపై వివరణ ఇవ్వాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ను హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసి, విచారణను సెప్టెంబర్ 10కి వాయిదా వేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనీర్, మైసూర్, పాటియాలా, ట్రావెన్‌కోర్ ఎస్‌బీహెచ్ ఉద్యోగులకూ.. ఎస్‌బీఐ ఉద్యోగుల మాదిరిగా ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ ఆలిండియా స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ ఫెడరేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషన్‌ను సింగిల్ జడ్జి కొట్టివేశారు. దీన్ని సవాల్ చేస్తూ ఫెడరేషన్ అప్పీల్ దాఖలు చేసింది. అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మోహియుద్దీన్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఉద్యోగులందరినీ ఒకేలా పరిగణించాల్సి ఉండగా.. సొంత ఉద్యోగులు, విలీనమైన వారికీ ప్రయోజనాల కల్పనలో బ్యాంక్ వ్యత్యాసం చూపిస్తోందని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది శ్రీపాద ప్రభాకర్ వాదించారు. ఇది విధానపరమైన నిర్ణయమని, కోర్టులు జోక్యం చేసుకోలేవని, ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు వెల్లడించిందని ఎస్‌బీఐ తరఫు సీనియర్ న్యాయవాది బీఎస్ ప్రసాద్ వాదించారు. విలీన బ్యాంకుల నుంచి 70 వేల మంది ఉద్యోగులు, 25 వేల మంది అధికారులు ఎస్‌బీఐలో చేరారని, కొందరికి మాత్రమే అభ్యంతరాలున్నాయన్నారు. ఫెడరేషన్ తరఫున ప్రధాన కార్యదర్శి కాకుండా ఉపాధ్యక్షుడు పిటిషన్ వేయడం చెల్లదని వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఆర్‌బీఐ వివరణ కోసం నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 12-8-2025



నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

యువ

వీరు సామాన్యులు కారు.
నెత్తురు మండే, శక్తులు నిండే
యువ సైనికులు.
రానీ, రానీ వస్తే రానీ కష్టాల్,
నష్టాల్ అంటూ లక్ష్యం వైపు
దూసుకెళ్లి విజయకేతనం
ఎగరేసిన ధీర యువత.
ఒకటి కాదు రెండు కాదు
ఎన్నో రంగాలలో 'నంబర్‌వన్'గా
అంతర్జాతీయ స్థాయిలో
సత్తా చాటుతున్నారు
ఈ యువ మహిళలు...

ఆరోగ్యం

ఆరోగ్యం... మన దేశంలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో రుతుస్రావ కాలంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎన్నో ఉన్నాయి. పేదరికం వల్ల ఎంతోమంది రుతుక్రమ పరిశుభ్రత (మెనుస్ట్రువల్ హైజీన్)కు సంబంధించిన సౌకర్యాలకు దూరం అవుతున్నారు. సౌకర్యాల లేమీ వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని **సౌమ్య డబ్రీవాల్, ఆరాధన రాయ్ గుప్తా** సోషల్ ఎంటర్‌ప్రైజ్ ప్రాజెక్ట్ 'బాల'కు శ్రీకారం చుట్టారు. 'బాల' ద్వారా పేదింటి మహిళలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన మెనుస్ట్రువల్ ప్రాడక్ట్స్‌ను అందిస్తున్నారు. మన దేశంలోని 28 రాష్ట్రాలతో పాటు నేపాల్, ఘనా, టాంజానియా దేశాలలో 'బాల' ఉత్పత్తులను అమ్ముతున్నారు. యూనివర్శిటీ ఆఫ్ వార్‌విక్‌లో ఎకనామిక్స్‌లో డిగ్రీ చేస్తున్న రోజుల్లో సౌమ్యకు 'బాల' ఆలోచన వచ్చింది. తన చిన్ననాటి స్నేహితురాలు, కార్నెల్ యూనివర్శిటీలో ఎంబీఏ చేస్తున్న ఆరాధనా రాయ్ గుప్తాతో కలిసి తన ఆలోచనను పట్టాలకెక్కించి విజయం సాధించింది

సాంకేతికం

సాంకేతికం... టెక్ ప్రాడక్ట్స్‌కు సంబంధించి డిజైనింగ్, విజువలైజేషన్‌లో చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకున్న **సిమౌల్ ఆల్వా** ఫైనాన్షియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ బ్లాక్‌చైన్ టెక్నాలజీ కంపెనీ 'రిపుల్'లో విజువల్ డిజైన్ టీమ్‌కు నాయకత్వం వహిస్తోంది. సినిమాలు చూస్తూ, పుస్తకాలు చదువుతూ పెరిగిన ఆల్వాకు ఊహలకు ఉండే శక్తి ఏమిటో అనుభవంలోకి వచ్చింది. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్' స్టూడెంట్‌గా అబుదాబీలో జరిగిన 'వరల్డ్‌స్కిల్స్ కాంపిటీషన్'లో మన దేశం నుంచి ప్రాతినిధ్యం వహించింది. ప్యాకేజింగ్ డిజైన్, ఎడిటోరియల్, విజువల్ ఐడెంటిటీకి సంబంధించి ముప్పై దేశాలకు చెందిన విద్యార్థులతో పోటీపడి ఆల్వా విజేతగా నిలిచింది. న్యూయార్క్‌లోని ప్రసిద్ధ క్రియేటివ్ ఏజెన్సీ 'అండ్ వాల్ష్'లో క్రియేటివ్ డైరెక్టర్ జెసికా వాల్ష్ బృందంతో పనిచేసే అవకాశం ఆల్వాకు వచ్చింది. 'అండ్ వాల్ష్'లో పర్యావరణహిత సంస్థ 'గెల్టర్'కు సంబంధించిన ప్రాజెక్ట్‌ను లీడ్ చేసింది. ఈ ప్రాజెక్ట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. అమెజాన్, యాపిల్, ఆడోబ్‌లాంటి దిగ్గజ సాంకేతిక సంస్థల ప్రాజెక్ట్‌లు చేసింది. 'ఎలాంటి పరిమితులు లేకుండా విశాల దృష్టితో ఆలోచిస్తూ ప్రాజెక్ట్‌లను విజయవంతం చేస్తోంది. అంకితభావానికి సృజనాత్మకత తోడైతే వచ్చే శక్తి ఏమిటో ఆమె పని విధానంలో కనిపిస్తుంది' అని ఆల్వాను ప్రశంసించారు 'అండ్ వాల్ష్' ఫౌండర్, క్రియేటివ్ డైరెక్టర్ జెస్సిక వాల్ష్.

సామాజికం

సామాజికం... 'కంటెంట్ క్రియేటర్' అంటే కాలక్షేప కంటెంట్ క్రియేటర్‌లు మాత్రమే కాదని నిరూపించింది **కావ్య కర్నాటక్.** ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతున్న ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆరోగ్య, నీటి, పారిశుధ్య సమస్యలను వెలుగులోకి తీసుకువస్తోంది. తన యూట్యూబ్ చానల్ 'కేకే క్రియేట్' ద్వారా సంప్రదాయ మార్గాన్ని తోసిరాజని 'ఇలా కూడా కంటెంట్ క్రియేట్ చేయవచ్చు (అని నిరూపించింది కావ్య. ఎన్నో సామాజిక సమస్యలపై ఇన్వెస్టిగేటివ్ స్టోరీలు చేసింది. ఆమె చానల్‌కు రెండు మిలియన్‌ల సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. ఉత్తరాఖండ్‌లోని నైనితాల్‌కు చెందిన కావ్య కర్నాటక్ 'టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్'లో మీడియా అండ్ కల్చర్ స్టడీస్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. అక్కడ చదువుతున్న రోజుల్లోనే ముంబై ఆరే ఫారెస్ట్, ఆదివాసీ తెగలపై డాక్యుమెంటరీ తీసింది. కావ్య, ఆమె బృందం కెమెరాలతో ఢిల్లీలోని ఘాజీపూర్‌లో అతిపెద్ద చెత్తడంప్‌ను చిత్రీకరిస్తున్నప్పుడు వారిపై దాడి జరిగింది. ఇలాంటి దాడులు ఎన్నో జరిగినా కావ్య వెనక్కి తగ్గలేదు. అదే ఆమె బలం.





అందం

అందం... 'శాంతి బనారస్' బ్రాండ్‌తో ప్రపంచ దృష్టిని ఆకర్షించింది **ఖుషీ షా.** బనారస్ (వారణాసి)లో పుట్టి పెరిగిన ఖుషీకి నేత ప్రపంచం గురించి తెలియని విషయం అంటూ లేదు. 'చిన్న వయసులోనే మార్కెటింగ్ పల్స్ పట్టుకున్నాను' అని నవ్వుతూ చెప్పే ఖుషీ న్యూయార్క్‌లోని ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎఫ్ఐటీ)లో చదువుకుంది. గ్లోబల్ మార్కెట్, టెక్స్‌టైల్‌కు సంబంధించి సాంకేతిక విషయాలను లోతుగా అర్థం చేసుకోవడానికి ఆ చదువు ఖుషీకి ఉపయోగపడింది. 'శాంతి బనారస్' కాన్సెప్చువలైజేషన్, బ్రాండ్ ఐడెంటిటీ డెవలప్‌మెంట్, మార్కెటింగ్‌లలో ఖుషీ కీలక పాత్ర పోషించింది. సంప్రదాయ బనారస్ చీరలకు భిన్నంగా తమ బ్రాండ్‌ను తీర్చిదిద్దింది. 'రియల్ జరీ' కాన్సెప్ట్‌తో 'శాంతి బనారస్' బ్రాండ్‌ను విజయవంతం చేసింది. చీరె కొన్నవారికి 'అథెంటిసిటీ సర్టిఫికెట్' ఇచ్చే విధానానికి రూపకల్పన చేసింది.

ఆత్మవిశ్వాసం

ఆత్మవిశ్వాసం... ఆ పోటీకి ముందు **ప్రీతి పాల్** మనసు కల్లోల సముద్రంలా ఉంది. భయంగా ఉంది. ఆ ఉద్రిక్త సమయంలో కోచ్ మాటలను గుర్తు తెచ్చుకుంది. 'పోటీలో నువ్వు కొత్తగా ఏమీ చేయబోవడం లేదు. ట్రెనింగ్‌లో చేసినదాన్ని అక్కడ రిపీట్ చేస్తున్నావు. అంతే'... అప్పుడు ప్రీతికి ఎంతో ధైర్యం వచ్చింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హషిమ్‌పూర్‌కు చెందిన ప్రీతి పాల్ గత ఏడాది ప్యారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో చరిత్ర సృష్టించింది. మహిళల 100, 200-మీటర్ల రేస్ ఈవెంట్‌లో రెండు కాంస్య పతకాలు గెలుచుకుంది. పారాలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారతీయ మహిళగా రికార్డ్ సృష్టించింది. చిన్న వయసులోనే సెరిబ్రల్ పాల్సీకి గురైంది ప్రీతి. పారా అథ్లెట్ ఫాతిమా ఖాతూన్‌ను కలుసుకోవడంతో ప్రీతి జీవితం కొత్త మలుపు తీసుకుంది. ప్రీతి నోటి నుంచి వచ్చిన 'రన్నింగ్ రేస్' అనే మాట విని కుటుంబ సభ్యులు ప్రోత్సహించారు. సైన్యంలో పనిచేసే గజేంద్రసింగ్ ప్రీతికి కోచ్‌గా మారాడు. శిక్షణ ఇవ్వడానికి ముందు ఒక షరతు పెట్టాడు. 'ఈ ఒక్కరోజు ట్రెనింగ్ వద్దు అని ఏ ఒక్కరోజు నీ నోటి నుంచి మాట వినబడినా ఇక ఎప్పుడూ శిక్షణ ఇవ్వను' అయితే ప్రీతి పాల్ నోటి నుంచి 'సాధన' అనే మాట తప్ప 'విశ్రాంతి' అనే మాట ఎప్పుడూ వినిపించలేదు. అదే ఆమె విజయరహస్యం.



వినోదం

వినోదం... 'హాస్యాన్ని సీరియస్‌గా తీసుకోండి. నవ్వితే వ్యాయామం చేసినట్లే' అంటున్న **కరిష్మ గంగ్వాల్** కామెడీ కంటెంట్ క్రియేటర్‌గా డిజిటల్ ప్రపంచంలో వేలాది మంది అభిమానులను సంపాదించుకుంది. 'ఆర్‌జే కరిష్మ'గా పాపులర్ అయిన కరిష్మ కామెడీకి ముడిసరుకు... రోజూ తాను చూసే వ్యక్తులు, తొంభైల నాటి టీవీ సీరియల్ క్యారెక్టర్లు. చుట్టూ ఉన్న నలుగురిని నవ్వించడం కరిష్మాకు కొత్త కాకపోయినప్పటికీ ఎంటర్‌టైన్‌మెంట్, కామెడీ తన కెరీర్ అవుతుందని ఎప్పుడూ అనుకోలేదు. డిగ్రీ పూర్తయిన తరువాత రేడియోలో ప్రోగ్రామ్స్ చేసిన కరిష్మ కోవిడ్ కాలంలో సోషల్ మీడియాలోకి అడుగుపెట్టి కామెడీ కంటెంట్ క్రియేటర్‌గా మారింది. తొలిసారిగా ఒక వినోదాత్మకమైన వీడియో చేసి తన చెల్లికి చూపించింది. అత్తా-కోడళ్ల హాస్యంపై చేసిన ఆ వీడియోను చూసిన కరిష్మ చెల్లెలు నాన్‌స్టాప్‌గా నవ్వింది. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఆ వీడియోకు మూడు రోజుల వ్యవధిలోనే 1.3 మిలియన్‌లు వ్యూస్ వచ్చాయి. 'కామెడీ కంటెంట్ కోసం ఎక్కడికో వెళ్లనక్కర్లేదు. మన ఇంట్లోనే ఎంతో కంటెంట్ దొరుకుతుంది. వీధిలో అలా నడుచుకుంటూ వెళ్లినప్పుడు వినిపించే మాటల నుంచి కూడా కంటెంట్ పుడుతుంది' అంటున్న ఆర్జే కరిష్మాకు ఇన్‌స్టాగ్రామ్‌లో 6.4 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. స్ప్రైట్, డీటీడీసీ, అమెజాన్ డాట్‌లాంటి ప్రసిద్ధ బ్రాండ్‌లతో కలిసి పనిచేస్తోన్న కరిష్మ గంగ్వాల్ 'ఫోర్బ్స్ ఆసియా 30 అండర్ 30' జాబితాలో చోటు సాధించింది.

బులియన్ (బంగారం 10 గ్రా.। వెండి కిలో) ఆగస్ట్ 11న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,00,850	బంగారం (24 క్యారెట్లు)	1,03,500	బంగారం (24 క్యారెట్లు)	1,02,280	బంగారం (24 క్యారెట్లు)	1,03,500	బంగారం (24 క్యారెట్లు)	1,00,700	బంగారం (24 క్యారెట్లు)	1,02,270
బంగారం (22 క్యారెట్లు)	93,350	బంగారం (22 క్యారెట్లు)	93,750	బంగారం (22 క్యారెట్లు)	93,750	బంగారం (22 క్యారెట్లు)	96,560	బంగారం (22 క్యారెట్లు)	92,640	బంగారం (22 క్యారెట్లు)	93,750
వెండి	1,17,500	వెండి	1,17,500	వెండి	1,27,000	వెండి	1,17,500	వెండి	1,17,100	వెండి	1,27,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి
మఖ కార్తె: ఆగస్టు 17 నుంచి



వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో యాంటీమైక్రోబియల్ ఔషధాల వాడకంలో అపసవ్య ధోరణులను అరికట్టాల్సిన తరుణం ఇది. పాలు, మాంసం కోసం పశువులు, కోళ్ల పెంపకంలో.. రొయ్యలు, చేపల సాగులో లేదా ప్రాసెసింగ్ ప్రక్రియల్లో వాడేటప్పుడు జాగరూకతతో వ్యవహరించాలని ప్రభుత్వం నిర్దేశిస్తోంది. పాలు, మాంసం, గుడ్లు, తేనె ఉత్పత్తి క్రమంలో, ఆక్వా సాగులో, ప్రాసెసింగ్‌లో ఏ దశలోనూ 34 యాంటీబయాటిక్స్‌ను వాడొద్దని భారతీయ ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిర్దేశిస్తోంది. యూరోపియన్ యూనియన్ ప్రమాణాలకు అనుగుణంగా మరో 15 యాంటీబయాటిక్స్ వాడకాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిషేధించింది. ప్రజల శ్రేయస్సు, ఎగుమతులను పెంపొందించుకోవటంతో పాటు మన దేశంలో వ్యవసాయంపై ఆధారపడిన సగానికిపైగా జనాభా జీవనోపాధులను సంరక్షించడంలోనూ యాంటీబయాటిక్స్ వాడకంపై సదవగాహన కీలక పాత్ర పోషిస్తుంది. ఇంతకీ ఏయే యాంటీబయాటిక్ ఔషధాలపై దశలవారీగా నిషేధం విధించారో తెలుసా? చదవండి..

ఈ యాంటీబయాటిక్స్‌తో జాగ్రత్త!



సూక్ష్మక్రిములు సోకినప్పుడు చేసే వైద్య చికిత్సల్లో వాడే శక్తివంతమైన ఔషధాలే యాంటీబయాటిక్స్. ఇవి రెండు వైపులా పదును ఉన్న వజ్రాయుధాల్లాంటివి. వీటిని రూపొందించటం మానవాళి సాధించిన అద్భుతమైన విజయాలలో ఒకటి. సూక్ష్మక్రిములు సోకినప్పుడు వచ్చే ఇన్ఫెక్షన్లకు చికిత్స చేయడానికి ఉపయోగించే యాంటీబయాటిక్స్ వంటి యాంటీమైక్రోబియల్ మందులు మనుషులకు, జంతువులకు మెరుగైన జీవన పరిస్థితులకు మార్గం సుగమం చేశాయి.

యంటీమైక్రోబియల్ ఔషధాలు మనుషులు, జంతువులు ఎక్కువ కాలం, ఆరోగ్యకరమైన జీవనాన్ని గడపడానికి సహాయపడతాయి. అంటువ్యాధులను నివారించడానికి, నియంత్రించడానికి, చికిత్స చేయటానికి ఎంతగానో ఉపయోగపడతాయి. సూక్ష్మక్రిములు (బ్యాక్టీరియా, వైరస్, శిలీంధ్రాలు, సూక్ష్మ పరాన్న జీవులు) నిరోధకతను సంతరించుకోవటంతో ఈ ప్రాణాలను రక్షించే అనేక మందులు వాటి సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. దీన్నే 'యాంటీమైక్రోబియల్ నిరోధకత' లేక ఏఎంఆర్ అని పిలుస్తారు. మనుషులు, జంతువుల శ్రేయస్సుకు 'యాంటీమైక్రోబియల్ నిరోధకత' ముప్పు పెరుగుతోంది. ఈ ముప్పు మన కాలంలోని అతిపెద్ద ప్రపంచ ఆరోగ్య సవాళ్లలో ఒకటిగా మారింది. ప్రపంచవ్యాప్తంగా జంతువులు, మానవ ఆరోగ్యానికి.. అలాగే ప్రపంచవ్యాప్తంగా జీవనోపాధికి, ఆహార భద్రతకు ఏఎంఆర్ ముప్పు పెరుగుతోంది..

అయితే, శుభవార్త ఏమిటంటే.. ఔషధ-నిరోధక సూక్ష్మక్రిముల ఆవిర్భావాన్ని అరికట్టడానికి పరిష్కారాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ- పశువులను, కోళ్లను, రొయ్యలు, చేపలను పెంచే రైతులు, పశువైద్యులు, ఆరోగ్య సంరక్షణ కార్మికులు, అన్ని దేశాల పౌరులు- ప్రపంచ ఆరోగ్యానికి ముప్పుగా మారిన ఏఎంఆర్‌ను ఎదుర్కోవడానికి తమ స్థాయిలో పాటుపడటానికి అవకాశం ఉంది.

మనుషులకు వాడేందుకు ప్రత్యేకించిన యాంటీబయాటిక్ ఔషధాలను ఇతరత్రా ఉపయోగాలకు అంటే పశుపోషణలో, ఆక్వా సాగులో ఉపయోగించరాదని అంతర్జాతీయ ప్రమాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఏఎంఆర్ ముప్పును తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పాల ఉత్పత్తులు, మాంసం, గుడ్లు, రొయ్యలలో ఫలానా యాంటీమైక్రోబియల్/యాంటీబయాటిక్ ఔషధాల అవశేషాలు ఉండకూడదు అని అనేక దేశాలు పట్టుబడుతున్నాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్ తదితర దేశాలు కట్టుదిట్టమైన నియంత్రణ చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాణాలకు అనుగుణంగా లేని కంటెయినర్లను వెనక్కి తిప్పి పంపుతున్నాయి కూడా.

భారతీయ ఆహారోత్పత్తుల దిగుమతిపై అమెరికా సరికొత్త అపరాధ సుంకాలు విధించిన నేపథ్యంలో ఇతర దేశాల్లో కొత్త మార్కెట్లు వెతుక్కోవలసిన పరిస్థితి మన దేశానికి ఇంతకుముందెన్నడూ లేనంతగా ఇప్పుడొచ్చింది.

ఈ నేపథ్యంలో మీ దేశం నుంచి ఆహారోత్పత్తులు దిగుమతి చేసుకోవాలంటే మనుషుల కోసం రిజర్వు చేసిన 18 రకాల యాంటీబయాటిక్ ఔషధాలను జంతువులు, కోళ్లు, రొయ్యల సాగులో పెరుగుదల కోసం గానీ, చికిత్సల కోసం గానీ వాడకూడదన్నది యూరోపియన్ యూనియన్ పెట్టిన షరతు. దీంతో భారత ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంది. కేంద్రీయ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ పరిధిలోని డ్రగ్స్ టెక్నికల్ అడ్వయిజరీ బోర్డు (డిటీఏబీ) 92వ సమావేశంలో మనుషుల చికిత్స కోసం యూరోపియన్ యూనియన్ రిజర్వు చేసిన 37 యాంటీమైక్రోబియల్ ఔషధాలపై చర్చించి, వీటిలో 34 యాంటీమైక్రోబియల్ ఔషధాలను నిషేధించింది. మన దేశంలో వీటి తయారీ, దిగుమతి, అమ్మకం, పంపిణీ, వినియోగాన్ని నిషేధిస్తూ డీటీఏబీ నిర్ణయం తీసుకుంది.

యూరోపియన్ యూనియన్ దేశాలు సూచించిన విధంగా మరో పదిహేను రకాలను యాంటీబయాటిక్స్ వాడకాన్ని నిషేధిస్తూ ఇటీవలే భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. గతంలో నిషేధించిన వాటితో కలుపుకుంటే ఇప్పటికి మొత్తంగా నిషేధానికి గురైన యాంటీమైక్రోబియల్ మందుల జాబితా (ఈ కథనంలోని పట్టికల్లో పేర్కొన్న విధంగా) చాలానే ఉంది. ఈ నిషిద్ధ మందుల జోలికి పోకుండా ఉంటేనే మన ఆహారోత్పత్తులను విదేశాలకు ఎగుమతి చెయ్యగలుగుతాం.

యూరోపియన్ యూనియన్ మనుషుల చికిత్స కోసం రిజర్వు చేసిన యాంటీబయాటిక్స్?	పశుపోషణ, రొయ్యల సాగులో కేంద్ర ఆరోగ్య శాఖ నిషేధించిన ఔషధాలు (2025):
1. కార్బాక్సి పెనిసిలిన్లు	1. నిషేధం లేదు
2. యూరిడో పెనిసిలిన్లు	2. నిషిద్ధం
3. సెఫ్టోబిప్రోల్	3. నిషిద్ధం
4. సెఫ్టరోలిన్	4. నిషిద్ధం
5. బీటా-లాక్టమాస్ ఇన్హిబిటర్లతో సెఫలోస్పోరిన్ల కాంబినేషన్లు	5. నిషేధం లేదు
6. సైడెరోఫోర్ సెఫలోస్పోరిన్స్	6. నిషిద్ధం
7. కార్బపెనెమ్‌లు	7. నిషిద్ధం
8. పెనెమ్‌లు	8. నిషిద్ధం
9. మోనోబాక్టమ్స్	9. నిషిద్ధం
10. ఫాస్ఫోనిక్ ఆసిడ్ డెరివేటివ్‌లు	10. నిషేధం లేదు
11. గ్లైకోపెప్టైడ్స్	11. నిషిద్ధం
12. లిపోపెప్టైడ్స్	12. నిషిద్ధం
13. ఆక్సాజోలిడినోన్స్	13. నిషిద్ధం
14. ఫిడాక్సోమైసిన్	14. నిషిద్ధం
15. ప్లాజోమైసిన్	15. నిషిద్ధం
16. గ్లైసిల్సైక్లిన్లు	16. నిషిద్ధం
17. ఎరావాసైక్లిన్	17. నిషిద్ధం
18. ఒమాడాసైక్లిన్	18. నిషిద్ధం

పశువులు, కోళ్లు, రొయ్యల సాగులో నిషిద్ధ యాంటీబయాటిక్స్ ఇవీ..

భారత ఆహార భద్రత-ప్రమాణాల అథారిటీ- ఎఫ్ఎస్ఎస్ఏఐ (2024) నిషేధించినవి:

- **ఏ రంగాలు?:** మాంసం కోసం పశువుల పెంపకం, మాంసం ఉత్పత్తుల తయారీ, పాడి పశువుల పెంపకం, పాల ఉత్పత్తుల తయారీ, కోళ్ల పెంపకం, ఆక్వా సాగు, ఆక్వా ఉత్పత్తుల తయారీ రంగంలో వాడకం నిషిద్ధం.
- **యాంటీబయాటిక్స్- 3 తరగతులు:** గ్లైకోపెప్టయిడ్స్, నైట్రోఫ్యూరాన్లు/ దాని మెటాబోలైట్లు, ఫ్యూరజోలిడోన్ (ఎవోజడ్), నైట్రోఫ్యూరాజోన్ (ఎస్ఇఎం), ఫ్యూరల్టాడోన్ (ఎఎంఓజెడ్), నైట్రోఫ్యూరాంటోయిన్ (ఎహెచ్‌డీ), నైట్రోమిడాజోల్స్.. వీటితో సహా- (ఎ) డైమెట్రిడాజోల్, (బి) రోనిడాజోల్, దాని మెటాబోలైట్ 2- హైడ్రాక్సీమీథైల్-1, -మిథైల్-3, నైట్రోమిడాజోల్(సి), ఇప్రోనిడాజోల్, దాని మెటాబోలైట్, హైడ్రాక్సీప్రోనిడాజోల్ (డి), మిట్రోనిడాజోల్, దాని మెటాబోలైట్ 3, హైడ్రాక్సీమెట్రోనిడాజోల్.
- **యాంటీబయాటిక్స్- 5 రకాలు:** కార్బడాక్స్, క్లోరంఫెనికాల్, కోలిస్టిన్ స్ట్రెప్టోమైసిన్ (దీని మెటబొలైట్ డిహైడ్రో స్ట్రెప్టోమైసిన్ సహా), సల్ఫామెథోగ్సాజోల్.

కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నిషేధించినవి (2019, 2025):

- **ఏ రంగాలు?:** పశువుల పెంపకం, కోళ్ల పెంపకం, ఆహారం కోసం పెంచే ఇతర పక్షుల పెంపకంలో వాడకం నిషిద్ధం.
- **యాంటీబయాటిక్స్- 9 తరగతులు:** యూరిడోపెనిసిలిన్స్, సైడెరోఫోర్, సెఫలోస్పోరిన్స్, కార్బపెనెమ్స్, పెనెమ్స్, మోనోబాక్టమ్స్, గ్లైకోపెప్టయిడ్స్, లిపోపెప్టయిడ్స్, ఆక్సాజోలిడినోన్స్, గ్లైసిల్‌సైక్లిన్స్.
- **యాంటీబయాటిక్స్- 9 రకాలు:** తొమ్మిది యాంటీబయాటిక్స్ వాడకంపై 2019 నుంచి నిషేధం ఉంది. ఆహారం కోసం పెంచే జంతువుల పెంపకంలో, కోళ్ల పెంపకంలో, ఆక్వా సాగులో, పశుగ్రాస సప్లిమెంట్లలో వాడటం నిషిద్ధం. కొలిస్టిన్ వాడటంపై 2025 మార్చి నుంచి నిషేధం ఉంది. ఆహార ఉత్పత్తి కోసం పెంచే ఏ జంతువుల పెంపకంలోనూ దీన్ని వాడకూడదు. సెఫ్టోబిప్రోల్, సెఫ్టరోలిన్, ఫిడాక్సోమైసిన్, ప్లాజోమైసిన్, ఎరావాసైక్లిన్, ఓమాడాసైక్లిన్, నైట్రోఫ్యూరాన్, క్లోరాంఫెనికాల్‌లను జంతువుల పెంపకంలో వాడకంపై 2025 మే నుంచి నిషేధం ఉంది.

కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ నిషేధించినవి (2024):

- **ఏ రంగం?:** తీరప్రాంత ఆక్వా సాగులో నిషిద్ధం.
- **యాంటీబయాటిక్స్- 5 తరగతులు:** నైట్రోఫ్యూరాన్లు.. వీటితో సహా : ఫ్యూరాల్టాడోన్, ఫ్యూరాజోలిడోన్, ఫ్యూరిల్‌ఫ్యూరమైడ్, నిఫుర్‌ప్రజైన్, నైట్రోఫ్యూరాంటోయిన్, నైట్రోఫ్యూరాజోన్, డైమెట్రిడాజోల్, మెట్రోనిడాజోల్, రోనిడాజోల్, ఇప్రోనిడాజోల్ తదితర నైట్రోమిడాజోల్స్. సల్ఫోనామైడ్ మందులు (ఆమోదించబడిన సల్ఫాడిమెథాక్సిన్, సల్ఫాబ్రోమోమెథాజిన్, సల్ఫేథాక్సిపైరిడాజిన్ తప్ప), ఫ్లూరోక్వినోలోన్స్, గ్లైకోపెప్టయిడ్స్.
- **యాంటీబయాటిక్స్- 5 రకాలు:** క్లోరాంఫెనికాల్, నియోమైసిన్, నలిడిక్సిక్ ఆసిడ్, సల్ఫామెథోక్సాజోల్, డాప్సోన్.

వాణిజ్య శాఖ నిషేధించినవి (2025):

- **రంగం:** రొయ్యల సాగులో నిషిద్ధం.
- **యాంటీబయాటిక్స్-12 తరగతులు:** కార్బోక్సిపెనిసిల్లిన్స్, యురీడోపెనిసిల్లిన్స్, సెఫలోస్పోరిన్స్ కాంబినేషన్లు బీటాతో- లాక్టామసె ఇన్హిబిటర్స్, సెడెరోఫోర్, సెఫలోస్పోరిన్స్, కార్బపెనెమ్స్, పెనెమ్స్, మోనోబాక్టమ్స్, గ్లైకోపెప్టయిడ్స్, లిపోపెప్టయిడ్స్, ఆక్సాజోలిడినోన్స్, గ్లైసిల్‌సైక్లిన్స్, ఫాస్ఫోనిక్ ఆసిడ్ డెరివేటివ్‌లు.
- **యాంటీబయాటిక్స్- 6 రకాలు:** సెఫ్టోబిప్రోల్, సెఫ్టారోలిన్, ఫిడాక్సోమైసిన్, ప్లాజోమైసిన్, ఎరవాసైక్లిన్, ఒమడాసైక్లిన్.



క్వార్టర్ ఫైనల్లో సౌరవ్ కొఠారి

చెంగ్డూ (చైనా): వరల్డ్ గేమ్స్ పురుషుల స్నూకర్ ఈవెంట్‌లో భారత స్టార్ సౌరవ్ కొఠారి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గ్రూప్ 'సి'లో భాగంగా సోమవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో సౌరవ్ 33-65, 61-34, 59-68తో డారిల్ హిల్ (బ్రిటన్) చేతిలో ఓడిపోయాడు. ఆదివారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో సౌరవ్ 91-59, 59-16తో జాక్ కాస్కర్ (బ్రిటన్)పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో జాక్ కాస్కర్ 74-25, 80-45తో డారిల్ హిల్‌ను ఓడించాడు. దాంతో గ్రూప్ 'సి'లో ఈ ముగ్గురూ తలో విజయంతో సమంగా నిలిచారు. అయితే గెలిచిన ఫ్రేమ్‌ల సంఖ్య ఆధారంగా సౌరవ్ కొఠారి, జాక్ కాస్కర్ క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకోగా... డారిల్ హిల్ నిష్క్రమించాడు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో జియో గువోడాంగ్ (చైనా)తో సౌరవ్ తలపడతాడు. హెబాల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత్‌కే చెందిన శివమ్ అరోరా క్వార్టర్ ఫైనల్ చేరాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో శివమ్ 5-1తో కెవిన్ జెరెకాని (స్వీడన్)పై గెలుపొందాడు.



రితిక 'పసిడి' పంచ్

బ్యాంకాక్: ఆసియా అండర్-22 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌ను భారత్ స్వర్ణ పతకంతో ముగించింది. చివరిరోజు సోమవారం భారత్‌కు ఒక స్వర్ణం, నాలుగు రజతాలు లభించాయి. మహిళల ప్లస్ 80 కేజీల విభాగంలో రితిక భారత్‌కు పసిడి పతకాన్ని అందించింది. ఫైనల్లో రితిక 4:1తో అసెల్ తొక్తాసియన్ (కజకిస్తాన్)పై గెలిచింది. ఫైనల్స్‌లో ఓడిన యాత్రి పటేల్ (57 కేజీలు), ప్రియ (60 కేజీలు) రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. పురుషుల విభాగంలో నీరజ్ (75 కేజీలు), ఇషాన్ కటారియా (ప్లస్ 90 కేజీలు) కూడా రజత పతకాలు సాధించారు. ఫైనల్స్‌లో బొల్తాయెవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో నీరజ్... ఖలిమ్‌జన్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఇషాన్ ఓడిపోయారు.

అర్జున్-ప్రణవ్ గేమ్ 'డ్రా'



చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీ మాస్టర్స్ కేటగిరీలో ప్రపంచ ఐదో ర్యాంకర్, భారత గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ రెండో 'డ్రా' నమోదు చేశాడు. భారత్‌కే చెందిన మరో గ్రాండ్ మాస్టర్ ప్రణవ్‌తో సోమవారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌ను అర్జున్ 78 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. మరో గేమ్‌లో జోర్డెన్ వాన్ ఫోరీస్ట్ (నెదర్లాండ్స్) 82 ఎత్తుల్లో రే రాబ్సన్ (అమెరికా)ను ఓడించాడు. కార్తికేయన్ మురళీ (భారత్)-అనీశ్ గిరి (నెదర్లాండ్స్) గేమ్ 73 ఎత్తుల్లో... విన్సెంట్ కీమెర్ (జర్మనీ)-విదిత్ (భారత్) గేమ్ 40 ఎత్తుల్లో... నిహాల్ సరీన్ (భారత్)-అవండర్ లియాంగ్ (అమెరికా) గేమ్ 29 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. ఐదో రౌండ్ తర్వాత కీమెర్ నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... మూడు పాయింట్లతో అర్జున్ రెండో స్థానంలో ఉన్నాడు.

బోధన సంచలనం

గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించిన అతిపిన్న వయస్కురాలిగా రికార్డు





లండన్: అంతర్జాతీయ చెస్‌లో ఇంగ్లండ్‌కు చెందిన పదేళ్ల బోధన శివనందన్ సంచలనం సృష్టించింది. గ్రాండ్‌మాస్టర్ (జీఎం) హోదా ఉన్న ప్లేయర్‌ను ఓడించిన అతిపిన్న వయస్కురాలిగా బోధన రికార్డు నెలకొల్పింది. లివర్‌పూల్‌లో జరిగిన బ్రిటిష్ చెస్ చాంపియన్‌షిప్‌లో బోధన ఈ ఘనత సాధించింది. ఇంగ్లండ్‌కు చెందిన 60 ఏళ్ల గ్రాండ్ మాస్టర్ పీటర్ వెల్స్‌తో జరిగిన పదో రౌండ్ గేమ్‌లో బోధన 40 ఎత్తుల్లో గెలిచింది. తద్వారా గ్రాండ్‌మాస్టర్ హోదా ఉన్న ప్లేయర్‌ను నెగ్గిన అతి పిన్న వయస్కురాలిగా బోధన (10 ఏళ్ల 5 నెలల 3 రోజులు) గుర్తింపు పొందింది. ఇప్పటిదాకా ఈ రికార్డు అమెరికాకు చెందిన కరిస్సా యిప్ పేరిట ఉంది. 2014లో జరిగిన న్యూ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నీలో ఇవనోవ్ (రష్యా)తో జరిగిన గేమ్‌లో కరిస్సా యిప్ (10 ఏళ్ల 11 నెలల 20 రోజులు) 32 ఎత్తుల్లో గెలిచింది. 11 ఏళ్లుగా కరిస్సా యిప్ పేరిట ఉన్న ఈ రికార్డును బోధన సవరించింది. వంద మంది ప్లేయర్లు పోటీపడ్డ బ్రిటిష్ చెస్ చాంపియన్ షిప్‌లో బోధన ఐదు పాయింట్లతో సంయుక్తంగా 26వ స్థానంలో నిలిచింది. ఇంగ్లండ్‌లో స్థిరపడ్డ భారత సంతతి తమిళ కుటుంబానికి చెందిన బోధన గత ఏడాది చెస్ ఒలింపియాడ్‌లో ఇంగ్లండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ఈ క్రమంలో ఏ క్రీడలోనైనా ఇంగ్లండ్ జాతీయ జట్టుకు ఆడిన అతి పిన్న వయస్కు రాలిగా రికార్డు నెలకొల్పింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



మహిళల వన్డే వరల్డ్‌కప్ ట్రోఫీతో ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, మిథాలీ రాజ్, ఐసీసీ చైర్మన్ జై షా, యువరాజ్ సింగ్, హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్

'ఆఖరి అడ్డంకిని అధిగమిస్తాం'

వన్డే వరల్డ్ కప్ విజయంపై హర్మన్‌ప్రీత్ ఆశాభావం ● టోర్నీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న భారత కెప్టెన్

ముంబై: మహిళల క్రికెట్‌లో భారత జట్టు గత కొన్నేళ్లుగా నిలకడైన ప్రదర్శనతో మంచి విజయాలు సాధిస్తోంది. అయితే ఇప్పటికీ వరల్డ్ కప్ మాత్రం అందని ద్రాక్షగానే ఉంది. అటు టి20ల్లోనూ, ఇటు వన్డేల్లోనూ మన జట్టు ఒక్కసారి కూడా విజేతగా నిలవలేకపోయింది. 2005, 2017 వన్డే వరల్డ్ కప్‌లలో రన్నరప్‌గా నిలిచిన మన జట్టు... 2022లో సెమీఫైనల్‌కే పరిమితమైంది. అయితే ఈసారి గెలుపు గీత దాటుతామని భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ విశ్వాసం వ్యక్తం చేసింది. స్వదేశంలో జరుగుతున్న ఈ టోర్నీలో తమకు పలు సానుకూలతలు ఉన్నాయని ఆమె అభిప్రాయపడింది. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2 వరకు జరిగే ఈ టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. టోర్నమెంట్ మరో 50 రోజుల్లో మొదలు కానున్న నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సోమవారం ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో హర్మన్‌తో పాటు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, ఐసీసీ చైర్మన్ జై షా, సీఈఓ సంజోగ్ గుప్తా, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియాతో పాటు 2011 పురుషుల వన్డే వరల్డ్ కప్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' యువరాజ్ సింగ్ పాల్గొన్నారు.

ఫామ్‌ను కొనసాగిస్తాం...

ఈ సందర్భంగా మాట్లాడుతూ హర్మన్ తమ ఆలోచనలను వెల్లడించింది. 'సొంత అభిమానుల సమక్షంలో మ్యాచ్‌లు ఆడబోతున్నాం. ఇది ఎప్పుడైనా ప్రత్యేకంగా ఉంటుంది. ఈసారి 100 శాతం మా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి విజేతగా నిలిచేందుకు ప్రయత్నిస్తాం. చాలా కాలంగా దీని కోసం ఎదురు చూస్తున్న భారత అభిమానుల కోరిక తీరుస్తాం' అని హర్మన్ వ్యాఖ్యానించింది. 2025లో 11 వన్డేలు ఆడిన భారత జట్టు 9 మ్యాచ్‌లు గెలిచింది. ఇందులో ఐర్లాండ్, ఇంగ్లండ్‌లపై సిరీస్ విజయాలతో పాటు శ్రీలంకలో జరిగిన ముక్కోణపు టోర్నీని కూడా జట్టు సొంతం చేసుకుంది. 'వరుస విజయాలతో నిజంగానే మా జట్టులో ఆత్మవిశ్వాసం చాలా పెరిగింది. అందరూ ఎలాగైనా గెలవగలమనే పట్టుదల, ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. గత రెండేళ్లుగా మేం చూపించిన నిలకడను ముందు కొనసాగిస్తే చాలు. ముఖ్యంగా జట్టు ఎలాంటి బెదురు లేకుండా నిర్భీతిగా ఆడటమే కొత్తగా వచ్చిన మార్పు. దాని వల్లే ఈ విజయాలు దక్కాయి' అని హర్మన్ వివరించింది. వరల్డ్ కప్ ముందు ఇంగ్లండ్ గడ్డపై సిరీస్ నెగ్గడం జట్టు ఫామ్‌ను చూపిస్తోంది. 'ఇంగ్లండ్‌లో ఫలితాలు మాకేమీ ఆశ్చర్యాన్ని కలిగించలేదు. ఎందుకంటే మా సన్నద్ధత అంత బాగుంది. దీని కోసం మేం చాలా కష్టపడుతున్నాం. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడటం వల్లే ఏ సిరీస్ అయినా టోర్నీ అయినా గెలవగలమనే నమ్మకం మాలో పెరిగింది. ఇప్పటి వరకు సాధించిన విజయాలతో మేమేమీ అద్భుతం చేసినట్లుగా భావించడం లేదు. విజయాలను మేం అలవాటుగా మార్చుకున్నాం. ఇంకా ఎంతో మెరుగుపడేందుకు అవకాశం కూడా ఉంది' అని భారత కెప్టెన్ విశ్లేషించింది. వరల్డ్ కప్‌కు ముందు భారత్ స్వదేశంలోనే ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఆసీస్‌తో మ్యాచ్ అంటే ఎప్పుడైనా గట్టి సవాల్ ఎదురవుతుందని... ఈసారి వారిని ఓడించటంతో పాటు మెగా టోర్నీకి ముందు సరైన సన్నాహకంగా ఉపయోగపడుతుందని హర్మన్ అభిప్రాయం వ్యక్తం చేసింది.

ఇదో గొప్ప అవకాశం...

సొంతగడ్డపై వరల్డ్ కప్ గెలిచి చరిత్ర సృష్టించేందుకు భారత జట్టుకు ఇదో సువర్ణావకాశమని యువరాజ్ సింగ్ అభిప్రాయపడ్డాడు. తమ ఆటపై నమ్మకంతో బరిలోకి దిగితే మంచి ఫలితాలు లభిస్తాయని అతను మార్గనిర్దేశనం చేశాడు. 'వరల్డ్ కప్ గెలిచేందుకు ఇది మంచి అవకాశం. కానీ మ్యాచ్ మొదలు కాగానే గెలుపు గురించి ఆలోచించవద్దు. ముందే ఇలాగే ఆడాలని లెక్కలు పెట్టుకోకుండా పరిస్థితిని బట్టి ఆడాల్సి ఉంటుంది. అన్నింటికంటే ఒత్తిడిని అధిగమించడం ముఖ్యం. అనుభవం, మనపై నమ్మకంతో అలాంటి స్థితిని అధిగమించాలి. జట్టులో ప్రతీ ఒక్కరు నేనే మ్యాచ్ గెలిపించగలనని నమ్మాలి. అప్పుడే విజయం దక్కుతుంది' అని యువీ ఉద్బోధ చేశాడు. 2017 వన్డే వరల్డ్‌కప్ భారత క్రికెట్‌లో మాత్రమే కాకుండా ప్రపంచ క్రికెట్‌లో కీలక మలుపు అని మిథాలీ రాజ్ వ్యాఖ్యానించింది. సోషల్ మీడియా ఇంకా ఊపందుకోని ఆ రోజుల్లో ఐసీసీ చాలా పెద్ద స్థాయిలో టోర్నీకి ప్రచారం కల్పించడం ఎంతో మేలు చేసిందని ఆమె అభిప్రాయపడింది.

సాక్షి సినిమా

చిత్ర నిర్మాణం భారంగా మారుతోంది

- విలేకరుల సమావేశంలో నిర్మాతలు



సినీ కార్మికుల సంఘం నిబంధనలు, కార్మికుల డిమాండ్స్ చిన్న నిర్మాతలకు పెనుభారంగా మారుతున్నాయని పలువురు నిర్మాతలు ఆవేదన వ్యక్తం చేశారు. అందరూ బాగుండాలనే ధోరణిలో యూనియన్లు వ్యవహరించాలని కోరారు. ప్రస్తుతం నెలకొన్న సమ్మె పరిస్థితుల నేపథ్యంలో చిత్ర నిర్మాణంలో తాము ఎదుర్కొంటున్న సవాళ్లను సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నిర్మాతలు వెల్లడించారు.

రాజేశ్ దండా మాట్లాడుతూ– ''చిన్న నిర్మాతలు బాగుంటేనే ఇండస్ట్రీ బాగుంటుంది. ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న మాలాంటి నిర్మాతలకు 30 శాతం వేతనాలు పెంచాలంటూ కార్మికులు చేస్తున్న సమ్మె మరింత ఇబ్బందికరంగా మారింది. మా సినిమాను దీపావళికి రిలీజ్ చేయాలని ప్లాన్ చేశాం. సమ్మె వల్ల షూటింగ్ ఆపేయాల్సి వచ్చింది. లెక్క చూస్తే 150 మంది జూనియర్ ఆర్టిస్టులు ఉంటారు. కానీ సెట్‌లో 50 మంది కూడా ఉండరు. వాళ్లకు ఇస్తున్న డబ్బు ఎక్కడికి వెళ్తోంది. ఓటీటీ, డబ్బింగ్ సినిమాలకు మాకు డబ్బులు సమయానికి అందడంలేదు. కానీ మేం మాత్రం ఏ రోజుకారోజు డబ్బులివ్వాలంటే అయ్యే పనేనా?'' అని ప్రశ్నించారు.

'మధుర' శ్రీధర్ మాట్లాడుతూ– ''చిన్న సీన్‌కి జనరేటర్ పెట్టాలన్నా యూనియన్ అనుమతి కావాలి. మేకప్, కాస్ట్యూమ్స్, ప్రొడక్షన్... ఇలా 80 మందిని పెట్టుకోవాలి. చిన్న నిర్మాతకు ఇంతమందిని పెట్టడం పెనుభారం'' అన్నారు.

చైతన్య మాట్లాడుతూ– ''నిర్మాత పరిస్థితి దయనీయంగా ఉంది. మన దగ్గరే కాదు... దేశ విదేశాల్లోనూ ఫిల్మ్ మేకింగ్ పరంగా ఇబ్బందులు ఉన్నాయి. ఎందరికో ఉపాధి కల్పిస్తున్న నిర్మాతలు సంతోషంగా లేరు'' అని తెలిపారు.

వంశీ నందిపాటి మాట్లాడుతూ – ''చిత్ర నిర్మాణం భారంగా మారుతోంది. రూ. రెండు కోట్లలో చేయాల్సిన సినిమాకు నాలుగైదు రెట్లు ఖర్చు అవుతోంది. సినీ కార్మిక సంఘాలు ఒకసారి నిర్మాత స్థానంలోకి వచ్చి ఆలోచిస్తే మా బాధలు తెలుస్తాయి'' అన్నారు.

ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ– ''యూనియన్ పేరుతో మాకు భారాన్ని పెంచొద్దు. ఎప్పటి నుంచో ఉన్న యూనియన్స్ నిబంధనలను ఇప్పటికి తగ్గట్టుగా మార్చాలి'' అని చెప్పారు.

రాకేశ్ వర్రె మాట్లాడుతూ– ''నేను గతంలో ఒక సినిమాను లోకల్ టాలెంట్, యూనియన్ కార్మికులను కలిపి చేస్తే కోటిన్నర అయ్యింది. ఇప్పుడు మొత్తం యూనియన్ కార్మికులతో చేస్తే 8 కోట్లు ఖర్చయ్యింది. చిన్న సినిమాకు అసలు బిజినెస్ లేదు'' అని తెలిపారు.

చాయ్ బిస్కెట్ శరత్ మాట్లాడుతూ– ''కొత్త వాళ్లతో సినిమాలు చేసే మాలాంటి చిన్న నిర్మాతలకు యూనియన్స్ నిబంధనల వల్ల ఇబ్బంది ఉంది'' అన్నారు.

ఎస్‌కేఎన్ మాట్లాడుతూ– ''30 శాతం వేతన పెంపు అడుగుతున్నారు. మీరు మా సినిమాల థియేట్రికల్, నాన్ థియేట్రికల్ బిజినెస్ బాధ్యత తీసుకుంటే మేం 50 శాతం పెంచడానికి కూడా రెడీ. ఇండస్ట్రీలో 90 శాతం సినిమాలు చిన్న నిర్మాతలవే. అసలు 'మా' అసోసియేషన్, దర్శకుల సంఘం ఎటువైపు ఉన్నాయో చెప్పాలి. ఇది గ్రూపిజమ్ కోసం పెట్టిన ప్రెస్‌మీట్ కాదు. చిన్న నిర్మాతలుగా మా బాధలు చెప్పుకునేందుకు పెట్టాం. మేం రైజింగ్ ప్రొడ్యూసర్స్ కాదు... బర్నింగ్ ప్రొడ్యూసర్స్'' అన్నారు.

– సాక్షి, బంజారా హిల్స్

నాకంటూ ఒక హిస్టరీ ఉంది



● రవితేజ

రవితేజ కెరీర్‌లోని 75వ చిత్రం 'మాస్ జాతర'. 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల కాంబినేషన్‌లో రూపొందిన సినిమా ఇది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. వినాయక చవితి సందర్భంగా ఈ చిత్రాన్ని ఈ నెల 27న రిలీజ్ చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'ఇక్కడొక కాలేజీ స్టూడెంట్‌ని చంపేశాడు సార్...', 'వాడి బ్యాక్‌గ్రౌండ్ ఏంటి?', 'రైల్వే పోలీస్...', 'ఆయన డిపార్ట్‌మెంట్‌లో తప్ప అన్ని డిపార్ట్‌మెంట్స్‌లో వేలు పెడుతుంటాడు', 'నాకంటూ ఒక హిస్టరీ ఉంది', 'డిస్టర్బ్ చేశారనుకోండి... చాలా వైల్డ్‌గా రియాక్ట్ అవుతాడు' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ''మాస్ ప్రేక్షకులతో పాటు కుటుంబ ప్రేక్షకులు కూడా మెచ్చే విధంగా అసలైన పండగ సినిమాలా 'మాస్ జాతర'ను సిద్ధం చేస్తున్నాడు దర్శకుడు భాను. ఈ సినిమా ప్రేక్షకులకు విందు భోజనంలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.




● సమంత

ఊ అంటారా?

బ్లాక్‌బస్టర్ సినిమా 'రంగస్థలం' తర్వాత హీరో రామ్‌చరణ్, హీరోయిన్ సమంత మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. కానీ... వీరిద్దరూ ఈసారి హీరో, హీరోయిన్లుగా నటించడంలేదట. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్ కోసం మేకర్స్ పలువురు హీరోయిన్స్ పేర్లను పరిశీలిస్తున్నారట. ఇప్పటికే పూజా హెగ్డే, శ్రీలీల వంటి హీరోయిన్ల పేర్లు వినిపించగా, తాజాగా సమంత పేరు తెరపైకి వచ్చింది. ఇక అల్లు అర్జున్ 'పుష్ప ది రైజ్' (2021) సినిమాలో సమంత చేసిన 'ఊ అంటావా మావ...' స్పెషల్ సాంగ్ బాగా పాపులర్ అయిన సంగతి తెలిసిందే. ఈ పాట తర్వాత సమంత మరో స్పెషల్ సాంగ్ చేయలేదు. మరి... రామ్‌చరణ్ 'పెద్ది' సినిమాలోని ప్రత్యేక పాటకు సమంత 'ఊ' అంటారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాల సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న 'పెద్ది' సినిమా మార్చి 27న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్

ఆర్మీ కుటుంబాల నేపథ్యంలో...

పెదపూడి బాబూరావు ప్రధాన పాత్రలో నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'సుప్రీమ్ వారియర్స్'. ఈ చిత్రంలో మురళీమోహన్ మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. హరి చందన్ దర్శకత్వంలోని ఈ సినిమా సోమవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శక-నిర్మాత ధవళ సత్యం క్లాప్ కొట్టారు. మురళీ మోహన్ గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం మురళీమోహన్ మాట్లాడుతూ– ''ఎన్నారై అయిన బాబూరావు సినిమాపై ప్యాషన్‌తో ఇండస్ట్రీకి వచ్చారు. నిర్మాతగా, నటుడిగా పెదపూడి బాబూరావు ఆకట్టుకోనున్నారు. ఈ 'సుప్రీమ్ వారియర్స్' సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని తెలిపారు. ''అతడు' సినిమాతో నాకు నటుడిగా మురళీమోహన్‌గారు జన్మనిచ్చారు. ఈ 'సుప్రీమ్ వారియర్స్'లో మా మధ్య వచ్చే సన్నివేశాలు అద్భుతంగా ఉంటాయి. ప్రేక్షకులు ఆశ్చర్యపోయేలా ఈ సినిమా ఉంటుంది'' అని చెప్పారు పెదపూడి బాబూరావు. ''తైవాన్ మీద జరిగిన దాడి తర్వాత ఈ కథ రాయడం మొదలు పెట్టాను. 8 పాత్రల చుట్టూ జరిగే ఈ కథలో మురళీమోహన్‌గారిని ఇప్పటివరకు చూడని పాత్రలో చూస్తారు. ఈ సైన్స్ ఫిక్షన్ అండ్ యాక్షన్ థ్రిల్లర్‌లో మిలటరీ, ఆర్మీ కుటుంబాల ఎమోషన్స్‌ను చూపించనున్నాం. ఇందుకోసం దాదాపు 800 మంది ఆర్మీ కుటుంబాలను కలిశాం'' అని తెలిపారు హరిచందన్.



● ధవళ సత్యం, మురళీమోహన్, బాబూరావు

కాపాడు... కాపాడు



● రాన్నా, ప్రియాంక

హీరోయిన్ రక్షిత సోదరుడు రాన్నా హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ఏలుమలై'. ఈ చిత్రంలో ప్రియాంకా ఆచార్ హీరోయిన్. పునీత్ రంగస్వామి దర్శకత్వంలో నరసింహా నాయక్ (రాజు గౌడ) సమర్పణలో తరుణ్ సుధీర్ క్రియేటివ్స్, డీఈ ఆర్ట్ స్టూడియోస్ నిర్మించాయి. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా తమిళ, తెలుగు, కన్నడ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'కాపాడు దేవా..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ''కాపాడు... కాపాడు... ప్రేమికుల చేతులిల విడిపించకు... కాపాడు... కాపాడు... దేవా... ప్రేమనిలా ఒంటరిగ విడిచెల్లకు...' అంటూ ఈ పాట సాగుతుంది. సంగీత దర్శకుడు డి. ఇమ్మాన్ స్వరకల్పనలో కాసర్ల శ్యామ్ ఈ పాటకు సాహిత్యం అందించగా, మంగ్లీ పాడారు.

పల్లెటూరి ప్రేమకథ



● గీత్ సైని, శ్రీచరణ్

శ్రీ చరణ్ రాచకొండ, గీత్ సైని హీరో హీరోయిన్లుగా నటించిన రూరల్ లవ్‌స్టోరీ 'కన్యాకుమారి'. 'అన్ ఆర్గానిక్ ప్రేమకథ' అనేది ఉపశీర్షిక. నటి మధు షాలిని సమర్పణలో సృజన్ అట్టాడ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమాను ఈ నెల 27న విడుదల చేయనున్నట్లుగా వెల్లడించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''శ్రీకాకుళం బ్యాక్‌డ్రాప్‌లో సహజ వాతావరణంలో నడిచే కథ ఇది. ఈ సహజమైన కథ సినిమాటిక్ టచ్‌తో కొత్త ఫీల్ కలిగించేలా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: రవి నిడమర్తి.

ప్రేమలో రెండోసారి...



● వనిత, రమణ

రమణ సాకే, వనిత గౌడ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమలో రెండోసారి'. సాకే రామయ్య సమర్పణలో సత్య మార్క దర్శకత్వంలో సాకే నీరజా లక్ష్మి నిర్మించారు. ఈ చిత్రంలోని 'ప్రేమలో రెండోసారి...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను కాంగ్రెస్ పార్టీ అగ్రనేత బి. వేణుగోపాల్ స్వామి విడుదల చేసి, ''ఈ చిత్రం యువతకు బాగా నచ్చుతుందని అనుకుంటున్నాను. హీరో రమణ బాగా నటించారు. టాప్ హీరోల స్థాయికి తను ఎదగాలి'' అన్నారు. ''ఈ సినిమాలో ఏడు పాటలు ఉన్నాయి. మంచి మ్యూజికల్ ఫిల్మ్‌గా ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది'' అన్నారు హీరో, మ్యూజిక్ డైరెక్టర్ రమణ సాకే.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
746	222
80,604	24,585

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	21,440	▽	9
డోజోన్స్	43,984	▽	192
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,128	▲	32
డాక్స్	24,083	▽	80
షాంఘై	3,648	▲	12
నికాయ్ (శుక్రవారం ముగింపు)	41,820	▲	761

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.10	88.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.50	119.46
€	యూరో	ఎస్‌బీఐ	100.90	103.65
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.66	60.16
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.06	58.31
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.89	69.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.49	23.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.98	24.22
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.33	13.15

కోనసీమలో ఓఎన్‌జీసీ గ్యాస్ సెంటర్

- 10 బావుల అభివృద్ధికి ప్రణాళికలు
- ఆఫ్‌షోర్ పైప్‌లైన్, ప్లాట్‌ఫామ్స్ ఏర్పాటు
- రూ. 4,606 కోట్ల పెట్టుబడులకు రెడీ



హైదరాబాద్: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) తాజాగా రూ. 4,606 కోట్లకుపైగా పెట్టుబడులకు తెరతీయనుంది. తద్వారా 10 చమురు, గ్యాస్ బావుల అభివృద్ధి, రెండు మానవరహిత ప్లాట్‌ఫామ్స్, ఆఫ్‌షోర్ పైప్‌లైన్ ఏర్పాటుతోపాటు.. ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లాలో ఆన్‌షోర్ గ్యాస్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని నెలకొల్పనుంది. ప్రతిపాదిత ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల కోసం పర్యావరణం, అటవీ శాఖను సంప్రదించింది. ఈ శాఖకు చెందిన నిపుణుల అప్రైజల్ కమిటీ(ఈఏసీ) జూలై 24న సంబంధిత సమావేశం జరిగినట్లు వెల్లడించింది. ప్రతిపాదిత ఇన్‌స్టాలేషన్‌కు ఓడలరేవు టెర్మినల్‌లో మొత్తం 26.3 హెక్టార్లు అవసరమని తెలియజేసింది. 8.7 హెక్టార్లలో గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి చేయవలసి ఉన్నట్లు పేర్కొంది. మొత్తం ప్రాజెక్టుకు రూ. 4,606 కోట్లకుపైగా వ్యయంకానున్నట్లు వివరించింది.

మినిమం బ్యాలెన్స్‌పై బ్యాంకులదే నిర్ణయం

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి



గొజారియా (గుజరాత్): సేవింగ్స్ అకౌంట్లలో కనీస బ్యాలెన్స్ విషయంలో నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ బ్యాంకులకి ఉంటుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా చెప్పారు. ఇది నియంత్రణ సంస్థ పరిధిలోకి రాదని ఆయన స్పష్టం చేశారు. 'మినిమం బ్యాలెన్స్‌పై నిర్ణయం తీసుకునే అంశాన్ని ఆర్‌బీఐ బ్యాంకులకే వదిలేసింది. కొన్ని బ్యాంకుల్లో ఇది రూ. 10,000గా ఉంటే మరికొన్నింటిలో రూ. 2,000గా ఉంది. ఇంకొన్ని పూర్తిగా మినహాయింపునిస్తున్నాయి. ఇది రెగ్యులేటరీ సంస్థ పరిధిలో లేదు' అని మల్హోత్రా వివరించారు. ప్రైవేట్ రంగ ఐసీఐసీఐ బ్యాంక్ కొత్త సేవింగ్స్ ఖాతాలపై సగటు నెలవారీ కనీస బ్యాలెన్స్‌ను (ఎంఏబీ) అయిదు రెట్లు పెంచి రూ. 10,000 నుంచి రూ. 50,000కు పెంచిన నేపథ్యంలో మల్హోత్రా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రైవేట్ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎంఏబీ చాలా తక్కువగా ఉంటోంది.

ఎరిక్సన్, నోకియాతో బీఎస్‌ఎన్‌ఎల్ జట్టు

యువతకు 5జీ తదితర టెక్నాలజీల్లో శిక్షణ



న్యూఢిల్లీ: యువతకు నైపుణ్యాల్లో శిక్షణ కల్పించే దిశగా నాలుగు అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాలతో ప్రభుత్వ రంగ దిగ్గజం బీఎస్‌ఎన్‌ఎల్ చేతులు కలిపింది. కేంద్ర టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం సింధియా సమక్షంలో ఎరిక్సన్ ఇండియా, క్వాల్‌కామ్ టెక్నాలజీస్, సిస్కో సిస్టమ్స్, నోకియా సొల్యూషన్స్ అండ్ నెట్‌వర్క్స్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. 5జీ, ఏఐ, సైబర్‌సెక్యూరిటీ, నెట్‌వర్కింగ్ తదితర టెక్నాలజీలకు సంబంధించిన కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చేందుకు ఇది ఉపయోగపడుతుంది. జబల్‌పూర్‌లోని భారత రత్న భీమ్ రావ్ అంబేద్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెలికం ట్రైనింగ్‌లో ఈ కోర్సుల్లో శిక్షణనిస్తారు. తొలి దశలో రూ. 1 కోటికి పైగా పెట్టుబడితో ఏటా 2,000 మంది విద్యార్థులకు ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు సింధియా తెలిపారు. కాగా, భారత్‌లో పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని విస్తరించి, భారీగా ఉద్యోగాలు కల్పిస్తామని నోకియా ఇండియా కంట్రీ మేనేజర్ తరుణ్ ఛాబ్రా తెలిపారు.

సెన్సెక్స్ మళ్లీ 80,000 పైకి

- నిఫ్టీ లాభం 222 పాయింట్లు
- బ్యాంకులు, చమురు షేర్లకు డిమాండ్

ముంబై: బ్యాంకులు, చమురు రంగాలకు షేర్లకు భారీగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో సోమవారం స్టాక్ సూచీలు దాదాపు ఒకశాతం మేర లాభపడ్డాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల పునరాగమనం కలిసొచ్చాయి.



సెన్సెక్స్ 746 పాయింట్లు పెరిగి 80,604 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 222 పాయింట్లు బలపడి 24,585 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 778 పాయింట్లు బలపడి 80,636 వద్ద, నిఫ్టీ 238 పాయింట్లు ఎగసి 24,601 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. సూచీల ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద రూ.3.40 లక్షల కోట్లు పెరిగి రూ.444 లక్షల కోట్లకు చేరింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 17 పైసలు బలహీనపడి 87.75 వద్ద స్థిరపడింది.

- రంగాల వారీగా బీఎస్‌ఈ ఇండెక్సుల్లో రియల్టీ 2%, బ్యాంకెక్స్, ఫార్మా, ఆటో, ఫైనాన్సియల్ సర్వీసెస్ యుటిలిటీ, సర్వీసెస్, పవర్ సూచీలు ఒకశాతం లాభపడ్డాయి.
- మెరుగైన క్యూ1 ఫలితాలతో ఎస్‌బీఐ షేరు 2.40% పెరిగి రూ.824 వద్ద స్థిరపడింది.

ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడుల వరద!



జూలైలో రికార్డు స్థాయిలో రూ. 42,702 కోట్లు

- రూ. 75 లక్షల కోట్లు దాటిన ఏయూఎం
- యాంఫీ గణాంకాల్లో వెల్లడి

న్యూఢిల్లీ: అమెరికాతో టారిఫ్‌లపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో మార్కెట్లు హెచ్చుతగ్గులకు లోనవుతున్నప్పటికీ ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌లోకి పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. జూలైలో నికరంగా రూ. 42,702 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్ వచ్చింది. ఈ విభాగానికి సంబంధించి నెలవారీగా చూస్తే ఇది రికార్డు స్థాయి. జూన్‌లో నమోదైన రూ. 23,587 కోట్లతో పోలిస్తే ఏకంగా 81 శాతం ఎగిశాయి. అలాగే, వరుసగా 53వ నెలా ఈక్విటీల్లోకి పెట్టుబడులు వచ్చినట్లు ఫండ్స్ పరిశ్రమ అసోసియేషన్ యాంఫీ విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడైంది. వీటి ప్రకారం పరిశ్రమ నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) తొలిసారిగా రూ. 75 లక్షల మార్కును దాటింది.

'టారిఫ్ యుద్ధం వల్ల అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత వృద్ధి గాథ పటిష్టంగానే ఉంది. నెమ్మదించిన ద్రవ్యోల్బణం, లిక్విడిటీ.. పొదుపు మెరుగుపడటం తదితర అంశాల ఊతంతో ఈక్విటీల్లోకి భారీగా పెట్టుబడులు వస్తుండటం ఇందుకు నిదర్శనం' అని యాంఫీ సీఈవో వెంకట్ ఎన్ చలసాని చెప్పారు. మార్కెట్లు మధ్యమధ్యలో కరెక్షన్లకు లోనవుతుండటమనేది ఇన్వెస్టర్లు ఎంట్రీ ఇచ్చేందుకు ఆకర్షణీయమైన అంశంగా నిల్చిందని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా ప్రిన్సిపల్ హిమాంశు శ్రీవాస్తవ తెలిపారు.

యాంఫీ గణాంకాల్లో మరిన్ని విశేషాలు..

- జూలైలో మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలోకి రూ. 1.8 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జూన్‌లో నమోదైన రూ. 49,000 కోట్లు, మే నెలలో రూ. 29,000 కోట్లతో పోలిస్తే ఇది గణనీయంగా అధికం. పెట్టుబడుల ప్రవాహంతో జూన్‌లో రూ. 74.4 లక్షల కోట్లుగా ఉన్న పరిశ్రమ ఏయూఎం జూలైలో రూ. 75.36 లక్షల కోట్లకు చేరింది.
- ఈక్విటీ ఆధారిత ఫండ్స్‌కి సంబంధించి సెక్టోరల్/థీమాటిక్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ. 9,426 కోట్లు నికరంగా వచ్చాయి. ఈ సెగ్మెంట్‌లో కొత్త స్కీములు మొత్తం రూ. 7,404 కోట్లు సమీకరించాయి. తర్వాత స్థానంలో రూ. 7,654 కోట్ల పెట్టుబడులతో ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఉన్నాయి. వివిధ మార్కెట్ క్యాపిటలైజేషన్లవ్యాప్తంగా పెట్టుబడులు పెట్టే అవకాశాలు ఉండటం వీటికి సానుకూలంగా నిలిచింది. ఇక స్మాల్ క్యాప్ ఫండ్స్ (6,484 కోట్లు), మిడ్ క్యాప్ ఫండ్స్ (రూ. 5,182 కోట్లు), లార్జ్.. మిడ్ క్యాప్ ఫండ్స్ (రూ. 5,035 కోట్లు)లోకి కూడా భారీగా పెట్టుబడులు వచ్చాయి. ఈక్విటీ ఆధారిత సేవింగ్స్ స్కీముల నుంచి మాత్రమే రూ. 368 కోట్లు తరలిపోయాయి.
- జూన్‌లో నమోదైన రూ. 27,269 కోట్లతో పోలిస్తే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్) ద్వారా పెట్టుబడులు రూ. 28,464 కోట్లకు పెరిగాయి.
- రూ. 1.06 లక్షల కోట్ల పెట్టుబడులతో డెట్ ఫండ్స్ జూలైలో పటిష్టంగా పుంజుకున్నాయి. లో-డ్యూరేషన్, మనీ మార్కెట్ ఫండ్స్‌తో పాటు లిక్విడ్, ఓవర్‌నైట్ ఫండ్స్‌లోకి కూడా పెట్టుబడులు వచ్చాయి. జూన్‌లో రూ. 1.711 కోట్ల పెట్టుబడులు నికరంగా తరలిపోయాయి.
- గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి పెట్టుబడులు జూన్‌లో నమోదైన రూ. 2,081 కోట్లతో పోలిస్తే క్షీణించి రూ. 1,256 కోట్లకు పరిమితమయ్యాయి. వేగం నెమ్మదించినప్పటికీ వరుసగా మూడో నెలా ఇన్వెస్ట్‌మెంట్స్ రావడం గమనార్హం. అనిశ్చితి వేళ పెట్టుబడుల డైవర్సిఫికేషన్‌కి అనువైన సాధనంగా పసిడి ఆకర్షణీయత కొనసాగుతోందని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా సీనియర్ అనలిస్ట్ నేహల్ మేష్రామ్ తెలిపారు.


'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఎగుమతుల పెంపునకు కేంద్రం 'టార్గెట్ 50' వ్యూహం	ఢిల్లీలో టెస్లా షోరూం

మతపరమైన సంస్థలకు పన్ను మినహాయింపులు

సెలక్ట్ కమిటీ సూచనతో కొత్త ఐటీ బిల్లులో పునరుద్ధరణ

న్యూఢిల్లీ: అన్ని మతపరమైన, స్వచ్ఛంద సేవా సంస్థలకు వచ్చే అజ్ఞాత విరాళాలపై టీడీఎస్ క్లెయిమ్, పన్ను మినహాయింపులకు ప్రస్తుత చట్టంలో మాదిరే ఆదాయపన్ను కొత్త బిల్లు (2.0)లోనూ అవకాశం కల్పించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో తీసుకొచ్చిన కొత్త బిల్లులో దీన్ని తొలగించడం గమనార్హం. అన్ని రిజిస్టర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థలు అందుకునే అజ్ఞాత విరాళాలపై 30 శాతం స్థిర పన్నును ప్రభుత్వం ప్రతిపాదించింది. కానీ, సెలక్ట్ కమిటీ చేసిన సూచనల మేరకు నూతన బిల్లులో మినహాయింపులకు తిరిగి చోటు కల్పించింది. క్లాజు 187 కింద 'ప్రొఫెషన్' పదాన్ని చేర్చారు. ఒక ఏడాదిలో చెల్లింపుల స్వీకరణలు రూ.50 కోట్లకు మించితే నిపుణులు సైతం ఎలక్ట్రానిక్ చెల్లింపుల నమూనాలను కలిగి ఉండాలని ఇది నిర్దేశిస్తోంది. నష్టాలను సర్దుబాటు చేసుకోవడం, క్యారీ ఫార్వార్డ్ చేసుకోవడానికి సంబంధించిన నిబంధనలను మరింత మెరుగుపరిచారు. టీడీఎస్ కరెక్షన్ స్టేట్‌మెంట్ (సవరణ నివేదికలు)లకు సంబంధించి దాఖలు గడువును ఆరేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించారు. నూతన ఆదాయపన్ను బిల్లు (2.0)గా చెబుతున్న తాజా బిల్లులో సెలక్ట్ కమిటీ సిఫారసులు అన్నింటికీ దాదాపుగా చోటు కల్పించడం గమనార్హం. తొలుత ఈ కొత్త బిల్లును ఈ ఏడాది ఫిబ్రవరిలో లోక్‌సభలో ప్రవేశపెట్టగా, సెలక్ట్ కమిటీకి సిఫారసు చేశారు. సెలక్ట్ కమిటీ తన నివేదికను జూలై 21న పార్లమెంట్‌కు సమర్పించింది. సోమవారం దీన్ని లోక్‌సభ ఆమోదించింది.



భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–భౌతిక శాస్త్రం
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–రసాయన శాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- ఇంగ్లిష్

బ్యాంకు ఉద్యోగాల అభ్యర్థులకు శుభవార్త. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగాల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. మరో భారీ నోటిఫికేషన్‌తో ముందుకొచ్చింది. మొత్తం 10,227 కస్టమర్ సర్వీస్ అసోసియేట్(క్లరికల్ కేడర్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏదైనా డిగ్రీతో ఈ పోస్టులకు పోటీ పడొచ్చు. రెండంచెల(ఆన్‌లైన్ ప్రిలిమ్స్, మెయిన్) ఎంపిక ప్రక్రియలో ప్రతిభ చూపితే ప్రభుత్వ రంగ బ్యాంకులో ఉజ్వల కెరీర్ ఖాయమవుతుంది. ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ కస్టమర్ సర్వీస్ అసోసియేట్ పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

సర్కారీ బ్యాంకుల్లో క్లర్క్ కొలువు

» మొత్తం 10,227 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు
» ఆన్‌లైన్ ప్రిలిమ్స్, మెయిన్ పరీక్ష ఆధారంగా ఎంపిక

ఐబీపీఎస్ 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మొత్తం 10,227 కస్టమర్ సర్వీస్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రాలు, యూటీల వారీగా ఖాళీలను ప్రకటించింది. వీటిల్లో తెలుగు రాష్ట్రాలైన తెలంగాణలో 261 ఖాళీలు, ఆంధ్రప్రదేశ్‌లో 367 ఖాళీలు ఉన్నాయి.

ఎంపిక ప్రక్రియలో పాల్గొనే బ్యాంకులు

బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

అర్హతలు

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తు తేదీ నాటికి అర్హత కోర్సు సర్టిఫికెట్లు అభ్యర్థి వద్ద ఉండాలి. డిగ్రీలో సాధించిన మార్కుల(పర్సంటేజ్)ను దరఖాస్తులో పొందుపర్చాల్సి ఉంటుంది.

స్థానిక భాష ప్రావీణ్యం

అభ్యర్థులు ఏ రాష్ట్ర/యూటీ పోస్టులకైనా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే సదరు రాష్ట్ర/యూటీ స్థానిక భాషలో చదవడం, రాయడం,మాట్లాడటం, అవగాహన చేసుకోవడం తప్పనిసరి. మెయిన్స్ తర్వాత భాషా ప్రావీణ్య పరీక్ష నిర్వహిస్తారు. అయితే అభ్యర్థులు పదో తరగతి, ఆపై కోర్సుల్లో సదరు స్థానిక భాష ఒక సబ్జెక్టుగా చదివుంటే భాషా ప్రావీణ్య పరీక్ష నుంచి మినహాయింపు లభిస్తుంది.

కంప్యూటర్ పరిజ్ఞానం

అభ్యర్థులకు కంప్యూటర్‌పై పనిచేసే పరిజ్ఞానం ఉండాలని పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేషన్స్/లాంగ్వేజ్‌పై సర్టిఫికెట్/డిప్లొమా/డిగ్రీ ఉండాలి (లేదా)హైస్కూల్/కాలేజీ స్థాయిలో కంప్యూటర్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.

వయసు

01.08.2025 నాటికి 20–28 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

నెలకు వేతన శ్రేణి రూ.24,050–రూ.64,480 లభిస్తుంది. దీంతోపాటు ఆయా బ్యాంకుల నిబంధనల మేరకు అలవెన్సులు, ఇతర సౌకర్యాలు లభిస్తాయి.

ఎంపిక ప్రక్రియ

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలుత ఆన్‌లైన్‌లో ప్రిలిమినరీ పరీక్ష ఉంటుంది. ప్రిలిమ్స్‌లో ప్రతిభ ఆధారంగా రెండో దశలో ఆన్‌లైన్‌లో మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. మెయిన్ మార్కులను మాత్రమే తుది ఎంపికలో పరిగణలోకి తీసుకుంటారు. ప్రిలిమ్స్ అర్హత పరీక్ష మాత్రమే.

వంద మార్కులకు ప్రిలిమ్స్

ఎంపిక ప్రక్రియ తొలి దశలో 100 మార్కులకు ప్రిలిమినరీ పరీక్ష ఉంటుంది. ఇందులో ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. మొత్తం మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులకు, న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ నుంచి 35 ప్రశ్నలు -35 మార్కులకు ఉంటాయి. ప్రతి విభాగానికి 20 నిమిషాల చొప్పున మొత్తం పరీక్ష వ్యవధి ఒక గంట మాత్రమే. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కును తగ్గిస్తారు. అభ్యర్థులు ప్రతి విభాగంలోనూ కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. పోస్టులను అనుసరించి ఐబీపీఎస్ కటాఫ్ మార్కులను నిర్ణయించి.. ఆన్‌లైన్ మెయిన్ ఎగ్జామ్‌కు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తుంది.

200 మార్కులకు మెయిన్ పరీక్ష

ప్రిలిమ్స్‌లో ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు. మొత్తం 200 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఇందులో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–50 మార్కులకు, జనరల్ ఇంగ్లిష్ 40 ప్రశ్నలు–40 మార్కులకు, రీజనింగ్ ఎబిలిటీ 40 ప్రశ్నలు–60 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 35 ప్రశ్నలు–50 మార్కులకు.. ఇలా మొత్తం 155 ప్రశ్నలు–200 మార్కులకు అడుగుతారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కు తగ్గిస్తారు. అభ్యర్థులు ప్రతి విభాగంలో కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. అదేవిధంగా మొత్తంగా నిర్దేశిత కటాఫ్ పొందాల్సి ఉంటుంది. మెయిన్ పరీక్షలో సాధించిన స్కోర్ ఆధారంగానే తుది ఎంపిక ఖరారు చేస్తారు.



సిలబస్ అంశాలు

- ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ ఉండే విభాగం ఇంగ్లిష్. అంతేకాకుండా ఇందులో అధిక స్కోర్‌కు అవకాశం ఉంటుంది. ఇంగ్లిష్ విభాగంలో రాణించేందుకు గ్రామర్‌తోపాటు వొకాబ్యులరీపై పట్టు సాధించాలి. అదేవిధంగా రీడింగ్ కాంప్రెహెన్షన్‌పై అవగాహన పెంచుకోవాలి.
- మంచి మార్కులు సాధించేందుకు అవకాశమున్న మరో విభాగం. జనరల్ /ఫైనాన్షియల్ అవేర్‌నెస్. దీనికోసం గత ఆరు నెలల జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి. భారత ఆర్థిక వ్యవస్థ, ఆర్‌బీఐ విధానాలు, పాలసీ రేట్లు, బ్యాంకింగ్ రంగంలో తాజా పరిణామాలు, బడ్జెట్ ముఖ్యాంశాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలతోపాటు జనరల్ నాలెడ్జ్‌ని మెరుగుపరచుకోవాలి.
- న్యూమరికల్ ఎబిలిటీ/క్వాంటిటేటివ్ ఎబిలిటీలో రాణించేందుకు అర్థమెటిక్, నంబర్ సిరీస్, ఈక్వేషన్స్, సింప్లిఫికేషన్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్స్‌పై అవగాహన పెంచుకోవాలి. గత ప్రశ్న పత్రాల సాధనతోపాటు మోడల్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.
- రీజనింగ్ ఎబిలిటీలో స్కోర్ కోసం కోడింగ్–డీకోడింగ్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్, పజిల్స్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ఇనిక్వాలిటీస్, డేటా సఫీషియన్సీ తదితర అంశాలపై పట్టు సాధించాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 01.08.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 21.08.2025
- ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేది: అక్టోబర్, 2025
- ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష తేది: నవంబర్, 2025
- వెబ్‌సైట్: www.ibps.in

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎంసీ-ఏసీటీఆర్‌ఈసీ, నవీ ముంబైలో 14 నాన్ మెడికల్ పోస్టులు

నవీ ముంబైలోని టాటా మెమోరియల్ సెంటర్–అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ట్రీట్‌మెంట్, రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్ క్యాన్సర్(ఏసీటీఆర్‌ఈసీ) నాన్ మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 14.
» పోస్టుల వివరాలు: సైంటిఫిక్ ఆఫీసర్ ఈ–1, సైంటిఫిక్ ఆఫీసర్ సి–2, సైంటిఫిక్ అసిస్టెంట్ బి–5, కోఆర్డినేటర్ బి–2, టెక్నీషియన్ ఏ–4.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, బీఎస్సీ, హెచ్ఎస్సీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» వేతనం: నెలకు సైంటిఫిక్ ఆఫీసర్ ఈకు రూ. 78,800, సైంటిఫిక్ ఆఫీసర్ సికు రూ.56,100, సైంటిఫిక్ అసిస్టెంట్, కోఆర్డినేటర్‌కు రూ.35,400, టెక్నీషియన్‌కు రూ.19,900.
» వయసు: సైంటిఫిక్ ఆఫీసర్ ఈకు 45 ఏళ్లు, సైంటిఫిక్ ఆఫీసర్ సికు 35 ఏళ్లు, సైంటిఫిక్ అసిస్టెంట్, కోఆర్డినేటర్‌కు 30 ఏళ్లు, టెక్నీషియన్‌కు 27 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం:రాతపరీక్ష,ఇంటర్వ్యూ ద్వారా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 22.08.2025
» వెబ్‌సైట్: https://tmc.gov.in

రైట్స్ లిమిటెడ్, గుడ్‌గావ్‌లో 19 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

గుడ్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 19.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. » వయసు: 23.08.2025 నాటికి 40 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.29,735.
» ఎంపిక విధానం:రాతపరీక్ష,ఇంటర్వ్యూ ద్వారా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.08.2025
» హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది: 26.08.2025.
» రాతపరీక్ష తేది: 30.08.2025.
» వెబ్‌సైట్: https://www.rites.com

రైట్స్ లిమిటెడ్‌లో 30 సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

గుడ్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 30.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(సివిల్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు:23.08.2025నాటికి 40ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.29,735.
» ఎంపిక విధానం: రాతపరీక్ష ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.08.2025
» హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది: 26.08.2025.
» రాతపరీక్ష తేది: 30.08.2025.
» వెబ్‌సైట్: https://www.rites.com

ఐఐటీ హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 03.
» పోస్టుల వివరాలు: ఆపరేషన్స్ మేనేజర్–01, ప్రాజెక్ట్ అసోసియేట్2–02.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ(ఎంటెక్ /ఎంఈ/ఎంఎస్), ఎంబీఏ బీటెక్, ఎంఎస్సీ, బీకాం, సీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 14.08.2025 నాటికి 35 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు ఆపరేషన్స్ మేనేజర్ రూ. 65,000 నుంచి రూ.85,000, ప్రాజెక్ట్ అసోసియేట్2కు రూ.35,000 నుంచి రూ.45,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 14.08.2025.
» వెబ్‌సైట్: https://iith.ac.in

బెల్, బెంగళూరులో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(బీకాం/బీబీఏ) ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 25 ఏళ్లు ఉండాలి.
» స్టైపెండ్: నెలకు రూ.12,500.
» ఎంపిక విధానం: మెరిట్, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఇంటర్వ్యూ తేది: 13.08.2025.
» ఇంటర్వ్యూ వేదిక: సెంటర్ ఫర్ లెర్నింగ్–డెవలప్‌మెంట్(సీఎల్‌డీ), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జలహళ్లి పోస్ట్, బెంగళూరు–560013 చిరునామాకు పంపించాలి.

పదిలో ముగ్గురే గ్రాడ్యుయేట్లు!

పదిలో ముగ్గురే.. అవును మీరు చదువుతున్నది నిజమే. దేశంలో పది మంది యువతలో ముగ్గురు మాత్రమే డిగ్రీ, ఆపై వరకు చదువుకున్నారు. మిగిలిన వారంతా ఇంటర్/డిప్లొమాకే పరిమితమవుతున్నారు. దేశంలో 15-29 సంవత్సరాల మధ్య వయసు గల యువత సుమారు 42 కోట్ల మంది ఉన్నారు. మొత్తం జనాభాలో వీరి వాటా దాదాపు 29%. వీరిలో సుమారు కోటికి పైగా నిరక్షరాస్యులు ఉన్నారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్



- మిగిలిన వారంతా ఇంటర్/డిప్లొమాకే పరిమితం
- ఉన్నత చదువులకు పల్లె యువత చాలా దూరం
- నిరక్షరాస్యులుగా 1.3 కోట్ల మంది యువత

ఒక వ్యక్తి ఆలోచనలను తీర్చిదిద్దడంలో సహాయపడే కీలక అంశాల్లో విద్య ఒకటి. ముఖ్యంగా యువత.. దేశంలో ఉత్పాదక శక్తులుగా, విలువైన మానవ వనరులుగా, వినూత్న పౌరులుగా మారడానికి వీలు కల్పించే ఆయుధం కూడా అదే. అలాంటి విద్య.. ప్రత్యేకించి ఉన్నత విద్య మనదేశంలో ఇప్పటికీ గ్రామీణులకు అందని ద్రాక్షలానే ఉంది. అక్షరాస్యత స్థాయిలు స్థిరంగా పెరుగుతున్నప్పటికీ దేశవ్యాప్తంగా సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులో ఉన్న విద్య నాణ్యత ఇప్పటికీ ఆశించిన స్థాయిలో లేదని 'పీపుల్ రీసెర్చ్ ఆన్ ఇండియాస్ కన్స్యూమర్ ఎకానమీ' (పీఆర్ఐసీఈ) విడుదల చేసిన 'నావిగేటింగ్ ది యూత్ ఫ్రాంటియర్' అనే పరిశోధనా పత్రం వెల్లడించింది. ఈ విషయంలో పట్టణాలకు, పల్లెలకు మధ్య అసమానత స్పష్టంగా కనిపిస్తోందని తెలిపింది.

ఉన్నత చదువులు పట్టణాలకే..

దేశవ్యాప్తంగా 2024-25 నాటికి మొత్తం యువతలో 24% మంది.. అంటే సుమారు 9.9 కోట్ల మంది డిగ్రీ పూర్తి చేశారు. వీరిలో గ్రామీణ ప్రాంతాల వారి వాటా 52 శాతం. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా దాదాపు 3 కోట్ల మంది అందుకున్నారు. వీరిలో 66 శాతం పట్టణవాసులే కావడం గమనార్హం. ఇతర ఉన్నత చదువులు చదివిన 20 లక్షల మంది యువతలో పట్టణ ప్రాంతాలవారు ఏకంగా 85 శాతం ఉన్నారు. అంటే ఉన్నత చదువులు పట్టణాలకే పరిమితం అవుతున్నట్టు స్పష్టం అవుతోంది. మొత్తం యువతలో ప్రాథమిక విద్య అభ్యసించిన వారు 7.3 కోట్లు (17%), మెట్రిక్ 7.6 కోట్లు (18%), ఇంటర్ 9.3 కోట్లు (22%), టెక్నికల్/డిప్లొమా చేసినవారు 3.6 కోట్లు (9%) ఉన్నారు. యూత్‌లో 3% అంటే 1.3 కోట్ల మంది నిరక్షరాస్యులుగా మిగిలిపోయారు. ప్రాంతాలవారీగా చూస్తే డిగ్రీ, ఆపై చదువులు చదివిన వారు దక్షిణాది రాష్ట్రాల్లో అధికంగా ఉన్నారు.

విద్య స్థాయి పట్టణాలు, పల్లెల్లో ఇలా (శాతాల్లో)

చదువు	పట్టణాలు	పల్లెలు
నిరక్షరాస్యులు	2	4
ప్రాథమిక విద్య	11	21
మెట్రిక్	18	18
ఇంటర్	23	21
టెక్నికల్	10	7
గ్రాడ్యుయేషన్+	36	28

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా మొత్తం యువతలో గ్రాడ్యుయేషన్, ఆపై ఉన్నత చదువులు చదివిన వారు అధికంగా ఉన్నది ఎక్కడంటే.. (శాతాల్లో)

కేరళ	60
పుదుచ్చేరి	58
చండీగఢ్	55
తమిళనాడు	52
ఢిల్లీ	52
తెలంగాణ	44
హరియాణా	42
గోవా	41
ఆంధ్రప్రదేశ్	41
హిమాచల్ ప్రదేశ్	40

చదువు	సంఖ్య (కోట్లలో)	శాతం	గ్రామీణం
నిరక్షరాస్యులు	1.3	3	90
ప్రాథమిక విద్య	7.3	17	82
మెట్రిక్	7.6	18	69
ఇంటర్	9.3	22	66
టెక్నికల్/డిప్లొమా	3.6	9	60
గ్రాడ్యుయేషన్	9.9	24	52
పీజీ	3	7	34
ఇతర	0.2	0.4	15
మొత్తం	42	100	64

చదువులపరంగా స్త్రీలు, పురుషుల శాతం

చదువు	స్త్రీలు	పురుషులు
నిరక్షరాస్యులు	5	2
ప్రాథమిక విద్య	20	15
మెట్రిక్	19	17
ఇంటర్	22	22
సాంకేతిక విద్య	5	11
గ్రాడ్యుయేషన్+	29	33

దక్షిణాదిలో ఇలా (శాతాల్లో)

నిరక్షరాస్యులు	1
ప్రాథమిక విద్య	8
మెట్రిక్	14
ఇంటర్	21
సాంకేతిక విద్య	16
గ్రాడ్యుయేషన్+	39

ఏఐ, కోడింగ్‌కు సంస్కృతం స్ఫూర్తి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సాక్షి, హైదరాబాద్: భారతదేశ ఆత్మ సంస్కృత భాష అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభివర్ణించారు. విశ్వ విజ్ఞానానికి సంస్కృత భాష ఎంతో దోహదపడిందన్నారు. వేల ఏళ్లుగా దేశంలో కళలు, తత్వశాస్త్రం, వైద్యం, సాహిత్యం, పాలన రంగాల అభివృద్ధికి సంస్కృత భాష సేవలందించిందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కోడింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి సంస్కృత భాష స్ఫూర్తి కలిగిస్తోందని గవర్నర్ పేర్కొన్నారు. సోమవారం రాజ్‌భవన్‌లో సంస్కృత అకాడమీ సహకారంతో నిర్వహించిన సంస్కృత భాషా దినోత్సవంలో భాషా పండితులు, విద్యావేత్తలు, గురుకులాల విద్యార్థులు పాల్గొన్నారు. విజ్ఞాన సముపార్జనకు సంస్కృతం చోదకశక్తిగా పనిచేస్తుందన్నారు. భవిష్యత్తు విజయాలకు సంస్కృతం వంతెనగా కృషి చేస్తుందని తెలిపారు. ఇది కేవలం ప్రార్థనలకు సంబంధించిన భాష కాదని, ప్రజల భాషగా చూడాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. సంస్కృత భాషాభివృద్ధికి కృషి చేస్తున్న సంస్కృత అకాడమీ డైరెక్టర్ పెన్నా మధుసూదన్‌కు ఈ సందర్భంగా గవర్నర్ అభినందనలు తెలిపారు. సంస్కృత భాష పండితులు పాణిని, ఆచార్య కనడ, భాస్కరాచార్య, బ్రహ్మగుప్త, కౌటిల్యలకు ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉస్మానియా వర్సిటీ ఉపకులపతి ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాదీ టెన్త్‌లో ఇంటర్నల్ మార్కులు

- ఉత్తర్వులు జారీచేసిన పాఠశాల విద్యాశాఖ
- పాత విధానం కొనసాగింపు



సాక్షి, హైదరాబాద్: పదవ తరగతి పరీక్షల్లో ఈ ఏడాది కూడా అంతర్గత మార్కుల విధానం కొనసాగుతుందని పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ఈమేరకు ఆయన సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. థియరీ మార్కులు 80 ఉంటే, ఇంటర్నల్ మార్కులు 20 ఉంటాయని పేర్కొన్నారు. గత ఏడాది పరీక్షల సమయంలో అంతర్గత మార్కులు తీసివేస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ ప్రకటించడంతో అన్ని వైపుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన విషయం తెలిసిందే. పరీక్షల ముందు ఇలా నిర్ణయం తీసుకోవడాన్ని అన్ని వర్గాలు వ్యతిరేకించాయి. దీంతో గత ఏడాది మాత్రం ఇంటర్నల్ మార్కులు ఉంటాయని, 2025-26లో వీటిని తీసివేసి, వంద మార్కులకు థియరీ పేపర్ ఇస్తామని ఆ శాఖ వెల్లడించింది. కానీ ఈ సంవత్సరం కూడా పాత విధానాన్నే కొనసాగిస్తున్నట్టు తాజాగా ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ఇంటర్నల్ మార్కులను పాఠశాల పరిధిలో వేస్తారు.

96 లక్షల మందికి ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు: దామోదర



బంజారాహిల్స్ (హైదరాబాద్): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. షేక్‌పేట సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ పాఠశాలలో జాతీయ నులి పురుగుల దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ నెల 18 వరకు రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 96 లక్షల 17 వేల మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లను అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 35,700 అంగన్‌వాడీ కేంద్రాల్లో, 52,165 వివిధ పాఠశాలల్లో నులి పురుగుల నివారణ కార్యక్రమం చేపట్టనున్నట్లు వివరించారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ హరిచందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాలుగు గంటలపాటు రానా విచారణ

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కేసులో ప్రశ్నించిన ఈడీ అధికారులు



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రచారం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సినిమా హీరో దగ్గుబాటి రానాను 4 గంటలపాటు ప్రశ్నించారు. విజయ్ దేవరకొండ ఏ23 గేమింగ్ యాప్‌ను ప్రమోట్ చేయగా రానా దగ్గుబాటి చైనాకు చెందిన జంగ్లీ రమ్మీని ప్రమోట్ చేసినట్లు ఇప్పటికే పోలీసులు గుర్తించారు. అధికారుల సూచన మేరకు బషీర్‌బాగ్‌లోని ఈడీ జోనల్ కార్యాలయానికి రానా సోమవారం ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఆయనను విచారించింది. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్‌లో భాగంగా చేసుకున్న అగ్రిమెంట్లు, బ్యాంక్ స్టేట్‌మెంట్ల ఆధారంగా ఈడీ అధికారులు ప్రశ్నించారు. మధ్యాహ్నం 3గంటల వరకు స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. అనుమానాస్పద లావాదేవీల గురించి ఆరా తీశారు. ఇతర రాష్ట్రాల అకౌంట్ల నుంచి జరిగిన డిపాజిట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు అందించాలని సూచించారు. ఇదే కేసులో జూలై 30న ప్రకాశ్‌రాజ్, ఈనెల 6న విజయ్ దేవరకొండలను ఈడీ విచారించింది. ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ తరహాలోనే రానాను ఈడీ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. సెలబ్రిటీల అకౌంట్లలో పెద్దమొత్తంలో డిపాజిట్ అయిన నగదు, ఇతర ఖాతాలకు నగదు బదిలీపై ఆరా తీస్తున్నారు.

నేడు 'హ్యామ్ ప్రాజెక్ట్' రోడ్ షో

బ్యాంకర్లు, వర్క్ ఏజెన్సీలకు విధి విధానాలు వివరించనున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రహదారుల నిర్మాణంలో కొత్తగా ప్రవేశపెడుతున్న హైబ్రిడ్ యాన్యుయిటీ మోడ్ (హ్యామ్) విధానానికి సంబంధించి మంగళవారం ఉదయం 10 గంటలకు హెచ్ఐసీసీ న్యాక్ ఆడిటోరియంలో 'హ్యామ్ ప్రాజెక్ట్'రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా బ్యాంకర్లు, కాంట్రాక్టర్లు, వర్క్ ఏజెన్సీలకు దీని విధి విధానాలు, ప్రత్యేకతలు, ప్రణాళికలు, నిర్మాణ కాలం, అర్హతలు, ఎంపిక విధానం గురించి రోడ్లు, భవనాలు, పీఆర్ఆర్‌డీ అధికారులు వివరిస్తారు. ఇది ఒక రకంగా ప్రీ-బిడ్ మీటింగ్ తరహాలో నిర్వహిస్తున్న సమావేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. కాగా, ఈ ప్రాజెక్టుల్లో ప్రభుత్వ వాటా 40 శాతం కాగా, మిగిలిన 60 శాతం నిధులను కాంట్రాక్టర్లు లేదా ఏజెన్సీలే సమీకరించుకోవాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయ్యాక 15 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యత సైతం కాంట్రాక్టర్లదే. గతంలో హ్యామ్ విధానం కేవలం జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రమే అమలుకాగా దీనిని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలనిప్రభుత్వం నిర్ణయించింది.

'సినీ' సమస్యల పరిష్కారానికి కమిటీ

- నిర్మాతలు, ఫెడరేషన్ సభ్యులు పట్టువిడుపుతో వ్యవహరించాలి
- మా ప్రభుత్వం కార్మికుల పక్షాన ఉంటుంది
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి
- సినిమా సంఘాలతో మంత్రి భేటీ

సాక్షి, హైదరాబాద్: సినీ పరిశ్రమలో సమస్యలపై ఫెడరేషన్, ఫిలిం చాంబర్ కలిసి కూర్చొని మాట్లాడుకోవాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. ఇరుపక్షాలు పట్టువిడుపుతో వ్యవహరించాలని సూచించారు. కోమటిరెడ్డి సోమవారం సచివాలయంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, నిర్మాతలు, వివిధ సినిమా సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, సినీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేయనున్నామని, ఈ కమిటీ అన్ని పక్షాలతో చర్చలు జరుపుతుందన్నారు. సినిమా, వినోద రంగంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కాపాడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్నో అందమైన ప్రదేశాలున్నాయని, వాటిని షూటింగ్‌లకు ఉపయోగించుకోవచ్చని చెప్పారు. దీనివల్ల స్థానిక ప్రజలకు ఆదాయం వస్తుందని, అలాగే, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు. సినిమా కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉందని, అలాగే, పరిశ్రమలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఆలోచనతో ఉందని చెప్పారు. బుధవారం నుంచి షూటింగ్‌లు పునఃప్రారంభమవుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మెకు వెళ్లడం సరైన మార్గం కాదన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ ఫిలిం హబ్‌గా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని మంత్రి పునరుద్ఘాటించారు. పేద కార్మికులకు ఇళ్లు ఇవ్వాలని, మౌలిక సదుపాయాలు కల్పించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారన్నారు. ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ, అన్ని పక్షాల మధ్య ఐక్యత అవసరమని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ ఫిలిం హబ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని సంఘాలను కోరారు.



సోమవారం సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన సినిమా సంఘాల ప్రతినిధులు. చిత్రంలో దిల్‌రాజు

మంత్రి సానుకూలంగా స్పందించారు: ఫిల్మ్ ఫెడరేషన్

సమావేశం అనంతరం ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్, ఇతర సభ్యులు మీడియాతో మాట్లాడారు. 'రేపు (మంగళవారం) తుది చర్చలున్నాయి. తుది నిర్ణయం వస్తుంది. ఈ సమావేశానికి మా ఫెడరేషన్ కమిటీ సభ్యులు వెళ్తారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు'అని అనిల్ చెప్పారు. ఇతర సభ్యులు మాట్లాడుతూ, 'మా పరిస్థితి మంత్రికి వివరించాం. పలు అంశాలకు మంత్రి సానుకూలంగా స్పందించారు. మేము చెప్పిన సమస్యలపై నిర్మాతలతో మంత్రి ఫోన్ చేసి చెప్పారు. తదుపరి భేటీలో సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాం'అని పేర్కొన్నారు.

అక్కడ సినిమా వాళ్లే ఉండాలి

హైదరాబాద్ చిత్రపురి కాలనీలో సినిమా వాళ్లు మాత్రమే నివాసం ఉండాలని, అక్కడ సినిమా రంగానికి చెందని వారు ఉంటే వారిని ఖాళీ చేయిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. సినీ సంఘాలతో చర్చల తరువాత కోమటిరెడ్డి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. శ్రీశైలం ఎడమగట్టు సొరంగం కూలాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ క్షుద్రపూజలు చేశారని ఆరోపణలు చేశారు. కేసీఆర్ కారణంగానే సొరంగం కూలిందన్నారు. పదేళ్లు సీఎంగా ఉన్నా కేసీఆర్ ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని ఆరోపించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని లూటీ చేశారని, వచ్చే ఎన్నికల్లో కిలో బంగారం ఇచ్చినా బీఆర్ఎస్ గెలిచే అవకాశం లేదని జోస్యం చెప్పారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



యాదాద్రి భువనగిరి జిల్లా జూలూరు వద్ద మూసీ వరదలో వ్యర్థాలు



రుద్రవెల్లి–జూలూరు మధ్యలో లెవల్ బ్రిడ్జి వద్ద హైదరాబాద్ నుంచి మూసీ వరదతో వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు

మూసీ.. విషతుల్యం

కొట్టుకొస్తున్న విషపూరిత రసాయనాలు

గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు • పునరుజ్జీవనంతోనే మనుగడ

సాక్షి, యాదాద్రి: జీవం పోసిన నదే.. జీవానికి ఆటంకం కలిగిస్తోంది. ప్రజల జీవితాలనే సవాల్ చేస్తోంది. ఒకప్పుడు స్వచ్ఛమైన జలంతో ప్రజల దాహార్తి తీర్చిన మూసీ ఇప్పుడు విషతుల్యంగా, వ్యర్థాలకు అడ్డాగా మారింది. గుర్రపుడెక్క, చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు.. మూసీ వరదలో కొట్టుకొచ్చి జిల్లా ప్రజలకు తలనొప్పిగా మారాయి. రుద్రవెల్లి– జూలూరు, భీమలింగంలో లెవల్ బ్రిడ్జిల వద్ద వరద ప్రవాహానికి అడ్డుకట్టగా మారింది. దీంతోపాటు రసాయన పరిశ్రమలు, ఫార్మా సంస్థలు, అరిగిన వాహనాల టైర్లు లాంటి వ్యర్థాలు జిల్లా ప్రజలకు మరణశాసనం రాస్తున్నాయి. విషపూరిత వ్యర్థాలు మూసీలో కలవడం వల్ల జలజీవాలు, పంటలు నాశనమవుతున్నాయి. మూసీని పునరుజ్జీవింపజేస్తామన్న పాలకుల హామీల అమలుకు జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు.

250 కిలోమీటర్ల దూరం..

రంగారెడ్డి జిల్లా వికారాబాద్, అనంతగిరి గుట్టల్లో ఆవిర్భవించిన మూసీ నది రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల మీదుగా మొత్తం 250 కిలోమీటర్ల దూరం ప్రవహిస్తోంది. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి వద్ద కృష్ణా నదిలో మూసీ నది కలుస్తుంది. జంట నగరాల నుంచి నిత్యం మిలియన్ లీటర్ల వ్యర్థ జలం మూసీలో కలుస్తుంది. ప్రభుత్వం సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది.

రసాయనాలతో విషతుల్యం

హైదరాబాద్ జంట నగరాల్లో 500కు పైగా రసాయన సంస్థలున్నాయి. నాచారం, కాటేదాన్, ఎల్‌బీ నగర్, జీడిమెట్ల పారిశ్రామిక వాడలు, ఫార్మా సంస్థలు విడుదల చేసే నానా రకాల రసాయన వ్యర్థాలను వానాకాలం వచ్చే దాక నిల్వ చేస్తున్నాయి. వానలు కురవగానే మూసీలోకి గుట్టు చప్పుడు కాకుండా వదులుతున్నాయి. దిగువనున్న రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మూసీ నీరు నల్లగా నురగలు గక్కుతూ పారుతోంది. పశువులు ఆ నీరు తాగితే చాలు అనారోగ్యం పాలవడంతో పాటు చనిపోతున్నాయి. విష పదార్థాలు చేరి చెరువుల్లోని చేపలు ఆక్సిజన్ అందక చనిపోతున్నాయి. రోజూ జంట నగరాల నాలాల నుంచి సుమారు వందల మిలియన్ లీటర్ల మురుగు నీరు నేరుగా మూసీలో కలుస్తోంది. దీంతో మూసీ నీరంటేనే విషంతో సమానం అన్న పరిస్థితి నెలకొంది.

రసాయనాలు శుద్ధి చేయలేని ట్రీట్‌మెంట్ ప్లాంట్లు

మురుగునీటి శుద్ధి కేంద్రాలను (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) ఏర్పాటు చేసినా ఆశించిన ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికే నాగోల్, అంబర్‌పేట, నల్ల చెరువు, అత్తాపూర్‌ల వద్ద సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. కానీ ఇవి కేవలం మురుగు నీటిని కొంతశాతం మాత్రమే శుద్ధి చేస్తున్నాయి. కంపెనీలు వదిలే జింక్, సీసం, కాపర్, క్రోమియం, ఆర్సెనిక్, ఐరన్, క్యాడ్మియం, నికెల్, లెడ్ లోహాల నైట్రేట్, సల్ఫేట్ లాంటి 12 రకాల భార రసాయన పదార్థాలను శుద్ధి చేయలేవు. ఇవన్నీ ప్రస్తుతం వస్తున్న వరద నీటిలో కలిసి జిల్లాలో ప్రవహిస్తున్నాయి.

మేలు కంటే కీడే ఎక్కువ

మూసీ వల్ల ప్రజలకు మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోంది. రైతులు వరి, కూరగాయలు, పచ్చగడ్డి సాగు చేస్తున్నారు. వరికి తెగుళ్లు సోకుతున్నాయి. తాలు ఎక్కువగా వచ్చి దిగుబడిపై ప్రభావం చూపుతోంది. ఇక్కడ పెంచిన కూరగాయలు తింటే ఆరోగ్య సమస్యలు, భూగర్భ జలాల్లో కలిసిన మూసీ నీటిని తాగితే కీళ్లు, చర్మం, మూత్రపిండాలు, గర్భకోశ వ్యాధులు సోకుతున్నాయి. ఈ నీటితో పెరిగిన పచ్చిగడ్డి తిన్న పశువుల పాలు కూడా కలుషితమే. పశువులు, చేపలు మృత్యువాత పడుతున్నాయి. నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గి చేపలు మృత్యువాత పడుతున్నాయి. మూసీ కలుషిత నీటిని పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాల రంగులద్దకానికి వినియోగిస్తే నాణ్యత దెబ్బ తింటోంది.



యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం చిన్నరావుల పల్లి వద్ద పచ్చని పొలాల పక్కన మూసీలో పారుతున్న రసాయనాల వ్యర్థాలు

కార్మికుల చేతుల్లో కంపెనీ భవిష్యత్

- అప్రమత్తంగా లేకుంటే నష్టాలు తప్పవు
- మహిళా ఉద్యోగులకు గనుల్లో విధులు
- ఉద్యోగులను అప్రమత్తం చేస్తున్న సింగరేణి యాజమాన్యం
- నేటి నుంచి మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీల పర్యటన

గోదావరిఖని: వరుస లాభాల్లోని సింగరేణి బొగ్గు గనుల సంస్థ భవిష్యత్‌లో గడ్డు పరిస్థితులు ఎదుర్కోబోతోందని, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండకుంటే నష్టాలు తప్పవని యాజమాన్యం చెబుతోంది. ఈ పరిస్థితులను కార్మికులకు వివరించి అప్రమత్తం చేస్తోంది. కొత్తగా చేరుతున్న మహిళా ఉద్యోగులు భూగర్భగనుల్లో విధులు నిర్వహించాల్సిందేనని చెబుతోంది. భూగర్భగనుల్లో నష్టాలు తగ్గించి, ఓసీపీల్లో భారీ యంత్రాల పనిగంటలు పెంచి ఉత్పత్తి వ్యయం తగ్గించాలని యోచిస్తోంది. ప్రస్తుత సవాళ్లు, ప్రణాళికలను కార్మికుల ముందుంచాలని నిర్ణయించింది.

నేటి నుంచి మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీల పర్యటన

గతేడాది ఉత్పత్తి, 2025–26లో నిర్దేశిత లక్ష్యం, ఇప్పటివరకు సాధించింది, భూగర్భగనుల వినియోగం, ఓసీపీల్లో భారీయంత్రాల వినియోగం, బొగ్గు నాణ్యత, మార్కెటింగ్ సవాళ్లు, కంపెనీ భవిష్యత్ ప్రణాళిక, మహిళా ఉద్యోగులు, సంక్షేమ పథకాల గురించి వివరించడానికి మంగళవారం నుంచి మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీలు పర్యటించనున్నాయి. మొత్తం 11 ఏరియాల్లోని గనులు, డిపార్ట్‌మెంట్లలో ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో కార్మికుల ముందుకు వెళ్లారు.

మహిళా ఉద్యోగులపై ప్రత్యేక దృష్టి

సింగరేణిలో 2,050 మంది మహిళా ఉద్యోగులు ఉన్నారు. వీరందరి సేవలను ఉత్పత్తికి అనుబంధంగా అన్ని షిఫ్టుల్లో వినియోగించాలని యాజమాన్యం యోచిస్తోంది.



హైదరాబాద్‌లోని సింగరేణి భవన్

మహిళా ఉద్యోగుల వివరాలు

మేనేజ్‌మెంట్ ట్రెయినీ (మైనింగ్)	37
మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ఈ అండ్ ఎం)	07
జేఎంఈటీ	21
మెకానికల్	01
ఎలక్ట్రికల్	05
ఫిట్టర్ ట్రెయినీ	09
ఎలక్ట్రికల్ ట్రెయినీ	19
బదిలీ వర్కర్లు, ఇతరులు	1,041

వ్యాపార విస్తరణపై దృష్టి..

సింగరేణి వ్యాపార విస్తరణపై ప్రణాళిక రూపొందిస్తోంది. సోలార్ సహా ఇతర రాష్ట్రాల్లోనూ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మూసివేసిన మేడిపల్లి ఓసీపీల్లో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ (పీఎస్‌పీ) నిర్మించనుంది. బొగ్గు నుంచి అమ్మోనియం నైట్రేట్, కార్బన్ డై ఆక్సైడ్ నుంచి మిథనాల్ ఉత్పత్తి చేయాలని యోచిస్తోంది. రామగుండంలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, 500 మెగావాట్ల పవన విద్యుత్, మణుగూరులో జియో థర్మల్‌ప్లాంట్, విదేశాల్లో గనుల కోసం అన్వేషణ, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం, మెటల్ నాన్ మెటల్, క్రిటికల్ మినరల్స్‌పై దృష్టి సారించింది.

ఏడు నూతన గనులకు శ్రీకారం..

భవిష్యత్‌లో ఏడు గనులు మూసివేతకు గురవుతాయని, ఈక్రమంలో 7 కొత్త గనులు ప్రారంభించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. కొత్త గనుల ద్వారా 21.90 మిలియన్ టన్నుల బొగ్గు తీయాలని యోచిస్తోంది.

పోటీనిస్తున్న కోలిండియా సంస్థలు

సింగరేణి మార్కెట్‌లో తీవ్రమైన పోటీ ఎదుర్కొంటోంది. ప్రస్తుతం జీ–8, 9, 10 గ్రేడ్ రకం బొగ్గు ఎక్కువగా లభిస్తోంది. టన్ను ధర రూ.6,405 ఉండగా, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో రూ.3,553, కోలిండియాలో రూ.2,605 పలుకుతోంది. జీ–9 గ్రేడ్ టన్ను ధర సింగరేణిలో రూ.5,559 ఉంటే వెస్టర్న్ కోల్‌ఫీల్డ్‌లో రూ.3,031, కోలిండియాలో రూ.2,169 ఉంది. ఈలెక్కన చూస్తే సింగరేణి కన్నా రెండు రెట్లు తక్కువగా బయటి బొగ్గు ధర ఉందని యాజమాన్యం చెబుతోంది. ప్రధాన వినియోగదారులైన ఎన్టీపీసీ కూడా వేరే సంస్థల బొగ్గును తీసుకునేందుకు నిర్ణయించి ఇప్పటికే తెప్పించుకుంటున్నాయని తెలిపారు.

2025-26 ఆర్థిక సంవత్సరం సమాచారం

ఉత్పత్తి లక్ష్యం (మిలియన్ టన్నుల్లో)	72
ఓసీపీల ద్వారా ఉత్పత్తి (మిలియన్ టన్నుల్లో)	64.90
భూగర్భగనుల ద్వారా (లక్షల టన్నుల్లో)	71
మట్టితొలగింపు (లక్షల క్యూబిక్ మీటర్లలో)	5,020
రవాణా చేసిన బొగ్గు (లక్షల టన్నుల్లో)	72
ఉత్పాదక (టన్నుల్లో)	6.78

పనితీరు మెరుగుపర్చుకోవాలి



ఉద్యోగులు పనితీరు మెరుగుపర్చుకోవాలి. రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయాలి. మార్కెట్‌లో పోటీ సంస్థలు తక్కువ ధరకే బొగ్గు ఉత్పత్తి చేస్తున్నాయి. భూగర్భ గనుల్లో నష్టాలు తగ్గాలి. ఓసీపీల్లో భారీయంత్రాల సామర్థ్యం పెంచాలి. ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు సమష్టిగా తోడ్పాటు అందించాలి.

– ఎన్.బలరాం, సీఎండీ, సింగరేణి

ప్రకృతిలో పరుగులు పెడుతున్న రైలు



అందాల మధ్య అద్భుత ప్రయాణం

దూరంగా గుట్టలు..
ఎటుచూసినా పచ్చదనం..
ప్రకృతి సోయగాల మధ్య
పరుగులు పెడుతున్న రైలును
చూసినపుడు మనసు మురిసిపోతుంది.
పెద్దపల్లి జిల్లా రామగుండం
మండలం కుందనపల్లి
గ్రామం వద్ద పచ్చని ప్రకృతిలో
రైలు ప్రయాణం
మంత్రముగ్ధుల్ని చేస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



త్రివర్ణ కాంతుల్లో వెలిగిపోతున్న రామప్ప దేవాలయం

త్రివర్ణ కాంతుల్లో రామప్ప దేవాలయం

ప్రపంచ వారసత్వ సంపద కలిగిన రామప్ప దేవాలయం త్రివర్ణ కాంతుల్లో వెలిగిపోతోంది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి ఆలయానికి మూడు రంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటుచేశారు. ఈనెల 15 వరకు విద్యుత్ కాంతులతో ఆలయం మెరిసిపోనుంది.

– వెంకటాపురం(ఎం)



సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 'రాజీవ్ సివిల్స్ అభయ హస్తం 'పథకం పేరుతో సివిల్స్ మెయిన్స్‌కు సన్నద్ధమయ్యే 178 మందికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించే చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రజాభవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు

ఎన్నికల కమిషన్‌లో దొంగలు దూరారు

ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కమిషన్‌లో దొంగలు దూరారని, బీజేపీతో కలిసి ఓట్ల చోరీకి పాల్పడ్డారని ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ ఆరోపించారు. ఈ చోరీ గురించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ గొంతెత్తుతుంటే బీజేపీ, ఆ పార్టీ అనుబంధ సంఘాలు మాటల దాడి చేయడం శోచనీయమని అభిప్రాయపడ్డారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రతిపక్ష నేతను, విపక్ష ఎంపీలను అరెస్టు చేయడం దారుణమన్నారు. ఈ ఘటన జరిగిన రోజును బ్లాక్‌డేగా పరిగణించాలన్నారు. ఓట్ల చోరీపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు వెళ్తుంటే.. ఓట్లు చోరీ చేసి అధికారంలోకి వచ్చిన వాళ్లు అడ్డుకోవడం, ఈసీని కాపాడే ప్రయత్నం నీతిమాలిన చర్యగా అభివర్ణించారు. రాహుల్‌గాంధీ ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు లేదని ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ వ్యాఖ్యానించారు.

విదేశీ విద్యకు సాయం: కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: ఉన్నత విద్య కోసం విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుకునే వారికి కేంద్రం అందించే స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లతో దేశవ్యాప్తంగా గత మూడేళ్లలో 527 మంది విద్యార్థులు లబ్ధి పొందారని కేంద్ర విద్యాశాఖ తెలిపింది. ఇందులో తెలంగాణకు చెందిన విద్యార్థులు కూడా ఉన్నారని వెల్లడించింది. సోమవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డా.సుకాంత మజుందార్ ఈ వివరాలు వెల్లడించారు. ప్రతి స్కాలర్‌షిప్‌కు ప్రత్యేక అర్హత ప్రమాణాలు, ఎంపిక విధానం ఆయా మంత్రిత్వ శాఖల అధికారిక వెబ్‌సైట్లలో లభిస్తాయని తెలిపారు.



ఫౌండేషన్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఐసీఏఆర్ మాజీ కార్యదర్శి డాక్టర్ ఛబీలేంద్ర రౌల్ తదితరులు

ఆహార కొరత నుంచి స్వావలంబన దిశగా...

- భారత్‌ది అద్భుత ప్రయాణం
- ఐసీఏఆర్ మాజీ కార్యదర్శి డాక్టర్ ఛబీలేంద్ర రౌల్
- 115వ 'ఫౌండేషన్ కోర్స్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్' ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: భారతదేశం 1960లో ఆహార కొరత స్థితి నుంచి ఆహార స్వావలంబన, ఆహార భద్రత దిశగా అద్భుత ప్రయాణం సాగించిందని సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యునల్ సభ్యుడు, ఐసీఏఆర్ మాజీ కార్యదర్శి డాక్టర్ ఛబీలేంద్ర రౌల్ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోషకాహారం, నాణ్యతతో కూడిన ఆహారం అందించడం, వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కోవడం వంటి వాటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్)– జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ అకాడమీ (నార్మ్)లో 115వ 'ఫౌండేషన్ కోర్స్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్' సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఆగస్టు 11 నుంచి నవంబర్ 25 వరకు కొనసాగే ఈ శిక్షణా కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎంపికైన 108 మంది శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారు. 22 రాష్ట్రాలకు చెందిన 35 వ్యవసాయ విభాగాలకు వీరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రౌల్ మాట్లాడుతూ సహజ వనరుల సంరక్షణ, యాంత్రీకరణ, సామాజిక–ఆర్థిక ప్రభావాల గురించి వివరించారు. రైతులకు, సమాజానికి మేలు చేసే ప్రాథమిక, అనువర్తిత పరిశోధన చేయాలని కొత్త శాస్త్రవేత్తలకు సూచించారు. ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఫిషరీస్ సైన్స్ అండ్ అగ్రికల్చరల్ ఎడ్యుకేషన్) డాక్టర్ జయకృష్ణ జేనా ఆధునిక వ్యవసాయ వ్యవస్థల్లో సవాళ్లు, అవకాశాలను వివరించారు. రిటైర్డ్ క్షిపణి శాస్త్రవేత్త, మాజీ డీఆర్‌డీఓ డైరెక్టర్, కేర్ ఫౌండేషన్ డైరెక్టర్ అరుణ్ తివారీ మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తలు దేశానికి అత్యంత విలువైన వనరులలో ఒకరని పేర్కొన్నారు. అకాడమీ తాత్కాలిక డైరెక్టర్ డాక్టర్ గోపాల్‌లాల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



జోలాపుట్టు.. అదిరేట్టు..

ప్రకృతి అందాలకు నెలవైన ఆంధ్రా ఒడిశా సరిహద్దులో మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు జలాశయం వద్ద ప్రకృతి అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వేల ఎకరాల్లో విస్తరించిన జలాశయంలో ఉన్న మత్స్యగెడ్డ పాయలు ద్వీపం మాదిరిగా ఆకట్టుకుంటున్నాయి. డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన ఈ దృశ్యాన్ని చూసినవారు అక్కడకు వెళ్లి జలాశయ అందాలను తనివితీరా వీక్షిస్తున్నారు.

– ముంచంగిపుట్టు



తెర్లాంలో చెత్తకుప్పలో పడేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్కూల్ బ్యాగులు

చెత్త కుప్పల్లో 'విద్యార్థి మిత్ర' బ్యాగ్‌లు

విజయనగరం జిల్లా తెర్లాం మండల కేంద్రంలోని జగనన్న కాలనీ సమీపంలో గల చెత్త కుప్పల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ద్వారా పాఠశాలల విద్యార్థులకు అందజేసిన స్కూల్ బ్యాగ్‌లు దర్శనమిచ్చాయి. జగనన్న విద్యా కిట్ల కంటే నాణ్యతకు అధిక ప్రాధాన్యమిచ్చి ఈ బ్యాగ్‌లను విద్యార్థులకు అందజేశామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రితో పాటు ఇతర నాయకులు గొప్పలు చెబుతున్నారు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. విద్యార్థి మిత్ర బ్యాగ్‌లు పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసి రెండు నెలలు కూడా పూర్తి కాలేదు. ఇంతలోనే బ్యాగ్‌లు చిరిగిపోయి ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. దీంతో విద్యార్థులు తమ సొంత డబ్బులతో కొత్త స్కూల్ బ్యాగ్‌లు కొనుగోలు చేసి విద్యార్థి మిత్ర బ్యాగ్‌లను చెత్త కుప్పల్లో పడేస్తున్నారు. ఇలాంటి బ్యాగ్‌లు ఎందుకు పంపిణీ చేయాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

– తెర్లాం

క్లుప్తంగా...

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సీఈవోగా శేషగిరిబాబు

సాక్షి, అమరావతి: భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సీఈవోగా కార్మిక శాఖ కమిషనర్ శేషగిరి బాబుకు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చింది. ఈ మేరకు కార్మిక శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీడీసీఎఫ్ఎల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా రాజేష్ కుమార్

సాక్షి, అమరావతి: ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సీనియర్ అడ్వకేట్ గుండపు రాజేష్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి గొట్టరపు ప్రతిభా దేవి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు కొత్త మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి: పాలిటెక్నిక్‌లు, సాంకేతిక విద్యా సంస్థల్లో ప్రవేశాల నిబంధనల్లో మార్పులు చేస్తూ సోమవారం విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో ఆయా ఉపకులాలకు రిజర్వేషన్ల శాతాన్ని వివరిస్తూ మార్పులు చేసింది.

యాంటీ ర్యాగింగ్‌పై చైతన్యం తీసుకురావాలి

సాక్షి, అమరావతి: యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థుల్లో చైతన్యం తీసుకుని రావాలని మంత్రి సత్యకుమార్ ఆరోగ్య వర్సిటీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. సీనియర్‌లు కొత్తగా ప్రవేశాలు పొందే విద్యార్థులతో సత్ప్రవర్తనతో మెలిగే వాతావరణాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో తీసుకురావాలన్నారు.

మిట్టల్‌పై మోహం.. ప్రైవేటు దాహం

- విశాఖ ఉక్కును ఉద్ధరిస్తామంటూనే.. ప్రైవేటు జపం చేస్తున్న కూటమి సర్కారు
- రాయితీల కోసం దక్షిణాఫ్రికా ప్రభుత్వాన్ని బెదిరిస్తున్న మిట్టల్ స్టీల్స్
- రాయితీలు ఇవ్వకపోతే ప్లాంట్ మూసివేస్తామంటూ హెచ్చరికలు
- ఇక్కడా అదే తరహా బెదిరింపులుంటాయని విమర్శలు
- ఇప్పటికే మిట్టల్ ప్లాంట్‌కు రూ.28 వేల కోట్ల ప్రోత్సాహకాలిచ్చిన కూటమి
- స్టీల్‌ప్లాంట్‌కు తక్షణమే రూ.30 వేల కోట్ల సాయం కోరుతున్న ప్రజాసంఘాలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఉక్కు పరిశ్రమను ఉద్ధరిస్తామంటూ ఊదరగొడుతున్న చంద్రబాబు సర్కారు.. ఆ సంస్థను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రానికి పరోక్షంగా సహకరిస్తోంది. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసి తీరుతామని కేంద్ర ప్రభుత్వం తెగేసి చెబుతుండగా.. మరోవైపు ప్లాంట్‌కు కొద్ది దూరంలోనే మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. పరిశ్రమను నిలబెట్టేందుకు రూపాయి కూడా విదల్చని చంద్రబాబు.. మిట్టల్ స్టీల్స్‌పై వ్యామోహంతో ఏకంగా రూ.28 వేల కోట్ల ప్రోత్సాహకాలు అందించడం విస్మయానికి గురి చేస్తోంది. మొదట్లో కొద్దోగొప్పో రాయితీలు అడిగి ఆ తర్వాత ప్రభుత్వం నెత్తినెక్కి కూర్చుంటుంది మిట్టల్ సంస్థ. దక్షిణాఫ్రికాలో ప్లాంట్ ఏర్పాటు చేసి ఇప్పుడు గొంతెమ్మ కోర్కెలు మిట్టల్ సంస్థ కోరుతోంది. భవిష్యత్తులో ఏపీ పరిస్థితి కూడా ఇలా మారకముందే మేల్కొనాలని ప్రజాసంఘాలు సూచిస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్‌కు పునరుజ్జీవనంపై దృష్టి సారించకుండా మిట్టల్‌కు మోకరిల్లడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

నాడు ప్రగల్భాలు పలికి..

ఎన్నికల ముందువరకూ ఉక్కు ఉద్యమం సడలనివ్వనంటూ ప్రగల్భాలు పలికిన టీడీపీ, జనసేన నేతలు కూటమి పేరుతో గద్దెనెక్కిన తర్వాత విశాఖ ఉక్కును ముక్కలు చేసేందుకు ఏం చెయ్యాలో అన్నీ చేస్తోంది. ఓ వైపు కేంద్ర గనుల శాఖ మంత్రిత్వ శాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేసి తీరతామని మరోసారి కుండబద్దలుగొట్టింది. అయినా.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం ప్లాంట్ మూసివేసేందుకు పూర్తిగా సహకారం అందిస్తోంది. ఇందులో భాగంగానే విశాఖ ఉక్కుకు కొద్ది దూరంలో అనకాపల్లి జిల్లాలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందిస్తోంది. ప్రజలు, ఉద్యోగుల ఆందోళనలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నిరసనలను ప్రభుత్వం ఏమాత్రం ఖాతరు చేయకుండా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అండ్ కో మిట్టల్‌కు మోకరిల్లుతున్నారు. స్టేజ్–1లో మిట్టల్ పరిశ్రమ ఏర్పాటుకు ఏకంగా రూ.28 వేల కోట్ల ప్రోత్సాహకాలు అందించిన చంద్రబాబు ప్రభుత్వం.. ఆ సంస్థకు కావల్సిన సమస్త సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధమవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.





మిట్టల్‌పై ఎందుకంత మోజు?



మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం ఇప్పటికే వేల ఎకరాల భూముల్ని ధారాదత్తం చేసి.. ప్రజల జీవనోపాధి, జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. దశాబ్దాల చరిత్ర గల విశాఖ ఉక్కుని పరిరక్షించాలన్న ధ్యాస రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. సొంత గనులు కేటాయించాలని పదేపదే కోరినా పట్టించుకోని ఎంపీలు.. ఇప్పుడు మిట్టల్‌కు సొంత గనులు కేటాయించాలని కోరడం దుర్మార్గం. ప్రభుత్వ తీరు చూస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని పూర్తిగా బలహీనపరచడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. మిట్టల్ సంస్థపై చంద్రబాబు ప్రభుత్వం ఎందుకంత మోజు చూపిస్తోందో అర్థం కావడం లేదు. ఎంపీలు ప్రైవేటుకు ఊడిగం చేయడం హేయమైన చర్య. ఇప్పటికైనా కళ్లు తెరిచి స్టీల్ ప్లాంట్‌కు రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం తీసుకొచ్చి ఆంధ్రుల హక్కుని బతికించాలి.


– ఈఏఎస్ శర్మ, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి

మిట్టల్ బెదిరింపులు మామూలుగా ఉండవు

మిట్టల్ సంస్థ ప్లాంట్ ఏర్పాటు చేశాక ప్రభుత్వాన్నే బెదిరించే స్థాయికి చేరుకుంటుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే.. దక్షిణాఫ్రికాలో ఇదే మిట్టల్ సంస్థ అక్కడి ప్రభుత్వాన్ని బెదిరిస్తోంది. ఇప్పుడిస్తున్న రాయితీలు సరిపోవడం లేదనీ.. తాము కోరినంత రాయితీ, ప్రోత్సాహకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. లేదంటే ప్లాంట్ మూసేస్తామంటూ హెచ్చరిస్తోంది. దీంతో భయాందోళనలకు గురైన దక్షిణాఫ్రికా ప్రభుత్వం తప్పని పరిస్థితుల్లో 92 మిలియన్ డాలర్ల భారీ రాయితీలు కల్పించేందుకు అంగీకారం తెలిపింది. మిట్టల్‌ని పెంచి పోషిస్తే భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వంపైనా ఇలాంటి బెదిరింపులు తప్పవని ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కాగా.. కూటమి ఎంపీల తీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు ఒక్కసారి కూడా కూటమి ఎంపీలు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ వద్దకు వెళ్లలేదు. కానీ.. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు సకల సదుపాయాలు కల్పించాలని కోరేందుకు మాత్రం పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, విశాఖ ఎంపీ భరత్ నేతృత్వంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి వద్ద సాగిలపడ్డారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని ఏ ఒక్కరోజూ కోరని కూటమి ఎంపీలు మిట్టల్ ప్లాంట్‌కు మాత్రం సొంత ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని మోకరిల్లుతున్నారు. విశాఖ ఉక్కుపై కూటమి ఎంపీలు, ప్రభుత్వ తీరు చూసి విశాఖ ఉక్కు పరిరక్షణ సంఘాలు ఆగ్రహంతో రగిలిపోతున్నాయి.

- ధర్మవరానికి చెందిన 35 ఏళ్ల చేనేత కార్మికుడు చేయి ఉన్నట్టుండి పనిచేయలేదు. దీంతో ఆస్పత్రికి వెళ్లగా.. పరీక్షించిన వైద్యులు పక్షవాతం వచ్చినట్లు నిర్ధారించారు. అయితే సకాలంలో ఆస్పత్రికి వచ్చి ఉంటే పెను ప్రమాదం తప్పేదని తెలిపారు. కానీ నిత్యం మందులు వాడాలని సూచించారు. అనంతరం చిత్తూరు జిల్లాలో నాటువైద్యం చేయించుకున్నా.. ఫలితం లేకపోయింది. కాళ్లు, చేతులు నియంత్రణలోకి వచ్చినా.. మెదడులో సమస్యతో మాటలు సరిగా రావడం లేదు. దీంతో బెంగళూరులోని నిమ్హాన్స్‌లో చికిత్స చేయిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.
- అనంతపురానికి చెందిన 46 ఏళ్ల మహిళ వ్యక్తిగత పని నిమిత్తం ఇటీవల పుట్టపర్తికి వచ్చారు. ఉన్నఫలంగా కింద పడిపోగా ఎవరూ గుర్తించలేదు. రాత్రంతా వైద్యం అందక గదిలోనే ఉండిపోయింది. తెల్లవారిన తర్వాత శ్రీసత్యసాయి జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు పక్షవాతం వచ్చినట్లు తేల్చారు. అయితే అప్పటికే ఆలస్యం జరిగిందని.. నిత్యం మందులు వాడాల్సిందేనని పేర్కొన్నారు. అనంతరం ఆమె డిశ్చార్జ్ అయి అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పది రోజులు చేరారు. ఇప్పటికీ కాళ్లు, చేతులు నియంత్రణలో లేనట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ఇలా శ్రీ సత్యసాయి జిల్లాలో రోజూ ఎక్కడోచోట పక్షవాతం కేసులు బయటపడుతున్నాయి. ఒత్తిడితో కూడిన జీవనం...మద్యపానం, ధూమపానం, నిద్రలేమి తదితర సమస్యలతో మెదడు మొద్దుబారిపోతున్నట్లు తెలుస్తోంది.



మెదడు మొరాయిస్తోంది!

తీవ్ర ఒత్తిడితో అలసిపోతున్న బ్రెయిన్

- యుక్త వయసులోనే చాలా మందికి పక్షవాతం
- పాతికేళ్లలోపు వయసున్న వారూ బాధితులే
- అవగాహన లోపంతో సమస్య తీవ్రం
- ఆహార అలవాట్లు.. జీవనశైలే కారణమంటున్న వైద్యులు

సాక్షి, పుట్టపర్తి: ఉన్నట్టుండి శరీరం బిగుసుపోవడం, మూతి వంకర తిరగడం, కాళ్లు, చేతులు చచ్చుబడిపోవడం, ఒక్కోసారి గుండె కూడా పని చేయకపోవడం.. ఇలా శరీరంలో ప్రతి అవయవంపై ప్రభావం చూపుతున్న వ్యాధి పక్షవాతం. అప్పటి వరకు ఆనందంగా సాగిపోతున్న వారి జీవితాలను ఆకస్మాత్తుగా కుప్ప కూల్చేస్తోంది. వారి బతుకులను ఉన్నట్లుండి అంధకారంలోకి నెట్టేస్తోంది. పక్షవాతానికి గురైన కొందరు దివ్యాంగులుగా మిగిలిపోయి.. తీవ్ర అవస్థలు పడుతూ బతుకు బండి లాగుతున్నారు. ఇంకొందరు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు.

ఆహారపు అలవాట్లలో మార్పుతోనే..

మారిన ఆహారపు అలవాట్లు, రక్తపోటు, మధుమేహాన్ని నియంత్రించుకోవడంలో నిర్లక్ష్యం, వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించకపోవడం, సరైన సమయంలో తగిన వైద్యం పొందకపోవడంతో ఎక్కువ శాతం మంది పక్షవాతం బారిన పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. గతంలో ఎక్కువగా వృద్ధులు పక్షవాతానికి గురయ్యేవారని, ఇప్పుడు బాధితుల్లో పాతికేళ్ల లోపు వారూ ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెబుతున్నారు.

ముందస్తు సంకేతాలు ఇవే..

పక్షవాతాన్ని ఆంగ్లంలో పెరాలసిస్, వైద్య పరిభాషలో బ్రెయిన్ స్ట్రోక్ అని పిలుస్తారు. మెదడుకు రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడినప్పుడు కొన్ని లక్షణాలు బయటపడుతాయి. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారికి మెదడుకు రక్త సరఫరా తగ్గడంతో శరీరంలో తిమ్మిర్లు, ఒక కాలు, చేతిలో శక్తి తక్కువైనట్లు అనిపిస్తుంది. పూర్తిగా లేదా సరిగా మాట్లాడలేకపోతారు. ఇతరులు చెప్పింది అర్థం చేసుకోలేరు. చూపు మసకబారుతుంది. నడవలేరు. తీవ్ర తలనొప్పితో బాధపడతారు. ఈ లక్షణాలు కనిపించిన మూడు గంటల్లోపు ఆస్పత్రికి తీసుకెళ్తే రక్త ప్రసరణను పునరుద్ధరించి మెదడు ఎక్కువగా దెబ్బ తినకుండా వైద్యులు కాపాడుతారు.

'ఫ్యామిలీ డాక్టర్' దూరమై.. సమస్య తీవ్రమై

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో చాలా మందికి మేలు జరిగింది. ఇళ్ల ముంగిళ్లలోనే వైద్య సేవలు అందేవి. అలాగే డాక్టరే ఇంటి వద్దకు వచ్చి పరీక్షించి ఆరోగ్య సమస్య ఉన్నట్లు గుర్తిస్తే పరీక్షలు చేయించేవారు. ఫలితంగా జబ్బులను తొలిదశలోనే గుర్తించేవారు. వెంటనే చికిత్స తీసుకోవడం వల్ల చాలా వరకు ఉపశమనం లభించేది. కానీ కూటమి ప్రభుత్వం 'ఫ్యామిలీ డాక్టర్' విధానానికి మంగళం పాడింది. దీంతో రక్తపోటు, మధుమేహం గురించి ప్రాణంమీదకు వచ్చాకే తెలుస్తోంది. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. మెదడుకు చేటు చేసే బీపీ, షుగర్ పరీక్షలు 'ఫ్యామిలీ డాక్టర్'తో నిత్యం జరిగేవి. అందువల్లే అప్పుడు పక్షవాతం కేసులు కూడా బాగా తక్కువగా ఉండేవి. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది.

అవగాహన లోపంతోనే..

దేశంలో సగటున 10 శాతం మంది పక్షవాతం బారిన పడుతున్నట్లు పలు అధ్యయనాల ద్వారా తేలింది. అయితే అవగాహన లోపంతోనే చాలా మంది పక్షవాతం బారిన పడుతున్నారని తెలిసింది. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వారిలో 30 శాతం మంది శాశ్వత వైకల్యం పొందుతున్నారు. బాధితుల్లో 25 శాతం మంది 30 ఏళ్ల లోపు వారు ఉండటం అందరినీ కలవరానికి గురిచేస్తోంది. అలాగే 45 ఏళ్లు దాటిన వారిలో రిస్క్ ఎక్కువగా ఉంటోంది. మహిళల్లో 55 ఏళ్లు పైబడిన వారు ఎక్కువ ప్రమాదంలో పడుతారు.

జాగ్రత్తలివే..

- తరచూ బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలి. వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి.
- ఎక్కువ నీరసంగా ఉన్నట్లు అనిపిస్తే వెంటనే ఆస్పత్రిలో చేరాలి.
- గుండె, కిడ్నీ సమస్యలతో బాధపడే వారు వైద్య పరీక్షలు చేయించుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఒత్తిడికి దూరంగా ఉండాలి. ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి.
- రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.

వెంటనే వైద్యులను సంప్రదించాలి



మద్యం, సిగరెట్లు తాగే వారికి పక్షవాతం సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే అవగాహన కలిగి ఉండి వీలైనంత తొందరగా వైద్యులను సంప్రదిస్తే పక్షవాతం బారిన పడకుండా ఉండవచ్చు. ఇటీవల మధుమేహం, రక్తపోటు కారణంగా చాలా మంది యుక్త వయసులోనే పక్షవాతం బారిన పడుతున్నారు. ఆహార అలవాట్లూ చేటు తెస్తున్నాయి.

– డాక్టర్ ఫైరోజాబేగం, శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

పీపీపీ విధానాలతో పేదలపై మరింత భారం

ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రమణయ్య

సాక్షి, అమరావతి: ప్రభుత్వ రంగంలో సరైన వైద్యం అందక, ప్రైవేటు వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్న పేదలపై చంద్రబాబు ప్రభుత్వం పీపీపీ పేరిట మరింత భారం మోపుతోందని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.వి. రమణయ్య అన్నారు. పీపీపీ రూపంలో జరగబోయే మార్పులు పేదల ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ, నియోజకవర్గాల్లో పీపీపీ ఆస్పత్రుల ఏర్పాటు వంటి నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 24న విజయవాడలో జాతీయ సదస్సు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. సోమవారం విజయవాడలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ విధానాన్ని అవలంబించగా, వైద్య ఖర్చులు పెరగడమే తప్ప పేదలకు సరైన వైద్యం అందిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక గౌరవ అధ్యక్షులు డాక్టర్ సాయి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట సర్వేలో పూర్తిసమాచారం నమోదుచేయాలి

వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు

సాక్షి, అమరావతి: డిజిటల్ పంటల సర్వే (ఈ –పంట)లో పంటల సాగు, నీటి నిర్వహణ, భూ కమతాల సాగు వంటి పూర్తి వివరాలు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు చెప్పారు. ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులతో కలిపి ఈ–పంట నమోదుపై జిల్లా స్థాయిలో గురువారం ఆయన సమీక్ష చేశారు. ఈ–పంట నమోదు వేగవంతం చేయాలని, ఇప్పటి వరకు 1,65,843 మంది రైతులకు సంబంధించిన 4,41,627 ఎకరాల విస్తీర్ణంలో పంటల వివరాలను నమోదు చేశారని పేర్కొన్నారు. బహు వార్షిక ఉద్యాన పంటలను ఈ ఏడాది నుంచి తప్పనిసరిగా నమోదు చేయాలని పేర్కొన్నారు. అంతరపంటల నమోదు చేస్తున్నప్పుడు భూ విస్తీర్ణం మళ్లీ నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గట్ల మీద, చేనులో ఉన్న పండ్ల మొక్కల విస్తీర్ణాన్నీ నమోదు చేయాలని చెప్పారు. ఈ –కేవైసీ ద్వారా వేలి ముద్రలు ప్రస్తుతం తప్పనిసరి కాదన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అదనపు సంచాలకులు విజయలక్ష్మి, ఎస్.వెంకటేశ్వర్లు, హరనాథ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ల సమావేశానికి నివేదికలు పంపాలి

కేంద్ర కేబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్

సాక్షి, అమరావతి: త్వరలో నిర్వహించనున్న 5వ జాతీయ చీఫ్ సెక్రటరీ(సీఎస్)ల సమావేశానికి సంబంధించి ప్రతి రాష్ట్రం నుంచి ఐదు నిర్దిష్ట నివేదికలు వెంటనే పంపాలని కేంద్ర కేబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్ ఆదేశించారు. జాతీయ చీఫ్ సెక్రటరీల సమావేశం ఏర్పాట్లు, వివిధ చట్టాల డీ రెగ్యులేషన్(నియంత్రణల సడలింపు) తదితర అంశాలపై చర్చించేందుకు ఆయన సోమవారం ఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, కేంద్ర పాలిత ప్రాంతాల అడ్మినిస్ట్రేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమనాథన్ మాట్లాడుతూ గత సమావేశంలో నిర్దేశించిన అంశాలకు సంబంధించిన ఫీడ్ బ్యాక్ నివేదికలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ ఇప్పటికే 21 అంశాలకు సంబంధించి నివేదికలను సమర్పించామని తెలిపారు. ఈ సమావేశంలో హోం, ఎంఏయూడీ శాఖల ముఖ్య కార్యదర్శులు కుమార్ విశ్వజిత్, ఎస్.సురేష్‌కుమార్, ఐ అండ్ ఐ కార్యదర్శి డాక్టర్ ఎస్.యువరాజ్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్, కార్మిక శాఖ కమిషనర్ శేషగిరిబాబు, న్యాయశాఖ అదనపు కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడల్లో పార్కింగ్ నిబంధనల సడలింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ పరిధిలోని పారిశ్రామిక వాడల్లో పార్కింగ్ నిబంధనలను ప్రభుత్వం సడలించింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఎంఎస్ఎంఈలు ఎదుర్కొన్న సమస్యను పరిష్కరించేందుకు గాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పారిశ్రామిక ప్రాంతాల్లో తప్పనిసరి పార్కింగ్ ప్రాంతాన్ని 20–10%కి తగ్గించారు. ఇకనుంచి ఏపీఐఐసీ ఆమోదించిన పారిశ్రామిక లే అవుట్లలో సామూహిక పార్కింగ్ సదుపాయాలు కేంద్రీకృతంగా నిర్వహిస్తారు. అలాగే, పారిశ్రామిక స్థలాలను సమర్థంగా వినియోగించుకునేందుకు సెట్‌బ్యాక్ నిబంధనలను మార్పుచేసి కనీస స్థల పరిమాణాన్ని తగ్గించారు.

హెల్త్



గుండె పోటు (హార్ట్ అటాక్) గురించి ఆలోచన రాగానే... మనకు కనిపించే దృశ్యం... మధ్య వయస్కుడైన పురుషుడు అలా తన ఛాతి పట్టుకుని ఒరిగిపోతున్నట్లుగా మన కళ్ల ముందుకు వస్తుంది. కానీ అసలైన చేదు నిజం ఏమిటంటే... భారతదేశంలో గుండెజబ్బులు పురుషులతో పాటు **మహిళల ప్రాణాలను కూడా ఎక్కువగానే తీసుకుంటున్నాయి.** ఇంకా చెప్పాలంటే... బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్, ప్రెగ్నెన్సీ సంబంధిత మరణాల కంటే గుండె జబ్బులే మహిళల ప్రాణాలను ఎక్కువగా హరిస్తున్నాయి. ఇది కేవలం ప్రాణాలను తీసుకోవడానికే పరిమితం కావడం లేదు... వాళ్లల్లో వచ్చే గుండెజబ్బులను సరిగా అర్థం చేసుకోలేకపోవడం, సరిగా నిర్ధారణ చేయలేకపోవడం, తగిన చికిత్స అందించలేకపోవడానికీ దారితీస్తోంది. **ఈ నేపథ్యంలో మహిళల్లో వచ్చే గుండెజబ్బులు** సాధారణం కంటే ఏ రకంగా భిన్నంగా ఉంటున్నాయో **తెలుసుకునేందుకే ఈ కథనం.**



ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ
సీనియర్ కార్డియాలజిస్ట్

ఇం(టి)తికి హార్ట్ ఎటాక్

భారతీయ మహిళల్లో దురదృష్టకరమైన అంశమేమిటంటే... పాశ్చాత్య మహిళలతో పోలిస్తే వీళ్లలో గుండె జబ్బులు దాదాపు పదేళ్ల ముందుగానే వస్తున్నాయి. ఇటీవల వయసు పరంగా తమ ముప్ఫైలలో, లేదా నలభైలలో ఉన్న మహిళలు గుండెపోటుతో ఆసుపత్రికి రావడం మునుపటి కంటే చాలా ఎక్కువైంది. ఒక అధ్యయనం ప్రకారం, భారతదేశంలో గుండెపోటుకు గురయ్యే వారిలో చాలా తక్కువ వయసున్న వాళ్లే! వీళ్లలోనూ 40 ఏళ్ల వయసు కంటే తక్కువగా ఉండేవారు 25 శాతం వరకు ఉంటారు. వీళ్లలోనూ మహిళల సంఖ్య గణనీయంగానే ఉంది. పాశ్చాత్య దేశాల్లో మెనోపాజ్ వరకు హార్మోన్ అయిన ఈస్ట్రోజన్ రక్షణగా పనిచేస్తుంది. కానీ భారతీయ మహిళలకు జన్యుపరమైన సమస్యలు, జీవనశైలి సమస్యలు, సమాజంలోని నిర్లక్ష్యం కలగలిపి ఇది ముందే రావడానికి కారణమవుతున్నాయి.

అయితే... ఇది కేవలం ఐస్‌బర్గ్‌కి తాలూకు పైకి కనిపిస్తున్న టిప్ మాత్రమే. అసలు మూలాలు ఇంత కంటే చాలా లోతుగా ఉంటాయి.

లక్షణాలూ... పురుషుల కంటే భిన్నంగా

పురుషుల గుండెపోటు లక్షణాలు సాధారణంగా ఛాతీలో ఎడమ వైపున తీవ్రమైన నొప్పితో కుదేలైపోయేలా చేస్తుంది. ఆ నొప్పితో ఎడమ చేతికి పాకుతూ ఉండటం వంటివి చాలా మామూలుగా కనిపించే లక్షణమైతే మహిళల్లో మాత్రం కాస్త భిన్నంగా కనిపించవచ్చు. ఆ లక్షణాలివి...

- **అస్థిమితంగా, ఇబ్బందిగా ఉండటం (అనీజీనెస్)**
- **ఛాతీ నొక్కుకు పోయినట్లుగా/ఛాతీలో ఇబ్బందిగా ఉండటం**
- **దవడ, భుజాలు, కొన్నిసార్లు వీపులో నొప్పి**
- **తీవ్రమైన నీరసం, నిస్సత్తువ, అల సట**
- **ఊపిరి అందకపోవడం, ఆయాసం**
- **వికారం, వాంతులు**
- **చెమటలు పట్టడం**

చాలామంది మహిళలు ఈ లక్షణాలను తమ తీవ్రమైన ఒత్తిడికీ, గ్యాస్ సమస్యకూ, ఇంట్లోని పనుల ఒత్తిడికీ ముడి పెడుతుంటారు. కుటుంబ సభ్యులూ ఇదే అనుకుంటారు. చివరికి చాలామంది డాక్టర్లు కూడా ఇలాగే అపోహపడుతుండటం మామూలే. ఇవన్నీ దాటి వారు హాస్పిటల్‌లోకి వచ్చేనాటికి... విలువైన పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది.



మహిళల్లో ఈ ముప్పు ఎందుకంటే?

ఈ విషయం తెలుసుకోవాలంటే... జీవశాస్త్రపరంగా లేదా విజ్ఞానశాస్త్రపరంగా కేవలం వాళ్ల శరీర నిర్మాణానికే పరిమితమైతే సరిపోదు. ఇంకా లోతుగా ఆలోచించాల్సి ఉంటుంది. భారతీయ మహిళకు కనిపించని సవాళ్లెన్నో ఉంటాయి. ఉదహరణకు బయటకు కనిపించకుండానే వాళ్లల్లో పొట్టచుట్టు కొవ్వు పెరగడాన్ని (మరీ ముఖ్యంగా ప్రసవాల తర్వాత) అది సహజం అనుకుంటారు తప్ప పెద్దగా ఎవరూ సీరియస్‌గా తీసుకోరు. వాళ్లకూడా తమ రోజువారీ పనుల్లో పడిపోవడం, ఇంటి పని, పిల్లల సంరక్షణల తర్వాతే తమ సొంత ఆరోగ్యం అంటూ తమను తాము మోసగించునే తప్పుడు అపోహల్లో ఉండిపోవడం వంటివి ఓ ఒత్తి వెలిగించిన బాంబు చివరన మహిళలు ఉండటమంతటి తీవ్రమైన ముప్పునకు గురిచేస్తున్నాయి. ఎట్టకేలకు వాళ్లు ఇలా తమ ఇంటిపనుల సంస్కృతిలో మునిగిపోయి మౌనంగా ఉండిపోతున్నారు. వీటిల్లో పడి తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం, పురుషులతో పోలిస్తే... అప్పుడప్పుడైనా చేయించుకోవాల్సిన ఆరోగ్య పరీక్షలకు మహిళలు దూరంగా ఉండటం, కనీసం దగ్గర్లో ఉండే క్లినిక్‌కూ వెళ్లకపోవడం వంటి అంశాలు వారిని ఆరోగ్యానికి దూరం చేస్తూ, గుండెజబ్బులకు దగ్గర చేస్తున్నాయి.

నిర్వహణ:
యాసీన్

ఆ సూచనలు వాళ్ల గర్భధారణ సమస్యలకే కాదు...

గుండె తాలూకు ముప్పునకూ చిహ్నాలు... కొన్ని సూచనలను మహిళల తాలూకు జెండర్‌కూ, వాళ్లకు మాత్రమే సంబంధించిన గర్భధారణ వంటి అంశాల తాలూకు సమస్యలు అనుకుంటారు తప్ప అవి గుండెకూ వర్తిస్తాయని అనుకోరు. ఉదాహరణకు... గర్భవతిగా ఉన్నప్పుడు పెరిగే రక్తపోటు (ప్రీ-ఎక్లాంప్సియా), గర్భిణిగా ఉన్నప్పుడు కనిపించే డయాబెటిస్ (జెస్టేషనల్ డయాబెటిస్), నెలలు నిండకముందే ప్రసవం కావడం (ప్రీ-టర్మ్ డెలివరీ) అనేవి గర్భవతికి వచ్చే ముప్పులుగా పరిగణిస్తారు. కానీ చాలామంది మహిళలు తమ ప్రసవం తర్వాత... అన్ని సూచనలనూ హాయిగా మరచిపోతారు. కానీ... నిజానికి అవి మున్ముందు రాబోయే గుండెజబ్బులకు సూచనలుగా చూడాల్సిన అంశాలు. అయితే ఇక్కడ కూడా మహిళలు తమ చేతులు కాలాకే ఆకుల కోసం చూస్తారు. అంటే నివారణకు అవకాశమున్నప్పుడే జాగ్రత్త పడకుండా దాన్ని చికిత్స వరకూ తీసుకొస్తారు.

మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించే ఆసక్తికరమైన ప్రత్యేకాంశాలు ఏమిటంటే...

- తొలిసారి గుండెపోటు తర్వాత ఏడాది లోపు చనిపోయే కేసుల్లో పురుషుల కంటే మహిళల సంఖ్య దాదాపు రెట్టింపు.
- టకోట్సుబో కార్డియోమయోపతి (దీన్నే వాడుక భాషలో బ్రోకెన్ హార్ట్ సింద్రోమ్) అనేది మహిళల్లోనే ఎక్కువ. ఇది అచ్చం గుండెపోటు లక్షణాలను కనబరుస్తుంది. అయితే దీని చికిత్స మాత్రం కాస్త వేరుగా ఉంటుంది. తప్పుడు లక్షణాలతో వ్యక్తం కావడంతో వారికి అందాల్సిన చికిత్స సరిగా అందకపోవడం.
- ఇక ఇటీవల కోవిడ్ (కరోనా వైరస్) దెబ్బ, లాక్‌డౌన్ తర్వాత మన భారతీయ మహిళల్లో గుండెపోటు కేసులు విపరీతంగా పెరిగినట్లు అధ్యయన ఫలితాల డేటా వెల్లడిస్తోంది. వాళ్లలో పెరుగుతున్న ఒత్తిడీ, బరువు పెరగడం, తరచూ చెకప్స్‌కు వెళ్లకపోవడం వంటి అంశాలు ఈ ముప్పును మరింతగా పెంచేస్తున్నాయి.

మరి ఇప్పుడు జరగాల్సింది ఏమిటి..?



- జరగాల్సిందేమిటంటే... ముందుగా మహిళల్లో అవగాహన పెరగాలి. గుండెజబ్బులూ లేదా గుండెపోటు అనేది కేవలం పురుషుల సమస్య మాత్రమే కాదు... అది మహిళల్లోనూ వచ్చే అవకాశం అంతే ఉందనీ, కొన్ని సార్లు వాళ్లకంటే ఎక్కువేనన్న అవగాహనను మహిళలు పెంచుకోవాలి.
- తమ సమస్యలైన రక్తపోటు, డయాబెటిస్, రక్తంలో కొవ్వులు (కొలెస్ట్రాల్) వంటి స్క్రీనింగ్ పరీక్షలు ఆలస్యం కాకుండా చూసుకోవాలి. క్రమం తప్పకుండా చేయించుకుంటూ ఉండాలి. అంతేకాదు... ఏదో మధ్యవయసుకు వచ్చాక మొదలుపెట్టడం కంటే ఈ పరీక్షలను ముందునుంచే చేయించుకుంటూ ఉండటం మేలు.
- గర్భధారణ, ప్రసవం సమయాల్లో కనిపించే లక్షణాలను ఆ తర్వాత విస్మరించకూడదు. మున్ముందు రాబోయే గుండె తాలూకు ముప్పులకు సూచికగా పరిగణించి, వాటి గురించి మీ డాక్టర్‌తో చర్చించాలి.
- ఈ ముప్పుల గురించి డాక్టర్లకు కూడా.. మరీ ముఖ్యంగా ఎమర్జెన్సీలో ఉండే డాక్టర్లూ, గ్రామీణ ప్రాంతల్లో సేవలందించే ప్రైమరీ కేర్ డాక్టర్లకు కూడా వీటి పట్ల అవగాహన పెంచాలి.
- మహిళల స్వావలంబన, అవగాహన అనేది వైద్యవిజ్ఞానం, వైద్యచికిత్సల విషయంలోనూ పెరగాలి. తమకు కనిపిస్తున్న లక్షణాల గురించి, తమ ఆరోగ్య ప్రాధాన్యం గురించి వాళ్లు ఇంటిపనులను పక్కనబెట్టి నిర్మొహమాటంగా మాట్లాడుతుండాలి.

నిజానికి మహిళలకు అందే చికిత్స సరైనదేనా?

వాస్తవానికి కాదనే జవాబే చాలాసార్లు వస్తుందీ ప్రశ్నకు! గుండెజబ్బు ఉండి హాస్పిటల్‌కు వచ్చే వాళ్లలో చాలా తక్కువ మందికి మాత్రమే థ్రాంబోలైసిస్‌కూ, యాంజియోప్లాస్టీ వంటికి చికిత్సలకూ... అంతెందుకు గుండెపోటుగా అనుమానించినప్పుడు ఇచ్చే చాలా బేసిక్ మందు ఆస్పిరిన్ టాబ్లెట్ కూడా వాళ్లకు అందడం కష్టమే. వాళ్ల లక్షణాలను పెద్దగా పరిగణనలోకి తీసుకోరు. వాళ్ల ఈసీజీని తప్పుగా అర్థం చేసుకుంటారు. ఇవన్నీ కలగలిసి వాళ్ల ముప్పు అనూహ్యంగా పెరుగుతుంది.

ఈ ముప్పును మరింతగా పెంచే మరో అంశమేమిటంటే... ఇటీవల మనం వాడుతున్న మార్గదర్శకాలన్నీ పాశ్చాత్య దేశాలనుంచి తీసుకున్నవే. అవి మన దేశీయ మహిళల శరీర నిర్మాణాన్ని బట్టి పాశ్చాత్యులతో పోలిస్తే మన మహిళల్లో రక్తనాళాలు ఒకింత సన్నగా ఉండటం, ఇక్కడ డయాబెటిస్ కేసులు ఎక్కువగా ఉండటం, పాశ్చాత్యులతో పోలిస్తే మన భారతీయ మహిళల దేహాల్లో కొవ్వు పేరుకుపోయే చోట్లు వేరుగా ఉండటం వంటి మన తాలూకు ప్రత్యేక అంశాలను పరిగణనలోకి తీసుకోకపోవడం వంటివి మహిళల్లో గుండెజబ్బుల ముప్పును మరింత పెంచుతున్నాయి.

'ఇంటికి మూలం ఇల్లాలే'... 'ఇల్లాలు బాగుంటేనే ఇల్లు బాగుంటుంది'... 'ఇల్లాల్ని చూసి ఇంటిని చూడమన్నారు... 'ఇంటికి ఇల్లాలే గుండెకాయ'... లాంటి భావోద్వేగపరమైన సూక్తులను మనం చాలా ఎక్కువే చెప్పుకుంటూ ఉంటాం. కానీ నిజంగా వైద్యచికిత్స విషయానికి వచ్చేప్పటికీ వాటిని తెలియకుండానే విస్మరిస్తుంటాం. మహిళకు వచ్చే గుండెజబ్బు అనేది కేవలం ఆమె ఒంటికి మాత్రమే పరిమితం కాదు.. అది సామాజికంగా, సాంస్కృతికంగా కూడా మనపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందుకే పురుషుల గుండెజబ్బులతో సమానంగా... మరీ చెప్పాలంటే అంతకంటే ముఖ్యంగా పరిగణిస్తే కుటుంబ హృదయస్పందనలు సజావుగా జరుగుతాయని గుర్తుపెట్టుకోవాలి.

బిజినెస్ రీల్

మహీంద్రా లాజిస్టిక్స్ నుంచి ఎలైట్ మొబిలిటీ సర్వీస్

- ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో ప్రారంభం
- త్వరలో హైదరాబాద్, ముంబైకి..



ముంబై: పట్టణ ప్రాంతాల్లో ప్రయాణాల కోసం ఉద్దేశించిన ప్రీమియం, టెక్ ఆధారిత బిజినెస్–టు–కన్జూమర్ (బీ2సీ) మొబిలిటీ సర్వీస్ ఎలైట్‌ను ఆవిష్కరించినట్లు మహీంద్రా లాజిస్టిక్స్ తెలిపింది. ఎయిర్‌పోర్ట్ నుంచి సిటీకి, నగరంలో ప్రయాణాలకు, ఔట్‌స్టేషన్ ప్రయాణాలకు ఉద్దేశించిన ఈ సేవలను కంపెనీ ముందుగా ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్)లో ప్రవేశపెట్టింది. తర్వాత దశల్లో హైదరాబాద్‌తో పాటు నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, ముంబై, బెంగళూరు ఇతరత్రా కీలక నగరాల్లో వీటిని విస్తరించనున్నట్లు వివరించింది. ఎలైట్ సర్వీసులు ప్రివీ, సెలెక్ట్ అని రెండు కేటగిరీల్లో లభిస్తాయి. సౌకర్యం, పర్యావరణహితాన్ని కోరుకునే వారికి ప్రివీ కేటగిరీలో ప్రీమియం ఎలక్ట్రిక్ వాహనాలు ఉంటాయి. సెలెక్ట్ విభాగంలో హై–క్వాలిటీ సెడాన్‌లు, ఎస్‌యూవీలు అందుబాటులో ఉంటాయి. ఎలైట్ మొబైల్ యాప్ ద్వారా వీటిని బుక్ చేసుకోవచ్చు.

అదానీ పవర్ నుంచి ఎల్‌అండ్‌టీకి భారీ ఆర్డర్



న్యూఢిల్లీ: అదానీ పవర్ నుంచి లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్‌అండ్‌టీ) 'అల్ట్రా మెగా' ఆర్డర్ దక్కించుకుంది. ఇందులో భాగంగా మొత్తం 6,400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 8 థర్మల్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్క యూనిట్ సామర్థ్యం 800 మెగావాట్లని సంస్థ తెలిపింది. ఆర్డర్ విలువ వెల్లడించకపోయినప్పటికీ ప్రాజెక్ట్ విలువ ఆధారంగా 15,000 కోట్లు ఉంటుందని అంచనా. ఎల్‌అండ్‌టీ బిజినెస్ యూనిట్‌గా ఉన్న 'ఎల్‌అండ్‌టీ ఎనర్జీ కార్బన్‌లైట్ సొల్యూషన్స్' ఈ ఆర్డర్‌ను పూర్తి చేయనుంది. ఎల్‌అండ్‌టీ..ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, ఈపీసీ (ఇంజినీరింగ్, సేకరణ, నిర్మాణం) ప్రాజెక్టులు, హైటెక్ తయారీ సేవల్లో నిమగ్నమై ఉన్న 30 బిలియన్ డాలర్ల విలువ గల భారతీయ మల్టీనేషనల్ సంస్థ.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

12-8-2025

విశాఖ	515–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510–00
విజయవాడ	520–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	480–00
వరంగల్	482–00
రిటైల్ ధర	5.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,270.20	4.23
TATAMOTORS	654	3.2
ETERNAL	309	2.69
GRASIM	2,763.00	2.65
APOLLOHOSP	7,248.00	2.31

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HEROMOTOCO	4,565.00	-0.76
BEL	383.7	-0.23
BHARTIARTL	1,855.30	-0.18
BAJFINANCE	876.45	-0.08
MARUTI	12,583.00	-0.06

స్టాక్ మార్కెట్ డేటా


	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	11,679
ఎన్‌ఎస్‌ఈ	81,194
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,27,734
ఎఫ్‌ఐఐ	- 1,203
డీఐఐ	+ 5,972

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.94 (రాత్రి 11.30కు)	$ 63.88 (క్రితం ముగింపు)
బ్రెంట్	66.60 (రాత్రి 11.30కు)	$ 66.59 (క్రితం ముగింపు)

టార్గెట్ 50

- ఎగుమతులు పెంచుకునేందుకు కొత్త వ్యూహం
- చర్యలపై కేంద్ర సర్కారు దృష్టి



న్యూఢిల్లీ: భారత ఉత్పత్తులపై అమెరికా టారిఫ్‌లను గణనీయంగా పెంచేయడంతో ప్రత్యామ్నాయాలపై కేంద్ర సర్కారు దృష్టి పెట్టింది. ఇతర దేశాలకు ఎగుమతులను పెంచుకునే వ్యూహరచనకు తెరతీసింది. ముఖ్యంగా మధ్యప్రాచ్య దేశాలు, ఆఫ్రికా తదితర ప్రాంతంలో 50 దేశాలకు ఎగుమతులను ఇతోధికం చేసుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. భారత మొత్తం ఎగుమతుల్లో 90 శాతం ఈ 50 దేశాలకే వెళుతుండడం గమనార్హం. ఎగుమతులను వైవిధ్యం చేసుకోవడం, దిగుమతులకు ప్రత్యామ్నాయాలు, ఎగుమతుల పోటీతత్వం పెంచుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించినట్టు ఆ వర్గాలు తెలిపాయి. ఈ దిశగా లోతైన విశ్లేషణ కొనసాగుతోందని చెప్పాయి. వాణిజ్య శాఖ ఇప్పటికే 20 దేశాలపై ప్రత్యేక దృష్టి సారించగా, ఇప్పుడు మరో 30 దేశాలు ఈ జాబితాలోకి వచ్చి చేరినట్టు పేర్కొన్నాయి.

కొత్త మార్కెట్లను అన్వేషించండి..

అధిక యూఎస్ టారిఫ్‌లను ధైర్యంగా ఎదుర్కోవాలని.. రొయ్యలు, ఇతర చేపల ఉత్పత్తుల ఎగుమతులకు ప్రత్యామ్నాయాలను అన్వేషించాలని ఎగుమతిదారులకు కేంద్రం సూచించింది. ఈయూ, జపాన్, దక్షిణ కొరియా, యూకే, రష్యా, ఆస్ట్రేలియా, పశ్చిమాసియా, దక్షిణాసియా తదితర ఎన్నో ప్రాంతాలు అందుబాటులో ఉన్నట్టు కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పేర్కొన్నారు. ఇతర దేశాలను ఎగుమతులను పెంచుకునే ముందు విలువను పెంచుకోవడం, ప్యాకేజింగ్‌పై దృష్టి సారించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఇందుకు ఫిషరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

55 శాతం ఎగుమతులపై ప్రభావం

అమెరికాకు ఎగుమతి చేస్తున్న మొత్తం వస్తు ఎగుమతుల్లో 55 శాతం మేర 25 శాతం ప్రతీకార సుంకాలను ఎదుర్కోవాల్సి వస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు లిఖిత పూర్వకంగా వెల్లడించారు. రైతులు, వ్యాపారవేత్తలు, ఎగుమతిదారులు, ఎంఎస్‌ఎంఈల ప్రయోజనాల పరిరక్షణకు, ప్రోత్సాహానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఉత్పత్తుల వైవిధ్యం, డిమాండ్, నాణ్యత, కాంట్రాక్టు ఒప్పందాలు భారత ఎగుమతులపై పడే ప్రభావాన్ని నిర్ణయిస్తాయని చెప్పారు.

అందుబాటు ఇళ్ల విక్రయాలపై టారిఫ్‌ల ప్రభావం

తగ్గొచ్చంటున్న అనరాక్ • ఎంఎస్‌ఎంఈలకు సమస్యలు



భారత ఎగుమతులపై అమెరికా విధించిన అధిక టారిఫ్‌లు దేశీ మార్కెట్లో అందుబాటు ధరల ఇళ్ల అమ్మకాలను ప్రభావితం చేయొచ్చని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ తెలిపింది. అధిక టారిఫ్‌లు చిన్న వ్యాపారాలకు విఘాతం కలిగించొచ్చంటూ.. ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులే రూ.45 లక్షల్లోపు ధరల ఇళ్ల కొనుగోలుదారుల్లో ఎక్కువగా ఉన్నట్టు గుర్తు చేసింది. ''యూఎస్‌కు వస్తు ఎగుమతుల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్‌ఎంఈలు) అధిక వాటా కలిగి ఉన్నాయి. అధిక టారిఫ్‌లతో వీటి ఉత్పత్తులకు ఉన్న పోటీతత్వ తగ్గిపోతుంది. దీంతో వాటికి ఆర్డర్లు తగ్గుతాయి. ఆయా సంస్థల ఉద్యోగులపై ప్రభావం పడుతుంది'' అని అనరాక్ వివరించింది. అందుబాటు ధరల ఇళ్ల అమ్మకాలు, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం అన్నవి కనిష్ట స్థాయికి పడిపోయినట్టు తెలిపింది. దేశవ్యాప్తంగా ఏడు ప్రధాన నగరాల్లో 2025 మొదటి ఆరు నెలల్లో 1.9 లక్షల యూనిట్ల ఇళ్లు అమ్ముడవగా.. ఇందులో అందుబాటు ధరల విభాగంలో విక్రయాలు 34,565 యూనిట్లుగానే ఉన్నట్టు పేర్కొంది.

కోలుకోవడానికి ఇబ్బందులు..

''రూ.45 లక్షలు లేదా అంతకంటే తక్కువ ధరల్లోని ఇళ్లు ఈ విభాగం కిందకు వస్తాయి. ఈ విభాగంపై కరోనా విపత్తు పెద్ద ప్రభావాన్నే చూపించింది. కోలుకునేందుకు ఇప్పటికీ సమస్యలు ఎదుర్కొంటోంది. ఈ విభాగం పట్ల ఉన్న కొద్దో గొప్ప ఆశలను ట్రంప్ అధిక టారిఫ్‌లు ఆవిరిచేస్తున్నాయి''అని అనరాక్ రీసెర్చ్ ఈడీ ప్రశాంత్ ఠాకూర్ వివరించారు. భారత జీడీపీలో ఎంఎస్‌ఎంఈలు 30 శాతం వాటా కలిగి ఉన్నాయన్న ప్రభుత్వ గణంకాలను అనరాక్ ప్రస్తావించింది. అలాగే ఎగుమతుల్లో 45 శాతం వాటా ఆక్రమిస్తున్నట్టు తెలిపింది. అమెరికా 50 శాతం టారిఫ్‌లతో ఎంఎస్‌ఎంఈలు, వాటి సిబ్బందిపై గణనీయమైన ప్రభావం పడుతుందని అంచనా వేసింది. ఎంఎస్‌ఎంఈలు, ఎస్‌ఎంఈల్లో పనిచేసే సిబ్బంది అందుబాటు ధరల ఇళ్ల విభాగంలో ప్రధాన వినియోగదారులుగా ఉన్నట్టు తెలిపింది. దీంతో ఈ విభాగంలో డిమాండ్‌పై ప్రభావం పడుతుందని పేర్కొంది. ఇది కొత్త ప్రాజెక్టుల ఆవిష్కరణపైనా ప్రభావం చూపిస్తుందని వివరించింది.

ఐపీవో స్ట్రీట్

పటేల్ రిటైల్ @ రూ. 237-255

ఈ నెల 19–21 మధ్య పబ్లిక్ ఇష్యూ



న్యూఢిల్లీ: సూపర్ మార్కెట్ చైన్ పటేల్ రిటైల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 237–255 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 19న ప్రారంభమై 21న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను కేటాయించనుంది. ఇష్యూలో భాగంగా 85.18 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 10.02 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 243 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. 2008లో ప్రారంభమైన కంపెనీ మహారాష్ట్రలోని అంబర్‌నాథ్‌లో తొలి స్టోర్‌కు శ్రీకారం చుట్టింది. ఆపై థానే, రాయ్‌గఢ్ జిల్లాలలోని పట్టణ ప్రాంతాలకు కార్యకలాపాలు విస్తరించింది. కంపెనీ పటేల్స్ ఆర్‌మార్ట్ బ్రాండుతో టైర్–3 పట్టణాలలో 43 స్టోర్లను ఏర్పాటు చేసింది. గతేడాది(2024–25) రూ. 821 కోట్ల ఆదాయం, రూ. 25 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఈ ఏడాది ఇప్పటివరకూ మెయిన్‌బోర్డులో 44 కంపెనీలు ఐపీవోకురాగా.. తాజాగా బ్లూస్టోన్ జ్యువెలరీ అండ్ లైఫ్‌స్టైల్ పబ్లిక్ ఇష్యూకిరాగా.. రేపటి(12న) నుంచి రెగాల్ రిసోర్సెస్ ఐపీవో ప్రారంభంకానుంది.

శ్రీజీ షిప్పింగ్ @ రూ. 240-252


ఈ నెల 19–21 మధ్య పబ్లిక్ ఇష్యూ



ముంబై: షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సొల్యూషన్ల కంపెనీ శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 240–252 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 19న ప్రారంభమై 21న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను కేటాయించనుంది. ఇష్యూలో భాగంగా 1.63 కోట్ల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ. 411 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇష్యూ నిధుల్లో రూ. 251 కోట్లను సూపర్‌మ్యాక్స్ విభాగంలో డ్రై బల్క్ కేరియర్స్(సెకండరీ మార్కెట్లో) కొనుగోలుకి వెచ్చించనుంది. రూ. 23 కోట్లు రుణ చెల్లింపులకు కేటాయించనుంది. 2025 మార్చికల్లా మినీ బల్క్ కేరియర్స్, టగ్ బోట్లు, ఫ్లోటింగ్ క్రేన్లు తదితర 80 వెస్సల్స్‌ను కలిగి ఉంది. కాండ్లా, భావనగర్, మగదల్లా, ధర్మతార్, పుట్టళం(శ్రీలంక) తదితర పోర్టులలో సర్వీసులు అందిస్తోంది.

హోమ్ ఫస్ట్ నుంచి వార్‌బర్గ్ అవుట్

- 10.64 శాతం వాటా విక్రయం
- డీల్ విలువ రూ. 1,307 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ నుంచి వార్‌బర్గ్ పింకస్ వైదొలగింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా కంపెనీలో ఉన్న 10.64 శాతం వాటాను తాజాగా విక్రయించింది. ఎన్‌ఎస్‌ఈ బ్లాక్‌డీల్ గణాంకాల ప్రకారం ఒక్కో షేరుకి రూ. 1,190.50 సగటు ధరలో రూ. 1,307 కోట్లకు వాటా విక్రయించింది. కాగా.. కొటక్ మహీంద్రా ఎంఎఫ్ 50 లక్షల షేర్లు(4.84 శాతం వాటా) కొనుగోలు చేసింది. ఈ బాటలో హెచ్‌ఎస్‌బీసీ ఎంఎఫ్, మోతీలాల్ ఓస్వాల్ ఎంఎఫ్, కొటక్ మహీంద్రా లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బ్యాంక్ ఆఫ్ జపాన్ మాస్టర్ ట్రస్ట్ తదితరాలు 1.09 కోట్ల షేర్లను సొంతం చేసుకున్నాయి. షేర్లను కొనుగోలు చేసిన సంస్థలలో మోర్గాన్ స్టాన్లీ, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ మారిషస్, ఫిడిలిటీ తదితరాలు సైతం చేరాయి. అనుబంధ సంస్థ ఆరంజ్ క్లోవ్ ఇన్వెస్ట్‌మెంట్స్ బీవీ ద్వారా హోమ్ ఫస్ట్‌లో వాటాను వార్‌బర్గ్ పింకస్ అమ్మివేసింది. కాగా.. 2024 డిసెంబర్‌లోనూ ఇతర రెండు ప్రమోటర్ సంస్థలతో కలసి రూ. 1,728 కోట్లకు 19.6 శాతం వాటా విక్రయించిన విషయం విదితమే.

బ్లాక్ డీల్స్ నేపథ్యంలో హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ షేరు 6.5 శాతం జంప్‌చేసి రూ. 1,280 వద్ద ముగిసింది.

క్యూ1 ఫలితాలు

ఎస్‌జేవీఎన్ లాభం నేలచూపు ▸ రూ. 228 కోట్లు



న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజం ఎస్‌జేవీఎన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 36 శాతం క్షీణించి రూ. 228 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 357 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం నామమాత్ర వృద్ధితో రూ. 972 కోట్లను తాకింది. గత క్యూ1లో రూ. రూ. 958 కోట్ల టర్నోవర్ నమోదైంది. మొత్తం వ్యయాలు రూ. 476 కోట్ల నుంచి రూ. 551 కోట్లకు పెరిగాయి. డిఫర్డ్ ట్యాక్స్ వ్యయాలు రూ. 21.3 కోట్ల నుంచి రూ. 79.5 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో ఎస్‌జేవీఎన్ షేరు బీఎస్‌ఈలో 1.1 శాతం వృద్ధితో రూ. 93 వద్ద ముగిసింది.

బాటా ఇండియా లాభం డౌన్ ▸ రూ. 52 కోట్లు



న్యూఢిల్లీ: ఫుట్‌వేర్ దిగ్గజం బాటా ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 70 శాతం క్షీణించి రూ. 52 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు, హైబేస్, నీరసించిన వినియోగం ప్రభావం చూపాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 174 కోట్లు ఆర్జించింది. దీనిలో భూమి విక్రయం కారణంగా లభించిన రూ. 134 కోట్ల అనుకోని ఆర్జన కలసి ఉన్నట్లు ప్రస్తావించింది. కాగా.. మొత్తం ఆదాయం నామమాత్ర వెనకడుగుతో రూ. 942 కోట్లకు పరిమితమైంది. గత క్యూ1లో రూ. రూ. 945 కోట్ల టర్నోవర్ నమోదైంది. అయితే మొత్తం వ్యయాలు రూ. 878 కోట్ల నుంచి రూ. 884 కోట్లకు స్వల్పంగా పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో బాటా షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం వృద్ధితో రూ. 1,186 వద్ద ముగిసింది.

వెల్‌క్యూర్ డ్రగ్స్ 1:1 బోనస్ ▸ షేర్ల విభజన సైతం



న్యూఢిల్లీ: వాటాదారులకు వెల్‌క్యూర్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ తాజాగా బోనస్ షేర్ల జారీకి ప్రతిపాదించింది. అంతేకాకుండా షేర్ల విభజనను సైతం చేపట్టనున్నట్లు వెల్లడించింది. వీటిపై ఈ నెల 22న సమావేశంకానున్న కంపెనీ బోర్డు నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొంది. 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీ, 1:10 నిష్పత్తిలో షేర్ల విభజనకు ప్రతిపాదించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో తెలియజేసింది. వెరసి వాటాదారులకు తమ వద్దగల ప్రతీ షేరుకీ మరో షేరు ఉచితంగా(బోనస్) లభించనుంది. అంతేకాకుండా రూ. 10 ముఖ విలువగల ప్రతీ షేరు రూ. 1 ముఖ విలువగల 10 షేర్లుగా విభజించనుంది. దీంతో కంపెనీలో మరింతమంది వాటాదారులకు వీలు కల్పించడంతోపాటు.. షేర్లలో లిక్విడిటీ పెరగనున్నట్లు తెలియజేసింది. కాగా.. ఈ ఏడాది తొలి క్వార్టర్(ఏప్రిల్–జూన్)లో 21 శాతం అధికంగా రూ. 300 కోట్ల ఆదాయం సాధించింది. రూ. 23 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది.

ఈ నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 10.59 వద్ద ముగిసింది.

నష్టాల్లో పూర్వాంకర ▸ రూ. 69 కోట్లు



న్యూఢిల్లీ: రియల్టీ కంపెనీ పూర్వాంకర లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో లాభాలను వీడి నష్టాలలోకి ప్రవేశించింది. వెరసి దాదాపు రూ. 69 కోట్ల నికర నష్టం ప్రకటించింది. ఆదాయం క్షీణించడం ప్రభావం చూపింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 15 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 676 కోట్ల నుంచి రూ. రూ. 539 కోట్లకు వెనకడుగు వేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 654 కోట్ల నుంచి రూ. 629 కోట్లకు స్వల్పంగా తగ్గాయి. ఈ కాలంలో 6 శాతం అధికంగా రూ. 1,124 కోట్ల అమ్మకాల బుకింగ్స్‌ను సాధించింది. అమ్మకాల పరిమాణం 1.29 మిలియన్ చదరపు అడుగుల నుంచి 1.25 ఎంఎస్‌ఎఫ్‌టీకి నీరసించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 2.7 శాతం క్షీణించి రూ. 259 వద్ద ముగిసింది.

పటేల్ ఇంజినీరింగ్ లాభం జూమ్ ▸ రూ. 75 కోట్లు



న్యూఢిల్లీ: మౌలిక సదుపాయాల అభివృద్ధి కంపెనీ పటేల్ ఇంజినీరింగ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 56 శాతం జంప్‌చేసి రూ. 75 కోట్లకు చేరింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 48 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 12 శాతం బలపడి రూ. 1,233 కోట్లను తాకింది. గత క్యూ1లో రూ. 1,102 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఈ కాలంలో లభించిన రూ. 2,250 కోట్ల కాంట్రాక్టులతో కలిపి మొత్తం ఆర్డర్ బుక్ రూ. 16,285 కోట్లకు చేరినట్లు కంపెనీ వెల్లడించింది. జూన్‌కల్లా మొత్తం రుణ భారం రూ. 1,603 కోట్ల నుంచి రూ. 1,527 కోట్లకు తగ్గినట్లు తెలియజేసింది. గత నెలలో పీఎస్‌యూ దిగ్గజం ఎన్‌హెచ్‌పీసీ నుంచి రూ. 240 కోట్ల ఆర్డర్ దక్కించుకున్న సంగతి తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 6 శాతం జంప్‌చేసి రూ. 39 వద్ద ముగిసింది.

2030 నాటికి 220 హోటళ్లు

- 20,000 గదులు
- ఐటీసీ హోటల్స్ చైర్మన్ సంజీవ్ పురి



న్యూఢిల్లీ: ఐటీసీ హోటల్స్ 2030 నాటికి నిర్వహణలోని హోటళ్ల సంఖ్యను 220కి పెంచుకోనుంది. అప్పటికి 20వేల కీలను (గదులు) కలిగి ఉంటామని సంస్థ చైర్మన్ సంజీవ్ పురి ప్రకటించారు. ఐటీసీ నుంచి వేరుపడి లిస్టింగ్ అనంతరం జరిగిన తొలి ఏజీఎంలో వాటాదారులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి అంతర్జాతీయ అల్లకల్లోల పరిస్థితుల్లో ఆవిష్కరణలు, టెక్నాలజీలపై పెట్టుబడులకు పిలుపునిచ్చారు. తద్వారా మరింత బలోపేతం కావాలని, స్వావలంబన సాధించాలని పేర్కొన్నారు. యువ జనాభా అధికంగా ఉండడం, ఖర్చు చేసే ఆదాయం పెరుగుతుండడం, వేగవంతమైన పట్టణీకరణ, టెక్నాలజీ సామర్థ్యాలు, పోటీతత్వం అన్నవి కంపెనీని నిలదొక్కుకునేలా చేస్తాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి వెయ్యి మంది జనాభాకు 2.2 హోటల్ గదులు అందుబాటులో ఉంటే, భారత్‌లో 0.3 గదులుగానే ఉన్నట్టు పురి చెప్పారు. అస్సెట్ రైట్ విధానంతో కంపెనీ వేగంగా వృద్ధిని సాధించగలదని చెప్పారు. టైర్ 2, 3 పట్టణాలకు ఐటీసీ హోటల్స్ విస్తరిస్తున్నట్టు చెప్పారు. కస్టమర్లకు మెరుగైన అనుభవంతోపాటు నిర్వహణ సామర్థ్యాన్ని బలోపేతం చేసుకునేందుకు వీలుగా డిజిటల్ టెక్నాలజీలపై పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టినట్టు తెలిపారు. 2025 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరాలో ఐటీసీ హోటల్స్ రూ.3,300 కోట్ల ఆదాయాన్ని సాధించిందని, ఎబిట్డా మార్జిన్ 36 శాతానికి పెరిగినట్టు చెప్పారు.

జియో ఫైనాన్స్ యాప్ ద్వారా రిటర్నుల దాఖలు



న్యూఢిల్లీ: జియో ఫైనాన్స్ యాప్ ద్వారా ఆదాయ పన్ను రిటర్నుల దాఖలు సదుపాయం అందుబాటులోకి వచ్చింది. పన్నుల ప్రణాళిక (ట్యాక్స్ ప్లానర్), రిటర్నుల దాఖలును మరింత సులభతరం చేసేందుకు వీలుగా ట్యాక్స్‌బడ్డీ సాయంతో జియో ఫైనాన్స్ కొత్త సదుపాయాన్ని అభివృద్ధి చేసింది. జియో ఫైనాన్స్ యాప్ ద్వారా తమంతట తామే రిటర్నులు దాఖలు చేసుకోవచ్చు. లేదా నిపుణుడి సాయంతో రిటర్నులు దాఖలు చేసే సదుపాయం కూడా ఉంది. స్వయంగా దాఖలు చేసుకునేందుకు రూ.24, నిపుణుడి సాయంతో రిటర్నుల దాఖలు చార్జీ రూ.999 నుంచి ఉంటుందని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రకటించింది. అధిక చార్జీలు వసూలు చేసే మధ్యవర్తుల అవసరాన్ని జియో ఫైనాన్స్ యాప్ నివారిస్తుందని పేర్కొంది. ట్యాక్స్ ప్లానర్ సాయంతో పాత–కొత్త పన్ను విధానాల్లో ఏది ఎంపిక చేసుకోవాలన్న అయోమయాన్ని తొలగించుకోవచ్చని సూచించింది.

టఫే మాసే డైనాస్టార్ పోటీల్లో విజేతలకు అవార్డులు



న్యూఢిల్లీ: వ్యవసాయ రంగంలో నవకల్పనలను ప్రోత్సహించేందుకు ట్రాక్టర్ల తయారీ సంస్థ టఫే నిర్వహించిన మాసే డైనాస్టార్ పోటీలకు సంబంధించి రెండో సీజన్ ముగిసింది. వినూత్నమైన ఆవిష్కరణతో అగ్రస్థానంలో నిల్చిన కర్ణాటక రైతు అవినాష్ దేశాయ్‌కి రూ. 8.2 లక్షల ఖరీదు చేసే సరికొత్త ఎంఎఫ్ 254 డైనాస్మార్ట్ 2డబ్ల్యూడీ ట్రాక్టర్‌ను అందించినట్లు కంపెనీ తెలిపింది. రెండో, మూడో స్థానంలో నిల్చిన వారికి 8 గ్రాముల పసిడి నాణేన్ని ప్రదానం చేసినట్లు వివరించింది. వచ్చే ఏడాది సీజన్ 3 నిర్వహించనున్నట్లు తెలిపింది.

ఢిల్లీలో టెస్లా షోరూం

భారత్‌లో రెండోది ప్రారంభం



న్యూఢిల్లీ: అమెరికన్ ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజం టెస్లా భారత్‌లో తమ రెండో ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ని ఢిల్లీలోని ఏరోసిటీలో ప్రారంభించింది. కంపెనీకి ఇప్పటికే ముంబైలో ఒక స్టోర్ ఉంది. ఢిల్లీ ప్రాంతంలో గురుగ్రామ్, నోయిడా, సాకేత్‌లో టెస్లా సూపర్‌చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసే యోచనలో ఉంది. ముంబైలో లోయర్ పరేల్, నవీ ముంబై, థానేలో కూడా వీటిని ప్రారంభించే ప్రణాళికలు ఉన్నట్లు టెస్లా రీజనల్ డైరెక్టర్ ఇసాబెల్ ఫాన్ తెలిపారు. ముంబైలో ఇప్పటికే బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో సూపర్‌చార్జింగ్ స్టేషన్ ఉంది.

జమీల్... చేసేనా కమాల్!

- సవాళ్లకు సిద్ధమైన కొత్త హెడ్ కోచ్
- స్వదేశీ కోచ్‌తో భారత ఫుట్‌బాల్ ప్ర'గతి' మారేనా



సాక్షి క్రీడా విభాగం

మిడ్‌ఫీల్డర్‌గా భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఖాలిద్ జమీల్ తదనంతం కోచ్‌గా క్లబ్ జట్లపై ప్రభావం చూపాడు. అరకొర నిధులతో సరి పెట్టినా జట్టును మేటిగా నిలిపేందుకు గట్టి ప్రయత్నమే చేశాడు. అలా తక్కువ బడ్జెట్‌లో విజయవంతమైన కోచ్‌గా నిరూపించుకున్నాడు. అందుబాటులో ఉన్న రూ. 2 కోట్ల నిధులతో 2016-17 సీజన్ ఐ-లీగ్‌లో ఐజ్వాల్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ)ని విజేతగా నిలబెట్టాడు. మోహన్ బగాన్, ఈస్ట్ బెంగాల్, ముంబై ఎఫ్‌సీ, నార్త్‌ఈస్ట్ యునైటెడ్, జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ క్లబ్‌లకు కోచ్‌గా సేవలందించాడు. ఐఎస్‌ఎల్‌లో నార్త్‌ఈస్ట్ యునైటెడ్ ప్లేఆఫ్‌కు చేర్చిన తొలి భారత కోచ్‌గా జమీల్‌దే ఘనత! తాజాగా మనొలో (స్పెయిన్) స్థానంలో భారత హెడ్ కోచ్‌గా నియమితుడైన 49 ఏళ్ల ఖాలిద్ తొలిసారిగా ఓ అంతర్జాతీయ జట్టుకు సేవలందించేందుకు సిద్ధమయ్యాడు.

జమీల్‌కు కలిసొచ్చిందిలా...

చాలా ఏళ్లుగా క్లబ్, ఫ్రాంచైజీ జట్లకు కోచింగ్ ఇచ్చిన ఖాలిద్ జమీల్‌కు ఇదే తొలి అంతర్జాతీయ స్థాయి నియామకం. అయితే ఇదేమీ గాలివాటంగా రాలేదు. ఇండియా లీగ్ (ఐ-లీగ్)లో ప్లేయర్‌గా విజయవంతమయ్యాడు. 2005లో మహీంద్ర యునైటెడ్ విజేత జట్టు సభ్యుడైన జమీల్ తదనంతరం మేనేజర్‌గా ఐజ్వాల్ ఎఫ్‌సీ తరఫున కమాల్ చేశాడు. ఐజ్వాల్‌ను విజేతగా నిలబెట్టడంలో కీలక పాత్ర ఖాలిద్‌దే! కేవలం పరిమిత నిధులతోనే తక్కువ బడ్జెట్‌లోనే జట్టును విజయపథాన నిలిపాడు. ఆ తర్వాత ముంబై ఎఫ్‌సీకి కోచ్‌గా వెళ్లాడు. తదనంతరం ఐఎస్‌ఎల్‌లో నార్త్‌ఈస్ట్ యునైటెడ్‌ను సెమీఫైనల్ చేర్చిన కోచ్‌గా పేరు తెచ్చుకున్నాడు. జంషెడ్‌పూర్ ఎఫ్‌సీ కోచ్‌గాను పని చేశాడు. టైటిళ్లు సాధించకపోయిన జట్టును సానబెట్టిన తీరుతో ఏఐఎఫ్‌ఎఫ్ 'కోచ్ ఆఫ్ ద ఇయర్'గా రెండు సీజన్లపాటు అవార్డు గెలుచుకున్నాడు. ఇవన్నీ కూడా టీమిండియా కోచ్ అయ్యేందుకు సోపానంలా పనిచేశాయి.

అద్భుతాలు కాదు... కానీ!

ఇప్పటికిప్పుడు జమీల్ నుంచి అద్భుతాలను ఆశించడమంటే అది అత్యాశే అవుతుంది. అయితే ఆచరణీయ సాధన సంపత్తితో జట్టును తీర్చిదిద్దుతాడని గత ఫలితాలను బట్టి చెప్పొచ్చు. స్వయంగా ప్లేయర్ అయిన ఖాలిద్ జట్టు లోటుపాట్లపై తక్షణం విశ్లేషించగలడు. డిఫెన్స్ వైఫల్యంతో ఇటీవల దిగువ ర్యాంక్ జట్లతోనూ ఓడిన భారత్ జట్టును ఓ మెట్టుపైనే నిలబెట్టేందుకు తన వంతు కృషి చేయగలడు. డిఫెన్స్, ఫార్వర్డ్‌లపై తనకున్న అపారమైన అనుభవం జట్టుకు మేలు చేస్తుంది. ముఖ్యంగా ఆటగాళ్లపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టి తీర్చిదిద్దే సామర్థ్యం అతనిలో ఉంది. సీనియర్లు, యువ ఆటగాళ్లను సమన్వయం చేసుకుంటూ ఫలితాలు సాధించే నైపుణ్యం జమీల్‌లో ఉంది. కానీ ఇవన్నీ కూడా ఒక్క సిరీస్‌తో, ఒక్క ఏడాదితో జరిగేది కాదు. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) కొత్త కోచ్‌కు తగినంత సమయం ఇవ్వాలి. దీర్ఘకాలిక లక్ష్యాలు చేరాలంటే మాత్రం ప్రణాళికబద్ధంగా శ్రమించాలి. కాబట్టి కోచ్‌గా కుదిరేందుకు, జట్టును మార్చేందుకు కచ్చితంగా సమయం పడుతుంది.

పెను సవాళ్లకు సిద్ధం

భారత కోచ్ పదవి కోసం సుమారు 170 మంది పోటీపడ్డారు. వీరిలో పేరున్న విదేశీ కోచ్‌లు కూడా ఉన్నారు. వారందరిని వెనక్కినెట్టిన ఖాలిద్ జమీల్ కొత్త హెడ్ కోచ్ అయ్యాడు. 2011-2012 తర్వాత స్వదేశీ కోచ్ ఈ బాధ్యతలు చేపట్టాడు. ఆ వెంటనే జమీల్ ముందున్న సవాళ్లపై దృష్టి పెట్టాడు. ఈ నెలలోనే సీఏఎఫ్‌ఏ నేషన్స్ కప్ జరుగనుంది. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 8 వరకు జరిగే టోర్నీతో టీమిండియాకు అతని కోచింగ్ మొదలవుతుంది. తజికిస్తాన్‌తో జరిగే తొలిపోరులో భారత్ సాధించే సానుకూల ఫలితం అతన్ని ఆత్మవిశ్వాసంతో నడిపించనుంది. ఇటీవల హాంకాంగ్ చేతిలో 0-1తో ఓడిపోయిన భారత్... 2027 ఆసియా కప్ రేసులో ఉండాలంటే సింగపూర్‌తో తదుపరి జరిగే మ్యాచ్‌లో కచ్చితంగా గెలవాల్సి ఉంది. తద్వారా 'ఫిఫా' ర్యాంకింగ్స్‌లో భారత్ ఎగబాకేందుకు అవకాశముంటుంది. ఇంటాబయటా జరిగే ఫ్రెండ్లీ మ్యాచ్‌లు, ఆసియా క్వాలిఫికేషన్ పోటీల్లో భారత్ రాణించాలంటే వెంటనే చేయాల్సింది సమీక్ష ఆ తర్వాతే సన్నద్ధతపై పూర్తి అవగాహన వస్తుంది.

తన శిష్యులకు కలిసొచ్చేనా...

సుదీర్ఘ కాలంపాటు క్లబ్, ఫ్రాంచైజీ జట్లతో ఉన్న అనుబంధంతో ఎంతో మంది శిష్యులు జతయ్యారు. వీరిలో అపూయా రాల్తే, సందేశ్ జింగాన్, మో సనన్‌లతో ఖాలిద్‌కు చక్కని బంధమేర్పడింది. ఇప్పుడు వీరందరికి అనుకూలమైన కోచ్ రావడం కాస్త అనుకూలించనుంది. నార్త్‌ఈస్ట్, జంషెడ్‌పూర్, ముంబై ఎఫ్‌సీ ఇలా క్లబ్ జట్లలో విశేషంగా రాణించిన వారికి తప్పకుండా భారత జట్టులో చోటు లభిస్తుంది. సీనియర్లతో పాటు యువ ఆటగాళ్లకు స్వేచ్ఛనిచ్చే కోచ్ వల్ల తప్పకుండా కుర్రాళ్లకు కలిసిరానుంది. భారత జట్టు కోసం తన దృష్టిలో ఉన్న కోర్ గ్రూప్ ప్లేయర్లను సానబెడతాడనడంలో ఎలాంటి అతిశయోక్తి ఉండదు. తద్వారా జమీల్ జట్టులో తన 'మార్క్' చూపించే ప్రయత్నమైతే గట్టిగానే చేస్తాడు.

ఐఓసీతో 'చర్చలు' కొనసాగుతున్నాయి!

2036 ఒలింపిక్స్ నిర్వహణపై కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ





న్యూఢిల్లీ: 2036లో ఒలింపిక్స్‌ను నిర్వహించాలని ఆసక్తి కనబరుస్తున్న భారత్ ఈ దిశగా తమ ప్రయత్నాలు కొనసాగిస్తోంది. ఒలింపిక్ నిర్వహణా హక్కుల ప్రక్రియలో భాగంగా రెండో దశలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)తో తాము 'నిరంతర చర్చలు' కొనసాగుతున్నాయని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. పార్లమెంట్‌లో ఆప్ పార్టీ ఎంపీ గుర్మీత్ సింగ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఆయన ఈ వివరాలు వెల్లడించారు. 'ఒలింపిక్స్ నిర్వహణ బిడ్డింగ్ ప్రక్రియను పూర్తిగా భారత ఒలింపిక్ సంఘం పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే తమ ఆసక్తిని కనబరుస్తూ ఐఓసీకి లెటర్ ఆఫ్ ఇన్‌టెంట్‌ను ఐఓఏ ఇచ్చింది. దీనిపై ఐఓసీలో భాగమైన ఆతిథ్య కమిషన్‌తో సంప్రదింపులు సాగుతున్నాయి. అయితే ఒకవేళ భారత్‌కు క్రీడలను కేటాయిస్తే వేదికలు ఏమిటనే విషయంపై ఇప్పుడే చర్చ అవసరం. మన దేశానికి ఒలింపిక్స్‌ను కేటాయించడమే అన్నింటికంటే ముఖ్యం' అని మంత్రి స్పష్టం చేశారు. ఒలింపిక్స్ హక్కుల కేటాయింపులో రెండో దశ అయిన 'కంటిన్యూయస్ డైలాగ్'లో బిడ్ వేసిన ఆయా దేశాల సన్నద్ధత, ఆర్థిక పరిస్థితి, ఆ దేశంలో సాధ్యాసాధ్యాలపై ఐఓసీ ఒక అంచనాకు వస్తుంది. 2036 క్రీడల కోసం భారత్‌తో పాటు ఖతర్, టర్కీ కూడా పోటీ పడుతున్నాయి. అయితే ప్రస్తుతానికి ఈ దశను ఐఓసీ నిలిపివేయడం గమనార్హం! ప్రస్తుత ఐఓసీ అధ్యక్షురాలు కిర్‌స్టీ కొవెంట్రీ స్వయంగా ఈ విషయాన్ని చెప్పింది. '2028, 2032 క్రీడలతో పాటు 2030లో జరిగే వింటర్ గేమ్ ఆతిథ్య హక్కులు కూడా వరుసగా లాస్ ఏంజెలిస్, బ్రిస్బేన్, ఫ్రెంచ్ ఆల్ప్స్‌కు ఇప్పటికే ఇచ్చేశాం. ముందు వీటి నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, ఇతర అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉంది. ఇలాంటి స్థితిలో 2036 క్రీడల కేటాయింపు గురించి ఆలోచించడం అనవసరం. అందుకే డైలాగ్ ప్రక్రియను ఆపేస్తున్నాం. ఐఓసీ సభ్యులందరూ దీనికి మద్దతు పలికారు' అని గత నెలలో కొవెంట్రీ స్పష్టం చేసింది. మరోవైపు భారత్‌లో ఫుట్‌బాల్ అధ్వాన్న పరిస్థితిపై అడిగిన ప్రశ్నకు మాండవీయ సమాధానిస్తూ... 'ఈ విషయంలో భారత ఫుట్‌బాల్ సమాఖ్యదే పూర్తి బాధ్యత. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సూచన ప్రకారం వారు అన్ని అంశాలు పర్యవేక్షిస్తున్నారు. ప్రపంచ ర్యాంకింగ్స్ ఎన్నో అంశాలపై ఆధారపడి ఉంటాయి కాబట్టి దానికి అంత ప్రాధాన్యత ఇవ్వనవసరం లేదు' అని చెప్పారు.

స్నేహిత్‌కు కాంస్యం

సాక్షి, హైదరాబాద్: జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ ఆటగాడు సూరావజ్జుల స్నేహిత్ కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. వడోదరలో జరుగుతున్న ఈ పోటీల పురుషుల సింగిల్స్ విభాగంలో స్నేహిత్ సెమీఫైనల్లో ఓటమి పాలయ్యాడు. సెమీస్‌లో రోనిత్ భంజా (ఆర్‌ఎస్‌పీబీ) 11-9, 14-12, 10-12, 12-10, 11-9 స్కోరుతో భారత 7వ ర్యాంకర్ స్నేహిత్ (ఐఏ అండ్ ఏడీ)పై విజయం సాధించాడు. అంతకుముందు జరిగిన క్వార్టర్ ఫైనల్లో స్నేహిత్ 3-1తో అంకుర్ భట్టాచార్జీ (బెంగాల్)పై గెలుపొందాడు. ఈ టోర్నీలో ఆర్‌బీఐకి చెందిన మనుష్ షా టైటిల్ సొంతం చేసుకున్నాడు.



కోచ్ సోమ్‌నాథ్ ఘోష్‌తో స్నేహిత్

నాలుగేళ్ల నుంచి మూడేళ్లకు...

పలువురు ఆటగాళ్లపై 'నాడా' నిషేధం



గగన్ దీప్

న్యూఢిల్లీ: డోపింగ్ వ్యవహారంలో పట్టుబడిన పలువురు ఆటగాళ్లపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) కొరడా ఝళిపించింది. వీరందరినీ మూడేళ్ల పాటు నిషేధిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆటగాళ్లపై గతంలోనే నాలుగేళ్ల నిషేధం పడింది. అయితే ఈ ప్రకటన వచ్చిన 20 రోజుల్లోగా తమ తప్పును అంగీకరిస్తూ ముందుకు రావటంతో 'నాడా' చట్టంలోని నిబంధనల ప్రకారం ఒక ఏడాది నిషేధం తగ్గింది. ఈ ఆటగాళ్లంతా స్టనొజొలోల్, మెటాండినోన్, నొరాన్‌డ్రోస్టెరాన్, మెఫంటర్‌మైన్‌వంటి నిషేధిక ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లుగా పరీక్షల్లో తేలింది. నిషేధానికి గురైన ఆటగాళ్ల జాబితాలో ముగ్గురు అథ్లెట్లు ఉన్నారు. ఈ ఏడాది డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో డిస్కస్ త్రోలో స్వర్ణం సాధించిన గగన్ దీప్ సింగ్‌పై వేటు పడింది. పోటీల్లో అతను సర్వీసెస్‌కు ప్రాతినిధ్యం వహించాడు. గగన్‌నుంచి స్వర్ణం కూడా వెనక్కి తీసుకోనుండగా... రెండో స్థానంలో నిలిచిన నిర్భయ్ సింగ్ (హరియాణా)కు ఇప్పుడు పసిడి పతకం దక్కుతుంది. మరో ఇద్దరు అథ్లెట్లు సచిన్ కుమార్, జైను కుమార్ కూడా నిషేధానికి గురయ్యారు. మోనికా చౌదరి, నందని వత్స్ (జూడో), ఉమేశ్‌పాల్ సింగ్, శామ్యూల్ వన్‌లల్‌తన్‌పుయ (పారా పవర్‌లిఫ్టింగ్), కవీందర్ (వెయిట్‌లిఫ్టింగ్), శుభమ్ కుమార్ (కబడ్డీ), ముగలి శర్మ (రెజ్లింగ్), అమన్, రాహుల్ తోమర్ (వుషు)పై కూడా 'నాడా' మూడేళ్ల వేటు వేసింది.

నేటి నుంచి జాతీయ జూనియర్ హాకీ చాంపియన్‌షిప్



జలంధర్: కొత్త ఫార్మాట్‌లో జాతీయ జూనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు నేడు తెర లేవనుంది. మొత్తం 29 జట్లకు డివిజన్ 'ఎ'... డివిజన్ 'బి'... డివిజన్ 'సి'లలో చోటు కల్పించారు. డివిజన్ 'ఎ'లోని 12 జట్లు టైటిల్ కోసం పోటీపడతాయి. డివిజన్ 'బి'లోని 9 జట్లు... డివిజన్ 'సి'లలోని 8 జట్లు వచ్చే ఏడాది డివిజన్ 'ఎ'కి...'బి'కి ప్రమోషన్ అయ్యేందుకు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి. డివిజన్ 'ఎ'లోని 12 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో పంజాబ్, మధ్యప్రదేశ్, తమిళనాడు... గ్రూప్ 'బి'లో ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర... గ్రూప్ 'సి'లో హరియాణా, మణిపూర్, దాద్రా నాగర్ హవేలి అండ్ డామన్ డియు... గ్రూప్ 'డి'లో కర్ణాటక, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ జట్లున్నాయి. డివిజన్ 'బి'లోని 9 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో హిమాచల్ ప్రదేశ్, చండీగఢ్, జమ్మూ కశ్మీర్, అరుణాచల్ ప్రదేశ్... గ్రూప్ 'బి'లో బిహార్, ఢిల్లీ, ఉత్తరాఖండ్, బెంగాల్, అస్సాం జట్లున్నాయి. డివిజన్ 'సి'లోని ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో కేరళ, పుదుచ్చేరి, తెలంగాణ, త్రిపుర... గ్రూప్ 'బి'లో ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, గుజరాత్, గోవా జట్లున్నాయి.

తెలంగాణ హాకీ జట్టు: ఉమేర్ ఖాన్, దివాకర్, మహేందర్, గణేశ్, మనోజ్ (కెప్టెన్), భాస్కర్, నిఖిల్ చంద్, నితిన్, ప్రదీప్, సింగం మధు, సుదర్శన్, రాహుల్ చౌదరీ, సందీప్, విజయ్, భరత్, హనుమంతు, కౌశిక్, మనీశ్ కుమార్. **కోచ్‌లు:** కామేశ్వరరావు, సాగర్, రవీందర్.

మనీశ్, సంజన సారథ్యంలో...

జాతీయ సీనియర్ అక్వాటిక్స్ బరిలో తెలంగాణ వాటర్ పోలో జట్లు





సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా వాటర్ పోలో ఈవెంట్‌లో పాల్గొనే తెలంగాణ పురుషుల, మహిళల జట్లను ప్రకటించారు. ఈ పోటీలు ఆగస్టు 13 నుంచి 17 వరకు అహ్మదాబాద్‌లో జరుగుతాయి. తెలంగాణ పురుషుల జట్టుకు కందికంటి మనీశ్ గౌడ్, మహిళల జట్టుకు కాల్వ సంజన సారథ్యం వహిస్తారని తెలంగాణ స్విమ్మింగ్ సంఘం జనరల్ సెక్రటరీ ఉమేశ్ గలాండే ఒక ప్రకటనలో తెలిపారు.


తెలంగాణ పురుషుల వాటర్ పోలో జట్టు: కందికంటి మనీశ్ గౌడ్ (కెప్టెన్), కైలా రోహన్ రెడ్డి, చదళ్ల వెంకట మణీధర్ రావు, ముద్రకోల సుశాంత్ దేశాయ్ (హైదరాబాద్), కాసుల భార్గవ్ రామ్, గౌని శివ గౌడ్, జ్వాల తనయ్ సింగ్ పటేల్, కాల్వ లలిత్ సాగర్, రిథీశ్ (రంగారెడ్డి), బానోతు శ్రీకాంత్ నాయక్, కట్ల ధీరజ్ సాయి (వరంగల్), సాయికార్తీక్, తుళ్ల సాయి చరణ్ (కరీంనగర్), తేజస్ నవాతే (నిజామాబాద్).

తెలంగాణ మహిళల వాటర్ పోలో జట్టు: కాల్వ సంజన (కెప్టెన్), పబ్బినేడి బృంద సంయుక్త (రంగారెడ్డి), పెద్దమ్మ శినేష్మ (వరంగల్), అవిషా రాచెల్ మాథ్యూ, నడిమెట్ల దేశిక ఆరుషి, పుప్పాల గాయత్రి, జన్నపల్లి క్రిషిత రెడ్డి, పాలెడ్ నవీషా, పాలెడ్ తనీషా, పబ్బా నిపుణిత, పబ్బా నియతి, ప్రీతిక వాధ్వాని, వింజమూరి సహస్ర, తృప్తి (హైదరాబాద్).

విండీస్‌ను గెలిపించిన రోస్టన్ ఛేజ్, రూథర్‌ఫోర్డ్

రెండో వన్డేలో ఓడిన పాక్ ● నేడు నిర్ణాయక ఆఖరి పోరు

టరోబా: రోస్టన్ ఛేజ్ (47 బంతుల్లో 49 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (33 బంతుల్లో 45; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించడంతో రెండో వన్డేలో వెస్టిండీస్ విజయం సాధించింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో కరీబియన్ జట్టు డక్‌వర్త్ లూయిస్ (డీఎల్‌ఎస్) పద్ధతిలో 5 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై గెలిచి సిరీస్‌ను 1-1తో సమం చేసింది. నేడు నిర్ణాయక ఆఖరి వన్డే జరుగుతుంది. భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున ముగిసిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ నిర్ణీత 37 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఓపెనర్లు సయీమ్ అయూబ్ (23; 4 ఫోర్లు, 1 సిక్స్), అబ్దుల్లా షఫీక్ (26; 3 ఫోర్లు) సహా టాపార్డర్ బ్యాటర్ బాబర్ ఆజమ్ (0) నిరాశపరిచారు. మిడిలార్డర్‌లో హసన్ నవాజ్ (30 బంతుల్లో 36 నాటౌట్; 3 సిక్స్‌లు), హుస్సేన్ తలత్ (32 బంతుల్లో 31; 4 ఫోర్లు) కాస్త మెరుగ్గా ఆడారు. జేడెన్ సీల్స్ 3 వికెట్లు తీశాడు. ఛేజ్, బ్లేడ్, జోసెఫ్ తలా ఒక వికెట్ పడగొట్టారు. అయితే వాన పదేపదే ఆటంకపరిచింది. పాక్ ఇన్నింగ్స్ జరుగుతుండగా మూడుసార్లు ఆటను నిలిపి వేయాల్సి వచ్చింది. వర్షంవల్ల 37 ఓవర్లకే పాక్ ఇన్నింగ్స్‌ను ముగించగా... డీఎల్‌ఎస్ ప్రకారం ఆతిథ్య వెస్టిండీస్ ముందు 35 ఓవర్లలో 181 పరుగులుగా లక్ష్యాన్ని సవరించారు. అనంతరం విండీస్ 33.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (1), ఎవిన్ లూయిస్ (7)లను హసన్ అలీ సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేర్చాడు. టాపార్డర్ బ్యాటర్ కీసి కార్టీ (16) చెప్పుకోదగ్గ స్కోరు చేయలేదు. 48 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయిన దశలో కెప్టెన్ షై హోప్ (35 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్), రూథర్‌ఫోర్డ్ నాలుగో వికెట్‌కు 54 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దారు. కానీ 5 పరుగుల స్వల్ప వ్యవధిలోనే వీళ్లిద్దరు అవుట్ కావడంతో 107/5 స్కోరు వద్ద మళ్లీ కరీబియన్ కష్టాల్లో పడింది. ఇలాంటి పరిస్థితుల్లో ఛేజ్, జస్టిన్ గ్రీవ్స్ (26 నాటౌట్; 1 సిక్స్) అభేద్యమైన ఆరో వికెట్‌కు 77 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. పాక్ బౌలర్లు హసన్ అలీ, నవాజ్ చెరో 2 వికెట్లు తీశారు.



రోస్టన్ ఛేజ్

తైక్వాండోలో హైదరాబాద్ ఆటగాళ్ల హవా



సాక్షి, హైదరాబాద్: హీరోస్ అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్ క్రీడాకారులు మెరిశారు. థాయ్‌లాండ్‌లోని పట్టాయాలో జరిగిన ఈ టోర్నీలో హైదరాబాద్ నారాయణగూడలోని సీకే తైక్వాండో క్లబ్‌కు చెందిన క్రీడాకారులు ఒక స్వర్ణం, ఒక రజతం, ఏడు కాంస్య పతకాలతో కలిపి మొత్తం తొమ్మిది పతకాలు సాధించారు. అండర్-45 కేజీల క్యాడెట్ విభాగంలో మొహమ్మద్ అహ్మద్ ఖాన్ పసిడి పతకం గెలుపొందాడు. అండర్-45 కేజీల జూనియర్ విభాగంలో ఫెనిల్ భవేశ్ భేద్ద రజత పతకం సొంతం చేసుకున్నాడు. అర్ణవ్ దుజారి (అండర్-48 కేజీలు, జూనియర్), హాఫ్సా ఫైజ్ (అండర్-37 కేజీలు, క్యాడెట్), కృష్ణ శర్మ (అండర్-54 కేజీలు, సీనియర్), పవన్ (అండర్-33 కేజీలు, క్యాడెట్), హేతాళి భవేశ్ భేద్ద (పూమ్సే), పొద్దటూరి అశ్వథ్ రామ్ (అండర్-25 కేజీలు, పీపీ ఈవెంట్), పొద్దటూరి అయాంశ్ కృష్ణ (అండర్-21 కేజీలు, పీపీ ఈవెంట్) కాంస్య పతకాలు గెలిచారు.

భార్య మృతదేహాన్ని బైక్‌కు కట్టుకుని...

నాగ్‌పూర్: ట్రక్ ప్రమాదంలో భార్య ప్రాణాలు కోల్పోయింది. మృతదేహాన్ని తీసుకెళ్లడానికి సాయం చేయమంటూ ఎన్ని వాహనాలను ఆపినా ఎవ్వరూ ఆగలేదు. చేసేదేం లేక భార్య మృతదేహాన్ని బైక్‌కు కట్టుకుని భర్త తీసుకెళ్లిన హృదయ విదారక ఘటన దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రాఖీ పౌర్ణమి పండుగ రోజు జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్‌లోని సియోనికి చెందిన అమిత్ అనే వ్యక్తి.. నాగ్‌పూర్‌లోని లోనారాలో నివసిస్తున్నాడు. ఆగస్టు 9న రాఖీ పౌర్ణమి రోజు తన భార్యతో కలిసి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మోర్ఫాటా సమీపంలో వేగంగా వచ్చిన ట్రక్కు వారి బైక్‌ను ఢీకొట్టింది. అమిత్ భార్య గయార్సి రోడ్డుపై పడిపోయింది. ఆమెను ఢీకొట్టిన ట్రక్కు ఆపకుండానే వేగంగా వెళ్లిపోయింది. భార్య అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని తరలించడానికి అటుగా వెళ్తున్న ఎన్నో వాహనాలను ఆపేందుకు ప్రయత్నించారు. కానీ ఎవరూ ఆపలేదు. ఎవ్వరూ సహాయం చేయకపోవడంతో ఏం చేయాలో తోచని అమిత్.. తన భార్య మృతదేహాన్ని బైక్‌కు కట్టుకున్నాడు. ఇంటికి బయల్దేరాడు. కొద్దిసేపటికే, ఒక పోలీసు వ్యాన్ అతన్ని చూసి, వెంబడించింది. జరిగిన విషయం తెలుసుకుని.. అమిత్ భార్య మృతదేహాన్ని నాగ్‌పూర్‌లోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీకి పోస్టుమార్టం కోసం పంపారు. ప్రమాదవశాత్తు మరణం కేసు నమోదు చేశారు.

15 నెలల చిన్నారిని చిత్రహింసలు పెట్టిన కేర్ టేకర్

నోయిడా: నోయిడాలోని ఒక రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో ఉన్న డేకేర్‌లో దారుణం జరిగింది. అందులో పనిచేస్తున్న ఒక మహిళా అటెండెంట్ 15 నెలల పాపను చిత్రహింసలు పెట్టింది. చిన్నారి తొడలపై గాట్లు పెట్టడమే కాదు.. ఉద్దేశపూర్వకంగా చిన్నారిని ముఖంపై కొట్టడం, నేలపై ఎత్తేయడం చేసింది. డేకేర్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌లో కనిపించిన ఈ దృశ్యాలు తల్లిదండ్రుల్లో ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. నోయిడాలోని సెక్టార్–137లోని పరాస్ టిరియా రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లోని డేకేర్‌లో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొంతకాలం కిందట పాప తొడలపై గాయాల గుర్తులను గమనించిన తల్లిదండ్రులు మొదట ఏదో అలర్జీ అని భావించారు. తరువాత వాటిని చూసిన డేకేర్‌లోని ఇతర ఉపాధ్యాయులు చిన్నారిని వైద్యుడు దగ్గరకు తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. అయితే అవి అలర్జీ వల్ల వచ్చినవి కాదని, ఎవరో గాయపరిచినవని వైద్యుడు తెలిపారు. దీంతో భయపడిన తల్లిదండ్రులు డేకేర్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను తీయించి చూశారు. కేర్‌టేకర్ ఆ చిన్నారి ముఖంపై కొట్టడం, ఉద్దేశపూర్వకంగా కిందపడేయడం.. దాంతో చిన్నారిని ఏడుస్తుండటం వీడియోలో కనిపించింది. తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు.. డేకేర్ కేర్‌టేకర్‌నూ అదుపులోకి తీసుకున్నారు. కేర్‌టేకర్ మైనర్ కావడంతో డేకేర్‌పైనా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

హఠాత్తుగా మనిషికి ఎదురుపడి పారిపోయిన సింహం..

దుంగార్‌పూర్: సింహాన్ని చూసి మనిషి పరుగు పెట్టడం తెలిసిందే.. కానీ మనిషిని చూసి సింహం పారిపోవడం! సింహం భయపడటమా అవకాశమే లేదంటారా? కానీ గుజరాత్‌లోని ఓ సింహం మనిషిని చూసి భయపడి వెనక్కి వెళ్లిపోయింది. పరధ్యానంగా ఉన్నప్పుడు హఠాత్తుగా కనిపించింది ఏదైనా భయపెడుతుందని గుజరాత్‌లో జరిగిన ఈ ఘటన రుజువు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. గుజరాత్‌లోని జునాగఢ్ జిల్లా దుంగార్‌పూర్‌లోని పటాపూర్ గ్రామంలోని ఆధార్ సిమెంట్ ఫ్యాక్టరీ ఉంది. ఓరోజు రాత్రి పది గంటల సమయంలో ఓ వ్యక్తి ఫ్యాక్టరీ గేటు నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో సెక్యూరిటీ గది వైపు నుంచి ఓ సింహం అలా నడుచుకుంటూ వస్తోంది. ఆ వ్యక్తి, సింహం ఒకేసారి ఎదురుపడ్డారు. సింహాన్ని చూసి భయపడిన మనిషి ఫ్యాక్టరీ కార్యాలయంలోకి పరుగెత్తుకుని వచ్చాడు. ఇక మనిషిని చూసిన సింహం కూడా అంతే వేగంగా వెనక్కు వెళ్లిపోయింది. మళ్లీ తాను సింహాన్నన్నే విషయాన్ని గుర్తు చేసుకుందో ఏమో.. గోడకు కొంచెం దూరంగా నడుస్తూ తాను వెళ్లాలనుకున్న చోటికి వెళ్లిపోయింది. ఆసక్తికరంగా ఉన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఫ్యాక్టరీ అటవీ ప్రాంతంలో ఉండటంతో సింహాలు కనిపించడం సర్వసాధారణమని ఫ్యాక్టరీ యజమాని సాగర్ కోటేచా తెలిపారు. కొన్నిసార్లు రాత్రిపూట, కొన్నిసార్లు తెల్లవారుజామున కనిపిస్తాయన్నారు. సింహాలు తరచుగా ఫ్యాక్టరీ గేటు గుండా వెళతాయని, కానీ ఎవరికీ హాని చేయలేదని తెలిపారు.

వీధి కుక్కలను షెల్టర్ హోంకు తరలించండి

కుక్కకాట్లతో చిన్నారులు రేబిస్ బారినపడటం ఆందోళనకరం

- ఢిల్లీలోని ఎన్‌సీఆర్ అధికారులకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వీధి కుక్కల బెడద పెరిగిపోవడంపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు కుక్కకాటుకు గురై రేబిస్‌కు గురికావడంపై 'పరిస్థితి అత్యంత దారుణం'గా ఉందంటూ వ్యాఖ్యానించింది. వీధి కుక్కలను సాధ్యమైనంత త్వరగా శాశ్వతప్రాదిపదికన షెల్టర్స్ హోమ్స్‌కు తరలించాలని ఆదేశించింది. శరవేగంతో షెల్టర్ హోంలను ఏర్పాటు చేసి, ఆరు నుంచి 8 వారాల్లోగా 5 వేల శునకాలను వాటిల్లోకి తరలించాలని సూచించింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్‌ల ధర్మాసనం సోమవారం ఈ మేరకు పలు ఆదేశాలను వెలువరించింది. ఈ విషయంలో ఎవరైనా వ్యక్తులు లేక సంస్థలు అధికారులకు అవరోధాలు కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. అవసరమైతే అటువంటి వారిపై ధిక్కారణ చర్యలు సైతం తీసుకుంటామని స్పష్టం చేసింది. అడ్డుకునే ఘటనలను తమకు వెంటనే రిపోర్టు చేయాలని అధికారులను ఆదేశించింది. జంతు ప్రేమికులమంటూ చెప్పుకునే వారు రేబిస్ బారిన పడిన చిన్నారులను కాపాడగలరా అంటూ ప్రశ్నించింది. పరిస్థితులు చేయిదాటిన పరిస్థితుల్లో జంతుహక్కుల కార్యకర్తలు సైతం ఇందులో భాగస్వాములు కావాలని వారిని కోరింది. 'ఢిల్లీ ప్రభుత్వంతోపాటు గురుగ్రామ్, నోయిడా, ఘాజియాబాద్ స్థానిక సంస్థలు కుక్కల షెల్టర్ హోంల ఏర్పాటులో చొరవ చూపాలి.ఈ హోమ్స్‌లో సంరక్షకులతోపాటు శునకాలకు స్టెరిలైజేషన్, ఇమ్యునైజేషన్‌కు అవసరమైన సిబ్బందిని నియమించాలి. సీసీటీవీ నిఘా ఉండాలి. అవసరమైతే షెల్టర్ హోమ్స్ సంఖ్యను మున్ముందు పెంచాలి. వీధి కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేకంగా బృందాలను రంగంలోకి దించాలి'అని ఆదేశాలు జారీ చేసింది. ప్రజల సంక్షేమం కోసమే ఈ ఉత్తర్వులు ఇస్తున్నట్లు పేర్కొంది. కుక్కల భయం లేకుండా చిన్నారులు సంచరించగలిగే వాతావరణం ఉండాలంది. రోజు వారీగా ఎన్ని కుక్కలను పట్టుకుని, షెల్టర్ హోంలకు తరలించిందీ రికార్డు చేయాలని, తదుపరి విచారణకు ఆ రికార్డును తమ ముందుంచాలని అధికారులకు స్పష్టం చేసింది. షెల్టర్ హోంల నుంచి కుక్కలు తప్పించుకున్నట్లు తెలిస్తే తీవ్ర చర్యలుంటాయని పేర్కొంది. కుక్కకాటు ఘటనలపై వారంలోగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలంది. ఫిర్యాదు అందిన నాలుగు గంటల్లోగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. రేబిస్ వ్యాక్సినేషన్, చికిత్సలపై నెల వారీ రికార్డును తమకు అందించాలంటూ తదుపరి విచారణను ఆరు వారాలకు ధర్మాసనం వాయిదా వేసింది. ఢిల్లీ దేశ రాజధాని ప్రాంతంలో వీధి కుక్కకాటుకు గురైన వారు పెద్ద సంఖ్యలో రేబిస్ బారిన పడుతున్నారంటూ వచ్చిన కథనాన్ని సుప్రీంకోర్టు జూలై 28న సుమోటోగా విచారణ చేపట్టింది.



తమ వల్ల కాదంటున్న యంత్రాంగం

సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేసే సదుపాయాలు, వనరులు తమకు లేవని ఢిల్లీ, ఎన్‌సీఆర్ అధికారులు అంటున్నారు. ఢిల్లీలో ప్రస్తుతం ఉన్న వీధి కుక్కలు సుమారు 6 లక్షలు కాగా డాగ్ షెల్టర్ ఒక్కటి కూడా లేదు. ఉన్నదల్లా 20 స్టెరిలైజేషన్ సెంటర్లే. వీటి సామర్థ్యం ఏడాదికి 1.25 లక్షలు. కనీసం 70 శాతానికైనా, అంటే ఏడాదికి 4.5 లక్షల శునకాలకు స్టెరిలైజ్ చేస్తేనే వాటి జనాభా నియంత్రణలోకి వస్తుంది. ప్రస్తుతం అందుకు తగ్గట్లుగా సదుపాయాలు లేవని అధికారవర్గాలు అంటున్నాయి. అదే సమయంలో, స్టెరిలైజ్ చేసిన కుక్కలకు, చేయని కుక్కలకు వేర్వేరుగా షెల్టర్లను నిర్మించాల్సి ఉంటుందని నిపుణులు అంటున్నారు.

ఎస్‌సీ, ఎస్‌టీలకు ఆదాయ ప్రాతిపదికన రిజర్వేషన్లు
పిల్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీం

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగాలలో మరింత సమానమైన రిజర్వేషన్ వ్యవస్థ కోసం విధానాలను రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం ఈ మేరకు కేంద్రానికి నోటీసు జారీ చేసింది. అక్టోబర్ 10వ తేదీ కల్లా జవాబివ్వాలని కోరింది. ఈ పిల్ చాలా విస్తృత ప్రభావాన్ని చూపే అవకాశం ఉన్నందున, తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని పిటిషనర్ తరపు న్యాయవాది సందీప్ సింగ్‌ను ధర్మాసనం కోరింది. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 16 ప్రకారం ప్రస్తుతమున్న రిజర్వేషన్ కోటాను మార్చకుండానే సమాన అవకాశాలు కల్పించాలని పిటిషనర్లు రమాశంకర్ ప్రజాపతి, యమునా ప్రసాద్‌లు కోరారు. దశాబ్దాలుగా రిజర్వేషన్ విధానం అమలవుతున్నప్పటికీ, కొన్ని అణగారిన వర్గాలు రిజర్వేషన్ ఫలాలకు దూరంగానే ఉండిపోయారన్నారు.

ల్యాండ్ పూలింగ్ చట్టం వెనక్కి..

పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం నిర్ణయం

చండీగఢ్: వివాదాస్పద ల్యాండ్ పూలింగ్ చట్టాన్ని పంజాబ్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. రైతు సంఘాలతోపాటు ప్రతిపక్ష పార్టీల నుంచి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకతతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా సమర్థించుకుంటున్న ఈ చట్టం అమలుపై ఈనెల 7న పంజాబ్ హరియాణా హైకోర్టు నాలుగువారాల స్టే కూడా విధించింది. మే 14వ తేదీన తీసుకువచ్చిన ఈ చట్టాన్ని, అనుబంధ సవరణల అమలును ఉపసంహరించుకున్నట్లు సోమవారం సాయంత్రం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రకటించారు. రిజిస్ట్రేషన్ సంబంధిత పనులన్నీ రద్దవుతాయన్నారు. సేకరించిన ప్రతి ఎకరా భూమికి బదులుగా యజమానికి పూర్తిగా అభివృద్ధి పర్చిన వెయ్యి చదరపు అడుగుల రెసిడెన్షియల్ ప్లాట్‌ను, 200 చదరపు అడుగుల వాణిజ్య ప్లాట్‌ను అందించేందుకు ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ చట్టంలో వీలు కల్పించింది.

ఢిల్లీ-వాషింగ్టన్ సర్వీసుల రద్దు

డ్రీమ్ లైనర్ల కొరతతో ఎయిరిండియా నిర్ణయం

న్యూఢిల్లీ: సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి న్యూఢిల్లీ- వాషింగ్టన్ సర్వీసులను నిలిపివేయాలని ఎయిరిండియా నిర్ణయించింది. బోయింగ్–787 డ్రీమ్ లైనర్ విమానాల కొరతే ప్రధాన కారణమని ఆ సంస్థ తెలిపింది. టాటా గ్రూప్ యాజమాన్యంలో ఎయిరిండియా ప్రస్తుతం వారంలో ఐదు సర్వీసులను ఢిల్లీ–వాషింగ్టన్ మధ్య నడుపుతోంది. 26 బోయింగ్ 787–8 రకం డ్రీమ్‌లైనర్ విమానాలను రెట్రోఫిట్టింగ్ నిమిత్తం పంపినందున ఈ మేరకు చర్య తీసుకున్నామని, 2026 చివరి వరకు ఇవి అందుబాటులోకి వచ్చే అవకాశాలు లేవని పేర్కొంది. మన విమానాలకు పాకిస్తాన్ గగనతలాన్ని మూసివేయడం ఇందుకు తోడైందని ఎయిరిండియా తెలిపింది. సెప్టెంబర్ ఒకటో తేదీ తర్వాత బుక్ చేసుకున్న ప్రయాణికులకు వారికి ఇష్టమైన విధంగా రీబుకింగ్, ఫుల్ రిఫండ్ వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడతామని పేర్కొంది.

మరో 476 రాజకీయ పార్టీల రద్దు

ఈసీ నిర్ణయం

సాక్షి, న్యూఢిల్లీ: చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లఘించే రాజకీయ పార్టీలపై చర్యల్లో భాగంగా దేశ వ్యాప్తంగా మరో 476 రాజకీయ పార్టీల గుర్తింపు రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. వీటిలో తెలుగు రాష్ట్రాల్లోని మరో 26 పార్టీలు కూడా ఉన్నాయి. తొలి జాబితాలో 334పార్టీలను రద్దు చేసిన ఈసీ తాజాగా రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల వారీగా రెండో జాబితాను సోమవారం విడుదల చేసింది. ఇందులో ఏపీలోని 17, తెలంగాణలోని 9 పార్టీలు ఉన్నాయని పేర్కొంది. 2019 నుంచి ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనైనా పోటీ చేయాలనే ప్రధానమైన షరతును నెరవేర్చడంలో విఫలమైన రిజిస్టర్డ్ గుర్తింపు లేని రాజకీయ పార్టీల(ఆర్‌యూపీపీ)ను గుర్తించేందుకు, వాటిని జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపింది. ఎన్నికల వ్యవస్థను స్వచ్ఛంగా మార్చేందుకు చేపట్టిన సమగ్రమైన వ్యూహాల్లో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఈసీ పేర్కొంది. కాగా, జాబితా నుంచి తొలగించిన (డీలిస్ట్) పార్టీలు ఏవీ కూడా ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 29సీ, 29బీ ఆదాయపన్ను చట్టం–1961, ఎన్నికల గుర్తులు (రిజర్వేషన్ అండ్ ఎలాట్‌మెంట్) ఆర్డర్ 1968 కింద ఉన్న ప్రయోజనాలను పొందలేవని ఇటీవల తొలి జాబితా విడుదల చేసిన సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

దేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల్లో ఈసీ రద్దు చేసిన పార్టీల సంఖ్య

అండమాన్ నికోబార్	1	మధ్యప్రదేశ్	23
ఆంధ్రప్రదేశ్	17	మహారాష్ట్ర	44
అస్సాం	3	మణిపూర్	2
బిహార్	15	మేఘాలయ	4
చండీగఢ్	1	మిజోరం	2
ఛత్తీస్‌గఢ్	7	నాగాలాండ్	2
ఢిల్లీ	41	ఒడిశా	7
గోవా	5	పంజాబ్	21
గుజరాత్	10	రాజస్థాన్	18
హరియాణా	17	తమిళనాడు	42
హిమాచల్ ప్రదేశ్	2	తెలంగాణ	9
జమ్మూకశ్మీర్	12	త్రిపుర	1
జార్ఖండ్	5	ఉత్తర ప్రదేశ్	121
కర్ణాటక	10	ఉత్తరాఖండ్	11
కేరళ	11	పశ్చిమ బెంగాల్	12

ప్రత్యేక పాలస్తీనాను గుర్తిస్తాం: ఆస్ట్రేలియా

వెల్లింగ్టన్: పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తామని ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు. గాజాలో ఇజ్రాయెల్ విధానాలతో పాలస్తీనియన్లు పడుతున్న వ్యథల నేపథ్యంలో కేబినెట్‌తోపాటు మెజారిటీ ప్రజలు పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాలంటూ ఇటీవలి కాలంలో చేస్తున్న డిమాండ్ మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. సోమవారం మంత్రివర్గం సమావేశం అనంతరం అల్బనీస్ మీడియాతో మాట్లాడారు. పాలస్తీనా అథారిటీ ఛైర్మన్ అబ్బాస్ నుంచి లభించిన హామీల మేరకు ప్రత్యేక పాలస్తీనాను గుర్తించాలని భావిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పాలస్తీనాలో హమాస్‌కు ఎటువంటి పాత్ర లేకుండటం, గాజా నుంచి ఆర్మీని విరమించడం, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిపించడం, ముందుగా బందీలను విడుదల చేయడం వంటి అంశాలపై అబ్బాస్‌తో చర్చించామన్నారు. బందీలందరినీ బేషరతుగా వెంటనే విడుదల చేయాలని ఆయన హమాస్‌ను కోరారు. గాజాను నెలలపాటు దిగ్బంధించడం, పాలస్తీనియన్లను ఆకలి చావులకు గురిచేయడాన్ని ఆపాలంటూ చేసిన వినతులను ఇజ్రాయెల్ పెడచెవిన పెట్టడంతో సెప్టెంబర్‌లో జరిగే ఐరాస సర్వప్రతినిధి సభలో ప్రత్యేక పాలస్తీనాను గుర్తిస్తామంటూ ఫ్రాన్స్, యూకే, కెనడా, జర్మనీ ఇటీవల ప్రకటించాయి. ఈ ప్రకటనలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తీవ్రంగా ఖండించడం తెల్సిందే. ఐరాసలోని 193 సభ్య దేశాలకు గాను సుమారు 150 దేశాలు దశాబ్దాల క్రితమే పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాయి. తాజాగా అల్బనీస్ ప్రకటనపై పొరుగునున్న న్యూజిలాండ్ సైతం సానుకూలంగా స్పందించింది.

ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం.. చెన్నైలో అత్యవసర ల్యాండింగ్..

అదృష్టం కొద్దీ బతికిపోయామన్న కాంగ్రెస్ ఎంపీ వేణుగోపాల్

విమానంలో ఉన్న పలువురు ఎంపీలు

న్యూఢిల్లీ: ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం.. కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ సహా, పలువురు ఎంపీలు, వందలాది మంది ప్రయాణికులను కలవరపెట్టింది. విమాన ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నామని, అదృష్టం కొద్దీ బతికిపోయామని ఆయన సోమవారం తెలిపారు. 'ఆదివారం రాత్రి తిరువనంతపురం నుంచి ఢిల్లీకి ఎయిరిండియా ఫ్లైట్ ఏఐ 2455లో బయల్దేరాం. నాతో పాటు పలువురు ఎంపీలు, వందలాది మంది ప్రయాణికులున్నారు. విమానం ఆలస్యంగా బయల్దేరింది. టేకాఫ్ అయిన కొద్ది సేపటికే సాంకేతిక లోపం తలెత్తింది. ఫ్లైట్‌ను చెన్నై ఎయిర్‌పోర్టుకు మళ్లిస్తున్నట్లు కెప్టెన్ ప్రకటించారు. అందరిలోనూ భయం నెలకొంది. అక్కడా ల్యాండింగ్‌కు వెంటనే అనుమతి లభించకపోవడందో విమానం రెండు గంటల పాటు గాల్లో చక్కర్లు కొట్టింది. ఆ తరువాత చెన్నై ఎయిర్‌పోర్టులో ల్యాండైంది. అందరం ఊపిరి పీల్చుకున్నాం'అని కేసీ వేణుగోపాల్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కెప్టెన్ ముందు చూపువల్ల తాము బతికి బయటపడ్డామని, అదృష్టవంతులమని చెప్పారు. అయితే.. విమానంలో భద్రత అదృష్టం మీద ఆధారపడి ఉండటం దురదృష్టకరమన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డీజీసీఏ, కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారు. అయితే వేణుగోపాల్ ప్రకటనపై ఎయిరిండియా స్పందించింది. ఆదివారం రాత్రి కేరళలోని తిరువనంతపురం నుంచి ఢిల్లీకి వెళ్తున్న ఎయిరిండియా విమానం సాంకేతిక సమస్య కారణంగా చెన్నైకి అత్యవసరంగా మళ్లించాల్సి వచ్చిందని తెలిపింది. అయితే.. రన్‌వేపై మరో విమానం ఉండటం వల్ల విమానంగాల్లో చక్కర్లు కొట్టలేదని, చెన్నై ఏటీసీ సూచన మేరకే అలా చేయాల్సి వచ్చిందని తెలిపింది. 'ప్రియమైన వేణుగోపాల్ గారు అనుమానిత సాంకేతిక సమస్య, అననుకూల వాతావరణం వల్ల చెన్నైకి మళ్లింపు జరిగింది. అయితే ల్యాండింగ్ ప్రయత్నంలో ఏటీసీ ఒక రౌండ్-అరౌండ్ సూచించింది. ఎలాంటి పరిస్థితులనైనా నిర్వహించేందుకు మా పైలట్లు బాగా శిక్షణ పొందారు. వారు ప్రామాణిక విధానాలను అనుసరించారు. అలాంటి అనుభవం కలవరపెడుతుందని మాకు అర్థమైంది. మళ్లింపు వల్ల కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. భద్రత ఎల్లప్పుడూ మా ప్రాధాన్యత. అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం'అని పేర్కొంది.

కాగా, ఫ్లైట్ రాడార్ డేటా ప్రకారం.. ఆదివారం రాత్రి 7.15 నిమిషాలకు బయలుదేరాల్సిన విమానం 8:17 గంటలకు తిరువనంతపురం నుంచి బయలుదేరింది. 10:35 గంటలకు చెన్నైలో ల్యాండ్ అయింది. ఆ తర్వాత సోమవారం తెల్లవారుజామున 1:40 గంటలకు బయలుదేరి 3:58 గంటలకు ఢిల్లీ చేరుకుంది.

పరువు నష్టం కేసులో మేధా పాట్కర్ దోషే

ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోం: సుప్రీం

న్యూఢిల్లీ: ఢిల్లీ లెఫ్టినెంట్ జనరల్ వీకే సక్సేనా వేసిన 25 ఏళ్లనాటి పరువు నష్టం కేసులో పర్యావరణ ఉద్యమకారిణి మేధా పాట్కర్(70)ను సుప్రీంకోర్టు దోషిగా ధ్రువీకరించింది. ఈ విషయంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. మేధా పాట్కర్‌ను 'ప్రొబేషన్ ఆఫ్ గుడ్ కాండక్ట్' కింద విడుదల చేసిన హైకోర్టు మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట మూడేళ్లకోసారి హాజరు కావాల్సి ఉంటుందంటూ ఆమెకు షరతు విధించింది. ఈ ఆదేశాలు యథాప్రకారం అమలవుతాయని సోమవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం తెలిపింది. అయితే, ఆమెపై విధించిన రూ.లక్ష జరిమానాను మాత్రం రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. 25 ఏళ్ల క్రితం గుజరాత్‌లోని ఓ ఎన్జీవోకు వీకే సక్సేనా సారథిగా ఉండేవారు. ఆ సమయంలో నర్మదా బచావో ఆందోళనను నడుపుతున్న మేధా పాట్కర్ చేసిన వ్యాఖ్యలపై కేసు నడుస్తోంది.

ఒడిశాలో మరో బాలిక ఆత్మాహుతి

నెల వ్యవధిలో ఇది నాలుగో ఘటన

భువనేశ్వర్: ఒడిశాలో మరో బాలిక ఆత్మాహుతికి పాల్పడింది. బార్‌గఢ్ జిల్లాలోని ఫిరింగ్‌మల్ గ్రామానికి చెందిన 13 ఏళ్ల పాఠశాల విద్యార్థిని కాలిన గాయాలతో బుర్లాలోని వీర్ సురేంద్ర సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(విమ్‌సార్)లో చికిత్స పొందుతూ చనిపోయిందని ఎస్పీ అభిలాష్ తెలిపారు. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అసహజ మరణంగా కేసు నమోదు చేశామన్నారు. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న బాధిత బాలిక మేనమామ ఇంటికి వచ్చి, ఈ అఘాయిత్యానికి పాల్పడిందన్నారు. బాలికకు సంబంధించిన ఒక వీడియో తమకు దొరికిందని, ఘటనపై ముగ్గురు అధికారులతో దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. అంతకుముందు, ఫుట్‌బాల్ మైదానంలో పెట్రోల్ పోసుకుని నిప్పటించుకుని, సగం కాలిన స్థితిలో ఉన్న బాలికను గ్రామస్తులు బార్‌గఢ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి విమ్‌సార్‌కు తరలించారు. బాధితురాలు 8వ తరగతి చదువుతోందని, ఆత్మహత్యకు కారణాలు తెలియలేదని పోలీసులు తెలిపారు. ఒడిశాలో నెల రోజుల వ్యవధిలో ఇది నాలుగో ఘటన.

లోయలోపడిన వ్యాన్.. 10 మంది మహిళలు మృతి

మరో 30 మందికి గాయాలు

పుణె: మహారాష్ట్రలోని పుణె జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. సుమారు 40 మంది ప్రయాణికులతో వెళ్తున్న పికప్ వ్యాన్ అదుపు తప్పి, లోతైన లోయలో పడిపోవడంతో అందులోని 10 మంది మహిళలు చనిపోయారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. పాపల్‌వాడి గ్రామానికి చెందిన వీరంతా ఖేడ్‌లోని శ్రీ క్షేత్ర మహాదేవ్ కుందేశ్వర్ ఆలయానికి వెళ్తుండగా మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. పర్వతప్రాంతం గుండా వెళ్లే సమయంలో వాహనంపై డ్రైవర్ అదుపు కోల్పోవడంతోనే ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. ఘటన విషయం తెలియగానే సమీపంలోని పయిట్ గ్రామస్తులు వచ్చి సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. వ్యానులోని అత్యధికులు మహిళలు, చిన్నారులేనని పోలీసులు తెలిపారు.

జీపు, బైక్ ఢీ: ఐదుగురు మృతి

అనూప్‌పూర్: మధ్యప్రదేశ్‌లోని అనూప్‌పూర్‌లో సోమవారం ఉదయం మోటారు సైకిల్, జీపు ఢీకొన్న ఘటనలో ఐదుగురు చనిపోగా, మరో ఐదుగురు గాయాలపాలయ్యారు. బెనిలా గ్రామ సమీపంలో మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన అనంతరం అదుపుతప్పిన జీపు పల్టీలు కొట్టిందని రామ్‌నగర్ పోలీసులు తెలిపారు. ఘటనలో జీపులోని ఇద్దరు, బైక్‌పై ఉన్న ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన ఐదుగురిని కొట్మాలోని ఆస్పత్రికి తరలించామన్నారు.

నా ప్రజలను, నా కుటుంబాన్ని మీకు అప్పగిస్తున్నా..

- ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో మరణించిన అనాస్ జమాల్ అల్-షరీఫ్
- హృదయాలను కదిలిస్తున్న ఆయన చివరి సందేశం


గాజా: గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో ఐదుగురు అల్ జజీరా జర్నలిస్టులు మృతిచెందారు వారిలో అనాస్ జమాల్ అల్-షరీఫ్ కూడా ఉన్నారు. ఈ దాడిలో మరణించడానికి ముందు అనాస్ రాసిన మెసేజ్‌ను అతడి మిత్రుడు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆ సందేశం ప్రజల హృదయాలను కదలిస్తోంది. అది చదివితే గుండె బరువెక్కడం ఖాయం. అన్సార్ సందేశం ఏమిటంటే...

వారిని అల్లా క్షమించడు

''ఇది నా వీలునామా. నా చివరి సందేశం. నా మాటలు మీకు చేరాయంటే దాని అర్థం నన్ను చంపడంలో, నా గొంతు మూగబోయేలా చేయడంలో ఇజ్రాయెల్ సైన్యం విజయవంతమైనట్లే. మీకు శాంతి సౌఖ్యాలు కలగాలని కోరుకుంటున్నా. అల్లా దయ, ఆశీస్సులు మీకు లభించాలి. నా ప్రజలకు మద్దతుగా, వారి గొంతుకగా ఉండడానికి నా బలం మొత్తం ఉపయోగించానని, చేయగలిగినదంతా చేశానని అల్లాకు తెలుసు. జబాలియా శరణార్థి శిబిరంలోని ఇరుకు సందుల్లో కళ్లు తెరిచినప్పటికీ నా ప్రజల కోసం ఆరాటపడుతున్నా. నా జీవిత కాలాన్ని అల్లా పొడిగిస్తాడని ఆశపడుతున్నా. దానివల్ల నా స్వస్థలం ఆక్రమిత అస్కెలాన్(అల్-మజ్‌దాల్)కు చేరుకొని, కుటుంబంతో, ప్రియమైనవారితో గడపగలను. కానీ, అల్లా ఆదేశమే ఫైనల్. దానికి తిరుగులేదు. ఇన్నాళ్లు ఎన్నో బాధలు అనుభవించా. కష్టాలు నష్టాలు నాకు కొత్త కాదు. ఎంతో కోల్పోయా. ఉన్నది ఉన్నట్లుగా చెప్పడంలో నాకు ఎలాంటి సంకోచం లేదు. మా చావులకు కళ్లారా చూస్తున్న వారిని, మా మారణాలను ఆమోదిస్తున్నవారిని, ఇన్ని దారుణాలు జరుగుతున్నా మౌనంగా ఉండిపోయినవారిని, గత ఏడాదిన్నరగా మా గడ్డపై మా పిల్లలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను, హింసాకాండను, మారణహోమాన్ని అడ్డుకోనివారిని అల్లా క్షమిస్తాడని నేను అనుకోవడం లేదు.

నా బిడ్డ నా కంటి వెలుగు

పాలస్తీనా అంటే మాకెంతో ప్రేమ. ముస్లిం ప్రపంచం అనే కిరీటంలో విలువైన రత్నం పాలస్తీనా. ప్రపంచంలో ప్రతి స్వేచ్ఛా జీవి గుండె చప్పుడు పాలస్తీనా. మా ప్రజలను మీకు అప్పగిస్తున్నా. కలలు కనడానికి సమయం లేని, స్వేచ్ఛగా, శాంతితో జీవించే అవకాశం లేని మా అమాయక చిన్నారులను అప్పగిస్తున్నా. మా ప్రజల దేహాలు వేలాది టన్నుల బరువు కింద ఛిద్రమైపోయాయి. ఇజ్రాయెల్ బాంబులు, క్షిపణులు వారి శరీరాలను ముక్కలు చేశాయి. ఆ ముక్కలన్నీ వెదజల్లినట్లుగా దూరంగా పడిపోయాయి. నిర్బంధాలు, హెచ్చరికలు మిమ్మల్ని ఆపకూడదు. సరిహద్దులు మీకు అడ్డంకి కాకూడదు. మీరంతా గొంతు విప్పండి. మా కోసం మాట్లాడండి. మా భూమి విముక్తికి, మా ప్రజలకు మధ్య వారధిగా మారండి. ఆక్రమణకు గురైన మా భూభాగంపై గౌరవం, స్వేచ్ఛ పరిఢవిల్లేదాకా గొంతు విప్పుతూనే ఉండండి. మా కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకోండి. వారిని మీకు అప్పగిస్తున్నా. నా ముద్దుల కూతురు షామ్ జాగ్రత్త. ఆమె నా కంటి వెలుగు. ఆమె ఎదుగుదలను కళ్లారా చూసే అదృష్టం నాకు దక్కలేదు. అది కలగానే మిగిలిపోయింది. నా కుమారుడు సలాహ్‌ను కూడా అప్పగిస్తున్నా. నా భారాన్ని మోసే, ఆశయాన్ని నెరవేర్చే బలవంతుడిగా మారేదాకా అతడికి అండగా ఉండాలనుకున్నా. ఇక నా తల్లి బాధ్యత కూడా మీదే. ఆమె ఆశీస్సులు, ప్రార్థనలే నన్ను ఇక్కడిదాకా తీసుకొచ్చాయి. ఆమె ఇచ్చిన వెలుగే నాకు దారిగా మారింది. నా తల్లికి బలాన్ని ఇవ్వాలని అల్లాను ప్రార్థిస్తున్నా. అల్లా ఆమెను కరుణించాలి. నా జీవన సహచారి ఉమ్ సలాహ్ బాధ్యతను సైతం మీ చేతుల్లో పెడుతున్నా. ఈ యుద్ధం నన్ను నా భార్య నుంచి దూరం చేసింది. అయినప్పటికీ మా బంధానికి ఆమె కట్టుబడి ఉంది. ఆమె తన బలం, విశ్వాసంతో నా బాధ్యతలను స్వీకరించి, భుజాన వేసుకొని మోసింది.



అనాస్ జమాల్

అల్లా తర్వాత మీరే రక్షణ

నా కుటుంబానికి అల్లా తర్వాత మీరే రక్షణగా నిలవాలి. ఒకవేళ నేను మరణిస్తే, నా ఆశయాలకు కట్టుబడి ప్రాణాలు పోగొట్టుకుంటే.. అల్లా ముందుకు వెళ్లి, మీ ఆదేశాలు శిరసావహించానని చెబుతా. శాశ్వతంగా అల్లా సన్నిధికి చేరడం సంతోషకరమే కదా. అమర వీరుల్లో ఒకడిగా నన్ను చేర్చుకో అని అల్లాను వేడుకుంటున్నా. నా పాపాలన్నింటినీ క్షమించాలని విజ్ఞప్తి చేస్తున్నా. నా ప్రజలకు, నా కుటుంబానికి కల్పించే స్వేచ్ఛా మార్గాన్ని మెరిపించడానికి నా రక్తాన్ని ఒక కాంతిగా మార్చాలని ప్రార్థిస్తున్నా. మీ ప్రార్థనల్లో గాజాను మర్చిపోవద్దు... నన్నూ మర్చిపోవద్దు.''


\- అనాస్ జమాల్ అల్-షరీఫ్

'సల్లేఖనం' ఏ మతానికి సంబంధించింది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ హిస్టరీ

మాదిరి ప్రశ్నలు

1. భారతీయ తర్కశాస్త్ర పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
1) వసబంధుడు
2) ఆచార్య నాగార్జునుడు
3) ధర్మకీర్తి 4) దిగ్నాగుడు
2. శాతవాహనుల కాలంనాటి తవ్వకాల్లో ఏ దేశ నాణేలు విస్తారంగా లభించాయి?
1) గ్రీస్ 2) రోమన్
3) ఈజిప్టు 4) ఇరాక్
3. రజాకారుల దళంలో చివరిస్థాయి అధికారి?
1) మర్‌కాజ్
2) సాలార్-ఇ-సాఫిర్
3) సాలార్-ఇ-కబర్
4) అప్సర్-ఇ-అలాగా
4. ఒకటో సాలార్జంగ్ కిందివారిలో ఏ పాలకుడి వద్ద దివాన్‌గా పనిచేశాడు?
1) నాసిరుద్దౌలా 2) అఫ్జలుద్దౌలా
3) మీర్ మహబూబ్ అలీఖాన్
4) పై వారందరూ
5. తెలుగులో 'జపాన్ చరిత్ర'ను రాసి మునగాల రాజుకు అంకితం ఇచ్చిన వారెవరు?
1) శ్రీరామ వీరబ్రహ్మం
2) ఆదిపూడి సోమనాథరావు
3) అయ్యదేవర కాళేశ్వరరావు
4) రామశాస్త్రి నాయుడు
6. కాకతీయుల కాలంలో ప్రధానంగా వేటిని ఎగుమతి చేసేవారు?
1) సుగంధ ద్రవ్యాలు 2) వస్త్రాలు
3) అలంకార వస్తువులు 4) గుర్రాలు
7. 'బగేలా' అనే వెట్టిచాకిరి పద్ధతి ఏ ప్రాంతంలో కనిపిస్తుంది?
1) తెలంగాణ 2) కోస్తాంధ్ర
3) రాయలసీమ 4) పైవన్నీ
8. 1988లో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, 'భూగోళమంత మనిషి', 'దృక్పథం', 'కలం సాక్షిగా', 'కర్పూర వసంతరాయలు' తదితర రచనలు చేసిన ప్రముఖ తెలుగు సాహిత్యవేత్త ఎవరు?
1) కాళోజీ నారాయణరావు
2) విశ్వనాథ సత్యనారాయణ
3) బోయి భీమన్న 4) సి.నారాయణరెడ్డి
9. నిజాం సంస్థానంలోని పాఠశాలల్లో బోధన ఏ భాషలో ఉండేది?
1) తెలుగు 2) హిందీ
3) ఉర్దూ 4) ఇంగ్లిష్
10. గోల్కొండ కుతుబ్‌షాహీ వంశానికి చెందిన రాజుల్లో చివరివారెవరు?
1) అబ్దుల్లా కుతుబ్‌షా
2) ఇబ్రహీం కుతుబ్‌షా
3) అబుల్‌హసన్ తానీషా
4) మహమ్మద్ కులీకుతుబ్‌షా
11. ఆంధ్రదేశంలో ఎవరి కాలంలో బంగారు నాణేలను 'మాడ' అని పిలిచేవారు?
1) శాతవాహనులు 2) కాకతీయులు
3) విజయనగర పాలకులు
4) చాళుక్యులు
12. శాసనాల్లోని తొలి తెలుగు పదం 'నాగబు' ఎవరి కాలం నాటిది?
1) శాతవాహనులు 2) హూణులు
3) కాకతీయులు 4) ఇక్ష్వాకులు
13. 'సల్లేఖనం' ఏ మతానికి సంబంధించింది?
1) బౌద్ధమతం 2) శైవం
3) సిక్కు 4) జైనమతం
14. కిందివాటిలో 1972 నవంబర్ 27న ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ప్రధాని ప్రకటించిన పంచసూత్రాల్లోని అంశం ఏది?
1) జంటనగరాల్లో ఇరు ప్రాంతాల వారిని తీసుకొని పోలీసు దళాన్ని ఏర్పాటు చేయాలి
2) జంటనగరాల్లో ఆంధ్ర ప్రాంత అభ్యర్థులకు విద్యా సౌకర్యాలు మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి
3) ముల్కీ నిబంధనలు నాన్ గెజిటెడ్ ఉద్యోగాలకు, అసిస్టెంట్ ఇంజనీర్లకు తెలంగాణ ప్రాంతమంతా వర్తిస్తాయి
4) పైవన్నీ
15. మట్టిపాడు శాసనాన్ని ఎవరు వేయించారు?
1) కందరుడు 2) అత్తివర్మ
3) దామోదరవర్మ 4) సోమశేఖరవర్మ
16. 'చిన్‌కిలిచ్ ఖాన్' అనే పేరున్న అసఫ్ జాహీ పాలకుడు ఎవరు?
1) నాజర్ జంగ్ 2) సలాబత్ జంగ్
3) నిజాం-ఉల్-ముల్క్
4) ఉస్మాన్ అలీఖాన్
17. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు మరణానంతరం మొగలు సుబేదారైన నిజాం ఉల్ ముల్క్ దక్కన్‌లో ఎప్పుడు స్వతంత్రం ప్రకటించుకున్నాడు?
1) 1724 2) 1794 3) 1734 4) 1726
18. 1930లో నిర్వహించిన తొలి ఆంధ్ర మహాసభకు ఆతిథ్యం ఇచ్చిన జోగిపేట ఏ జిల్లాలో ఉంది?
1) రంగారెడ్డి 2) నల్గొండ
3) మెదక్ 4) వరంగల్
19. 'ఏక బ్రాహ్మణ' బిరుదు ఉన్న శాతవాహన చక్రవర్తి ఎవరు?
1) మొదటి శాతకర్ణి
2) గౌతమీపుత్ర శాతకర్ణి
3) శ్రీముఖుడు 4) రెండో శాతకర్ణి
20. 'ఆపరేషన్ పోలో' ఎప్పుడు జరిగింది?
1) 1948 సెప్టెంబర్ 13
2) 1947 ఆగస్టు 15 3) 1949 ఆగస్టు 15
4) 1950 జనవరి 26
21. 'నీతిశాస్త్ర ముక్తావళి' రచన ఏ భాషలో వెలువడింది?
1) సంస్కృతం 2) ప్రాకృతం
3) తెలుగు 4) తమిళం
22. కిందివాటిలో దేన్ని 'జూన్ ప్రణాళిక'గా పేర్కొంటారు?
1) క్రిప్స్ ప్రతిపాదనలు
2) అట్లీ ప్రకటన
3) మౌంట్ బాటన్ ప్రణాళిక
4) కేబినెట్ మిషన్ ప్లాన్
23. నిజాం సంస్థానంలో 'బలూతాదార్' అంటే ఎవరు?
1) జమీందారీ వర్గం 2) వర్తకులు
3) ప్రభుత్వ అధికారులు
4) వెట్టిచాకిరి వర్గం
24. కింద పేర్కొన్న ఏ రాజవంశానికి వరాహం రాజ లాంఛనంగా ఉండేది?
1) శాతవాహనులు 2) చాళుక్యులు
3) శాలంకాయనులు 4) పల్లవులు
25. 1950లో హైదరాబాద్ రాష్ట్రానికి సివిల్ అడ్మినిస్ట్రేటర్‌గా ఎవరు నియమితులయ్యారు?
1) బూర్గుల రామకృష్ణ
2) యం.కె. వెల్లోడి 3) జె.ఎన్. చౌదరి
4) టంగుటూరి ప్రకాశం పంతులు
26. మొదటిసారిగా 'స్టేట్ రీ ఆర్గనైజేషన్ కమిషన్'ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1948 2) 1949 3) 1953 4) 1956
27. శాతవాహన కాలంనాటి 13 అడుగుల శివలింగం ఎక్కడ ఉంది?
1) వీరాపురం (కర్నూలు)
2) గుడిమల్లం (చిత్తూరు)
3) జగ్గయ్యపేట (కృష్ణా)
4) హనమకొండ (వరంగల్)
28. అజంతా గుహల్లో శాతవాహన యుగానికి చెందినవి ఏవి?
1) 6, 7వ గుహలు 2) 8, 9వ గుహలు
3) 9, 10వ గుహలు 4) 11, 12వ గుహలు
29. భారతదేశ గ్రంథాలయోద్యమ చరిత్రలో విశిష్ట స్థానాన్ని పొందిన సంస్థానం ఏది?
1) గ్వాలియర్ 2) జమ్ము-కశ్మీర్
3) బరోడా 4) జునాఘడ్
30. నక్సల్‌బరీ ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైంది?
1) 1965 2) 1967 3) 1969 4) 1970



31. కుతుబ్‌షాహీలు భూమి శిస్తు వసూలు చేసిన పద్ధతి ఏది?
1) రైత్వారీ 2) మహల్వారీ
3) వేలం 4) మున్సబ్‌దారీ విధానం
32. శ్రీ లక్ష్మీనృసింహ విలాస గ్రంథాలయం ఎక్కడ ఉంది?
1) అశ్వారావుపేట 2) ఇబ్రహీంపట్నం
3) కొడిమ్యాల 4) పజ్జూరు
33. హైదరాబాద్‌లో నెలకొల్పిన మొదటి విద్యాసంస్థ ఏది?
1) మాడపాటి హనుమంతరావు బాలికల పాఠశాల
2) వివేకవర్ధిని పాఠశాల
3) నిజాం పాఠశాల
4) సుందరయ్య పాఠశాల
34. ఘటికల గురించి ప్రస్తావించిన తొలి శాసనం ఏది?
1) హిరె సముద్ర 2) అమరావతి
3) ఇంద్ర భట్టారకవర్మ
4) పల్లవుల శాసనాలు
35. నిజాం పాలనా కాలంలో శాసనసభ్యులను ఎవరు నియమించేవారు?
1) బ్రిటిష్ ప్రభుత్వం
2) భారత యూనియన్
3) నిజాం నవాబు 4) ప్రజలు
36. శాతవాహనుల కాలంలో 'ఆహారాలు'గా వేటిని పేర్కొనేవారు?
1) సామంత రాజ్యాలు 2) రాష్ట్రాలు
3) గ్రామాలు 4) పట్టణాలు
37. మొట్టమొదటి తెలుగు శాసనం ఏది?
1) పల్నాడు శాసనం
2) విప్పర్ల శాసనం
3) వేంగి శాసనం
4) అమరావతి శాసనం
38. ఇక్ష్వాకుల కాలంలో ప్రజలు ఏ దేశంతో వ్యాపారం నిర్వహించారు?
1) ఈజిప్టు 2) రోమన్
3) సింహళం 4) అరబ్బు
39. 'క్షత్రియ దర్పమాణ'గా గుర్తింపు పొందిన పాలకుడు ఎవరు?
1) యజ్ఞశ్రీ శాతకర్ణి
2) గౌతమీపుత్ర శాతకర్ణి
3) శ్రీముఖుడు 4) పులోమావి
40. శ్రీముఖునికి చెందిన ఏడు నాణేలు ఎక్కడ లభించాయి?
1) నాగార్జునకొండ 2) ధూళికట్ట
3) కోటిలింగాల 4) రామతీర్థం
41. భారతదేశ 'ఐన్‌స్టీన్'గా ఎవరిని పేర్కొంటారు?
1) హాలుడు 2) ఆర్యభట్ట
3) సోమదేవుడు 4) నాగార్జునుడు
42. దేశంలో మొదటి ద్వీపపు మ్యూజియం ఎక్కడ ఉంది?
1) అమరావతి 2) నాగార్జునకొండ
3) నలంద 4) భట్టిప్రోలు
43. దేవరకొండలో నిర్వహించిన రెండో ఆంధ్ర మహాసభల్లో మహిళా సభ అధ్యక్షురాలిగా నియమితులైనవారెవరు?
1) బి. వరలక్ష్మమ్మ 2) సీతాకుమారి
3) ఎస్. సుందరమ్మ 4) మాణిక్యమ్మ

సమాధానాలు

1) 4; 2) 2; 3) 1; 4) 4; 5) 2; 6) 2; 7) 1; 8) 4; 9) 3; 10) 3; 11) 2; 12) 1; 13) 4; 14) 4; 15) 3; 16) 3; 17) 1; 18) 3; 19) 2; 20) 1; 21) 3; 22) 3; 23) 4; 24) 3; 25) 2; 26) 3; 27) 2; 28) 3; 29) 3; 30) 2; 31) 3; 32) 2; 33) 2; 34) 4; 35) 3; 36) 2; 37) 2; 38) 2; 39) 2; 40) 3; 41) 4; 42) 2; 43) 1.

హోలోగ్రఫీ విధానాన్ని ఆవిష్కరించింది ఎవరు?

ఓజోన్ పొరకు నష్టం వాటిల్లకుండా, వాతావరణ మార్పుల నుంచి రక్షించుకోవడానికి ప్రపంచ దేశాలన్నీ 1997 డిసెంబర్‌లో జపాన్‌లోని క్యోటో నగరంలో సమావేశమయ్యాయి. 1998 ఫిబ్రవరి 16న ప్రపంచ దేశాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. దీన్ని 'క్యోటో ఒప్పందం' అంటారు. ఇది 2005 ఫిబ్రవరి 16 నుంచి అమల్లోకి వచ్చింది.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
భౌతిక శాస్త్రం

దృష్టి లోపాలు- రకాలు

హ్రస్వదృష్టి: కంటికి దగ్గరగా ఉన్న వస్తువులను మాత్రమే చూడగలిగి, దూరంగా ఉన్న వాటిని సరిగా చూడలేకపోవడాన్ని 'హ్రస్వదృష్టి' అంటారు. తగిన నాభ్యంతరం ఉన్న వికేంద్రీకరణ (పుటాకార) కటకాన్ని ఉపయోగించి ఈ లోపాన్ని నివారించవచ్చు.

దూరదృష్టి (లేదా) దీర్ఘదృష్టి: కంటికి దూరంగా ఉన్న వస్తువులను మాత్రమే చూడగలిగి దగ్గరగా ఉన్న వాటిని చూడలేకపోవడాన్ని 'దూరదృష్టి' అంటారు. తగిన నాభ్యంతరం ఉన్న కేంద్రీకరణ(కుంభాకార) కటకాన్ని ఉపయోగించి ఈ లోపాన్ని నివారించవచ్చు.

అసమదృష్టి: కంటిలోని కార్నియాలో లోపం వల్ల ఈ సమస్య వస్తుంది. ఈ లోపం ఉన్న వ్యక్తులు ఒక వస్తువును చూసినప్పుడు అది అడ్డగీతలు లేదా నిలువు గీతలుగా మాత్రమే కనిపిస్తుంది. ఈ లోపాన్ని సవరించడానికి స్థూపాకార కటకం వాడతారు.

చత్వారం: కొంత మందిలో వయసు పెరుగుతున్న కొద్దీ కన్ను దాని నేత్రానుగుణ్యతను కోల్పోతుంది. ఫలితంగా దగ్గరగా ఉన్న వస్తువును లేదా కొంత దూరంలో ఉన్న వస్తువును చూడటం వీలుకాదు. ఈ దృష్టి లోపాన్ని సవరించడానికి ద్వినాభి కటకాన్ని ఉపయోగిస్తారు.

రేచీకటి: విటమిన్-ఎ లోపం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. రేచీకటితో బాధపడే వారు పగటి సమయంలో మాత్రమే చూడగలుగుతారు. రాత్రివేళలో కృత్రిమ కాంతి జనకాల నుంచి వచ్చే కాంతి తీవ్రత వీరిలో దృష్టిజ్ఞానాన్ని ప్రేరేపించదు. ఈ సమస్య నివారణకు విటమిన్-ఎ ఎక్కువగా లభించే ఆహారాన్ని తీసుకోవాలి.

వర్ణాంధత్వం: కంటిలోని కోన్లలో తలెత్తే లోపం వల్ల వర్ణాంధత్వం కలుగుతుంది. ఈ సమస్య ఉన్నవారు అన్ని రంగులను గుర్తించలేరు. తల్లిదండ్రుల జన్యువుల ద్వారా పిల్లలకు సంక్రమిస్తుంది. ఈ దృష్టి లోపాన్ని నివారించడానికి ఎలాంటి ఔషధాలు, చికిత్సా విధానం అందుబాటులో లేదు.

అదృశ్య వికిరణాలు


పరారుణ కిరణాలు: వీటిని విలియం హెర్షెల్ కనుగొన్నాడు. వీటి తరంగదైర్ఘ్య అవధి 7,500 ¯- 40,00,000 ¯. అన్ని రకాల గాజు పదార్థాలు ఈ కిరణాలను శోషించుకుంటాయి. రాతి ఉప్పుతో తయారైన పట్టకాలు, కటకాల ద్వారా ఈ తరంగాలు చొచ్చుకొని వెళ్లలేవు. కాబట్టి ఈ కటకాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.

పరారుణ కిరణాలు తమ వెంట ఉష్ణాన్ని మోసుకెళుతూ ఎదురుగా ఉన్న వస్తువులను తాకినప్పుడు వాటికి ఉష్ణాన్ని బదిలీ చేస్తాయి. అందువల్ల ఈ కిరణాలను ఉష్ణ వికిరణాలు అని కూడా అంటారు. ఉష్ణ వికిరణ సూత్రం ఆధారంగా థర్మోపైల్, బోలోమీటర్ సాధనాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.

అనువర్తనాలు:

- కండరాల నొప్పి, బెణకడం వల్ల వచ్చే నొప్పుల నివారణకు పరారుణ కిరణాలను ఉపయోగిస్తారు. పక్షవాతానికి చికిత్సలో, టీవీ, రేడియో కార్యక్రమాల ప్రసారాల్లో వీటిని వినియోగిస్తారు.
- ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి రహస్య సాంకేతికాలను ప్రసారం చేయడానికి ఈ కిరణాలు ఉపయోగపడతాయి.
- రిమోట్ సెన్సింగ్ విధానంలో వాడతారు.
- గోడలపై ఉన్న పాత చిత్రలేఖనాలను తొలగించడానికి ఉపయోగిస్తారు.
- పరారుణ కిరణాల తరంగదైర్ఘ్యం ఎక్కువ. అందువల్ల పొగమంచు, దుమ్ము, ధూళి కణాల ద్వారా ఈ తరంగాలు తక్కువ పరిక్షేపణం చెందుతాయి. రుజుమార్గంలో ఎక్కువ దూరం ప్రయాణిస్తాయి. కాబట్టి ఇలాంటి పదార్థాల ద్వారా వస్తువులను చూడటానికి, ఫొటోలు తీయడానికి ఈ కిరణాలను వాడతారు.
- భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహాలను నియంత్రించడానికి వాడతారు.
- నైట్ విజన్ కెమెరా, బైనాక్యులర్లలో ఈ కిరణాలను వాడతారు. రాత్రి వేళల్లో ఈ పరికరాలతో వస్తువులను స్పష్టంగా చూడవచ్చు.
- పరిశ్రమల బట్టీలు, కొలిమిల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలను సృష్టించడానికి వాడతారు.
- పరారుణ కిరణాల ఆధారంగా వస్తువుల ఉష్ణోగ్రతను కొలిచే పద్ధతిని థర్మోగ్రఫీ అంటారు.
- గ్లోబల్ వార్మింగ్‌ను, ఒక ప్రదేశంలోని శీతోష్ణస్థితులను అధ్యయనం చేయడానికి ఈ తరంగాలను ఉపయోగిస్తారు.
- టెలిస్కోప్ పనిచేయడానికి కూడా ఈ కిరణాలను ఉపయోగిస్తారు.

అతినీలలోహిత కిరణాలు: వీటిని రిట్టర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. వీటి తరంగదైర్ఘ్య అవధి 100Å- 4000Å. క్వాంటం సిద్ధాంతం ప్రకారం ఈ కిరణాల శక్తి చాలా ఎక్కువ. క్వార్ట్జ్ గాజు మినహా మిగతా గాజు పదార్థాలన్నీ ఈ కిరణాలను శోషించుకుంటాయి. అందువల్ల క్వార్ట్జ్‌తో నిర్మించిన కటకాలు, పట్టకాలను ఉపయోగించి ఈ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.



గమనిక: అతినీలలోహిత కిరణాలను తేనెటీగలు చూడగలుగుతాయి.

అనువర్తనాలు:

- పాలు, నీళ్లలో ఉన్న హానికర బ్యాక్టీరియాను నశింపజేయడానికి, ఆహార పదార్థాలను మన్నికగా ఎక్కువ కాలం నిల్వ చేయడానికి అతినీలలోహిత కిరణాలను ఉపయోగిస్తారు.

గమనిక:
ఆహార పదార్థాలను నిల్వ చేయడం కోసం వాటిలో సోడియం బెంజోయేట్‌ను కలుపుతారు.

- వైద్య రంగంలో స్టెరిలైజేషన్ కోసం (హానికరమైన బ్యాక్టీరియాను నశింపజేయడానికి) ఈ కిరణాలను ఉపయోగిస్తారు.
- పాడైన కోడిగుడ్లను గుర్తించడానికి వాడతారు.
- సహజ, కృతిమ దంతాల మధ్య తేడాలను తెలుసుకోవడానికి వీటిని ఉపయోగిస్తారు.
- టీవీ, రేడియో కార్యక్రమాల ప్రసారాల్లోనూ వినియోగిస్తారు.
- తొలిదశలో ఉన్న కేన్సర్ గడ్డలను కరిగించడానికి వీటిని వాడతారు.
- వేలిముద్రలను విశ్లేషించడానికి వాడతారు.
- వృక్షాలు కిరణజన్య సంయోగక్రియ జరపడానికి వీటిని ఉపయోగించుకుంటాయి.
- అతినీలలోహిత కిరణాలు మన శరీరంపై పడినప్పుడు 1 మి.మీ. లోతుకు చొచ్చుకెళ్లి విటమిన్-డిని ప్రేరేపిస్తాయి. రికెట్స్ వ్యాధి రాకుండా విటమిన్-డి తోడ్పడుతుంది.
- నకిలీ డాక్యుమెంట్లు, కరెన్సీ నోట్లను గుర్తించడానికి వినియోగిస్తారు.

నష్టాలు: సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల శక్తి అధికంగా ఉంటుంది. వీటి ద్వారా చర్మ కేన్సర్ సోకుతుంది. ఈ కిరణాలు నేరుగా భూమిని చేరకుండా వాతావరణంలోని ఓజోన్ పొర శోషించుకుంటుంది. కానీ క్లోరోఫ్లోరో కార్బన్‌లు, ఫ్రియాన్ వాయువుల వల్ల ఓజోన్ పొరకు రంధ్రాలు ఏర్పడుతున్నాయి. వీటి ద్వారా అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిని చేరుతాయి.

రేడియో తరంగాలు: వీటిని జేమ్స్ మాక్స్‌వెల్ కనుగొన్నాడు. వీటి తరంగదైర్ఘ్య అవధి 1 మిల్లీ మీటరు నుంచి 100 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఇవి ఒక రకమైన విద్యుదయస్కాంత కిరణాలు. కాబట్టి శూన్యంలో, గాలిలో రేడియో తరంగాల వేగం కాంతి వేగానికి ($C = 3\times10^8$ m/s) సమానంగా ఉంటుంది.

అనువర్తనాలు:

- రేడియో కార్యక్రమాల ప్రసారాల్లో వినియోగిస్తారు.
- టెలిస్కోప్‌లు పనిచేయడానికి వాడతారు.
- రాడార్‌లు పనిచేయడానికి ఉపయోగిస్తారు.
- వాతావరణంలోని మార్పులను ముందుగా గుర్తించడానికి ఈ తరంగాలను ఉపయోగిస్తారు.

మైక్రోవేవ్స్: వీటి తరంగదైర్ఘ్య అవధి 1 మీటరు - 1 మిల్లీ మీటరు. మైక్రో తరంగాలు ఒక రకమైన విద్యుదయస్కాంత తరంగాలు. గాలిలో, శూన్యంలో వీటి వేగం కాంతి వేగానికి సమానం.

అనువర్తనాలు:

- నావిగేషన్ విధానంలో (వాహనాలు, నౌకలు, విమానాల మార్గాలను తెలుసుకోవడానికి) ఉపయోగిస్తారు.
- టెలిమెట్రీ విధానంలో వాడతారు. భూమి నుంచి ఒక అంతరిక్ష నౌక మధ్య ఉండే దూరాన్ని కొలిచే పద్ధతిని టెలిమెట్రీ అంటారు.
- భూమి ఉపరితలం నుంచి మేఘాల ఎత్తు, అవి కదిలే దిశను తెలుసుకోవడానికి ఉపయోగిస్తారు.
- ఆప్టికల్ ఫైబర్ ద్వారా సమాచార ప్రసారం కోసం వీటిని వినియోగిస్తారు.
- మైక్రో ఓవెన్‌లో ఆహార పదార్థాలను వేడిచేయడానికి వాడతారు.
- ఈ తరంగాలు ఆహార పదార్థంలోని అణువుల లోపలికి చొచ్చుకెళ్లి వాటి కంపనాలను పెంచుతాయి. అందువల్ల ఈ కణాల కంపన శక్తి ఉష్ణశక్తిగా మారుతుంది. ఫలితంగా ఆహార పదార్థాలు వేడుక్కుతాయి.

అల్యూమినియం, రాగి, ఇనుము తదితర లోహాల ద్వారా మైక్రోవేవ్స్ చొచ్చుకెళ్లలేవు. కానీ అలోహాలైన గాజు, ప్లాస్టిక్, పేపర్ తదితరాల ద్వారా చొచ్చుకెళతాయి. కాబట్టి అలోహ పదార్థాలతో తయారుచేసిన పాత్రల్లో మాత్రమే ఆహార పదార్థాలను ఉంచి మైక్రోవేవ్ ఓవెన్‌లో వేడి చేయాలి. మైక్రో ఓవెన్‌ను స్పెన్సర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

మాదిరి ప్రశ్నలు

1. ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయడంలో ఇమిడి ఉన్న ధర్మం?
1) రుజువర్తనం 2) వ్యతికరణం
3) సంపూర్ణాంతర పరావర్తనం
4) వివర్తనం
2. కాంతి వ్యతికరణాన్ని కనుగొన్నది ఎవరు?
1) హైగెన్స్ 2) థామస్ యంగ్
3) న్యూటన్ 4) గ్రిమాల్డి
3. కాంతి పరిక్షేపణం దేనిపై ఆధారపడుతుంది?
1) కాంతి కిరణాల కోణం
2) కాంతి తరంగ దైర్ఘ్యం
3) కాంతి కిరణం ఢీకొంటున్న కణాల పరిమాణం
4) పైవన్నీ
4. ఆకాశం నిజమైన రంగు ఏది?
1) నీలం 2) నలుపు
3) తెలుపు 4) వర్ణ రహితం
5. నీటిపై నూనెను వెదజల్లినప్పుడు రంగులు కనిపించడానికి కారణం?
1) వ్యతికరణం 2) వక్రీభవనం
3) రుజువర్తనం 4) విశ్లేషణం
6. సీడీ, డీవీడీలపై కాంతి పతనమైనప్పుడు భిన్న రంగులు కనిపించడానికి కారణం?
1) రుజువర్తనం 2) వివర్తనం
3) విశ్లేషణం 4) ధ్రువణం
7. ఇంద్రధనస్సు ఏర్పడటానికి కారణమయ్యే కాంతి ధర్మం?
1) వక్రీభవనం
2) విశ్లేషణం
3) సంపూర్ణాంతర పరావర్తనం
4) పైవన్నీ
8. హోలోగ్రఫీ విధానాన్ని ఆవిష్కరించింది ఎవరు?
1) గేబర్ 2) ఫెర్నీ
3) ఫారడే 4) బ్రటేయిన్
9. రామన్ ఫలితంలోని కాంతి ధర్మం ఏది?
1) రుజువర్తనం 2) పరిక్షేపణం
3) విశ్లేషణం 4) ధ్రువణం

సమాధానాలు

1) 3; 2) 2; 3) 4; 4) 4; 5) 1; 6) 2; 7) 4; 8) 1; 9) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ న్యూఢిల్లీలో జేఆర్ఎఫ్‌లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) న్యూఢిల్లీలో ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోలు(జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 02.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ /బీటెక్ /ఎంఈ/ఎంటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు నెట్ గేట్‌లో అర్హత సాధించి ఉండాలి. » వేతనం: నెలకు రూ.37,000.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా.
» ఈమెయిల్: aarora@iitd.ac.in
» దరఖాస్తులకు చివరితేది: 14.08.2025.
» వెబ్‌సైట్: https://ird.iitd.ac.in

ఎఫ్‌డీడీఐ, నోయిడాలో ఫ్యాకల్టీ పోస్టులు

నోయిడాలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» పోస్టులు: చీఫ్ ఫ్యాకల్టీ, సీనియర్ ఫ్యాకల్టీ గ్రేడ్-1, సీనియర్ ఫ్యాకల్టీ గ్రేడ్-2, ఫ్యాకల్టీ, జూనియర్ ఫ్యాకల్టీ.
» అర్హత: సంబంధిత రంగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం, టెక్నికల్ నైపుణ్యాలు ఉండాలి.
» వయసు: 53 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు చీఫ్ ఫ్యాకల్టీ పోస్టుకు రూ.1,50,000, సీనియర్ ఫ్యాకల్టీ గ్రేడ్-1 రూ.1,10,000, సీనియర్ ఫ్యాకల్టీ గ్రేడ్2కు రూ.80,000, ఫ్యాకల్టీ పోస్టులకు రూ. 65,000, జూనియర్ ఫ్యాకల్టీకి రూ.45,000.
» ఎంపిక విధానం: విద్యార్హతలు, షార్ట్‌లిస్టింగ్, రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 22.08.2025
» వెబ్‌సైట్: https://fddiindia.com

టీఐఎఫ్ఆర్, ముంబైలో ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులు

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టీఐఎఫ్ఆర్).. ప్రాజెక్ట్ అసోసియేట్, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60శాతం మార్కులతో బీఈ/బీటెక్, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీ(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ - కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్- ఎలక్ట్రానిక్స్ లేదా ఎలక్ట్రానిక్స్-టెలికమ్యూనికేషన్స్)లో ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 28 నుంచి 32 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.30,000 నుంచి రూ.40,000, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.60,000.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా.
» ఈమెయిల్: gmohanty@tifr.res.in.
» దరఖాస్తులకు చివరితేది: 20.08.2025.
» వెబ్‌సైట్: www.tifr.res.in

సిమెంట్‌లో సాధారణంగా కలిపే జిప్సం శాతం?

నిర్మాణ రంగంలో సిమెంట్ ఆవిష్కరణ ఒక అద్భుత ఘట్టం. ఆధునిక యుగంలో సిమెంట్ రహిత నిర్మాణాలను ఊహించలేం. ఇటీవల రోడ్లను సైతం సిమెంట్‌తోనే వేస్తున్నారు. హైదరాబాద్‌లో వివిధ సిమెంట్ కంపెనీల ఆధ్వర్యంలో ఒక కిలోమీటర్ మేర 'వైట్ ట్యాపింగ్' చేశారు. మారుతున్న కాలంతో పాటు సిమెంట్ ప్రాధాన్యం మరింత పెరుగుతోంది.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

సిమెంట్

భవనాలు, వంతెనలు, ఆనకట్టలు తదితర నిర్మాణాల్లో ఉపయోగించే అతి ముఖ్యమైన పదార్థం సిమెంట్. దీన్ని 1824లో జె.ఆస్పిడిన్ అనే తాపీమేస్త్రి కనుగొన్నాడు. సున్నపురాయి, బంకమట్టి మిశ్రమాన్ని అధిక ఉష్ణోగ్రతకు వేడిచేస్తే అది ఒక పొడిని ఏర్పరుస్తుందని, దీనికి తగినంత నీటిని కలిపితే కొన్ని గంటల్లో అది రాయిలా గట్టి పడుతుందని ఆస్పిడిన్ కనుగొన్నాడు. ఈ పదార్థం 'పోర్ట్‌లాండ్' అనే ప్రదేశంలో దొరికే రాయి లాంటి బలమైనది కావడం వల్ల దీన్ని 'పోర్ట్‌లాండ్ సిమెంట్'గా వ్యవహరించారు.

- సిమెంట్ అనేది ప్రధానంగా కాల్షియం సిలికేట్‌లు, కాల్షియం అల్యూమినేట్ల మిశ్రమం. ఇందులో కొద్ది మొత్తంలో ఐరన్, సోడియం, పొటాషియం, మెగ్నీషియం లోహాల ఆక్సైడ్‌లు, కరిగిన సల్ఫర్ ట్రై ఆక్సైడ్‌లు ఉంటాయి.
- సిమెంటుకు ప్రధాన ముడి పదార్థాలు సున్నపురాయి, బంకమన్ను.
- సిమెంట్‌ను తడి పద్ధతి, పొడి పద్ధతి అనే రెండు విధానాల్లో తయారుచేస్తారు.
- ముడి స్లరీ (చూర్ణం)ను 'ప్రగలన పదార్థం' అంటారు. దీన్ని తిరుగుడు కొలిమిలో 'గ్యాస్' లేదా 'బొగ్గు'ను మండించి వేడి చేస్తారు. ఈ విధానంలో ఏర్పడే పదార్థం 'బూడిద రంగు'ఉన్న గట్టి బంతుల రూపంలో ఉంటుంది. వీటిని సిమెంట్ క్లింకర్‌లు అంటారు.
- సిమెంట్ క్లింకర్లను చూర్ణం చేసి 2 నుంచి 3 శాతం 'జిప్సం'ను కలిపితే వచ్చేదే వ్యాపారాత్మక సిమెంట్.
- జిప్సం అనేది ఆర్ద్ర కాల్షియం సల్ఫేట్. సిమెంట్ సెట్టింగ్‌ను కంట్రోల్ చేయడానికి జిప్సం కలుపుతారు. ఒకవేళ జిప్సంను కలుపకపోతే సిమెంట్‌కు నీరు కలిపిన వెంటనే గట్టి పడుతుంది.
- సిమెంట్ గట్టిపడే ప్రక్రియలో కాల్షియం అల్యూమినేట్లు వేగంగా ఆర్ద్రీకరణం చెంది 'కాల్షియం అల్యూమినియం హైడ్రేట్ (CAH)'లుగా మారతాయి. ఇది ఉష్ణం వెలువడే చర్య (ఉష్ణమోచక చర్య).
- సిమెంట్ పరిశ్రమల్లో ఇటీవల 'ఫ్లై యాష్'ను ఉపయోగిస్తున్నారు. థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో 'నేలబొగ్గు' లేదా 'కోక్'ను మండించడం వల్ల చివరగా మిగిలే బూడిదనే ఫ్లై యాష్ అంటారు.
- ఫ్లై యాష్‌లో ప్రధానంగా సిలికాన్ డై ఆక్సైడ్ (SiO_2), అల్యూమినియం ఆక్సైడ్ (Al_2O_3), కాల్షియం ఆక్సైడ్‌లు ఉంటాయి. అత్యల్ప ప్రమాణాల్లో ఆర్సెనిక్, బెరీలియం, బోరాన్, కాడ్మియం, క్రోమియం, కోబాల్ట్, లెడ్, మాంగనీస్, పాదరసం (మెర్క్యురీ), మాలిబ్డినం, సెలీనియం లాంటి మూలకాలు కూడా ఉంటాయి.
- ఫ్లై యాష్‌ను సిమెంట్‌లో ఉపయోగించడం వల్ల వాతావరణంలోకి విడుదలయ్యే 'హరిత గృహ' వాయువైన కార్బన్ డై ఆక్సైడ్ (CO_2) తగ్గుతుంది.

గాజు

గృహాలంకరణ వస్తువుల్లో గాజుకే ప్రాధాన్యం ఉంది. గ్లాస్ బ్లోయింగ్‌లో రోమన్‌లదే పైచేయి. ఘనరూపంలో ఉన్నప్పటికీ గాజు నిజమైన స్ఫటిక పదార్థం కాదు. ఇది అస్ఫటిక పదార్థం. గాజు ద్రవాన్ని త్వరగా చల్లబరచడం వల్ల దాని స్నిగ్ధత అధికమై ఘనరూపాన్ని సంతరించుకుంటుంది. అందువల్ల గాజును 'అతి శీతలీకరణం చెందిన ద్రవం' అంటారు.

- గాజు ప్రధానంగా సోడియం సిలికేట్, కాల్షియం సిలికేట్, సిలికాల మిశ్రమం.
- గాజుకు కావాల్సిన ముడి పదార్థాలు సోడా యాష్ (Na_2CO_3), సున్నపురాయి ($CaCO_3$), ఇసుక (SiO_2).
- ముడి పదార్థాల మిశ్రమ పొడిని 'బాచ్' అంటారు.
- బాచ్ ద్రవీభవన స్థానం (కరిగే ఉష్ణోగ్రత)ను తగ్గించడానికి కొన్ని పగిలిన గాజు ముక్కలను కలుపుతారు. వీటిని 'కల్లెట్' అంటారు.
- మొత్తం మిశ్రమాన్ని కొలిమిలో 1000°C వద్ద వేడి చేస్తే ద్రవగాజు ఏర్పడుతుంది. దీనిపై తేలియాడే మలినాలను 'గాజుగాల్' అంటారు.
- ద్రవ గాజును త్వరగా చల్లబరిస్తే పెళుసుగా మారే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రత్యేక పద్ధతిలో నెమ్మదిగా చల్లబరుస్తారు. మంద శీతలీకరణం వల్ల గాజుకు అధిక బలం చేకూరుతుంది.
- గాజును వివిధ రంగుల్లో పొందడానికి ద్రవగాజుకు కొన్ని లోహ ఆక్సైడ్‌లను లేదా లోహ లవణాలను కలుపుతారు. క్రోమియం ఆక్సైడ్‌తో ఆకుపచ్చ, మాంగనీస్ ఆక్సైడ్‌తో ఊదా, కాపర్ సల్ఫేట్‌తో నీలం, బంగారం క్లోరైడ్‌తో కెంపు, క్యూప్రస్ ఆక్సైడ్‌తో ఎరుపు రంగులు లభిస్తాయి.
- గాజును 'ఆక్సిజన్-ఎసిటలీన్' మంటతో వేడి చేసి మెత్తబరుస్తారు. అందులోకి గాలిని పంపి కోరిన ఆకృతిలో గాజు వస్తువులను తయారు చేస్తారు. ఈ నైపుణ్యాన్నే 'గ్లాస్ బ్లోయింగ్' అంటారు.
- పైరెక్స్ గాజు, బోరోసిలికేట్ గాజు గ్లాస్ బ్లోయింగ్ ప్రక్రియలకు అనువైనవి.

మాదిరి ప్రశ్నలు

1. ప్రాచీన కట్టడాలకు వినియోగించిన 'దంగుసున్నం' తయారీకి అవసరం లేని ముడిపదార్థం ఏది?
   ఎ) సున్నం బి) ఇసుక
   సి) నీరు డి) బొగ్గు
2. సిమెంట్ అనేది వేటి మిశ్రమం?
   ఎ) కాల్షియం సల్ఫేట్, కాల్షియం క్లోరైడ్
   బి) కాల్షియం ఫాస్ఫేట్, కాల్షియం అల్యూమినేట్
   సి) కాల్షియం సిలికేట్లు, కాల్షియం అల్యూమినేట్
   డి) సోడియం క్లోరైడ్, కాల్షియం క్లోరైడ్
3. సిమెంట్ తయారీలో వినియోగించే ఉష్ణోగ్రత?
   ఎ) 100-200°C బి) 1700-1900°C
   సి) 2000-2500°C డి) 170-190°C
4. సిమెంట్ పరిశ్రమను ఎలాంటి ప్రాంతాల్లో నెలకొల్పుతారు?
   ఎ) ఇసుక దొరికే ప్రాంతం
   బి) సున్నపురాయి దొరికే ప్రాంతం
   సి) నదీ తీర ప్రాంతం
   డి) సముద్ర తీర ప్రాంతం
5. సిమెంట్ తయారీకి కావలసిన ముడి పదార్థాలు?
   ఎ) సున్నపురాయి బి) బంకమన్ను
   సి) బొగ్గు డి) పైవన్నీ
6. బూడిద వర్ణం ఉన్న సిమెంట్ బంతులను ఏమంటారు?
   ఎ) సిమెంట్ బాల్స్ బి) బక్కీ బాల్స్
   సి) సిమెంట్ క్లింకర్స్ డి) కల్లెట్స్
7. సిమెంట్‌కు జిప్సం కలపడానికి కారణం?
   ఎ) రంగు కోసం బి) గట్టిదనం కోసం
   సి) నునుపుదనం కోసం
   డి) సెట్టింగ్ నెమ్మదిగా జరగడం కోసం
8. కిందివాటిలో మోటారు వాహనాల నుంచి వెలువడని కాలుష్యకారిణి ఏది?
   ఎ) కార్బన్ డై ఆక్సైడ్ బి) ఫ్లై యాష్
   సి) నైట్రోజన్ ఆక్సైడ్‌లు డి) నీటి ఆవిరి
9. ఫ్లై యాష్‌ను ఎక్కువగా వేటికి ఉపయోగిస్తారు?
   ఎ) ఇటుకల తయారీ
   బి) సిమెంట్ తయారీ
   సి) ఎ, బి డి) ఏదీకాదు
10. ఫ్లై యాష్ గురించి సరికాని వాక్యం ఏది?
    ఎ) థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఉప ఉత్పన్నం ఫ్లై యాష్
    బి) ఫ్లై యాష్‌కు క్షార ధర్మం ఉంటుంది
    సి) నీటిని పీల్చుకునే ధర్మం ఉంటుంది
    డి) విషపూరిత మూలకాలు ఉండవు
11. ఫ్లై యాష్‌లో ఉండే హానికారక లోహాలు ఏవి?
    ఎ) ఆర్సెనిక్ బి) మెర్క్యూరీ
    సి) లెడ్ డి) పైవన్నీ
12. ఫ్లై యాష్‌లో ప్రధానంగా ఉండేవి?
    ఎ) సిలికాన్ డై ఆక్సైడ్
    బి) అల్యూమినియం ఆక్సైడ్
    సి) కాల్షియం ఆక్సైడ్ డి) పైవన్నీ
13. సిమెంట్‌లో సాధారణంగా కలిపే జిప్సం శాతం?
    ఎ) 10-20 శాతం బి) 5-10 శాతం
    సి) 50 శాతం డి) 2-3 శాతం
14. గాజు అనేది ఒక..?
    ఎ) స్ఫటిక ఘనపదార్థం
    బి) అస్ఫటిక ఘన పదార్థం
    సి) అతి శీతలీకరణం చెందిన ద్రవం
    డి) జెల్లీ
15. గాజు రసాయనికంగా వేటి మిశ్రమం?
    1. సోడియం సిలికేట్
    2. కాల్షియం సిలికేట్
    3. సిలికా
    ఎ) 1, 2 మాత్రమే బి) 2, 3 మాత్రమే
    సి) 1, 3 మాత్రమే డి) పైవన్నీ
16. ప్రయోగశాలలోని గాజు పరికరాల తయారీకి వాడే గాజు?
    ఎ) సోడా గాజు బి) క్వార్ట్జ్ గాజు
    సి) పైరెక్స్ గాజు డి) ఏదీకాదు
17. విద్యుత్ బల్బులు, దృశ్య పరికరాల తయారీకి వాడే గాజు?
    ఎ) సోడా గాజు బి) క్వార్ట్జ్ గాజు
    సి) ఫ్లింట్ గాజు
    డి) బోరోసిలికేట్ గాజు
18. గాజును కోయడానికి ఉపయోగించే పదార్థం?
    ఎ) గాజు బి) వజ్రం
    సి) స్టీల్ డి) టంగ్‌స్టన్
19. పోర్ట్‌లాండ్ సిమెంట్‌లోని ప్రధాన అనుఘటకాలు?
    ఎ) సున్నం, సిలికా, ఐరన్ సల్ఫైడ్
    బి) సున్నం, సిలికా, సోడా
    సి) సున్నం, సిలికా, అల్యూమినా
    డి) సిలికా, సున్నం, ఐరన్ ఆక్సైడ్
20. గాజు అనేది ఒక..?
    ఎ) విద్యుత్ వాహకం బి) ఉష్ణ వాహకం
    సి) ఉష్ణబంధకం (ఇన్సులేటర్)
    డి) అర్ధ వాహకం
21. బంకమట్టి నుంచి సిమెంట్‌లోకి ప్రధానంగా చేరేది?
    ఎ) కాల్షియం సిలికేట్
    బి) అల్యూమినియం సిలికేట్
    సి) సోడియం సిలికేట్
    డి) సోడియం కార్బొనేట్
22. కిటికీ అద్దాలు, గాజుసీసాల తయారీకి ఉపయోగించే గాజు?
    ఎ) ఫ్లింట్ గాజు
    బి) సోడా గాజు (మెత్తని గాజు)
    సి) గట్టిగాజు డి) పైరెక్స్ గాజు
23. గ్లాస్ బ్లోయింగ్ ప్రక్రియలో వాడే వాయువు?
    ఎ) ఆక్సిజన్ బి) ఎసిటలీన్
    సి) ఆక్సీ-ఎసిటలీన్ డి) హైడ్రోజన్
24. సాధారణ గాజుకు కలిపే వివిధ పదార్థాలు, అవి ఇచ్చే రంగులను జతపరచండి.
    ఎ) మాంగనీస్ డై ఆక్సైడ్ 1) ఊదా
    బి) కోబాల్ట్ ఆక్సైడ్ 2) నీలం
    సి) క్రోమియం ఆక్సైడ్ 3) ఆకుపచ్చ
    డి) క్యూప్రస్ ఆక్సైడ్ 4) ఎరుపు

	ఎ	బి	సి	డి
ఎ)	1	2	3	4
బి)	4	3	2	1
సి)	2	4	1	3
డి)	3	1	4	2

25. గాజుపై గాట్లు పెడుతూ ఎచ్చింగ్ చేయడానికి వాడే ఆమ్లం ఏది?
    ఎ) హైడ్రోక్లోరికామ్లం (HCl)
    బి) హైడ్రోఫ్లోరికామ్లం (HF)
    సి) నైట్రికామ్లం (HNO_3)
    డి) సల్ఫ్యూరికామ్లం (H_2SO_4)
26. వాటర్ గ్లాస్ అని దేనికి పేరు? (Gr-II, 2012)
    ఎ) సోడియం సిలికేట్
    బి) అల్యూమినియం సిలికేట్
    సి) జింక్ సిలికేట్ డి) కాల్షియం సిలికేట్
27. అతినీలలోహిత కిరణాలకు పారదర్శకంగా పని చేసే గాజు?
    ఎ) ఫ్లింట్ గాజు బి) క్వార్ట్జ్ గాజు
    సి) పైరెక్స్ గాజు డి) పైవన్నీ
28. బుల్లెట్ ప్రూఫ్ గ్లాస్‌ను దేనితో తయారు చేస్తారు?
    ఎ) క్వార్ట్జ్ గాజు బి) మెత్తని గాజు
    సి) గట్టిగాజు పొరల మధ్య థర్మోప్లాస్టిక్ పాలీకార్బొనేట్ పొరలను బలంగా అతికిస్తారు
    డి) బోరోసిలికేట్ గాజు

సమాధానాలు

1) డి; 2) సి; 3) బి; 4) బి; 5) డి; 6) సి; 7) డి; 8) బి; 9) సి; 10) డి; 11) డి; 12) డి; 13) డి; 14) సి; 15) డి; 16) సి; 17) బి; 18) బి; 19) సి; 20) సి; 21) బి; 22) బి; 23) సి; 24) ఎ; 25) బి; 26) ఎ; 27) బి; 28) సి.

The direct speech of the sentence is...



BANK EXAMS

ENGLISH

Fill in the blanks with appropriate articles (1-3):

1. They usually spend their holidays in _____ mountains.
   1) a 2) an 3) the 4) no article
2. I can't live on _____ 500 rupees a month.
   1) a 2) an 3) the 4) no article
3. Someone call _____ police man!
   1) a 2) an 3) the 4) no article

Fill in the blanks with appropriate prepositions (4-6):

4. Don't be late _____ school.
   1) for 2) in 3) on 4) with
5. Are you a teacher _____ this school?
   1) on 2) at 3) for 4) from
6. She is _____ vacation. She is _____ Delhi now.
   1) on; in 2) in; at
   3) for; at 4) upon; in

Choose the right phrasal verb in the following sentences (7-8):

7. The dish that I prepared was ruined. I am afraid I had to throw it _____.
   1) off 2) in 3) up 4) away
8. If you don't know this word, you can look it _____ in a dictionary.
   1) up 2) off 3) on 4) in

Choose the right conditional clause to the following main clause

9. I will go to London _____
   1) If I have enough money
   2) If I had enough money
   3) Had I got enough money
   4) If I will have enough money

Identify the subordinate class in the following sentence

10. When Sheela moved to the United States, she was five years old.
    1) She was five years old
    2) Sheela was five years old
    3) When Sheela moved to the United States
    4) Sheela moved to the United States

The correct response to the following question is

11. "Do you want to show your presentation in the meeting?
    1) Yes, I do 2) Yes, I am
    3) No, I want 4) Yes, I can

Identify the parts of speech of the underlined word in the following sentences: (12-14)

12. Which one of the books is your favourite?
    1) conjunction
    2) preposition
    3) interjection
    4) pronoun
13. No one wanted to live by the smelly landfill.
    1) adjective 2) adverb
    3) verb 4) noun
14. They visited their grandparents frequently in the summer.
    1) adjective 2) adverb
    3) verb 4) noun

Match the following with the right options:

1) Bird's eye view
2) Apple of eye
3) An eye for an eye
4) All eyes

a) attentive
b) allows you to see a large area
c) treasure
d) punishment

15. The correct order is
    1) 1-d, 2-c, 3-b, 4-a
    2) 1-b, 2-c, 3-d, 4-a
    3) 1-a, 2-c, 3-d, 4-b
    4) 1-c, 2-a, 3-b, 4-d

The reported speech of the sentence is _____

16. "Don't waste your money", she said.
    1) She said don't waste your money.
    2) She told the boys not to waste their money.
    3) She told don't waste your money.
    4) She asked them not to waste your money.

The direct speech of the sentence is __

17. He wanted to know where I had been.
    1) He said "where I was?"
    2) He questioned "where I have been?"
    3) "Where have you been?" he asked me.
    4) He told "where are you?"

Convert the following complex sentence into simple sentence.

18. Your father is the man who can solve this problem.
    1) Your father is the man who is going to solve this problem.
    2) Your father is the man solving this problem.
    3) Your father is the man to solve this problem.
    4) Your father is the man to solving this problem.

Convert the following simple sentence into complex sentence

19. He liked his former place.
    1) He liked the place where he was living formerly.
    2) He liked the place where he lived formerly.
    3) He liked the place where he lived earlier.
    4) He liked the place in which he lived formerly.

Fill in the blanks with the appropriate word (20-25):

20. How is your father today? Is he any _____?
    1) improved 2) good
    3) better 4) best
21. The student was given a fee ___.
    1) waiver 2) waver
    3) exempt 4) permit
22. we are building a _____ for waste water to flow under the railway track.
    1) turnkey project
    2) network 3) equipment
    4) culvert
23. She's speaking to _____ on the phone.
    1) something 2) someone
    3) any one 4) no one
24. There is a _____ in the Indian economy due to liberalization.
    1) boon 2) bane
    3) beep 4) boom
25. Coins are manufactured in _____.
    1) factory 2) depot
    3) mint 4) cast
26. The following is not a wrong group of words
    1) woods, timber, copse, silva
    2) walk, sleep, patient, teacher
    3) vigor, vicious, vivacity, venom
    4) juvenile, operate, control, possess
27. The meaning of 'From hand to mouth' is
    1) something repeated often
    2) consuming food
    3) to survive without saving
    4) hitting someone by hand on the mouth
28. He does like me. _____? (choose the correct option)
    1) does he 2) did he
    3) do he 4) doesn't he
29. We are not satisfied with the consignment sent by you. The above statement expresses
    1) approval 2) apology
    3) complaint 4) request
30. Heading, Salutation, Body, subscription, superscription The words given above refer to
    1) notice 2) memo
    3) mail 4) letter

Choose the synonym of the word given in bold in the sentence below

31. He fell into the **abyss** of despair.
    1) well 2) deep pit
    3) sea 4) borough

Choose the antonym of the word given in bold in the sentences below (32-33)

32. I was annoyed at his **crude** manners.
    1) refined 2) smooth
    3) civilized 4) gentle
33. They should **promote** harmony among the people.
    1) disturbance 2) hatred
    3) fighting 4) discord
34. Which sentence is the odd one out from the following set of sentences:
    1) I shall eat an apple
    2) You will be working.
    3) You will have been writing a novel.
    4) You were playing.
35. The teacher always answers the students' questions. (change it into passive voice)
    1) The students' questions were always answered by the teacher.
    2) The students' questions are always being answered by the teacher.
    3) The students' questions are always answered by the teacher.
    4) The students' questions are always answered by teacher.
36. The following two sentences can be combined as
    He studied for the test.
    He felt confident.
    1) He studied for the test, he felt confident.
    2) He felt confident upon study for the test.
    3) Studying for the test increased his confidence.
    4) He worked hard and did well in the test and improved his confidence.
37. The following sentence is correct in relation to the use of would
    1) We would come and see you next week.
    2) We would be late.
    3) He would help you if you asked him.
    4) I would give you a lift after the party.

Tick the combinations of words that sound the most natural (38-40)

38. a) a tall shelf b) a long shelf
    c) a high shelf
    d) a fat shelf
    1) a 2) b 3) c 4) d
39. a) heavy wind b) large wind
    c) high wind d) strong wind
    1) a 2) b 3) c 4) d
40. a) a large mistake
    b) a fat mistake
    c) a vast mistake
    d) a great mistake
    1) a 2) b 3) c 4) d

Answers

1) 3	2) 1	3) 1	4) 1	5) 2
6) 1	7) 4	8) 1	9) 1	10) 3
11) 1	12) 4	13) 1	14) 2	15) 2
16) 2	17) 3	18) 3	19) 2	20) 3
21) 1	22) 4	23) 2	24) 4	25) 3
26) 1	27) 3	28) 4	29) 3	30) 4
31) 2	32) 4	33) 4	34) 4	35) 3
36) 3	37) 3	38) 3	39) 4	40) 4